# జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం

**2005**




**జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ**

**National Council of Educational Research and Training**

# జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం

**2005**

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ

**National Council of Educational Research and Training**

**EMPTY PAGE**

## ముందుమాట

మన పిల్లలకి ఏమి నేర్పించాలి, ఎలా నేర్పించాలి అనేదాన్ని ప్రజల దృష్టికి తెచ్చేందుకు NCERT ప్రారంభించిన గొప్ప సామాజిక చర్చలో పాల్గొనే మహత్తరావకాశం నాకు కల్గింది. విస్తృత స్థాయిలో జరిగిన ఈ చర్చలో అనేక ఆలోచనలు, ఆకాంక్షలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ఎంతోమంది గొప్పవారిని కలిసే అవకాశం నాకు కలిగింది. ఇలా ఈ జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం రూపుదిద్దుకొంది. వీళ్ళందరి పేర్లు ఈ డాక్యుమెంటులో మీరు చూస్తారు.

ఈ క్రమంలో చాలా విశ్లేషణ జరిగింది. చాలా సలహాలు వచ్చాయి. ప్రత్యేకతల్ని పట్టించుకోవాలని, మాతృభాష చాలా కీలక వాహకమని, స్వీయ జ్ఞాన విషయంలో పిల్లల సామాజిక, ఆర్థిక, జాతిపరమైన నేపథ్యాలు చాలా ముఖ్యమైనవని మాటిమాటికీ చాలామంది గుర్తుచేశారు. ఒకవైపు మీడియా ప్రాధాన్యతను గుర్తిస్తూనే, విద్యాబోధనలో వస్తున్న సాంకేతిక విప్లవాన్ని ఒప్పుకొంటూనే ఇప్పటికీ ఉపాధ్యాయులే కేంద్రమనేది మాత్రం అందరూ అంగీకరించారు. వైవిధ్యాల్ని గురించి నొక్కివక్కాణిస్తూనే అవి అడ్డంకులు కావనీ వెల్లడించారు. సమాజం నుంచి నేర్చుకునే విలువైన అంశాల్ని మన పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా పాఠ్యాంశాల్ని సుసంపన్నం చెయ్యవచ్చునని ఏకాభిప్రాయం వ్యక్తమైంది. బహుళత్వం మనకు పెద్ద సంపద అనీ, దీనిపట్ల మనకు విశాల అవగాహన అవసరమని, సృజనాత్మకత వికసించేందుకు ఇదెంతో దోహదపడుతుందని భావించడం జరిగింది.

మన పిల్లలపై పాఠ్యగ్రంథాల బరువును గురించి ఈ డాక్యుమెంటు మాటిమాటికీ చర్చిస్తుంది. ఈ విషయంలో మాత్రం మనం ఓ పెద్ద అగాథంలో పడిపొయ్యామన్పిస్తోంది. స్వల్పకాలంపాటు సమాచారాన్ని నిల్వచేసుకొనే 'జ్ఞాపకాన్ని' మనం అవగాహనగా పొరపడుతున్నాం. ఇది మారాలి. ఎందుకంటే కాలం మారింది. మనపిల్లలు జ్ఞాపకం పెట్టుకోవల్సిన సమాచారం నానాటికీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. విషయాన్ని అర్థం చేసుకోవడంలోని రుచిని మన పిల్లలకు అందించాలి. ఫలితంగా వాళ్ళు ప్రపంచాన్ని, జీవితాన్ని ఎదుర్కొనేపుడు స్వంతంగా వ్యవహరించగల్గుతారు.

స్వంత జ్ఞానాన్ని పెంపొందించుకోగల్గుతారు. ఇలాంటివారు సమగ్రమైన, సృజనాత్మకమైన, సంతోషభరితమైన వ్యక్తులుగా మారుతారు. కేవలం పరీక్షల పోటీలో తలపడేందుకు లేనిపోని సమాచారాన్నంతా మెదడులో కుక్కుకోవాల్సిన భారం వాళ్ళకి తప్పుతుంది. మనమీద మనమే రుద్దుకొన్న ఈ అవరోధాన్ని అధిగమించడాన్ని గురించి ఈ డాక్యుమెంట్ చర్చిస్తుంది. ఈ అంశంలో మనం ఏ కొంచెం ముందుకెళ్ళగల్గినా మన పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించగల్గిన వాళ్ళమవుతాం. ఎర్రసిరాతో, కంప్యూటర్ డిస్క్ బిట్స్‌తో కొలిచి పిల్లల మెదళ్ళకు ధట్టిస్తున్న సమాచారం ఎంత దండగమారిదో అప్పుడు మనకు తెలిసొస్తుంది.

విద్య అంటే పోస్టుద్వారానో, టీచరు ద్వారానో చేరవేసే వస్తువు కాదు. నిజమైన విద్య బిడ్డ భౌతిక, సాంస్కృతిక క్షేత్రంలో సృష్టించబడుతుంది. దాగి వుంటుంది. తల్లిదండ్రులతో, టీచర్లతో, తోటి పిల్లలతో, సమాజంతో నెరపే ప్రతిచర్య ద్వారా అది క్రమ వికాసం పొందుతుంది. ఇలాంటి విద్య పటిష్టంగా, ఫలప్రదంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుడి పాత్రను, ఔన్నత్యాన్ని మనం గుర్తించాలి, దృఢపరచాలి. జ్ఞాన సముపార్జన ఎప్పుడూ పరస్పరాశ్రితంగా ఉంటుంది. పిల్లల నుంచి టీచరు నేర్చుకొనేదికూడా ఎంతో ఉంటుంది. కాకుంటే, టీచరు పిల్లలకు మౌనముద్ర వేసి మూగమొద్దుల్లా కూచోబెట్టకుంటేనే ఇది సాధ్యమవుతుంది. పెద్దలకంటే పిల్లలు బాగా పరిశీలిస్తారు. బాగా గ్రహిస్తారు. జ్ఞానాన్ని సృష్టించడంలో వాళ్ళకున్న సామర్థ్యాన్ని, పాత్రను మనం గుర్తించాలి. నాకున్న ఈ కొద్ది అవగాహన పిల్లలతో మాట్లాడ్డం వల్లనే లభించిందని అనుభవంతో నేను చెపుతున్నాను. ఈ అంశాన్ని కూడా ఈ డాక్యుమెంట్ విస్తారంగా ప్రస్తావించింది.

ఈ డాక్యుమెంట్ ఇంత సమగ్రంగా, ఇంత సుసంపన్నంగా తయారైందంటే దానికి కారణం ఇందులో భాగస్వాములైన వారూ, వారి కృషీ అని చెప్పాలి. ఏ ఒకర్ని ప్రత్యేకించి చోదకులని చెప్పలేము. విద్యారంగంపట్ల నానాటికీ పోగుపడ్డ అసంతృప్తి నుంచే ఈ చేతన పుట్టుకొచ్చి ఉండొచ్చు. 'ఉన్నదేదో ఉంది ఇది చాలు' అనుకొనేవారూ లేకపోలేదు. కానీ ఆ కొందరి ఉత్సాహం మాత్రం మమ్మల్నందర్నీ ఆవేశించింది.

దశాబ్దాలకుముందే మనం కలగన్న అనేకానేక అంశాలు అనుకున్నట్లు జరగనందుకు మనం చింతిస్తూంటాము, నిందిస్తూంటాము. కానీ ఏదో ఒకరకంగా ఈ పరిస్థితికి మనమూ బాధ్యులమే. అందువల్ల ఈ నిందా క్రీడలలోకి మేము దూరదలచుకోలేదు. మధ్యతరగతి వర్గంగా మనం ఈ దేశ జన బాహుళ్యం నుంచి వేరుపడ్డాము. అందువల్లనే ఈ పరిస్థితికి మనమూ బాధ్యులమయ్యాము. 'బహుళత్వం', 'సమాన న్యాయం', 'సమానత్వం' అనే మాటలు ఈ డాక్యుమెంటులో మాటిమాటికీ వస్తాయి. ఇవేమీ రాజకీయ ప్రచార నినాదాలు కాదు. ఎందుకంటే ఇంత విస్తృతంగా చేసిన చర్చలో మేమెక్కడా రాజకీయాల జోలికి పోలేదు. మనదేశంలో నాల్గింట మూడు వంతులుగా ఉన్న అథో జగత్ సోదరుల్లోనే మన శక్తి, మన గొప్పతనం దాగివుందని మేము దృఢంగా నమ్ముతున్నాము. ఈ నమ్మకం నుంచే పైమాటలు వచ్చాయి. ఈ వర్గం సామాజిక జీవితం నుంచి సంపాదించుకొన్న సామర్థ్యాల్నీ, నైపుణ్యాల్నీ మన బోధనాంశాలతో జతపరచగల్గితే అద్భుతాలు జరుగుతాయి.

ఈవైపు పయనించేందుకుగల మార్గాల్ని ఈ డాక్యుమెంట్ సూచిస్తుంది. కొన్ని నిర్దిష్టమైన మార్పుల్ని గురించి ఇందులో చెప్పిన అంశాలు ఖచ్చితంగా ఉపయోగపడతాయి. ఈ లక్ష్యాన్ని చూచి మేమేమీ జంకటం లేదు. ఇది ఆచరణ సాధ్యమని మేము దృఢంగా నమ్ముతున్నాం.

మనకు మనంగా చేసిన స్వయంకృతాపరాధంవల్లనే కొన్ని కష్టాల్లో కూరుకుపోయాం. మా యీ ప్రయత్నం మనల్ని వీటినుంచి బయటపడేస్తుందనీ, మన పిల్లల విద్య కోసం ఓ స్వాతంత్రోద్యమానికి శ్రీకారం చుడుతుందనీ నమ్ముతున్నాను.

**యశ్‌పాల్**

EMPTY PAGE

# సంక్షిప్త సారాంశం

పార్లమెంట్‌లో మానవ వనరుల శాఖామాత్యులు "జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా మండలి" (NCERT) పాఠ్య ప్రణాళికా చట్రాన్ని పునఃసమీక్షిస్తుందని ప్రకటించిన తర్వాత మండలి కార్యనిర్వాహక వర్గం 14–19 జూలై, 2004న సమావేశమై దీన్ని సమీక్షించాలని నిర్ణయించింది. దీనికనుగుణంగా మానవవనరుల శాఖలోని విద్యాశాఖ కార్యదర్శి NCERT డైరెక్టరు గార్కి 'పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళికాచట్రాన్ని' (National Curriculum for School Education - 2000) భారంలేని అభ్యసనం (Learning without Burden) నివేదిక (1993) వెలుగులో సమీక్షించాల్సిందిగా తెలియజేశారు. ఫలితంగా ప్రొఫెసర్ యశ్‌పాల్ అధ్యక్షులుగా జాతీయ సారథ్య సంఘం ఏర్పడింది. 21 ఫోకస్ గ్రూపులుకూడా ఏర్పడ్డాయి. ఈ కమిటీల సభ్యులు పలు విద్యా సంస్థల్ని, NCERT విద్యావేత్తల్ని, పాఠశాల ఉపాధ్యాయుల్ని, స్వచ్ఛంద సంస్థల్ని సంప్రదించారు. మైసూరు, అజ్మీరు, భోపాల్, భువనేశ్వర్, షిల్లాంగ్‌లలోని 5 NCERT ప్రాంతీయ విద్యా సంస్థల్లో 5 పెద్ద సెమినార్లు దీనికోసం జరిగాయి. దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభించబడింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో, రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థలతో (SCERT), పరీక్షల బోర్డులతో సంప్రదింపులు జరిగాయి. గ్రామీణ ఉపాధ్యాయుల జాతీయస్థాయి సభ జరిగింది. వారి సలహాల్ని తీసుకొన్నాము. ప్రజాభిప్రాయ స్వీకరణ కోసం జాతీయ, ప్రాంతీయ భాషా పత్రికల్లో ప్రకటనలిచ్చాము. చాలా పెద్ద స్పందన వ్యక్తమైంది.

మాముందున్న జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం (NCF) విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ "Civilisation and Progress" రచనలోని వాక్యాలతో ప్రారంభమవుతుంది. సృజనాత్మక శక్తి, సహజమైన ఆనందం బాల్యానికి కీలకమైనవని ఆయన ఇందులో పేర్కొంటారు. ఈ రెండింటినీ అనాలోచితంగా పెద్దల ప్రపంచం ధ్వంసం చేస్తోందని ఆవేదన చెందుతారు. ఈ డాక్యుమెంటు మొదటి అధ్యాయంలో స్వాతంత్ర్యానంతరం పాఠ్యప్రణాళికల సంస్కరణలకోసం జరిగిన ప్రయత్నాల్ని కూడా మీరు చూడవచ్చు.

జాతీయ విద్యావిధానం (NPE-1986) జాతీయ విద్యా వ్యవస్థ రూపొందేందుకు జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం ఒక సాధనంగా దోహదపడుతుందని పేర్కొనింది. జాతీయ అభివృద్ధికోసం భారత రాజ్యాంగం నిర్దేశించిన కీలకాంశాల్ని ఇందుకోసం గుర్తుచేసింది. దీనికనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక (POA) మన పాఠ్య ప్రణాళికలో సంగతత్వం, పరివర్తనాశీలత, సమానత్వం ప్రధానాంశాలుగా ఉండాలని నొక్కిచెప్పింది.

భారతదేశాన్ని లౌకికత్వం, సమానత్వం, బహుళత్వం గల సమాజంగా ప్రవచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తితో; సామాజిక న్యాయం, సమానత్వంపై ఆధారపడి ఈ డాక్యుమెంట్ విశాల ప్రాతిపదికన కొన్ని విద్యా లక్ష్యాల్ని గుర్తించింది. ఆలోచనలోనూ, క్రియాశీలతలోనూ స్వేచ్ఛ; ఇతరుల క్షేమంపట్ల, అభిప్రాయాలపట్ల సంవేదనాశీలత; నూతన పరిస్థితులకు తగ్గట్లు సృజనాత్మకంగా, నమ్రంగా వ్యవహరించగల్గడం; ప్రజాస్వామిక ప్రక్రియలో పాల్గొనేందుకు సంసిద్ధత; సామాజిక మార్పుకూ, ఆర్థికాభివృద్ధికీ తోడ్పడే సామర్థ్యం వంటి లక్ష్యాలన్నీ ఇందులో ఉన్నాయి. మన ప్రజాస్వామిక జీవన విధానాన్ని బలోపేతం చేసేవిధంగా విద్య ఉండాలి. మొదటితరం

విద్యార్థుల్ని ఇది సానుభూతితో అర్థం చేసుకోవాలి. ఈ పిల్లలు బడిలో కొనసాగితేనే విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ చేసిన రాజ్యాంగ సవరణ ఫలప్రదమవుతుందని గుర్తించాలి. ఆరోగ్యం, పౌష్టికాహారం, పిల్లకనుకూలమైన పాఠశాల వాతావరణం ఉంటే కులం, లింగం, వైకల్యంలాంటి అడ్డంకులతో నిమిత్తం లేకుండా పిల్లలందరూ అభ్యసిస్తారు. దీన్నే మన రాజ్యాంగం ఆకాంక్షిస్తున్నది.

ప్రస్తుతం అభ్యసనం భారంగా మారింది. పిల్లలపై ఒత్తిడి పెరిగింది. మన విద్యా లక్ష్యాల్ని, నాణ్యతను కూడా ఇవి దెబ్బతీస్తాయన్నది కఠినమైన వాస్తవం. దీన్ని సరిచేసేందుకు ఈ జాతీయ పాఠ్య ప్రణాళిక నాలుగు మార్గదర్శక సూత్రాల్ని ప్రతిపాదిస్తోంది. అవి (1) పాఠశాల బయటి జీవితంలో జ్ఞానాన్ని అనుసంధానింపజెయ్యడం, (2) కంఠస్థం, భట్టీయం పద్ధతుల్నించి అభ్యసనాన్ని దూరం చెయ్యడం, (3) పాఠ్యప్రణాళికను పాఠ్యపుస్తకాల పరిధికి కుదించకుండా విస్తరించి సంపన్నం చెయ్యడం, (4) పరీక్షల్ని సరళీకరించి తరగతి జీవితంతో ఐక్యం చేయడం.

ప్రాథమిక తరగతుల్లో విద్యాబోధన అంతా మనం రూపొందించుకునే మంచి ప్రణాళికనుబట్టి, బాల్యారంభ సంరక్షణా విద్యాకేంద్రాల్ని (ECCE) విస్తరించడాన్నిబట్టి ఆధారపడివుంది. ECCE సూత్రాలకనుగుణంగా మన సిలబస్ మారాలి. మన పాఠ్యపుస్తకాలు మారాలి. జ్ఞాన స్వభావం గురించి, నేర్చుకోవడంలో పిల్లల స్వంత పద్ధతుల గురించి ఈ డాక్యుమెంట్ రెండవ అధ్యాయంలో చర్చించాము. మూడవ అధ్యాయంలో చేసిన సిఫారసులకివి సైద్ధాంతిక పునాదిని కల్పిస్తాయి. జ్ఞానం అనేది పిల్లలు స్వయంగా నిర్మించుకునేది. పాఠ్యప్రణాళికా, సిలబసూ, పాఠ్య గ్రంథాలూ దీన్ని మొదట గుర్తించాలి. పిల్లల స్వభావానికీ, వాతావరణానికీ అనుగుణంగా తరగతి గది అనుభవాల్ని ఉపాధ్యాయుడు ప్రోదిచేసుకొనేందుకు ఈ పాఠ్య గ్రంథాలు దోహదపడాలి. అందరు పిల్లలకూ అన్ని అవకాశాలూ వీటివల్ల అందుబాటులోకి రావాలి. పిల్లల స్వాభావిక ఆకాంక్షల్ని, సహజ అభ్యసన ఊహల్ని అభివృద్ధి చెయ్యడం బోధనాలక్ష్యం. సమాచారం, జ్ఞానం ఒకటి కావు. బోధన ఎంతో నైపుణ్యంతో కూడినది. పిల్లలు సమాచారాన్ని గుర్తుపెట్టుకొంటే చాలదు. అలా చెయ్యించడాన్ని బోధన అనరు. కొన్ని వాస్తవాల్ని ప్రసారం చెయ్యడం కూడా బోధన అన్పించుకోదు. పిల్లలు ప్రపంచానుభవాన్ని పొందడంలో కీలక పాత్ర వహించేది కృత్యం. కాబట్టి పిల్లలు తమకుతాము వ్యక్తీకరించుకొనే అవకాశం ఉండాలి. తరగతిలో వస్తువుల్ని వారు ఉపయోగించాలి. తమ సహజ సామాజిక వాతావరణం అభ్యసనంలో వాళ్ళకి ఉపయోగపడాలి. వాళ్ళు ఆరోగ్యంగా పెరగాలి. తరగతి గది అనుభవాలనుంచే పిల్లలు తమ జ్ఞానాన్ని నిర్మించుకోవాలి. అలా మన తరగతి మారాలంటే దానికి మన పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులవసరం (అధ్యాయం-5). పాఠ్యప్రణాళిక గురించీ, పాఠశాల సబ్జక్టుల గురించీ మన దృక్పథమే మారాలి (అధ్యాయం-3). పాఠశాల పద్ధతుల్లోనూ నాణ్యత పెరగాలి (అధ్యాయం-4).

వర్తమానానికి సంగతంగా ఉండేలా, భవిష్యత్ అవసరాల్ని దృష్టిలో ఉంచుకొనేలా, పిల్లలమీద పెరుగుతున్న ఒత్తిడిని తొలగించేలా భాష, గణితం, సైన్సు, సామాజిక శాస్త్రాల్లో చాలా ముఖ్యమైన మార్పుల్ని ఈ డాక్యుమెంటు సిఫార్సు చేస్తోంది. అభ్యసనంలో ఆహ్లాదం, పరిపూర్ణ జ్ఞానం పిల్లలు పొందాలంటే మన సబ్జక్టుల సరిహద్దుల్ని

కొంచెం చెరిపెయ్యడం మంచిది. దీన్నికూడా ఈ డాక్యుమెంటు ప్రస్తావించింది. దీంతోపాటు బహుళ పాఠ్య గ్రంథాలు, ఇతర సామగ్రి కూడా అవసరం స్థానిక జ్ఞాన సంపదను, సాంప్రదాయక నైపుణ్యాల్ని ఇవి ఇముడ్చుకొనగలిగేలా ఉండాలి. అలాగే పిల్లల గృహ, సామాజిక వాతావరణానికి తగ్గ పాఠశాల వాతావరణం కూడా ఎంతో ముఖ్యమైంది. వీటిని కూడా NCF సూచిస్తుంది. భాష విషయానికొస్తే మరింత సమర్థవంతంగా త్రిభాషా సూత్రాన్ని అమలుచెయ్యాల్సి వుంది. అదే సందర్భంలో మాతృభాషను, గిరిజన భాషల్ని మరచిపోగూడదు. బోధనా మాధ్యమాలుగా ఇవే అత్యుత్తమమైనవి. భారతదేశం బహు భాషల దేశం. మన పిల్లలు బహు భాషల్లో ప్రావీణ్యం పొందేందుకిదొక మంచి వనరు. ఇంగ్లీషులో నైపుణ్యం సంపాదిస్తూనే మన పిల్లలు మన భాషల్ని బాగా నేర్చుకోవాలి. కానీ ఇది సాధ్యం కావాలంటే మొదట మాతృభాషలో మంచి పునాది అవసరం. అన్ని సబ్జెక్టులలో విద్యార్థి రాణించడానికి చదవడం, రాయడం, వినడం, మాట్లాడ్డం అనే భాషా నైపుణ్యాలు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. పాఠ్య ప్రణాళికల్ని రూపొందించేపుడు దీన్ని గుర్తుంచుకోవాలి. పాఠాశాలలో విద్యార్థి మంచి అభ్యసనం కొనసాగించాలంటే ప్రాథమిక విద్య సాగినంత కాలం పుస్తక పఠనం కొనసాగించాలి. మనం ఇందుకోసం శ్రద్ధ పెట్టాలి.

గణితబోధన విద్యార్థి ఆలోచనలో హేతు తత్వాన్ని పదును పెట్టేలావుండాలి. అమూర్తాంశాల్ని దర్శింపచెయ్యాలి. సమస్యల్ని పరిష్కరించుకొనే సామర్థ్యాన్ని కల్గించాలి. దీన్ని సాధించాలంటే గణితం జీవితానికి దగ్గరిదిగా, సంగతమైనదిగా ఉండాలి. పిల్లల స్వీయానుభవాలతో ముడిపడివుండాలి. గణితంలో రాణించడం అనేది ప్రతిబిడ్డకూ హక్కుగా మారాలి. ఇందుకోసం గణితాన్ని విస్తరింపజెయ్యాలి. ఇతర సబ్జెక్టులతో దీన్ని అనుసంధించాలి. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సమస్యల్ని అధిగమించడంతోపాటు ప్రతి పాఠశాలకు ఇవి అందుబాటులోకి రావాలి.

పిల్లలు దైనందిన జీవితానుభవాల్ని విశ్లేషించి, పరీక్షించే విధంగా సైన్సు బోధన మారాలి. విభిన్న కృత్యాలతో, ప్రాజెక్టులతో ఇది సాగాలి. ప్రతి సబ్జెక్టులోను పర్యావరణం పట్ల అభిమానం కల్గించాలి. బాలల సైన్సు కాంగ్రెస్ రూపంలో ఒక సామాజిక ఉద్యమాన్ని మనం నిర్మించాలి. దీనివల్ల భారతదేశాన్ని, ఆ తర్వాత మొత్తం దక్షిణాసియాను పిల్లలు అన్వేషిస్తారు.

సామాజిక శాస్త్రాల్లోని పలు అంశాల్ని గుర్తిస్తూనే NCF 'నీరు' లాంటి కీలక విషయాలపట్ల ఒక పరిపూర్ణ దృక్పథాన్ని ముందుకు తెస్తుంది. వెనకబడ్డ వర్గాల దృక్పథం నుంచి సామాజిక శాస్త్రాల అధ్యయనం సాగేలా పెద్ద మార్పు రావల్సి వుంది. స్త్రీలపట్ల, గిరిజనులపట్ల, దళితులపట్ల, మైనారిటీలపట్ల, వారికి అందాల్సిన న్యాయం పట్ల మన సామాజిక శాస్త్రాల్లో సంవేదన కన్పించాలి. వాళ్ళ సమస్యలు ప్రతిసందర్భంలోనూ ముందుకు రావాలి. పౌరశాస్త్రం, రాజనీతి శాస్త్రంగా రూపాంతరం చెందాలి. పిల్లల్లో గతంపట్ల స్పష్టత కల్గించి వారిని ప్రభావితం చేసేదిగా చరిత్ర ఉండాలి.

మరి నాలుగు పాఠ్యాంశాల్ని గూర్చి కూడా NCF గుర్తు చేస్తుంది. అవి ఒకటి శ్రమ (పని), రెండు కళలు– వారసత్వపు చేతివృత్తులు, మూడు ఆరోగ్యం–వ్యాయామవిద్య. నాలుగు శాంతి. జ్ఞానాన్ని శ్రమ అనుభవంగా మారుస్తుంది. స్వావలంబన, సృజనాత్మకత, సహకారంలాంటి ముఖ్యమైన సామాజిక వ్యక్తిగత విలువల్ని ఇది

పెంపొందిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక స్థాయి నుంచి శ్రమనూ అభ్యసనాన్ని అనుసంధానం చేసేందుకు గట్టి చర్యల్ని ఈ డాక్యుమెంటు ప్రతిపాదిస్తుంది. పై తరగతుల్లో బతుకుతెరువుతో ముడిపడ్డ విద్యను కోరుకొనే పిల్లలకోసం ఇంటాబయటా వనరుల్ని గుర్తించి ఉపయోగించుకొనే వ్యూహాన్ని గురించి కూడా ఇది ప్రస్తావిస్తుంది. బడి బయటి సంస్థలకు అవకాశమిచ్చి తమ బ్రాంచీలలోని పరికరాల్ని, ఇతర వనరుల్ని పిల్లలు వాడుకొనే అవకాశం, గుర్తింపు ఇవ్వాలి. ఏఏ ప్రాంతాల్లో ఏఏ చేతివృత్తులు ప్రముఖంగా ఉన్నాయో గుర్తించి, స్థానిక వృత్తి నిపుణుల్ని భాగస్వాముల్ని చేసుకొని వృత్తి విద్యను పిల్లలకు అందుబాటులోకి తేవాలి.

సంగీతం, నృత్యం, చిత్రకళ, నాటకం వంటి కళలు ప్రతిస్థాయిలోనూ మన పాఠ్యాంశాలుగా ఉండాలి. సౌందర్యాన్వేషణ, స్వీయాభివ్యక్తి, భిన్న రూపాల్లో వ్యక్తీకరణాసామర్థ్యం అనేవి కళావిద్యా లక్ష్యాలు. ఇలాంటి కళా విద్య బోధనారూపంలో ఉండదు. పరస్పర చర్యల రూపంలో ఉంటుంది. భారతదేశపు వారసత్వ హస్త కళలు ఆర్థికపరంగానూ, సౌందర్యపరంగానూ ఎంతో విలువైనవి. ఇవికూడా మన పాఠశాల విద్యకు సన్నిహితం కావాలి.

మన పిల్లలు పాఠశాలల్లో రాణించాలంటే అన్నిటికన్నా ముందు మంచి ఆహారం అవసరం. తర్వాత మంచి వ్యాయామం అవసరం. అందువల్ల మధ్యాహ్న భోజనం కోసం వనరుల్ని సమీకరించుకోవాలి. పాఠశాల వేళల్ని తదనుగుణంగా సవరించుకోవాలి. పూర్వ ప్రాథమిక విద్య నుంచే ఆరోగ్యంలోనూ, శారీరక వ్యాయామంలోనూ బాలికలకు మగపిల్లలతో సమానంగా ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రపంచవ్యాప్తంగా అసహనం పెరుగుతున్న కాలమిది. ప్రతి సమస్యనూ పరిష్కరించడానికి హింసా మార్గాన్ని ఎన్నుకొంటున్న రోజులివి. శాంతి మాత్రమే దేశాభివృద్ధికి శ్రీరామరక్ష. అందువల్ల శాంతి ఒక సామాజిక గుణంగా మారాల్సిన తరుణం నేడు వచ్చింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ డాక్యుమెంటు శాంతిని నేటి తక్షణావసరంగా గుర్తిస్తోంది. శాంతిని ఒక సమగ్ర విలువగా భావిస్తోంది. మనం అన్ని స్థాయిల్లో, అన్ని సబ్జక్టుల్లో పలు కృత్యాల ద్వారా ఒక న్యాయమైన ప్రజాస్వామిక సంస్కృతిని పిల్లలకు ఒంటబట్టించాలి. ఫలితంగా పిల్లలు తదనుగుణమైన సామాజికీకరణ చెందుతారు. ఉపాధ్యాయ శిక్షణలో కూడా ఈ శాంతి విద్య ఒక అంతర్భాగంగా ఉండాలని NCF సిఫార్సు చేస్తోంది.

పాఠశాల పద్ధతుల్ని, సంప్రదాయాల్ని కూడా పాఠ్యాంశ పరంగా మనం చూడాలి. సమర్థవంతంగా పిల్లలు స్కూల్లో విద్యనభ్యసించడాన్ని, విద్యా లక్ష్యాల్ని సాధించడాన్ని ఈ పద్ధతులు ముందుగానే నిర్ణయిస్తాయి. పాఠశాల వేళలు సవరణకు తగినట్టు ఉండాలి. స్థానిక ప్రణాళికలుండాలి. అకడమిక్ కాలెండర్లు, టైంటేబుళ్ళు మనం పిల్లలచేత చేయించే వివిధ కృత్యాలకు తగినట్లు ఉండాలి. ప్రాజెక్టు పనులకు, విజ్ఞాన యాత్రలకు, ప్రాచీన, ప్రాకృతిక ప్రదేశాల్ని సందర్శించేందుకు తగ్గ సమయాల్ని కేటాయించుకోవాలి. పిల్లలకు మరింత అభ్యసన సామగ్రి అవసరం. చదవడం కోసం, పరిశీలనకోసం స్థానిక భాషల్లో పుస్తకాలు మరింత అవసరం. పాఠశాలల్లో పిల్లలకూ, టీచర్లకూ మంచి గ్రంథాలయాలు అవసరం. ఇవన్నీ సమాచారాన్ని అందించేవిగా ఉంటే చాలదు. పరస్పర చర్యకు ఉపయోగపడాలి.

సెకండరీ పాఠశాల తర్వాత పిల్లలు తమకిష్టమైన సబ్జెక్టుల్ని ఎంచుకొనే వీలుండాలి. నియమితాంశాలకే వీళ్ళని నిర్బంధించకూడదు. దీనివల్ల గ్రామీణ పిల్లల అవకాశాలు మరీ కుంచించుకొనిపోతున్నాయి. NCF ఈ అంశాన్ని కూడా నొక్కి చెపుతుంది.

మన విద్యలో నాణ్యత పెరగడానికీ, జవాబుదారీతనం పెరగడానికీ సమాజ భాగస్వామ్యం, ప్రమేయం అవసరం. ఇందుకోసం పంచాయతీరాజ్ సంస్థల్ని పటిష్టపరచాల్సి ఉందని ఈ డాక్యుమెంట్ పేర్కొంటుంది. NCE ప్రతిపాదించే సంస్థాగత సంస్కరణల్లో ఇది ముఖ్యమైంది. నాణ్యతను పెంచాలంటే పాఠశాల స్థాయిలో అకడమిక్ ప్రణాళిక రూపొందించాలి. అకడమిక్ నాయకత్వ బాధ్యతల అప్పగింత జరగాలి. ఇతర బాధ్యతలు బ్లాకు క్లస్టర్ స్థాయిలో నిర్ణయింపబడాలి. ఛటోపాధ్యాయ కమిషన్ (1984) పేర్కొన్న వృత్తి ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్న ఈ తరుణంలో ఉపాధ్యాయ శిక్షణలో సమూల మార్పులు అవసరం. సర్వీసుకు ముందు పొందే శిక్షణ మరింత సమగ్రంగా ఉండాలి. మరింత ఎక్కువకాలం ఉండాలి. శిక్షణార్థులకు పాఠశాల తరగతి గదిలో పిల్లల్ని, వారికిస్తున్న బోధనని పరిశీలించేందుకు ఎక్కువ అవకాశం ఉండాలి. బోధనా సిద్ధాంతాల్ని ఆచరించి చూచుకొనేందుకు వీలుండాలి.

మన పిల్లలేగాదు తల్లిదండ్రులు సైతం పరీక్షల కాలంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. 10, 12 తరగతుల్లో ఇది మరీ ఎక్కువవుతోంది. దీన్ని తప్పించాలంటే పరీక్షల్లో మార్పులు చాలా అవసరం. మనం కోరుకొనే పాఠ్యాంశ సంస్కరణల్లో ఇది చాలా కీలకమైనది. పిల్లల సృజనాత్మకత, హేతు తత్వాల సామర్థ్యాన్ని మూల్యాంకనం చెయ్యాలిగానీ భట్టీపట్టి గుర్తుపెట్టుకోవడాన్ని కాదు మనం పరీక్షించాల్సింది. ఇందుకోసం మన ప్రశ్నాపత్రాల తీరు మారాలి. అంతర్గత మూల్యాంకనాన్ని, పారదర్శకతని ప్రోత్సహించాలి. తరగతి జీవితంతో పరీక్షల్ని అనుసంధానించాలి. ప్రస్తుత 'పాస్', 'ఫెయిల్' విధానం స్థానే పలు స్థాయిల వర్గీకరణ విధానం కావాలి. దీనివల్ల ఒత్తిడి బాగా తగ్గుతుంది.

స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలతో కూడిన పౌరసమాజ బృందాలలో పాఠశాలకు అనుబంధం ఉండాలని చివరిగా ఈ డాక్యుమెంట్ సిఫార్సు చేస్తోంది. ఇప్పటికే బయట అందుబాటులోవున్న గొప్ప అనుభవాల్ని మనం పాఠశాల విద్యా ప్రధాన స్రవంతిలోకి తేవాలి. సార్వత్రిక విద్యను సాధించడంలోని సవాళ్ళను అధిగమించడం కోసం పాఠశాలకూ, పిల్లలపట్ల శ్రద్ధాసక్తులు గల ప్రతి సంస్థకూ మధ్య విస్తృత సహకారం నెలకొనాలి.

EMPTY PAGE

# జాతీయ సారధ్య సంఘం సభ్యులు

1. ప్రొ॥ యశ్‌పాల్ (అధ్యక్షులు)
మాజీ యు.జి.సి. ఛైర్మన్,
11 బి, సూపర్ డీలక్స్ ఫ్లాట్స్,
సెక్టార్ 15ఎ, కాడా, ఉత్తర ప్రదేశ్

2. ఆచార్య రామమూర్తి
ఛైర్మన్, 'శ్రమభారతి'
ఖాదీగ్రాం, ఖాదీగ్రాం (పోస్టు)
జూమాయ్ జిల్లా – 811 313, బీహార్

3. డా॥ శైలేష్ ఎ. షిరాలి
ప్రిన్సిపాల్, అంబర్ వ్యాలీ రెసిడెన్షియల్ స్కూలు
కె.యం. రోడ్డు, ముక్తిహల్లి,
చిక్‌మగళూర్ – 577 001, కర్ణాటక

4. శ్రీ రోహిత్ దినకర్
డైరెక్టర్, 'దిగంతర్'
తోడీ రాంజనిపురా
జైపూర్ 30205, రాజస్థాన్

5. శ్రీ పరమేశ్ ఆచార్య
(పశ్చిమ బెంగాల్ ఎడ్యుకేషన్ కమిషన్ మాజీ సభ్యులు)
యల్/యఫ్9, కుస్తాయ్ రోడ్,
ప్రభుత్వ హౌసింగ్ ఎస్టేట్, 'అవంతికా ఆవాసం'
కొలకత్తా – 700 039, పశ్చిమబెంగాల్

6. డా॥ మీనా స్వామినాధన్
గౌరవ డైరెక్టర్,
ఉత్తరదేవి సెంటర్ ఫర్ జెండర్
డెవలప్‌మెంట్
యం.యస్. స్వామినాధన్ రీసర్చి
ఫౌండేషన్స్, 3వ క్రాస్ రోడ్
తారామణి ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా
చెన్నై – 600 113, తమిళనాడు

7. డా॥ పద్మా సారంగపాణి
అసోసియేట్ ఫెల్లో
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్
అడ్వాన్స్‌డ్ స్టడీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్
ఆఫ్ సైన్స్ క్యాంపస్,
బెంగుళూరు – 560 012, కర్ణాటక.

8. ప్రొ॥ ఆర్. రామానుజం
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేథమెటికల్ సైన్స్
4వ క్రాస్ రోడ్డు, సి.ఐ.టి. క్యాంపస్
తారామణి, చెన్నై – 600 013,
తమిళనాడు

9. ప్రొ॥ అనిల్ సద్గోపాల్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్
ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఇ–8/29,
సహకార నగర్, భోపాల్ – 462 039,
మధ్యప్రదేశ్

10. ప్రొ॥ జి. రవీంద్ర
ప్రిన్సిపాల్,
రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్
మానసగంగోత్రి,
మైసూరు – 570 006, కర్ణాటక.

11. ప్రొ॥ డా. దమయంతి జె. మోడి
(మాజీ శాఖాపతి, విద్యా విభాగం
భావనగర్ విశ్వవిద్యాలయం)
2209 ఎ/2, ఆనందధారా,
వడోదరియా పార్కు (వద్ద), వాల్‌డ్రైవ్
భావనగర్ – 364 002, గుజరాత్.

12. మిస్ సునీలా మాసిహ్
టీచర్, మిత్రా జి.హెచ్.ఎస్. స్కూలు
సోహగ్‌పూర్ (పోస్ట్)
హోషంగాబాద్ (జిల్లా)
మధ్యప్రదేశ్, పిన్ – 461 771.

13. మిస్. హరకుమారి
హెడ్‌మిసెస్, సి.ఐ.ఇ.,
ఎక్స్‌పెరిమెంటల్ బేసిక్ స్కూల్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్
యూనివర్శిటీ ఆఫ్ డిల్హీ
ఢిల్లీ – 110 007.

14. శ్రీ త్రిలోచన్ దాస్ గార్గ్
ప్రిన్సిపాల్, కేంద్రీయ విద్యాలయ
ఫరీద్‌కోట్ కంటోన్‌మెంట్
పంజాబ్.

15. ప్రొ॥ అరవిందకుమార్
సెంటర్ డైరెక్టర్
హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్
వి.ఎన్. పురావో మార్గ్
మాంఖర్డ్, ముంబాయి – 400 088
మహారాష్ట్ర.

16. ప్రొ॥ గోపాల్‌గురు
సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్
స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్
జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ
న్యూఢిల్లీ – 110 067.

17. డా॥ రామచంద్ర గుహ
22ఎ, బ్రుంటన్ రోడ్
బెంగుళూరు – 560 025
కర్నాటక.

18. డా॥ బి.ఎ. దబ్లా
ప్రొఫెసర్ & హెడ్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజి &
సోషల్ వర్క్
యూనివర్శిటీ ఆఫ్ కాశ్మీర్
శ్రీనగర్ – 190 006, జమ్ము & కాశ్మీర్

19. శ్రీ అశోక్ వాజ్‌పేయి
ఫార్మర్ వైస్‌ఛాన్సలర్
మహాత్మాగాంధీ ఇంటర్నేషనల్ హిందీ
యూనివర్శిటీ
సి–6, అనుపమ్ అపార్ట్‌మెంట్స్
బి–13, వసుంధర ఎన్‌క్లేవ్,
ఢిల్లీ – 110 096.

20. ప్రొ॥ వల్సన్ థంపు
సెంట్ స్టీఫెన్స్ హాస్పిటల్
జి–3, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్
తీస్‌హజారీ, ఢిల్లీ – 110 054

21. ప్రొ॥ శాంతా సిన్హా
డైరెక్టర్, యం.వి. ఫౌండేషన్
201, నారాయణ అపార్ట్‌మెంట్స్
వెస్ట్ మారేడుపల్లి
సికింద్రాబాదు – 500 026
ఆంధ్రప్రదేశ్

22. డా॥ మిసెస్ విజయములయ్
ఫౌండర్ ప్రిన్సిపాల్,
సి.ఇ.టి., యన్.సి.ఇ.ఆర్.టి.,
ప్రెసిడెంట్, ఇండియా డాక్యుమెంటరీ
ప్రొడ్యూసర్స్, బి–42, ఫ్రెండ్స్ కాలనీ (వెస్ట్)
న్యూఢిల్లీ – 110 065

23. ప్రొ॥ మృణాల్ మిరి
వైస్ ఛాన్సలర్
నార్త్ ఈస్టర్న్ హిల్ యూనివర్శిటీ
పి.ఓ.నెహ్రూ క్యాంపస్, మాకిన్‌రో ఉమ్‌షింగ్
షిల్లాంగ్ – 793 022, మేఘాలయ.

24. ప్రొ॥ మిసెస్. తలత్ అజీజ్
ఐ.ఏ.యస్.ఇ. ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్
జామియా మిలియా, ఇస్లామియా
జామియానగర్, న్యూఢిల్లీ – 110 025.

25. ప్రొఫెసర్ సవితా సిన్హా
హెడ్, DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ – 110 016

26. ప్రొఫెసర్ కె.కె. వశిష్ట
హెడ్, DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ – 110 016

27. డా॥ సంధ్యా ప్రాన్‌జ్‌పే
DEE, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ – 110 016

28. ప్రొఫెసర్ సి.యస్. నాగార్జున
హెడ్, DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ – 110 016

29. డా॥ జ్యోత్స్న తివారీ
DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ – 110 016

**30.** ప్రొఫెసర్ యం. చంద్ర
హెడ్, DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ - **110 016**

**31.** డా॥ అనితా జుల్కా
రీడర్, DESSH, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ - **110 016**

**32.** ప్రొఫెసర్ క్రిష్ణకుమార్
డైరెక్టర్, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ - **110 016**

**33.** శ్రీమతి అనితౌ కౌర్
సెక్రటరి, NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ - **110 016**

**34.** శ్రీ అశోక్ గంగూలీ
ఛైర్మన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్,
**2,** కమ్యూనిటీ సెంటర్, ప్రీత్ విహార్,
ఢిల్లీ - **110 092.**

**35.** ప్రొఫెసర్ యం.ఎ.ఖాదిర్ (మెంబర్ సెక్రటరి)
హెడ్, కరిక్యులమ్ గ్రూప్
NCERT
శ్రీ అరబిందో మార్గ్
న్యూఢిల్లీ - **110 016**

EMPTY PAGE

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట | | i |
| | సంక్షిప్త సారాంశం | | v |
| | జాతీయ సారధ్య సంఘం సభ్యులు | | xi |
| **1.** | దృక్పథం | | **3** |
| | **1.1** | పరిచయం | **3** |
| | **1.2** | సింహావలోకనం | **5** |
| | **1.3** | జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం | **6** |
| | **1.4** | మార్గదర్శక సూత్రాలు | **7** |
| | **1.5** | నాణ్యతా పార్శ్వాలు | **9** |
| | **1.6** | విద్యా సామాజిక సందర్భం | **11** |
| | **1.7** | విద్యా లక్ష్యాలు | **12** |
| **2.** | అభ్యసనం, జ్ఞానం | | **14** |
| | **2.1** | అభ్యాసకుల ప్రాధాన్యత | **14** |
| | **2.2** | అభ్యాసకులు - సందర్భం | **15** |
| | **2.3** | అభివృద్ధి, అభ్యసనం | **16** |
| | | **2.3.1** అభివృద్ధికి పూర్వ నిర్ణయం | **16** |
| | | **2.3.2** జ్ఞానం | **17** |
| | | **2.3.3** కౌమార దశ | **19** |
| | | **2.3.4** అభ్యసనా నైపుణ్యాలు | **20** |
| | **2.4** | కరికులంలో, ఆచరణలో ఇమిడివున్న అంశాలు | **20** |
| | | **2.4.1** జ్ఞాన నిర్మాణాల కోసం బోధన | **20** |
| | | **2.4.2** ప్రతిచర్యల విలువ | **22** |
| | | **2.4.3** అభ్యసనానుభవాలను రూపొందించడం | **22** |
| | | **2.4.4** ప్రణాళిక పట్ల వైఖరి | **24** |
| | | **2.4.5** విమర్శనాత్మక బోధనా వ్యూహం | **25** |
| | **2.5** | జ్ఞానమూ, అవగాహన | **28** |
| | | **2.5.1** ప్రాథమిక సామర్థ్యాలు | **29** |
| | | **2.5.2** అనుభవంలోని జ్ఞానం | **30** |
| | | **2.5.3** అవగాహనా రూపాలు | **31** |

2.6 జ్ఞాన పునఃసృజన 33
2.7 పిల్లల జ్ఞానం, స్థానిక జ్ఞానం 34
2.8 పాఠశాల విద్య, సమాజం 36
2.9 అభివృద్ధికి సంబంధించి ఆలోచించవలసిన కొన్ని అంశాలు 37

3. పాఠ్యాంశాలు, పాఠశాల స్థాయిలు, మూల్యాంకనం 39

3.1 భాష 39
3.1.1 భాషా విద్య 40
3.1.2 ప్రథమ భాషా విద్య 41
3.1.3 అన్ని సబ్జెక్టుల్లోనూ భాష 42
3.1.4 ద్వితీయ భాషా బోధన 44
3.1.5 ఆంగ్లం 44
3.2 గణితం 45
3.2.1 పాఠశాల గణితంలో దృష్టి 46
3.2.2 పాఠ్య ప్రణాళిక 48
3.2.3 కంప్యూటర్ సైన్సు, గణితం 49
3.3 ప్రకృతి శాస్త్రాలు 50
3.3.1 వివిధ స్థాయిల్లో విద్యాప్రణాళిక 51
3.3.2 ఒక పరిశీలన 52
3.4 సామాజిక శాస్త్రాలు 54
3.4.1 కొన్ని తాత్వికాంశాలు 55
3.4.2 విద్యా ప్రణాళిక అమలు 56
3.4.3 విద్యాబోధనా పద్ధతులు, వనరులు 58
3.5 కళా విద్య 59
3.6 ఆరోగ్య విద్య, వ్యాయామ విద్య 61
3.7 పని విద్య 62
3.7.1 వృత్తి విద్యలో శిక్షణ 64
3.8 శాంతి కోసం విద్య 65
3.8.1 వ్యూహాలు 67
3.9 అధ్యయన పథకాలు 69
3.9.1 బాల్యారంభ విద్య 69
3.9.2 ప్రాథమిక విద్య 70

3.9.3 సెకండరీ విద్య 71

3.9.4 హైయ్యర్ సెకండరీ విద్య 73

3.9.5 ఓపన్ స్కూళ్ళు, బ్రిడ్జి స్కూళ్ళు 74

3.10. మూల్యాంకనం 75

3.10.1 మూల్యాంకనం లక్ష్యం 75

3.10.2 అభ్యాసకుల్ని అంచనావేయడం 76

3.10.3 బోధనా సమయంలో అంచనా 76

3.10.4 మార్కుల కోసం పరీక్షించకూడని విద్యాప్రణాళికాంశాలు 77

3.10.5 మూల్యాంకనా రూపకల్పన, నిర్వహణ 78

3.10.6 స్వయం మూల్యాంకనం, పునశ్చరణ 79

3.10.7 మనం పునరాలోచించాల్సిన అంశాలు 80

3.10.8 వివిధ స్థాయిల్లో మూల్యాంకనం 81

4. పాఠశాల, తరగతి గది వాతావరణం 82

4.1 భౌతిక వాతావరణం 82

4.2 సమర్థవంతమైన వాతావరణాన్ని పెంపొందించుకోవడం 85

4.3 పిల్లలందరి భాగస్వామ్యం 86

4.3.1 పోటీ సామర్థ్యం 88

4.4 పాఠశాలల్లో క్రమశిక్షణ 89

4.5 తల్లిదండ్రులకు, సమాజానికీ స్థానం 90

4.6 పాఠ్యాంశ రంగాలు అభ్యసన వనరులు 92

4.6.1 పాఠ్యపుస్తకాలు, పుస్తకాలు 92

4.6.2 గ్రంథాలయాలు 93

4.6.3 విద్యా సాంకేతిక పరిజ్ఞానం 94

4.6.4 పరికరాలు, ప్రయోగశాలలు 95

4.6.5 ఇతర రంగాలు, అవకాశాలు 96

4.6.6 బహుళ పాఠ్య గ్రంథాలు, ప్రత్యామ్నాయ సామగ్రి 96

4.6.7 వనరుల సమీకరణ, నిర్వహణ 97

4.7 సమయం 98

4.8 ఉపాధ్యాయులకు స్వతంత్ర ప్రతిపత్తి, వృత్తి స్వేచ్ఛ 101

4.8.1 పునశ్చరణకూ, ప్రణాళికకూ సమయం 102

| | | |
|---|---|---|
| 5. | సంస్థాగత సంస్కరణలు | 105 |
| 5.1 | నాణ్యతపట్ల శ్రద్ధ | 105 |
| | 5.1.1 నాణ్యత కోసం విద్యాప్రణాళిక, పర్యవేక్షణ | 107 |
| | 5.1.2 పాఠశాలల్లో అకడమిక్ బాధ్యతలు, పాఠశాల పర్యవేక్షణ | 108 |
| | 5.1.3 పంచాయతీలు, విద్య | 108 |
| 5.2 | పాఠ్యప్రణాళికా రచన, ఉపాధ్యాయ విద్య | 110 |
| | 5.2.1 ఉపాధ్యాయుడి వృత్తి గౌరవాన్ని పెంచడం | 111 |
| | 5.2.2 రూపకల్పనలో, ఆచరణలో కీలకాంశాలు | 112 |
| | 5.2.3 కొన్ని విస్మృతాంశాలు | 112 |
| | 5.2.4 వృత్త్యంతర విద్య, ఉపాధ్యాయ శిక్షణ | 113 |
| | 5.2.5 వృత్త్యంతర శిక్షణా ప్రయత్నాలు, వ్యూహాలు | 114 |
| 5.3 | పరీక్షల సంస్కరణలు | 115 |
| | 5.3.1 ప్రశ్నాపత్రం తయారీ, పరీక్షలు, నివేదికలు | 116 |
| | 5.3.2 ఇతర స్థాయిల్లోని ప్రవేశ పరీక్షలు, బోర్డు పరీక్షలు | 117 |
| 5.4 | వినూత్నాలోచనలు, ప్రయోగాలు | 117 |
| | 5.4.1 బహుళ పాఠ్యగ్రంథాలు, నూతన ప్రయత్నాలకు ప్రోత్సాహం | 117 |
| | 5.4.2 వినూత్న పద్ధతుల్ని ప్రోత్సహించడం | 119 |
| | 5.4.3 సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం | 119 |
| 5.5 | నూతన భాగస్వామ్యం | 120 |
| | 5.5.1 స్వచ్ఛంద సంస్థల, పౌరసమాజ బృందాల, ఉపాధ్యాయ సంఘాల పాత్ర | 120 |
| ముగింపు | | 122 |
| | అనుబంధం | |
| | సారాంశం (అధ్యాయాల వారీ) | 125 |

"నా చిన్నతనంలో చాలా చిన్నచిన్న వస్తువులతో నాక్కావాల్సిన బొమ్మలు చేసుకొనే స్వేచ్ఛ నాకుండేది. ఊహించి కొత్తకొత్త ఆటల్ని నేను సృష్టించుకొనేవాణ్ణి. నా ఆనందంలో నా తోటి పిల్లలకూ భాగం ఉండేది. నిజానికి వాళ్ళు నాతో కలిసి ఆడుకోవడం మీదనే నా ఆనందమంతా ఆధారపడివుండేది. ఒకరోజు నా బాల్యపు స్వర్గంలోకి పెద్దల ప్రపంచపు మార్కెట్ మోహం జొరబడింది. నా తోటి మిత్రుడొకడు ఒక ఇంగ్లీషు దుకాణం నుంచి ఓ బొమ్మను తీసుకొచ్చాడు. అది చాలా పెద్ద బొమ్మ. అందంగా, అద్భుతంగా, జీవకళ ఉట్టిపడేలా ఉండేది. బొమ్మ చిక్కగానే వాడికి గర్వం పట్టుకొంది. ఆటలమీద మనసు తగ్గింది. ఆ ఖరీదైన బొమ్మని వాడు మాకందకుండా దూరంగా పెట్టాడు. వాడికొక్కడికే అలాంటి బొమ్మ వుందని వాడనుకొనేవాడు. మా బొమ్మలు వాడికి నాసిరకంగా కనిపించేవి. ఇప్పటి మన ఆధునిక చరిత్రభాషలో చెప్పాలంటే అంత గొప్ప బొమ్మ ఉన్నందుకు వాడు మాకంటే చాలా 'నాగరికుడ' న్నమాట.

ఆ సందర్భంలో అంత ప్రధానమైందిగా కన్పించి ఉండకపోవచ్చుగానీ, ఆ భావోద్వేగంలో అతనొకటి గుర్తించలేకపోయాడు. బొమ్మ పట్ల అతని మోహం అసలుసిసలైన బాల్యపు వ్యక్తీకరణను అదృశ్యం చేసింది. ఇది బొమ్మకంటే ఎంతో విలువైంది. ఆ బొమ్మ అతని భౌతిక సంపదను మాత్రమే ప్రదర్శింపజేయగలిగింది. అతని సృజనాత్మకశక్తిని, ఆటల్లో లభించే సహజ ఆహ్లాదాన్ని, క్రీడా ప్రపంచంలోకి చేతులెత్తి తోటి పిల్లలందర్నీ ఆహ్వానించే అతని సహజ లక్షణాన్ని మాత్రం ప్రదర్శించలేకపోయింది.

– **రవీంద్రనాథ్ ఠాగూర్**, **Civilisation and Progress**' నుంచి

అధ్యాయం - 1

# దృక్పథం

| | |
|---|---|
| 1.1 | పరిచయం |
| 1.2 | సింహావలోకనం |
| 1.3 | జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం |
| 1.4 | మార్గదర్శక సూత్రాలు |
| 1.5 | నాణ్యతా పార్శ్వాలు |
| 1.6 | విద్యా సామాజిక సందర్భం |
| 1.7 | విద్యా లక్ష్యాలు |

## 1.1 పరిచయం

భారతదేశం వైవిధ్యభరితమైన సుసంపన్న చరిత్రతో, భిన్న సంస్కృతులతో, ప్రజాస్వామిక విలువలపట్ల సార్వజనీన సంక్షేమం పట్ల నిబద్ధతతో విలసిల్లే దేశం. 1986లో "జాతీయ విద్యా విధానం" పార్లమెంటు ఆమోదం పొందినప్పటినుండి జాతీయ విద్యా వ్యవస్థ కోసం పాఠ్య ప్రణాళికను పునః రచించుకొనేందుకు ప్రయత్నాలు జరిగాయి. దేశంలోని పిల్లలందరికీ విద్య గరపడం మన బృహత్తర కర్తవ్యం. దీన్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు మనం అప్పుడప్పుడూ సమిష్టిగా కూచోవాలి. అలాంటి సందర్భాల్ని కల్పించుకోవాలి. 'ఈ కర్తవ్య సాధనకోసం మనమిప్పుడేంచేస్తున్నాం? విద్య పేరుతో మనం మన పిల్లలకు ఏమిస్తున్నాం? దీన్ని మరోసారి సమీక్షించుకోవడానికి సమయమేమైనా ఆసన్నమైందా?' అని చర్చించుకోవాలి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి మన విద్యా వ్యవస్థ నేటిదాకా ఏమి సాధించింది అని ప్రశ్నించుకొంటే సంతృప్తికరమైన సమాధానమే వస్తుంది. ఇప్పుడు మనదేశంలో 10 లక్షల స్కూళ్ళున్నాయి. వీటిలో 55 లక్షల మంది టీచర్లు, 2025 లక్షలమంది పిల్లలకి విద్య నేర్పుతున్నారు. 82% జనావాసాలకు ఒక కిలోమీటరు దూరంలో ప్రాథమిక పాఠశాలలు, 75% జనావాసాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. సెకండరీ విద్య చివరి పరీక్షలో 50 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారు. అయినా 37% మంది ప్రజలకింకా అక్షర జ్ఞానం లేదు. 53% పిల్లలు ప్రాథమిక విద్యా స్థాయిలోనే బడి మానేస్తున్నారు. 75% గ్రామీణ పాఠశాలలు బహుళ తరగతి పాఠశాలలు. మన విద్యారంగంలో చాలా అపసవ్యతలు కూడా ఉన్నాయి. (అ) మన విద్యా వ్యవస్థ మారడానికి ససేమిరా అంగీకరించదు. అలా బిగుసుకుపోయింది. (ఆ) జ్ఞానాన్ని తమ నిత్య జీవితంతో అనుసంధానించుకొని సజీవాభ్యసనం చేసే అవకాశం మన పిల్లలకు తక్కువ. అభ్యసనాన్ని మనం ఒంటరి ప్రక్రియగా చూస్తాం. (ఇ) సృజనాత్మకంగా ఆలోచించడాన్ని, అంతర్దృష్టిని మన పాఠశాలలు నిరోధిస్తాయి. (ఈ) అభ్యసనం పేరుతో మనం పాఠశాలల్లో అందిస్తున్నదీ, ప్రసారం చేస్తున్నదీ నూతన జ్ఞానాన్ని సృష్టించుకోగల మానవ సామర్థ్యాన్ని త్రోసిరాజనడమే. (ఉ) విద్యార్థి 'భవిష్యత్తు' ముందుకొచ్చి 'వర్తమానం' వెనక్కు పోయింది. ఇది విద్యార్థికీ, సమాజానికీ, జాతికీ అన్నింటి శ్రేయస్సుకూ భంగకరమై కూచుంది.

పిల్లలు తమ జీవితంపట్ల స్పృహను పెంచుకోవడం, తమ అంతర్గత శక్తుల్ని ఉద్దీప్తం చేసుకోవడం, ఒక లక్ష్యాన్ని నిర్వచించుకొని దాన్ని సాధించడంకోసం ప్రయత్నించడం, ఇతరులు కూడా ఇలాగే వ్యవహరించేందుకు గల హక్కును అంగీకరించడం అనే విద్యాలక్షణాలు ఈనాటికీ ఎవ్వరూ కాదనలేనివి. 'ఇతరులద్వారా మనల్ని మనం గుర్తింపచేసుకోగల్గడమే మనం సాధించగల గొప్ప ఆనందం' అని రవీంద్రుడు అంటాడు. మానవజాతి పరస్పరాశ్రితమని మనం పునరుద్ఘాటించుకొందాం. బడిలోకి అడుగుపెడుతున్న పిల్లలు సాంస్కృతికంగా, సామాజికంగా

భిన్న నేపథ్యాలనుంచి వచ్చినవారు. దీన్ని గుర్తించి మనం సమానత్వానికి కట్టుబడ్డవాళ్ళమని మళ్ళీ ఒక నిశ్చయానికి వద్దాం. పోటీ ఆర్థికయుగంలో వ్యక్తిగత ఆకాంక్షలు విద్యను భౌతికావసరాల సాధనంగా కుదించివేస్తున్నాయి. గొంతులు కోసుకొనే పోటీలో దిగే సంబంధాలు మాత్రమే మిగలడంతో మనపిల్లలమీద తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. విలువల్ని వక్రీకరించడం జరుగుతోంది. ఒకరినుంచి ఒకరు నేర్చుకోవడం అనేది అర్థం లేనిదిగా మారుతోంది. ఈ స్థితిలో భిన్న సంస్కృతులుగల దేశంలో శాంతి, మానవత, సహనశీలత వంటి విలువల్ని పెంపొందించడం విద్యకు పరమార్థంగా ఉండాలి.

పిల్లలకు ఎలాంటి అనుభవాలు ఉండాలని పాఠశాలలు, ఉపాధ్యాయులు భావిస్తారో అలాంటివి ఎంపిక చేసుకొనేందుకు, తదనుగుణంగా వారు సంసిద్ధులయ్యేందుకు అవసరమైన పద్ధతుల్ని ఈ డాక్యుమెంటు ముందుకు తెస్తుంది. అవసరమైన అనుభవాల్ని ప్రోదిజేసేదిగా పాఠ్య ప్రణాళికను దర్శించినపుడే విద్యా లక్ష్యాల్ని దర్శించగలం. ఇందుకోసం ఈ క్రింది మౌలిక ప్రశ్నల్ని మనం పట్టించుకోవాలి.

(అ) మన పాఠశాల ఏ విద్యా ప్రయోజనాల్ని సాధించాలని చూస్తోంది?

(ఆ) ఈ ప్రయోజనాల్ని సాధించడానికి ఏ విద్యా అనుభవాల్ని సమకూర్చుకోవాలి.

(ఇ) ఈ అనుభవాల్ని ఎలా అర్థవంతంగా వాడుకోగలం?

(ఈ) ఈ విద్యా ప్రయోజనాలు సాధింపబడ్డాయని మనం ఎలా ధృవపరచుకోగలం?

జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం (2000) పిల్లలపై పాఠ్యప్రణాళికాభారాన్ని గుర్తించి, ఈ సమస్యను పరిష్కరించడానికి పూనుకొంది. 1990వ దశకంలో మానవ వనరుల శాఖ ఇందుకోసం ఒక కమిటీని నియమించింది. సమాచారాన్ని జ్ఞానంగా భావించే ధోరణివల్లనే ఈ సమస్య ఉత్పన్నమైందని ఈ కమిటీ గుర్తించింది. పాఠ్య పుస్తకాల్ని పరీక్షలకోసంగా భావించే సంప్రదాయంలో ఇరుక్కున్నంతకాలం, పిల్లల్ని జ్ఞాన గ్రహీతలుగా మాత్రమే భావించినంతకాలం స్కూళ్ళలో ఆహ్లాదకరమైన బోధన అసాధ్యమని ఈ కమిటీ తన 'భారంలేని విద్య' (Learning without Burden) నివేదికలో స్పష్టం చేసింది. పిల్లలకు అంతర్గతంగానే సృజనాత్మక శక్తి ఉంటుందని, వాళ్ళు తమ అనుభవాలనుంచే జ్ఞానాన్ని నిర్మించుకొంటారనీ నమ్మనందువల్లనే ప్రతి ఒక్కటీ మనమే బోధించాలనే దుగ్ధలోకి మనం పడిపోతున్నాం. పాఠ్య పుస్తకాల సైజు ప్రతి ఏడాదికీ పెరిగిపోతోంది. కొత్త కొత్త అంశాలు వచ్చి చేరేకొద్దీ జ్ఞానానికి సమగ్రత ఉంటుందన్న స్పృహ బలహీన పడుతోంది. పాఠ్యపుస్తకాల భారం, సిలబసు మోత, విద్యార్థిని విద్యాకేంద్రంగా చూడనీకుండా చేసే వ్యవస్థాగతాంశాలుగా మారాయి. విజ్ఞాన సర్వస్వాల్లాంటి పాఠ్య గ్రంథాల్ని రాసే ఈ రచయితలు విజ్ఞాన విస్ఫోటనం జరిగిపోయిందనీ, దీన్నంతా మన పిల్లల గొంతులోకి గుక్కకపోతే వాళ్ళు ఇతర దేశాల పిల్లలకంటే వెనకపడి పోతారనీ భ్రమ పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 'భారంలేని విద్య' నివేదిక సిలబసు, పాఠ్య గ్రంథాల రూపకల్పనలో తీవ్రమైన మార్పులు అవసరమని సిఫార్సు చేసింది. వయసుకు మించిన ప్రతిభ ప్రదర్శించాలని, పోటీ పడాలని పిల్లలపై ఒత్తిడి పెట్టే పాఠశాల పద్ధతుల్ని ఇది ప్రశ్నించింది. బోధన పిల్లల స్వాభావిక సృజనాత్మకతను వెలికితీసేదిగా ఉండాలంటే మన సిలబసులో సమూల మార్పులు అవసరమని సూచించింది. సమాచారాన్ని కంఠస్థం చేసి కక్కేసే పరీక్షా విధానం మారాలని కోరింది. పరీక్షలకోసమే నేర్చుకోవడమనే యాంత్రిక ధోరణి పిల్లల బాల్యానందాన్ని హరిస్తుంది. నిత్య జీవిత జ్ఞానం నుంచి పాఠశాల జ్ఞానాన్ని వేరుచేస్తుంది. తీవ్రమైన సంస్థాగత సమస్యగా మారిన ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈ NCF డాక్యుమెంటు 'భారంలేని విద్య' నివేదికలోని లోతైన అంశాల్ని విస్తారంగా ప్రస్తావిస్తుంది. చర్చకు పెడుతుంది.

ఈ డాక్యుమెంటు దేన్నీ నిర్దేశించదు. దీనికి బదులు సిలబసును, పాఠ్యగ్రంథాల్ని, పరీక్షల్ని సంస్కరించే ప్రయత్నంలో టీచర్లు, అధికార్లు, ఇతర సంస్థలు హేతుబద్ధమైనవాటిని ఎన్నుకొని తమకుతాము నిర్ణయాలు తీసుకోవాలని కోరుకొంటుంది. దీనివల్ల స్థానికంగా, వినూత్నమైన ప్రణాళికల్ని రూపొందించుకొనే అవకాశం ఉంటుంది. సమకాలీన, సామాజిక వాస్తవికత ఆధారంగా పాఠ్యప్రణాళికను రూపొందించే సందర్భంలో ఎదురయ్యే కొన్ని ప్రత్యేక సమస్యల్ని ఈ డాక్యుమెంటు మన దృష్టికి తెస్తుంది. వీటిని పరిష్కరించుకొనేందుకు సృజనాత్మకత అవసరం. టీచర్లు, ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులు కలిసి నిర్ణయాలు తీసుకొనేలా అధికార వికేంద్రీకరణ అవసరం. బహుళ పాఠ్య గ్రంథాలు అవసరం. పరీక్షా విధానంలో అత్యవసరంగా మార్పులు తేవడం అవసరం. ఇలాంటి సంస్కరణల క్రమానికి ఈ డాక్యుమెంటు బలం చేకూర్చుతుంది.

## 1.2 సింహావలోకనం

మన సామాజిక వ్యవస్థలో వేళ్ళూనుకొన్న అన్యాయం, హింస, అసమానతలకు వ్యతిరేకంగా భారతీయాత్మను మేల్కొల్పేందుకు విద్యను ఒక సాధనంగా గాంధీజీ దర్శించారు. ఆయన ముందుకు తెచ్చిన 'నయీతాలీమ్'లో వ్యక్తిగత స్వావలంబన, ఆత్మగౌరవం చాలా ముఖ్యమైనవి. అహింసావాదం ప్రవచించే సామాజిక సంబంధాలకు ఇలాంటి విద్యను పునాదిగా ఆయన విశ్వసించారు. విద్య ద్వారా విద్యార్థి సామాజికీకరణ చెందాలి, సమాజాన్ని మార్చాలి. అందుకవసరమైన విద్యకోసం మనకందుబాటులో దగ్గరగా ఉన్న మాతృభాష, వృత్తి, శ్రమ లాంటి వనరుల్ని ఆయన వాడుకొమ్మన్నారు. జాతులకు జాతులకూ మధ్య, మానవుడికీ ప్రకృతికీ మధ్య, సమాజంలో ఒక వర్గానికీ మరో వర్గానికీ మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయని, దీనికి భిన్నమైన ప్రపంచాన్ని నిర్మించాల్సి ఉందని ఆయన నమ్మారు. ప్రతి వ్యక్తీ తన స్వంత ప్రతిభనూ, సామర్థ్యాన్నీ గుర్తించి, ఉద్దీప్తం చేసుకోగల్గితే ఇతరులతో కలిసి సమిష్టిగా కృషి చెయ్యగలిగితే ప్రపంచాన్ని మార్చవచ్చునని ఆయన విశ్వసించారు. స్వాతంత్ర్యానంతరం సెకండరీ విద్యా కమిషన్ (1952-53), విద్యా కమిషన్ (1964-66) మన స్వాతంత్ర్య పోరాటంలో విద్యను గురించి మనం చెప్పుకొన్న విషయాల్ని పరిశీలించాయి. జాతీయ అభివృద్ధిని మనస్సులో ఉంచుకొని, మారిన సామాజిక, రాజకీయ సందర్భాన్ని పరిగణనలోనికి తీసుకొని ఈ రెండు కమిషన్లు మహాత్మాగాంధీ విద్యా తత్వాన్ని లోతుగా విశ్లేషించాయి. 1976 దాకా పాఠ్య ప్రణాళికా బోధనతోసహా పాఠశాల విద్యకు సంబంధించిన అన్ని అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు సంపూర్ణ అధికారాలుండేవి. కొన్ని విధాన విషయాల్లో మాత్రం కేంద్రం కొంత మార్గదర్శకత్వం వహించేది. జాతీయ విద్యా విధానం (1968), NCERT రూపొందించిన పాఠ్యప్రణాళికా చట్రం (1975) ఈ నేపథ్యంలోంచే వచ్చాయి. 1976లో విద్యను ఉమ్మడి జాబితాలో చేరుస్తూ రాజ్యాంగ సవరణ జరిగింది. ఫలితంగా 1986లో మొట్టమొదటిసారి జాతీయ విద్యావిధానం (NPE) వచ్చింది. దేశమంతటికీ సామాన్యమైన ఒక పాఠ్య ప్రణాళికను ఇది సిఫార్సు చేసింది. NCERTకి జాతీయ పాఠ్యప్రణాళికా చట్రాన్ని రూపొందించేందుకూ, అప్పుడప్పుడూ అవసరాన్నిబట్టి దాన్ని సమీక్షించేందుకూ బాధ్యత అప్పగించబడింది.

పాఠ్య ప్రణాళికకు సంబంధించి తాను చేస్తున్న ఉద్యమానికి కొనసాగింపుగానూ, తన కృషిలో భాగంగానూ, 1984లో జాతీయ పాఠ్యప్రణాళికా చట్రాన్ని NCERT రూపొందించింది. దేశవ్యాప్తంగా పాఠ్యప్రణాళికలో నాణ్యతాపరంగా సమానమైన స్థాయి ఉండేలా చూడ్డం దీని ముఖ్య లక్షణం. భారతదేశపు బహుళత్వాన్ని ఏమాత్రం నష్టపరచకుండా జాతీయ సమైక్యతను పటిష్టం చెయ్యడం కూడా దీని ఉద్దేశం. "పాఠశాల విద్యకోసం జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం" (1988) దీనికి తుదిరూపం. భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఈ పాఠ్యప్రణాళిక ఆధారంగా అనేక కోర్సులు, అనేక పాఠ్య గ్రంథాలు వెలువడ్డాయి. చివరికివి పిల్లలకు పెద్దభారంగా

పరిణమించాయి. బాల్య, కౌమార దశల్లో పిల్లల మనసును, శరీరాన్ని కూడా తీవ్ర ఒత్తిడికి గురిచేశాయి. ప్రొ.యశ్‌పాల్ అధ్యక్షతన ఏర్పడ్డ కమిటీ తన 'భారం లేని అభ్యసనం' (Learning without Burden - 1993) నివేదికలో దీన్ని చాలా స్పష్టంగా మనముందుకు తెచ్చింది.

## 1.3 జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం

పిల్లల వివిధ స్థాయిల సామర్థ్యాన్ని, విలువల్ని గుర్తించాలని, వారు క్రమవికాసం చెందేలా చూడాలని NPE **(1986)** చెప్పినప్పటికీ, బోలెడేసి సమాచారాన్ని కుక్కిపెట్టిన పాఠ్యపుస్తకాల ఆధారంగా జరిగే పరీక్షలే మన పాఠశాల విద్యను శాసించసాగాయి. **2000**వ సం॥లో పాఠ్యప్రణాళిక సమీక్ష మళ్ళీ జరిగింది. కానీ ఈ పరీక్షల ఉపద్రవం నుంచి మనం బయటపడలేకపోయాం.

ప్రస్తుత డాక్యుమెంట్ ఈ రంగంలో ఇటీవల తలెత్తిన మంచి చెడు రెండింటినీ పరిశీలిస్తుంది. అదే సందర్భంలో నూతన శతాబ్దంలో మనకావల్సిన పాఠశాల విద్యా భవిష్యత్ అవసరాల్ని చర్చిస్తుంది. విద్యా లక్ష్యాలు, పిల్లల సామాజిక వాతావరణం, విస్తృతార్థంలో జ్ఞాన స్వభావం, మానవాభివృద్ధి స్వభావం, మానవాభ్యసన క్రమంలాంటి పరస్పరాధారితాంశాల్ని అన్నిటినీ ఈ డాక్యుమెంట్‌లో గమనంలో ఉంచుకొంది.

'జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం" అనగానే దీన్ని దేశమంతా ఏకరూపత్వం తేవడానికి చేసే ప్రయత్నమని తరచూ పొరపడే ప్రమాదముంది. NPE **(1986)**లో, కార్యాచరణ ప్రణాళిక (POA) **1982**లో పేర్కొన్న అంశాలు నిజానికి దీనికి భిన్నమైనవి. భారతదేశపు భిన్న భౌగోళిక, సాంస్కృతిక వాతావరణాలకనుగుణంగా ఒక జాతీయ విద్యావ్యవస్థ రూపుదిద్దుకొనేందుకు జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రాన్ని NPE ప్రతిపాదించి ముందుకు తెచ్చింది. అదే సందర్భంలో కొన్ని ముఖ్యమైన సాధారణ విలువలకు, సాధారణ పాఠ్యాంశాలకు

**జా**తీయ విద్యావ్యవస్థ (NSE) జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రంపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రణాళికలో అందరికీ సాధారణమైన ముఖ్యాంశాలతోపాటు ఎవరికివారు మార్చుకోగల అంశాలుకూడా ఉంటాయి. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, రాజ్యాంగ విధులు, జాతీయ సమగ్రత ఆధారంగా ఈ ముఖ్యాంశాలు ఉంటాయి. ఈ అంశాలు ఏవో కొన్ని సబ్జెక్టులకు పరిమితమై ఉండవు. మన సాంస్కృతిక వైభవం, సమానత్వం, స్వాతంత్ర్యం, లౌకికత్వం, స్త్రీ పురుష సమానత్వం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక అవసరాల తొలగింపు, చిన్న కుటుంబం, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రబోధించడం లాంటి విలువల్ని పెంచేలా ఈ అంశాలుంటాయి. అన్ని విద్యారంగ కార్యక్రమాలు లౌకికత్వ విలువల్ని ప్రతిబింబిస్తాయి. భారతదేశం ఎల్లప్పుడూ ప్రపంచాన్ని ఒక కుటుంబంగా చూసింది. జాతుల మధ్య అవగాహన కోసం, శాంతికోసం ప్రయత్నించింది. ఈ ప్రాచీన సంప్రదాయాలకను గుణమైన ఈ ప్రాపంచిక దృక్పథాన్ని విద్య మన యువతరంలో కల్గించాలి. అంతర్జాతీయ సహకారాన్ని శాంతియుత సహజీవనాన్ని వారిలో పెంచాలి. దీన్ని మనం ఏమాత్రం ఉపేక్షించకూడదు. సమానత్వాన్ని సాధించాలంచే అందరికీ సమానావకాశాలుండాలి. అవకాశాలు అందుబాటులో ఉంటే చాలదు. వాటిని పొందేందుక్కూడా సమాన పరిస్థితులుండాలి. పాఠ్యాంశాల్లోని ఈ ముఖ్యాంశాలద్వారా సమానత్వంపట్ల మన యువతరానికి స్పష్టత కల్గించాలి. ఎందుకంటే సామాజిక వాతావరణంవల్ల, పుట్టుక వల్ల వచ్చిన సంక్లిష్టతల్ని, ప్రతికూలతల్ని నిర్మూలించడం మన లక్ష్యం – జాతీయ విద్యా విధానం, **1986**

హామీ అవసరమని కూడా పేర్కొంది. "14 ఏళ్ళవరకు పిల్లలందరూ బడిలో చేరడానికి, బడిలో కొనసాగడానికి, పాఠశాల విద్యలో వీళ్ళు రాణించడానికి విద్యార్థి కేంద్రమైన విద్య అవసర"మని NPE-POA లు పేర్కొన్నాయి (POA, పేజి 77). సంగతత్వం, సరళత్వం, నాణ్యత జాతీయ పాఠ్య ప్రణాళికా దృక్పథాలుగా ఉండాలని కూడా POA సూత్రీకరించింది. ఇలా చూస్తే ఈ రెండు డాక్యుమెంట్లు జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం ద్వారా విద్యావ్యవస్థను ఆధునీకరించాలని తలపెట్టినట్టు అవగతమవుతుంది.

## 1.4 మార్గదర్శక సూత్రాలు

మనకున్న మంచి ఆలోచనల్ని అమల్లోకి తేవాలంటే కొన్ని వ్యవస్థాగతాంశాలపట్ల మనం మనసుపెట్టాలి. మనకొక ప్రణాళిక కూడా ఉండాలి.

- బయటి జీవితాన్ని, జ్ఞానాన్ని మన బోధనతో అనుసంధానించాలి.
- కంఠస్థం చేసే పద్ధతుల్నించి మన బోధనను దూరం చేయాలి.
- పాఠ్య పుస్తకాల్లో చిక్కుకొనేలా కాకుండా, విద్యార్థి సంపూర్ణ వికాసానికి తోడ్పడేలా మన పాఠ్యాంశాల్ని రూపొందించుకోవాలి.
- పరీక్షల్ని మరింత సరళీకరించి తరగతి జీవితంతో వాటిని సమైక్యం చెయ్యాలి.

మన పాఠ్య ప్రణాళిక తప్పనిసరిగా గుర్తించాల్సిన కొత్త అంశాలు కొన్ని ప్రస్తుతం మనముందున్నాయి. వీటిలో అన్నింటికంటే ముఖ్యమైనది అందరు పిల్లల్ని బడిలో చేర్చడం, కొనసాగించడం. దీనికోసం ప్రతి బిడ్డ ఔన్నత్యాన్ని, ఆత్మగౌరవాన్ని గుర్తించేలా అభ్యసనంలో విశ్వాసాన్ని ప్రోదిచేసేలా మనకొక కార్యాచరణ ఉండాలి. సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తే చాలదు, భిన్న సామాజికార్థిక నేపథ్యాల నుంచి వచ్చిన భిన్న భౌతిక, మానసిక, మేధో లక్షణాలున్న పిల్లలందరూ విద్య నేర్చుకోగలరనీ, పాఠశాలలో రాణించగలరనీ మొదట మన పాఠ్యప్రణాళిక గుర్తించాలి. స్త్రీ పురుష అసమానత్వంవల్ల, కులం వల్ల, భాషాసంస్కృతులవల్ల, మతం వల్ల, వైకల్యం వల్ల, పిల్లలకు విద్యాభ్యసనంలో ఎదురవుతున్న ప్రతికూలతలన్నిటినీ ప్రత్యక్షంగా పట్టించుకోవాలి. విధానాలతో, పథకాలతో మాత్రమే ఇది సాధ్యం కాదు. బాల్యారంభం నుంచి మనం ఎన్నుకొనే అభ్యసన లక్ష్యాల్ని, బోధనా పద్ధతుల్ని కూడా దృష్టి ఉంచుకొని పాఠ్యప్రణాళికను రూపొందించుకొన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది.

మన జ్ఞాన సంప్రదాయాలు, వృత్తులు, హస్తకళలు ఎంతో సంపన్నమైనవి. 'సార్వజనీనవిద్య' సాధించాలంటే వీటిని మన పాఠ్య ప్రణాళికల్లో ఇముడ్చుకొనడం చాలా అవసరం. ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ రూపం పొందుతున్న ఈ తరుణంలో జ్ఞానం సరుకుగా మారుతోంది. మార్కెట్ శక్తుల నుండి ఈ సంప్రదాయాలకు పెనుముప్పు వాటిల్లుతోంది. ఆత్మ గౌరవాన్ని పెంచడం, నైతికతను అభివృద్ధి చెయ్యడం, సృజనాత్మకతను వికసింపచెయ్యడం అన్నింటికంటే ప్రధానం కావాలి. చాలావేగంగా మారిపోతున్న ఈ పోటీ ప్రపంచ యుగంలో పిల్లల స్థానిక స్వంత విచక్షణా జ్ఞానాన్ని, ఊహా సామర్థ్యాల్ని గౌరవించడం చాలా అవసరం.

ఇటీవల విద్యారంగంలో తెచ్చిన సంస్కరణల్లో వికేంద్రీకరణ, పంచాయతీరాజ్ సంస్థల పాత్రను పెంచడం చాలా పెద్ద ముందడుగులు. మన పాఠ్య ప్రణాళికకు, జ్ఞానాన్ని స్థానికీకరించవల్సిన బాధ్యత దీనివల్ల నెరవేరుతుంది. నిరంకుశాధికార ధోరణి పంచాయతీరాజ్ సంస్థల ప్రమేయం వల్ల తగ్గుతుంది. పాఠశాలకిది స్వతంత్ర ప్రతిపత్తిని కల్గిస్తుంది.

పిల్లలు పర్యావరణం పట్ల స్పృహను పెంచుకోవడం, దాన్ని కాపాడ్డం మన పాఠ్య ప్రణాళిక ప్రాధాన్యాతాంశాల్లో ఒకటి. గత శతాబ్దంలో వచ్చిన నూతన సాంకేతిక అవకాశాలు, నూతన జీవనశైలి పర్యావరణ ధ్వంసాన్ని తెచ్చిపెట్టాయి. అవకాశాలున్న వారికీ, లేనివారికీ మధ్య అగాధాన్ని తీవ్రంగా పెంచాయి. గతంలో ఎప్పటికన్నా ఇప్పుడు పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరం ఏర్పడింది. మానవుడి మనుగడకు, ఎదుగుదలకు, అభివృద్ధికి ఆటంకంలేకుండా ఈ పర్యావరణ సంక్షోభం నుంచి మానవ జీవితం ఎలా తట్టుకొని నిలబడగలదో విద్యద్వారానే మన పిల్లలు తెలుసుకోవాలి. సమాజంలోని అన్ని వర్గాల వారికి అన్ని స్థాయిల తరగతుల్లో పర్యావరణ పట్ల చైతన్యం కల్గించాల్సిన అవసరాన్ని జాతీయ విద్యా విధానం (1980) నొక్కి చెప్పింది.

మనిషి తనకు తానుగానూ, తనచుట్టూ ఉన్న సామాజిక వాతావరణంలోనూ, స్నేహపూర్వకంగా జీవించాల్సి ఉంది. శాంతియుత వాతావరణంలో మాత్రమే వ్యక్తి వ్యక్తిత్వం సమగ్రంగా అభివృద్ధి చెందగల్గుతుంది. సంక్షుభితమైన ప్రాకృతిక, మానసిక, సామాజిక వాతావరణంలో మానవ సంబంధాలు ఒత్తిడికి లోనవుతాయి. అసహనం పెరుగుతుంది. సంఘర్షణలు తలెత్తుతాయి. స్థానికంగానూ, దేశంలోనూ, ప్రాంతీయ స్థాయిలోనూ, ప్రపంచ స్థాయిలోనూ కూడా గతంలో ఎన్నడూ ఎరగని హింస చెలరేగుతున్న కాలంలో మనం జీవిస్తున్నాం.

తరచుగా మన విద్య పిల్లల హృదయాల్లోకి సాంస్కృతిక అసహనత్వాన్ని ఎక్కిస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో ఇది కపటపూరితంగా వ్యవహరిస్తే కొన్ని సందర్భాల్లో పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తుంది. మానవుల మూల భావావేశాల్ని వివిధ నాగరికతల అన్వేషణా ఫలితాలైన గొప్ప సత్యాల్ని ఈ ధోరణి చూడనిరాకరిస్తుంది. విద్య శాంతిని జీవన విధానంగా అలవరచుకొనేటట్టు చెయ్యాలి. ఘర్షణలు తలెత్తినపుడు సాక్షీభూతులుగా వుండి పోవడం గాదు వాటిని నివారించగల్గేలా చెయ్యాలి. మన పాఠ్యాంశాల్లో శాంతి అంతర్భాగమైతే అది జాతి గాయాల్ని మాన్పుతుంది. మనల్ని పునరుజ్జీవితం చేస్తుంది.

ఒక జాతిగా మనం దృఢమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పుకోగలుగుతాం. ఈ సందర్భంలో సెకండరీ విద్యా కమిషన్ (1952) ప్రజాస్వామ్యాన్ని గురించి చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకొందాం.

"ప్రజాస్వామిక వ్యవస్థలో పౌరుడికి మేధోపరంగానూ, సామాజికపరంగానూ చాలా అర్హతలుండాలి. ప్రజాస్వామ్య పౌరుడు అవాస్తవాల్నించి వాస్తవాన్ని వేరు చెయ్యగల్గాలి. ప్రచారార్భాటాల నుంచి నిజాల్ని విడదీయగల్గాలి. దురభిమాన దురావేశాల్ని తిరస్కరించాలి. ప్రాచీనమైంది ప్రాచీనంగాబట్టి తిరస్కరించకూడదు, ఆధునికమైనదాన్ని ఆధునికంగాబట్టి నెత్తికెత్తుకోకూడదు. నిష్పక్షపాతంగా రెండింటినీ పరీక్షించుకొని న్యాయానికి, అభివృద్ధికి వ్యతిరేకమైనదాన్ని ధైర్యంగా, నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ప్రజాస్వామ్యం ఓ పరిపాలనా వ్యవస్థగాదు. జీవన విధానమని గుర్తించాలి. మన రాజ్యాంగం ప్రతిపాదించిన విలువలు అప్పుడే ప్రాధాన్యతను సంతరించుకొంటాయి.

- ✦ భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమానస్థాయికి, సమాన అవకాశాలకు హామీ ఇస్తుంది.
- ✦ ఎక్కువమంది పిల్లలు ఇంకా విద్యకుదూరంగా ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా వ్యవస్థలు పెంచుతున్న అంతరాలు సమానత్వం కోసం, జరుగుతున్న ప్రయత్నాల్ని సవాలు చేస్తున్నాయి. సామాజిక పరివర్తనానికి, సమానత్వ ప్రాతిపదికన నిర్మింపబడే సామాజిక క్రమానికి విద్య ఒక సాధనం కావాలి.
- ✦ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యాలంటే పేదలందరికీ సామాజికార్థిక రాజకీయ న్యాయం అవసరం.

✦ భావస్వేచ్ఛ, ఆచరణ స్వేచ్ఛ మన రాజ్యాంగంలోని ప్రాథమిక విలువలకు పౌరుడు స్వతంత్రంగా తన లక్ష్యాల్ని నిర్ణయించుకోవడం, ఇతరులకు కూడా అలా నిర్ణయించుకొనే హక్కు వుందని అంగీకరించడం ప్రజాస్వామ్యానికి అవసరం. అదే సందర్భంలో ఈ అవకాశాల్ని ప్రజాస్వామ్యం సృష్టిస్తుంది కూడా.

✦ అందరి మధ్యా స్వేచ్ఛాతత్వాన్ని పెంచేందుకు పౌరుడు సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే ప్రజాస్వామిక సూత్రాల్ని సొంతం చేసుకోవాలి.

✦ భారతదేశం లౌకిక దేశం. అన్ని మత విశ్వాసాల్ని ఇది గౌరవిస్తుంది. అదే సందర్భంలో భారత ప్రభుత్వం ఏ ప్రత్యేక విశ్వాసానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వదు. మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ప్రజలందరినీ గౌరవించే తత్వాన్ని మన పిల్లలకు మనం నేర్పాలి.

మానవుడిగా ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవం ఉంటుంది. ప్రాధాన్యత ఉంటుంది. దీన్ని గుర్తించి, విశ్వసించడమే ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి వ్యక్తి సర్వతోముఖంగా, సంపూర్ణంగా అభివృద్ధి చెందడమే ప్రజాస్వామిక విద్యాలక్ష్యం. విద్య విద్యార్థికి సమాజంలో బహుముఖంగా జీవించగల కళను నేర్పాలి. అట్లని వ్యక్తి తనకుతాను ఒంటరిగా జీవించనూలేడు. అభివృద్ధి చెందనూలేడు. తన తోటివారితో కలిసి గౌరవప్రదంగా, స్నేహపూర్వకంగా, సమర్థవంతంగా జీవించే అర్హతల్ని అందించని విద్య విద్యే కాదు –

(సెకండరీ విద్యా కమీషన్, **1952–53**, పేజి **267**)

అనేక ప్రాంతీయ, స్థానిక సంస్కృతులతో నిర్మించబడ్డ బహుళ సంస్కృతుల సమాజం మనది. మతవిశ్వాసాలు, జీవన విధానం, సామాజిక సంబంధాలు, ఒకరికున్నట్టు మనదేశంలో మరొకరికి ఉండవు. ఇలా సహజీవనం చేస్తూ అభివృద్ధి చెందే హక్కు అన్ని సామాజిక బృందాలకు సమానంగా ఉంది. మనదేశంలోని ఈ సాంస్కృతిక బహుళత్వానికి తగ్గట్టుగా మన విద్యారంగం ఉండాలి. నూతన ప్రాధాన్యతలకు, మారుతున్న సామాజిక సందర్భంలో వస్తున్న నూతన దృక్పథాలకు తగ్గట్టుగా గతాన్ని మన యువతరం అర్థం చేసుకోవాలి. బేరీజు వేసుకోవాలి. మన పాఠ్యప్రణాళిక ఇందుకు తగ్గట్టు ఉండాలి. అప్పుడే మన సాంస్కృతిక వైభవం, జాతీయ సమైక్యత సాధ్యమవుతాయి. తమ హక్కులపట్ల పౌరులకు స్పృహ, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలపట్ల నిబద్ధత ఈ సందర్భంలో ముందుగా అవసరం.

## 1.5 నాణ్యతా పార్శ్వాలు

బిడ్డకు విద్య నందించడం సాధ్యమైనా నాణ్యమైన విద్యనందించడం పెద్ద సవాలు. 'అధికృత ఉన్న వారికే నాణ్యమైందికూడా లభిస్తుంద'నడం రాజకీయరంగంలో భారతదేశం నమ్మిన, ఆచరిస్తున్న భాగస్వామ్య ప్రజాస్వామ్యం దృష్టిలో చూస్తే అర్థంలేని వాదం. వివిధప్రాంతాల్లోని, వివిధ సామాజిక తరగతుల పిల్లలకు అందుతున్న విద్య సాపేక్షంగా, సమానంగా ఉండడం నేటి విద్యారంగ ఆవశ్యకతల్లో ముఖ్యమైంది. సమానత్వం, నాణ్యత, రాశి అనే మూడంశాలు మన విద్యారంగంలో పొంతనలేని త్రికోణం వంటివని కీర్తిశేషులు జె.పి. నాయక్ అభివర్ణించారు. ఈ త్రికోణాన్ని అర్థం చేసుకోవాలంటే నాణ్యతకు సంబంధించినంతవరకు లోతైన తాత్వికావగాహన అవసరం. దీనికి మన ప్రస్తుతావగాహన సరిపోదు. నాణ్యతాచర్చ సందర్భంగా కొన్ని స్పష్టమైన ప్రమాణాల్ని 'యునెస్కో' తన అంతర్జాతీయ పర్యవేక్షణా రిపోర్టులో ప్రస్తావించింది.

ఈవైపునుంచి చూస్తే విద్యార్థి జీవితాచరణల్ని ఒక ప్రామాణికమైన నాణ్యతగా మనం గుర్తించాల్సి ఉంటుంది. విపరీతంగా పెరిగిపోతున్న ప్రైవేట్ రంగానికి; వనరుల్లేక, ఉన్న వనరులూ సమానంగా అందక సతమతమవుతున్న ప్రభుత్వ రంగానికి మధ్య విద్యావ్యవస్థ ప్రస్తుతం విభజింపబడి వుంది. ఈ స్థితిలో నాణ్యత అనగానే కొన్ని సంక్లిష్ట తాత్వికాంశాలు, ఆచరణలో ఎదురయ్యే సమస్యలు మనముందుకొస్తాయి. ప్రైవేట్ స్కూళ్ళకు సంబంధించినంతవరకు నాణ్యత అంటే పరీక్షల్లో ఎక్కువ మార్కులు, ఎక్కువ ఫలితాలు సాధించడం. వీటిలో ఎక్కువగా మాతృభాషకు ప్రాధాన్యత ఉండదు. మరి విద్యార్థి అర్థవంతమైన పద్ధతుల్లో జ్ఞాన నిర్మాణం చేసుకోవడానికి ఈ పాఠశాలలు అందిస్తున్న అవకాశాలేమిటి? ఈ స్కూళ్ళలో పేదపిల్లలకు ప్రవేశమే ఉండదు. తరగతి గదిలోని భిన్న సామాజికార్థిక సంస్కృతీ నేపథ్యాల పిల్లలతో కలిసిమెలసి ఉండే అవకాశం, వీళ్ళనుంచి నేర్చుకొనే అవకాశం ప్రైవేట్ స్కూలు పిల్లలకెక్కడుంది? ఇదికూడా గొప్ప అభ్యసనావకాశాల్ని కోల్పోవడమేగదా?

భౌతిక వనరుల్ని సమకూర్చడమే నాణ్యతకు ప్రమాణం కాదు. కానీ ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు నడుపుతున్న స్కూళ్ళలో అత్యవసరమైన సదుపాయాలు, వసతులు, భౌతిక వనరులు లేకపోవడం మాత్రం నాణ్యతకు పెద్ద అడ్డంకిగా ఉన్నమాట వాస్తవం. నాణ్యతకు అన్ని విద్యార్హతలు, తగిన ప్రేరణా గల్గి, ఉపాధ్యాయ వృత్తిని కోరుకొని వచ్చిన టీచర్లు ప్రాథమికావసరం. NPE లోనూ, అంతకుపూర్వపు ఛటోపాధ్యాయ కమిషన్ రిపోర్టు (1984)లోనూ నిర్దేశించిన ప్రమాణాలు ఉపాధ్యాయుల నియామకాల్లో, ఉపాధ్యాయ శిక్షణలో ప్రస్తుతం తగ్గిపోతుండడం ఆందోళన కల్గిస్తోంది. ఉపాధ్యాయుల నాణ్యతకు మించిన నాణ్యత విద్యావ్యవస్థలో ఉంటుందని ఎలా భావించగలం? మరి ఉపాధ్యాయుల్లో నాణ్యత ఎలా వస్తుంది? ఎంపిక పద్ధతుల్నిబట్టి, శిక్షణా పద్ధతుల్నిబట్టి, జవాబుదారీతనాన్ని పెంచే మార్గాల్ని బట్టి ఈ నాణ్యత ఉంటుంది.

పిల్లల జ్ఞానాన్ని, నైపుణ్యాల్ని పెంచేందుకు మనం ఎలాంటి అనుభవాల్ని తరగతిగదిలో రూపొందించామనేదాన్ని బట్టి కూడా నాణ్యత నిర్ధారింపబడుతుంది. జ్ఞాన స్వభావాన్ని గురించి, విద్యార్థి స్వభావాన్ని గురించి మనకున్న ఆలోచనలనుంచే పాఠశాల పద్ధతులు రూపుదిద్దుకొంటాయి. పాఠ్యగ్రంథాల్ని తయారుచేసే వారి దృక్పథాన్ని కూడా ఇవే మలుస్తాయి. టీచర్ల దృక్పథం కూడా వీటినిబట్టే ఉంటుంది. ఈనాడు మానవజాతికీ, మనదేశానికీ ఎదురవుతున్న సవాళ్ళను దృష్టిలో ఉంచుకొని మన పాఠ్యపుస్తకాల్లోని, ఇతర బోధనా సామగ్రిలోని అంశాలు, జ్ఞానం ఉండాలి. ఈ విస్తృత అవసరాలకు దూరంగా ఏ పాఠ్యప్రణాళికా ఉండటానికి వీల్లేదు. కాబట్టి ప్రతి సబ్జెక్టులోని జ్ఞానాన్ని మన సామాజికార్థిక సాంస్కృతిక పరిస్థితుల్ని, లక్ష్యాల్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా పరిశీలించాలి. భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని సుదృఢపరచడం రాజ్యాంగంలో నిర్దేశించుకొన్న విలువల్ని కాపాడుకోవడం మన జాతిముందున్న నేటి పెద్ద సవాళ్ళు. పాఠ్య ప్రణాళికా సంస్కరణలో సామాజికన్యాయాన్ని, నాణ్యతని కీలకాంశాలుగా గుర్తించడం ద్వారా ఈ సవాళ్ళను అధిగమించగలం. సార్వత్రిక మానవ హక్కుల్ని గురించి, సంక్లిష్ట బోధనావకాశాన్ని గురించి ఈనాడు జరుగుతున్న చర్చల్ని దృష్టిలో ఉంచుకొని మనం ధైర్యంగా మన దృక్పథాన్ని మార్చుకోడానికి సిద్ధపడాలి. శాంతి, స్నేహపూర్వక సహజీవనం లాంటి అంశాలతో ముడిపడ్డ విలువలపట్ల మనం అవగాహన పెంచుకోవాలి. విద్యలో నాణ్యత అంటే జీవితాన్ని అన్ని రూపాల్లోనూ నాణ్యంగా మలుచుకోవడం. మనం ముందే వల్లించుకొన్న నాణ్యతల్నే, నాణ్యతలుగా తృప్తిపడితే సరిపోదు. శాంతికోసం తపన, పర్యావరణం పట్ల శ్రద్ధ, సామాజిక పరివర్తనకు సంసిద్ధత ఇవన్నీ విద్యా నాణ్యతలోని ముఖ్యాంశాలని గుర్తించాలి.

## 1.6 విద్యా సామాజిక సందర్భం

విద్యా వ్యవస్థ సమాజాన్నుంచి వేరుపడి ఒంటరిగా మనలేదు. అదికూడా సమాజంలో అంతర్భాగమే. సమాజంలోని కులాల దొంతరలు, ఆర్థిక స్థితిగతులు, స్త్రీపురుష సంబంధాలు, అసమాన అభివృద్ధి పిల్లలకు, విద్యను అందుబాటులోకి తేవడంలో తీవ్రప్రభావాన్ని కల్గిస్తాయి. పాఠశాలల్లో వాళ్ళు భాగస్వాములు కావడాన్ని కూడా నిరోధిస్తాయి. బడిలో చేరడంలోను, చదువును పూర్తిచేయడంలోను వివిధ సామాజికార్థిక వర్గాల పిల్లల్లో కన్పించే వ్యత్యాసాల్ని చూస్తే ఇది మనకు అర్థమవుతుంది. నగరాల్లోనూ, గ్రామాల్లోనూ గల దళిత ఆదివాసీ బాలికలు విద్యావిషయంగా బాగా నష్టపోతున్నవాళ్ళు. మన విద్యావ్యవస్థే భిన్న వర్గాల పిల్లలకు భిన్న విద్యానుభవాల్ని అందించేలా విభక్తమైవుంది. మన గ్రామాల్లో, నగరాల్లో ఎక్కడైనా ఈ దుస్థితిని మనం చూడొచ్చు.

పట్టణాల ధనికవర్గపు పిల్లలు చదువుకొనే ఖరీదైన 'పబ్లిక్' (ప్రైవేట్) స్కూళ్ళు ఒకవైపు, ఇంతకుముందు చెప్పుకొన్న అణగారిన వర్గాల పిల్లలు అత్యధికంగా చేరే, అధ్వాన్న స్థానికసంస్థల స్కూళ్ళు ఒకవైపు మనకు సర్వత్రా దర్శనమిస్తాయి. ఈ రెండో రకం స్కూళ్ళు పైకిమాత్రం 'ఉచితం'గా విద్యనందిస్తున్నట్టు కన్పిస్తాయి. ఒక కిలోమీటరు లోపల ఒక స్కూలు ఉండాలని, ప్రతి జనావాసానికి బడి ఉండాలని, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని గమనంలో ఉంచుకోవాలని మనం పెట్టుకొన్న నియమాల్ని యాంత్రికంగా అమలుచేసిన ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో బహుళ తరగతి పాఠశాలలు విపరీతంగా ఇటీవల పెరిగాయి. ఈ స్కూళ్ళకు ఎలాంటి పాఠ్య ప్రణాళిక, ఎలాంటి బోధన, ఎలాంటి సామగ్రి అవసరమో ఎవ్వరికీ స్పష్టత లేదు. మనకు తెలియకుండానే ఈ పరిస్థితి కొందరి ఆధిక్యతను పెంచింది. కొందరికి నాసిరకం చదువును మిగిల్చింది. సామాజిక న్యాయం, అందరికీ సమానావకాశాలు అనే రాజ్యాంగ విలువల్ని హరింపజేసింది. 'అందరికీ విద్య', ఎదుర్కొంటున్న అడ్డంకులు, 'ఉచిత విద్య' అందించడంవల్ల తొలగిపోతాయని మనం అర్థం చేసుకొన్నట్లయితే ఇందుకోసం ప్రభుత్వపు ఇతర విభాగాలు కూడా తమ తోడ్పాటునందించాలి.

ప్రపంచీకరణ, సమాజంలోని ప్రతి రంగంలోను మార్కెట్ సంబంధాల విస్తరణ విద్యమీద కూడా తీవ్ర ప్రభావాన్ని కల్గిస్తున్నాయి. ఒకవైపున విద్యారంగం చాలా వేగంగా వ్యాపారంగా మారుతోంది. మరొకవైపున ప్రభుత్వ నిధులు అరకొరగా మాత్రమే అందడంతో అధికార్లు 'ప్రత్యామ్నాయ పాఠశాలలవైపు మొగ్గుచూపుతున్నారు. విద్యా బాధ్యత క్రమంగా ప్రభుత్వం నుంచి దూరమై కుటుంబాల మీద, సమాజం మీద పడుతోంది.

స్కూళ్ళు వ్యాపార సంస్థలవుతున్నాయి. మార్కెట్ దృక్పథాలే పాఠశాల నాణ్యతకు గీటురాళ్ళుగా మారుతున్నాయి. నానాటికీ విపరీతమైన పోటీతత్వం పాఠశాలల్లోకి ప్రవేశిస్తోంది. తల్లిదండ్రుల ఆకాంక్షలు పిల్లలపై విపరీతమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. పసిపిల్లలమీద కూడా ఈ ఒత్తిడి పెరగడంతో వ్యక్తిగత ఎదుగుదల, అభివృద్ధీ, 'నేర్చుకోవడంలో ఆహ్లాదం' అన్నీ దెబ్బతింటున్నాయి.

రాజ్యాంగపు 73, 74 సవరణలవల్లా, చట్టాలవల్లా పిల్లల చదువులో స్థానిక ప్రజలకు నిర్ణయాధికార భాగస్వామ్యం లభించింది. ఇది చాలా మంచి పరిణామం. కానీ తమ పిల్లల చదువులపట్ల తల్లిదండ్రులకున్న ఆకాంక్షలు వారి పేదరికంవల్ల, అసమాన సామాజిక భేదాలవల్ల ఏమాత్రం నెరవేరడం లేదు. ఇతర వర్గాలతో సమానమైన నాణ్యతగల స్కూళ్ళు వాళ్ళకి అందుబాటులో లేవు. నగరాల్లో పెరిగిపోతున్న పేదల సంఖ్యనుబట్టి ప్రణాళికలుండటంలేదు. ఈ పేద తల్లిదండ్రుల ఆకాంక్షల్ని పాఠ్యప్రణాళికతో సంబంధంలేని అంశాలుగా భావించి మనం దూరంగా ఉంచలేము.

మన ఈ సామాజిక సందర్భంవల్ల విద్యారంగంలో అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయి. పాఠ్యప్రణాళికా రచనలోను, దీని అమలులోను మనం వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. విద్యామార్గదర్శక సూత్రాలపై జరిగిన చర్చ ఈ సవాళ్ళని గుర్తించింది. కొన్ని పరిష్కార మార్గాల్ని కూడా సూచించింది. జ్ఞానాన్ని, జ్ఞానానుభవాల్ని పరిధులు పెంచి విస్తరింపచెయ్యడం, అభ్యసన లక్ష్యాల్ని ఎంచుకొనేపుడు అణగారిన వర్గాల్ని గమనంలో ఉంచుకోవడం, పిల్లల భాగస్వామ్యాన్ని పెంచే బోధనా విధానాల్ని రూపొందించడం, మనం తీసుకొనే నిర్ణయాల్ని ప్రజలకు మనసువిప్పి స్పష్టంగా వివరించడం లాంటి ఆలోచనల్ని ఈ డాక్యుమెంటులోని వివిధ భాగాల్లో మీరు చూస్తారు.

## 1.7 విద్యా లక్ష్యాలు

మనం ఎంచుకున్న ఆదర్శాలకూ, అంగీకరించిన నియమాలకూ విద్యా ప్రక్రియల్ని అనుసంధానం చెయ్యడానికి విద్యాలక్ష్యాలు స్థూలనిర్దేశకసూత్రాలుగా ఉపకరిస్తాయి. విద్యా లక్ష్యాలు ప్రస్తుత అవసరాలనూ, సమాజపు ఆకాంక్షలనూ కూడా ఏకకాలంలో ప్రతిబింబిస్తాయి. అవి శాశ్వతవిలువలతో పాటు,సమాజం యొక్క తక్షణ సమస్యలనూ, విస్తృతమానవాదర్శాలనూ కూడా ప్రతిబింబిస్తాయి.ఏ నిర్దిష్ట స్థలకాలసందర్భంలోనైనా వాటిని శాశ్వత,స్థూల మానవాకాంక్షల వ్యక్తీకరణగా పేర్కొనవచ్చు.

విద్యాలక్ష్యాలు పాఠశాలల్లోనూ, ఇతర విద్యాసంస్థల్లోనూ చేపట్టే వివిధ కార్యకలాపాన్ని సృజనాత్మకంగా మార్చి వాటికి 'విద్యాపరమైన' లక్షణాన్ని ఆపాదిస్తాయి. ఏ విద్యాలక్ష్యమైనా ఉపాధ్యాయురాలికి తన ప్రస్తుత తరగతి గది కార్యకలాపాల్ని అభిలషణీయభవిష్యత్తుగా మార్చుకోగలిగే అవకాశాన్నిస్తుంది. కాని ఆ ప్రయత్నంలో దాన్ని యాంత్రికం కానివ్వదు. అంతేకాక, ప్రస్తుత సమస్యలనుండి ఎడంకానివ్వకుండానే దానికొక దిశానిర్దేశాన్నిస్తుంది. ఆ విధంగా చూస్తే, ఒక లక్ష్యమంటే మనం ముందే ఆశించిన ఒక ఫలితంగా చెప్పవచ్చు. అదొక ప్రేక్షకపాత్ర ధరించిన సోమరి దృక్పథం కాదు, అంతకు మించి ఆ గమ్యాన్ని చేరే ప్రతి అడుగునూ ప్రభావితం చేసే ప్రక్రియ అనవచ్చు.

ఏ లక్ష్యమైనా దూరదృష్టిని ప్రసాదించాలి. దానికి మూడు మార్గాలున్నాయి. ఒకటి, అది నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరడానికి చుట్టూ ఉన్న పరిస్థితుల్లో ఏ సాధనసంపత్తి లభ్యంగా ఉందో సునిశితంగా పరీక్షించడం. ఆ మార్గంలోని ఆటంకాల్ని గుర్తెరగడం. ఇందుకుగాను, పిల్లల్ని సవివరంగా పరిశీలించవలసిఉంటుంది. వాళ్లు వివిధవయస్సుల్లో ఏమి అభ్యసించగలుగుతారో పరిశీలించవలసిఉంటుంది. ఇక రెండవది, ఆ దూరదృష్టి మన లక్ష్యసాధనకి అనువైన క్రమాన్ని, మార్గాన్ని సూచిస్తుంది. మూడవది, ఆ క్రమంలో, వివిధ ప్రత్యామ్నాయాల్ని ఎంచుకునే వీలు కల్పిస్తుంది. కాబట్టి ఒక లక్ష్యానికి అనుగుణంగా ప్రయత్నించడం మనకొక చాకచక్యాన్ని కలిగిస్తుంది. పాఠశాల, తరగతి గది, ఇతర సంబంధిత అభ్యాసస్థలాలు విద్యాభ్యాసంలో ముఖ్యమైన రంగస్థలాలు. ఇవి అభ్యాసకులు తమ ఆకాంక్షిత కరికులర్ లక్ష్యాల్ని సాధించుకోవడానికి సహకరించే స్థలాలు కావాలి. అభ్యాసకుల గురించిన అవగాహన, విద్యాలక్ష్యాలు, జ్ఞాన స్వభావం,సాంఘిక స్థలంగా పాఠశాల స్వభావం మన తరగతి గది ఆచరణల్ని నిర్దేశించే కొన్ని సూత్రాల్ని మనకందిస్తాయి.

ప్రజాస్వామిక విలువల పట్ల నిబద్ధత కలిగిఉండటం. హేతుబద్ధ వివేచనమీదా, అవగాహనమీదా ఆధారపడ్డ ఇటువంటి విలువల పట్ల నిబద్ధతను పెంపొందించడానికి విద్య కృషి చెయ్యాలి. అటువంటి నిబద్ధతను విద్యార్థులలో కలిగించడానికి పాఠశాలలో చర్చ, సంవాదం కొనసాగే దిశగా కరికులం కృషి చేయవలసిఉంటుంది.

అలాగే స్వతంత్రంగా ఆలోచించడం, స్వతంత్రంగా పనిచెయ్యడమనేవి వ్యష్టిగానూ, సమష్టిగానూ కూడా జాగ్రత్తగా పరిశీలించి విలువలకు కట్టుబడి నిర్ణయాల్ని తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించే గుణగణాలు.

ఇతరుల సంక్షేమం పట్లా, వారి అనుభూతుల పట్లా సున్నితంగా స్పందించడం, ప్రపంచం గురించిన జ్ఞానం, అవగాహనా విలువలకు కట్టుబడటానికొక హేతుశీలతను కలిగిస్తాయి.

నేర్చుకోవడమెట్లానో నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని అవసరమైతే వదిలిపెట్టగలగడం లేదా సవరించుకోగలగడం అనేవి కొత్త సందర్భాలకు సరళంగా, సృజనాత్మకంగా ప్రతిస్పందించడాన్ని నేర్పే క్రమంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. ఇటువంటి జ్ఞాననిర్మాణ ప్రక్రియల్ని నొక్కి చెప్పవలసిన బాధ్యత కరికులంకి ఎంతైనా ఉంది.

జీవితంలో మనిషి చేపట్టే ఎంపికలు, ప్రజాస్వామిక ప్రక్రియల్లో భాగస్వామ్యం వహించగల నేర్పు చాలా వరకు మనం సమాజానికి ఏమివ్వగలుగుతున్నామన్నదానిమీద ఆధారపడిఉంటుంది. కనుకనే విద్య పనిచేయగలిగే సామర్థ్యాన్ని, ఆర్థికకార్యకలాపంలో పాలుపంచుకునే నేర్పుని, సామాజిక పరివర్తనని పెంపొందించవలసిఉంటుంది. ఇందుకు మనం పనిని విద్యతో అనుసంధానం చేయవలసిఉంటుంది. ఇందుకుగాను కృత్యాధార అనుభవాలు చాలినన్ని ఉండేటట్టుగా, నైపుణ్యాల్లో, వైఖరుల్లో అవి విశాలంగా ఉండేటట్టుగా, సాంఘిక-ఆర్థిక ప్రక్రియలపట్ల అవగాహన కలిగిఉండేటట్టుగా, ఇతరులతో సహకారభావనతో కలిసిపనిచేయడానికి అనువైన మనస్థితి ఏర్పడేటట్టుగా మనం చూసుకోవలసిఉంటుంది. కేవలం పని మాత్రమే సాంఘికభావనని పెంపొందింపజాలదు.

సౌందర్యాన్ని, కళారూపాల్ని చూసి ఆనందించడం మానవజీవితంలో విడదీయరాని అంతర్భాగం. కళలో, సాహిత్యంలో, ఇతర జ్ఞానక్షేత్రాల్లో సృజనాత్మకత దగ్గరగా అనుసంధానమయ్యేఉంటుంది. పిల్లవాడి సృజనాత్మక అభివ్యక్తినీ, సౌందర్యవివేచననూ పెంపొందించే సాధనసంపత్తినీ, అవకాశాల్నీ విద్య అందించవలసిఉంటుంది. సౌందర్యవివేచనా, సౌందర్యనిర్ణయాత్మకతా మార్కెట్ శక్తుల చేత తారుమారుకాబడుతూ, వాటి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ధారితమవుతున్న ఈ రోజుల్లో సౌందర్యవివేచననూ, అభిరుచినీ పెంపొందింపచేసే విద్య అవసరం ఎంతయినాఉంది. అలాగని మనం ఆ ప్రయత్నంలో సౌందర్యానికీ, కళావినోదరూపాలకూ నకళ్లను తయారుచేయకూడదు. మన సౌందర్యాభిరుచి స్త్రీలనూ, బలహీనుల్నీ కించపరిచేది కాకూడదు.

❀ ❀ ❀

అధ్యాయం - 2

# అభ్యసనం, జ్ఞానం


2.1 అభ్యాసకులకు ప్రాధాన్యత

2.2 అభ్యాసకులు - సందర్భం

2.3 అభివృద్ధి, అభ్యసనం

2.4 కరికులంలో, ఆచరణలో ఇమిడివున్న అంశాలు

2.5 జ్ఞానమూ, అవగాహన

2.6 జ్ఞాన పునఃసృజన

2.7 పిల్లల జ్ఞానం, స్థానిక జ్ఞానం

2.8 పాఠశాల పరిజ్ఞానమూ, పరిసరసమాజమూ

2.9 అభివృద్ధికి సంబంధించి ఆలోచించవలసిన కొన్ని అంశాలు


పిల్లవాడినొక సహజసిద్ధ అభ్యాసిగా, జ్ఞానాన్ని పిల్లవాడి స్వీయకార్యకలాపం వల్ల సంభవించేదిగా గుర్తించాలని ఈ అధ్యాయం స్పష్టం చేస్తుంది. పాఠశాలకు బయట మన దైనందిన జీవితాల్లో మనం పిల్లల్లో కుతూహలాన్నీ, ప్రశ్నించే తత్వాన్నీ, కొత్తవాటిని తమకై తాము కనుగొనే లక్షణాల్నీ గమనిస్తుంటాం. వాళ్లు తమ చుట్టూ ఉండే ప్రపంచంతో ఏదో ఒక కార్యకలాపంలో నిమగ్నులవుతూ ఉంటారు. ప్రతిస్పందిస్తూంటారు. పరిశీలిస్తుంటారు. కొత్తవేవో కనుగొంటూంటారు. రహస్యాలేవో తమకు తామే కనుగొనాలని చూస్తారు. కొత్త అర్థాల్ని తమకై తాము అన్వేషిస్తూంటారు. మనిషి శారీరిక మానసిక శక్తుల్ని పరిపూర్ణంగా వికసింపచేసే పెరుగుదలకీ, పరివర్తనకీ అనువైన దశ బాల్యం. అది పిల్లలు పెద్దవాళ్ల సమాజానికి అనుగుణంగా తమని తాము సంసిద్ధపరచుకునే దశ. తనగురించీ, ప్రపంచం గురించీ తెలుసుకొనే దశ, అందుకవసరమైన కార్యాచరణకు కావలసిన జ్ఞానాన్ని సముపార్జించుకుంటూ, రూపొందించుకుంటూ ఉండే దశ. ప్రతి తరం సాంస్కృతిక భాండాగారం నుంచి, సామాజిక జ్ఞానం నుంచీ తనకి కావలసినదాన్ని అందిపుచ్చుకుంటూ తన అవగాహనలో, తన కార్యకలాపంలో విలీనం చేసుకుంటూ, దాన్ని తిరిగి పున:సృష్టి చేస్తుంది.

## 2.1 అభ్యాసకులకు ప్రాధాన్యత

స్వేచ్ఛాయుత అభ్యసనం అభ్యాసకుల్లో సహజసిద్ధంగా నేర్వగలిగే శక్తుల్ని మేల్కొల్పుతుంది. వారు తమ చుట్టూ ఉండే భౌతిక, సామాజిక వాతావరణానికి అనుగుణంగా, తమ నిర్దేశిత కర్తవ్యానికి అనుగుణంగా తమ జ్ఞానాన్ని తామే నిర్మించుకునేలా, తమ సామర్థ్యాల్ని తామే పెంపొందించుకునేలా ఇది దోహదం చేస్తుంది. ఇది సంభవించాలంటే, అసలన్నిటికన్నా ముందు ప్రయత్నాలు చెయ్యడానికీ, ప్రత్యామ్నాయాలు వెతకడానికీ, తప్పులు దొర్లడానికీ, తమని తాము సరిదిద్దుకోవడానికీ పిల్లలకు అవకాశాలుండాలి. ఇది ఒక నైపుణ్యాన్నో లేదా క్రమశిక్షణనో నేర్వడానికి ఎంత అవసరమో, ఒక భాషని నేర్వడానికి కూడా అంతే అవసరం. తమ గురించీ, ఇతరుల గురించీ, సమాజం గురించీ నేర్చుకోవడానికీ, తమకు వారసత్వంగా లభించిందాన్ని తెలుసుకోవడానికీ, అందుకోడానికీ, తన సామాజిక సాంస్కృతిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా జ్ఞానాన్ని పాఠశాలలు సంస్థాగత అవకాశాల్ని కలుగజేస్తాయి. ప్రపంచానికి సంబంధించి అవగాహన చేసుకోవల్సిన అంశాల విషయమై పాఠశాల కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తుంది.

కరికులానికి సంబంధించి మనం తీవ్రంగా ఆలోచన చెయ్యాల్సిన అంశం ఏమిటంటే దాన్ని పిల్లలకొక అర్ధవంతమైన అనుభవంగా, అన్నిటినీ తనలో పొదువుకోగలిగిన అనుభవంగా రూపొందించడమెట్లా అన్నది. పుస్తకాధార సంస్కృతికి మనం దూరంగా జరగాలంటే అభ్యాసకుల గురించీ, అభ్యసన ప్రక్రియలగురించీ మనం ఆలోచించేవిధానంలోనే సమూల పరివర్తన రావాలి. శిశు కేంద్రవిద్యలోని ముఖ్యాంశాల పట్ల మరింత జాగరూకతతో మరింతవివరంగా ఆలోచించవలసిన అవసరం ఇందుకే వచ్చింది.

శిశుకేంద్ర విద్య అంటే పిల్లల అనుభవాలకు, వారి ఆవేదనలకు,వారి క్రియాశీల భాగస్వామ్యానికి పెద్దపీట వెయ్యడం. అటువంటి విద్యావిధానం వల్ల పిల్లల మానసిక అభివృద్ధినీ, వారి ఆకాంక్షల్నీ దృష్టిలో పెట్టుకుని మనం అభ్యసనప్రణాళికను రూపొందించగలం. అటువంటి అభ్యసన ప్రణాళిక, వైవిధ్యవంతమైనలక్షణాల మధ్యా, అవసరాల మధ్యా పిల్లల భౌతిక, సాంస్కృతిక, సామాజిక ప్రాథమ్యాలకు ప్రతిస్పందించేట్టుగా ఉండాలి. ప్రస్తుతం మన పాఠశాలల్లోని బోధనాపద్ధతులు, అభ్యసన కర్త్యవ్యాలు, అభ్యాసకులకోసం మనం రూపొందించే వాచకాలు పిల్లల సామాజీకరణమీదా, వారి అభ్యసనంలోని 'స్వీకార' లక్షణాల మీదా దృష్టి పెడుతూఉన్నాయి. ఇందుకు బదులు మనం వారిలోని సృజనాత్మక, క్రియాశీల సామర్థ్యాలమీద దృష్టి పెట్టవలసిఉంటుంది. ప్రపంచం యొక్క యథార్ధ పార్శ్వంతోనూ, తోటిమానవులతోనూ తమ కార్యకలాపాల్ని అనుసంధానించుకునే గుణాన్ని మనం పెంచిపోషించవలసిఉంటుంది. ఎంతో క్రియాశీలకం. కాని సాధారణంగా మనం 'ఉత్తమ విద్యార్ధి' అనే మాటని ఉపాధ్యాయుడి పట్ల విధేయత చూపించేవారినీ, నైతిక ప్రవర్తన కలిగిఉండేవారినీ, తన ఉపాధ్యాయుడి ప్రతి మాటనీ 'సాధికారిక'జ్ఞానంగా భావించేవారినీ దృష్టిలో పెట్టుకునే వాడుతుంటాం.

సాధారణంగా పిల్లలకు భౌతిక అసౌకర్యం కలిగించే కొన్ని అంశాలు

- ✦ చిన్నపిల్లలు బడికి పోవడానికి చాలా దూరం నడవవలసి రావడం
- ✦ బాగా బరువుండే పుస్తకాల సంచులు
- ✦ మౌలిక సదుపాయాల కొరత, చదువుకోవడానికీ, రాసుకోవడానికీ చాలినన్ని పుస్తకాలు లేకపోవడం
- ✦ సరిగ్గా రూపొందించని ఫర్నిచరు, దానివల్ల పిల్లలకు కూర్చున్నప్పుడు నడుంనొప్పి, కాళ్లకి తిమ్మిర్లు,మొణుకులు నొప్పి మధ్యమధ్యలో వొళ్లు చాచుకోవడానికీ, అటూ ఇటూ మసలడానికీ, ఆడుకోవడానికీ చిన్నపిల్లలకు అవకాశమివ్వని టైం టేబుళ్లు,
- ✦ పెద్దపిల్లలకు క్రీడలకు అవకాశం లేకపోవడం, ఆడపిల్లలకు సరైన అవకాశాలు లేకపోవడంతో వాళ్లు చదువు మధ్యలో మానేసేలాంటి టైం షెడ్యూళ్లు
- ✦ ఆడపిల్లలకు మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు లేకపోవడం
- ✦ పిల్లలను కొట్టడం, గోడకుర్చీ లాంటి వికృతశిక్షలు

## 2.2 అభ్యాసకులు – సందర్భం

సాధారణంగా తరగతి గదిలో పిల్లల అనుభవాలనూ, అభిప్రాయాలనూ అభివ్యక్తీకరించడానికి చోటు దొరకదు. పిల్లలు మాట్లాడటానికి ప్రయత్నించినపుడల్లా మనకి తరచు వినబడేది ఉపాధ్యాయుడి కంఠం మాత్రమే.

వాళ్లు సాధారణంగా ఉపాధ్యాయుడి మాటల్ని తిరిగి వల్లిస్తూనో, లేదా ఉపాధ్యాయుడి ప్రశ్నలకు జవాబిస్తూనో వినబడతారు. వాళ్లు ఏదన్నా  పని చేస్తూ కనబడటం అరుదు. అలాగే వారు చొరవ తీసుకుని ఏదన్నా చేసి చూపించే అవకాశాలూ అరుదే. కాబట్టి కరికులం పిల్లలు తమ సొంతగొంతు వినగలిగేటట్టు చేయాలి. వాళ్ల కుతూహలాన్ని పెంచిపోషించాలి. కేవలం పుస్తకజ్ఞానాన్ని తిరిగి అప్పగించడం కాకుండా, వాళ్లేదో ఒకటి చేసేటట్టుగా, ప్రశ్నలు అడిగేటట్టుగా, పరిశోధన కొనసాగించేటట్టుగా, తమ అనుభవాల్ని స్కూలు నుంచి లభ్యమైన జ్ఞానంతో పంచుకునేటట్టుగా, అను సంధానించుకునేటట్టుగా చేయాలి. దీనికితగ్గట్టు మన పాఠ్యప్రణాళికని మార్చడం మన మొదటి కర్తవ్యం. టీచర్ల సంసిద్ధత, పాఠశాలల వార్షిక ప్రణాళికలు రూపొందించడం, రూపకల్పన ఇవన్నీ దీనికి తగ్గట్టు ఉండాలి.

తమని గుర్తించి తమకి విలువనిచ్చే వాతావరణంలో మాత్రమే పిల్లలు నేర్వగలుగుతారు. మన పాఠశాలలు ఈ భావనని ఇంకా అందరు పిల్లలకూ అందించలేకపోతున్నాయి. నేర్వడం సంతృప్తికరమైనఒక అనుభవంగా కాకుండా భయంతో, క్రమశిక్షణతో, ఒత్తిడితో కూడుకున్నది కావడం అభ్యసన మౌలికప్రయోజనానికే ప్రమాదకరం. మన పిల్లల్లో ప్రతి ఒక్కరికి తమ కుటుంబాలు, తమ సమాజాలు, తమ భాషలు, తమ సంస్కృతులు ఎంతో విలువైనవిగా తోచాలి. వారి వైవిధ్యవంతమైన సామర్థ్యాలు స్వీకారయోగ్యం కావాలి. ప్రతి ఒక్కరికీ నేర్వగలిగే హక్కు, నేర్చుకునే సామర్థ్యం, జ్ఞానాన్నీ, నైపుణ్యాల్నీ అందుబాటులోకి తెచ్చుకోగల అవకాశం ఒనగూడాలి. పిల్లలకు అత్యుత్తమఫలితాల్ని సాధించగల సత్తా వారికుందని వయోజన సమాజం నమ్మగలగాలి. మన పాఠశాలల పరిధి విస్తరించి అవి సమాజంలోని అన్ని వర్గాల పిల్లలనూ తమలోకి ఇముడ్చుకుంటున్నకొద్దీ మనం ఈ అవసరాల్ని మరింత బాగా గుర్తించగలుగుతున్నాం. మధ్యాహ్నభోజన పథకం, మౌలిక సదుపాయాల కల్పన, పిల్లలందరినీ కలుపుకుపోగల విద్యగురించిన ఆతృత ఈ మధ్యకాలంలో మనం చెప్పుకోదగ్గ విశేషాలు. అలాగే పిల్లల మీద శారీరికంగా విధించే అన్ని రకాల దండనలకీ వ్యతిరేకంగా మనం దృఢవైఖరి అవలంబించాలి. పాఠశాల సరిహద్దులకీ, గ్రామసమాజానికీ మధ్యగల హద్దులు నెమ్మదిగా పరస్పరవిలీనమయ్యే రోజు రావాలి. అదే సమయంలో, కరికులం భారానికీ, పరీక్షలకు సంబంధించిన ఒత్తిడికి  సంబంధించిన పార్శ్వాలన్నిటిపట్లా మనం జాగ్రత్త వహించాలి. అభ్యసన సమయంలో ప్రాథమిక సెకండరీ పాఠశాలల దశనుంచి, ఆ తర్వాత కూడా అభ్యాసకులకు భౌతిక మానసిక భద్రత సమకూరడం మొత్తం అభ్యసనప్రక్రియకే పునాదిరాయివంటిది.

## 2.3 అభివృద్ధి, అభ్యసనం

శైశవం నుంచితొలియవ్వనం దాకా ఉండే కాలం వేగవంతమైన పెరుగుదలతోనూ, మార్పుతోనూ కూడుకున్న దశ.అందువల్ల కరికులం అభివృద్ధికీ, అభ్యసనానికీ మధ్య సమగ్రదృష్టి కలిగి వాటి మధ్య పరస్పర సంబంధాల్ని చూడగలిగేటట్టు ఉండాలి. అప్పుడే అది భౌతిక మానసిక అభివృద్ధుల మధ్యగల సరిహద్దులకి అతీతంగా ముందుకు పోగలుగుతుంది. వ్యక్తిగత అభివృద్ధినీ, తోటిమానవులతోఆదానప్రదానాల్నీ సమన్వయించగలుగుతుంది.

### 2.3.1 అభివృద్ధికి పూర్వనిర్ణయం

మొత్తం అభివృద్ధి అంతటికీ ఒకే ఒక్క ముందస్తు షరతు ఏమిటంటే అందరు పిల్లలూ ఆరోగ్యవంతంగా ఎదగడమే. అన్ని రకాల భౌతిక అసౌకర్యాలనుంచీ విముక్తి, శారీరికవ్యాయామం, తగినంత పోషకాహారం అందుకు ముఖ్యం.

పిల్లలు శారీరికంగా ఎదగడానికి స్వేచ్ఛగా ఆడుకోవడం, యథేచ్ఛగానూ, పద్ధతి ప్రకారంగానూ ఆడుకునే వివిధ రకాల ఆటలు, క్రీడలు చాలా అవసరం. అలాగే, వాళ్లు ఒత్తిడినుంచి బయటపడి ఊపిరి పీల్చుకోవడానికి తగినంత తీరికసమయం కూడా ఉండాలి.

వాళ్లకి లభించవలసిన శారీరక సామర్థ్యాల్లో శరీర పటుత్వం, చాలన నైపుణ్యాలు, లాఘవాలు, స్వయంజాగృతి, సంయమనం, జట్టుతో కలిసిపనిచేయగలగడం ముఖ్యమైనవి. కొన్ని రకాల అదనపు పరికరాలు, కొంత తర్ఫీదు ఉన్నట్లయితే, ఈ కార్యకలాపంలో, క్రీడల్లో పిల్లలందరూ కూడా కలిసిపాల్గొనేటట్టు చేయవచ్చు. తద్వారా శారీరికంగా వికాసానికి నోచుకోని పిల్లలు కూడా తక్కిన పిల్లల్లాగా ఆటల్లో, క్రీడల్లో పాలుపంచుకోగలుగుతారు. పిల్లలు క్రీడల్లో, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ వంటిశారీరిక విన్యాసాల్లో; యోగాలో, నృత్యం వంటి కళారూపాల్లో కూడా అత్యున్నత ప్రతిభాపాటవాల్ని కనబరచగలుగుతారు. కాని వాటిల్లో ఆనందాస్వాదనకు బదులుగా విజయసాధన దిశగా లక్ష్యాలు మారినప్పుడు అత్యధిక క్రమశిక్షణ, సాధన అవసరమై పిల్లల మీద వారి వయసుకి మించినఒత్తిడిని కలగచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

ముఖ్యంగా చిన్నపిల్లల్లో శారీరిక అభివృద్ధి మానసిక అభివృద్ధికీ, గ్రహణసామర్థ్యాల పెంపుదలకూ దోహదం చేస్తుంది. ఆలోచించగల, వివేచించగల సామర్థ్యం, తన గురించీ, ప్రపంచం గురించీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం అనేవి వివిధ కృత్యాల్ని తనకు తానుగానూ, ఇతరులతో కలిసీ చేయగలగడంతో, ఇతరులతో ఇచ్చిపుచ్చుకోగలిగే నేర్పుతో చాలా సన్నిహితంగా అనుసంధానమై ఉంటాయి.

### 2.3.2 జ్ఞానం

గ్రహణసామర్థ్యం పనిద్వారానూ, భాషాప్రసారం ద్వారానూ తన గురించీ, ప్రపంచం గురించీ అవగాహన చేసుకోగలిగిన సామర్థ్యంతోనూ ముడిపడిఉంటుంది. దేన్నైనా అర్థవంతంగా నేర్చుకోవడమంటే అదొక ఉత్పాదన క్రియవంటిది. అందులో కేవలం సమాచారాన్ని భద్రపరచుకోవడం, అవసరమైనప్పుడు వెలికి తీసుకోవడం మాత్రమే ఉండవు. దానిలో వివిధ నిర్దిష్టవిషయాల్నీ, మానసిక భావనల్నీ రకరకాలుగా ఉపయోగించుకోగలగడం కూడా ఉంటుంది. కాబట్టి ఆలోచించడం, భాష (శాబ్దికం, సంజ్ఞాపూర్వకం రెండూనూ)ఆచరణకు తేవడం అనేవి దగ్గరగా దగ్గరగా అనుసంధానమైన విషయాలు. ఇటువంటి నేర్పు తొలి శైశవం నుంచే మొదలవుతుంది. నెమ్మదిగా స్వతంత్ర, సంవదిత కార్యకలాపం ద్వారా వృద్ధి చెందుతుంది.మొదట్లో పిల్లలు 'ఇప్పుడు', 'ఇక్కడ' ఉన్నవాటిని మాత్రమే తెలుసుకోగలుగుతారు. తమకు సంప్రాప్తమైన నిర్దిష్ట అనుభవాల్ని మాత్రమే తర్కించి వివేచించ గలుగుతారు.నెమ్మదిగా వారి భాషాసామర్థ్యాలు, నలుగురితో కలిసి పనిచేయగలిగే నేర్పు అధికమైన కొద్దీ వారు 'ఇప్పుడు' కట్టెదుట కనిపించని లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక చెయ్యగలగడం, అమూర్త ప్రత్యయాల ఆధారంగా మరింత సంక్లిష్టంగా ఆలోచించగలగడం నేర్చుకుంటారు. సంభావ్యప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలోచించడం, ఊహాజనిత ప్రత్యయాల ఆధారంగా వివిధ తార్కిక ప్రతిపాదనలు చేయగలగడం కూడా క్రమేణా సాధ్యమవుతుంది.

మౌలికభావనాసామర్థ్యం వృద్ధి చెందడమంటే కొత్త అర్థాల్నీ, అర్థచ్ఛాయల్నీ అందుకోగలగడం, వాటి మధ్య సంబంధాల్ని అన్వేషించుకోగలగడం, మరింత సుసంపన్నంగా, లోతుగా వాటిని బోధపరుచుకోగలగడం. అదొక నిరంతర ప్రక్రియ. దానితో పాటే కార్యకారణ సంబంధం గురించిన ఆలోచన కూడా వృద్ధి చెందుతుంది. సాధారణంగా ప్రాకృతిక, సామాజిక ప్రపంచాల పట్ల పిల్లలకు సహజసిద్ధంగా ఉండే అభిప్రాయాలు పదునెక్కడంతో పాటు, వివిధ అంశాలు అవెందుకట్లా ఉన్నాయో తెలియపర్చుకునే క్రమంలోఇతరులతో తమకుగల పరస్పర సంబంధం

మెరుగవుతుంది. దీంతోపాటు కార్యకారణ సంబంధాల ఆధారంగా నిర్దిష్ట నిర్ణయాలు తీసుకోవడానికీ, నిర్దిష్ట కార్యాచరణకూ కూడా సామర్థ్యం ఒనగూడుతుంది. కాబట్టి వైఖరులు, ఉద్వేగాలు, నైతికత పిల్లల జ్ఞానం అభివృద్ధి చెందడంలో అంతర్భాగంగా ఉంటాయి. అవి భాషాభివృద్ధికీ, మానసిక సంవేదనలకూ, మౌలికభావాలు ఏర్పరచుకోవడానికీ, హేతుశీలవివేచనకూ అనుసంధానమై ఉంటాయి. ఇటువంటి జ్ఞానసంబంధ సామర్థ్యాలు వృద్ధి చెందేకొద్దీ వారు తమ విశ్వాసాలపట్ల మరింత జాగరూకులై తమ స్వీయ అభ్యసనాన్ని తామే నియంత్రించుకోగలుగుతారు.

పిల్లలందరూ నేర్చుకోవడానికి సహజంగానే ఆసక్తి చూపిస్తారు, వాళ్లంతా నేర్వగలరు.

ఏ విషయాన్నైనా అర్థం చేసుకోగలగడం, అమూర్త ప్రత్యయాల ఆధారంగా ఆలోచించగలగడం, తెలుసుకున్నదాన్ని మనసులో ప్రతిఫలించుకోగలగడం, పని చేయగలగడం అభ్యసన ప్రక్రియలోని ముఖ్యాంశాలు.

పిల్లలు వివిధ పద్ధతుల్లో నేర్చుకొంటారు. అనుభవం ద్వారా, వస్తువుల్ని తయారు చేయడం ద్వారా విషయాల్ని ఆచరణకు పెట్టడం ద్వారా, ప్రయోగాలు చెయ్యడం ద్వారా, చదవడం ద్వారా, చర్చించడం ద్వారా, ప్రశ్నించడం ద్వారా, వినడం, ఆలోచించడం, పర్యావలోకనం, తమని తాము భాషద్వారా అభివ్యక్తీకరించుకోగలగడం, చలనం, రాయడం వంటి పద్ధతుల్ని విడిగానూ, బృందాలతోనూ కలిసి చేయడం ద్వారా పిల్లలు నేర్చుకోగలుగుతారు. వాళ్లు అభివృద్ధి చెందే క్రమంలో ఈ అవకాశాలన్నీ కూడా వారికి అందిరావాలి. శారీరిక సమస్యలున్న పిల్లలకు బహుళేంద్రియానుభవాలు అవసరమవుతాయి. ఒకటి కన్నా ఎక్కువ ఇంద్రియాలకు పనిచెప్పే అటువంటి అనుభవాల వల్ల వారి భావనాసామర్థ్యం వృద్ధి చెందుతుంది.

పిల్లవాడు విషయగ్రహణకు సంసిద్ధుడు కాకుండానే అతనికి బోధించడం వల్ల తర్వాత తర్వాత అది పిల్లవాడి అభ్యసన సామర్థ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. అటువంటప్పుడు పిల్లలు చాలా విషయాల్ని 'గుర్తుపెట్టుకోవచ్చు' గానీ, వాటిని యథార్థంగా అర్థం చేసుకోలేరు, లేదా వాటిని తమ చుట్టూ ప్రపంచానికి అనుసంధానించి చూసుకోలేరు.

నేర్వడం పాఠశాలలోపలా జరుగుతుంది, పాఠశాల బయటా కూడా జరుగుతుంది. ఆ రెండూ క్షేత్రాలూ ఒకదానికొకటి ఇచ్చిపుచ్చుకోగలిగినప్పుడు ఆ నేర్వడం సుసంపన్నమవుతుంది. సౌందర్యవివేచనాత్మక భావనల్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సమగ్ర అభ్యసనాన్ని కళా, పనీ సమకూరుస్తాయి.

కేవలం తాత్కాలికంగా గుర్తు పెట్టుకుని, పరీక్షలు పూర్తికాగానే మర్చిపోవడానికి మాత్రమే ఉపకరించే విధంగా కాకుండా, మనకి ఏర్పడుతున్న మౌలికభావనలకి మనం అంటిపెట్టుకుని, తద్వారా మన అవగాహనని సుసంపన్నం చేసుకునే విధంగా అభ్యసనం కొనసాగవలసిఉంటుంది. శారీరిక సమస్యలున్న పిల్లలు సక్రమంగా నేర్చుకోవాలంటే వారు నేర్చుకున్నదాన్ని తిరిగి తిరిగి నెమరేసుకునేందుకు ఎక్కువ సమయం అవసరమవుతుంది. అదే సమయంలో నేర్వడం వైవిధ్యవంతంగానూ, ఉత్కంఠభరితంగానూ, ఆసక్తికరంగానూ, క్రియాశీలకంగానూ ఉండాలి. ఏదైనా పని చేయడానికి పిల్లవాడు విసుగుదల చూపిస్తున్నాడంటే ఆ అభ్యసన కృత్యం మరీ యాంత్రికంగా మారిపోయిందనీ, ఇక పిల్లవాడికి దాన్నుంచి లభించే సంజ్ఞాతక విలువ ఏదీ లేదనీ మనం అర్థం చేసుకోవాలి.

మధ్యవర్తితో ప్రమేయం ఉన్నా లేకున్నా కూడా నేర్వడం కొనసాగుతుంది. మధ్యవర్తి లేకుండా నేర్వడం కొనసాగాలంటే, ఆ సామాజిక సందర్భం, ఆ సామాజిక ఆదానప్రదానాలు, ముఖ్యంగా ఉన్నత సామర్థ్యాలున్న వ్యక్తులతో సంబంధాలు అవసరం.

### 2.3.3 కౌమార దశ

మనిషికి తనదంటూ ఒక అస్తిత్వముద్ర లభించే క్రమంలో తొలియవ్వనం చాలా ముఖ్యమైన దశ. ఒక మనిషికి తనదంటూ ఒక శరీరం అభివృద్ధి చెందడం, తనదంటూ ఒక ముద్ర ఏర్పడటం ఒకదానికొకటి అనుసంధానమైన విషయాలు. బయటి ప్రపంచంలో లభించే చోటు, దానిలోకి ప్రవేశం, దానిలో స్వేచ్ఛగా సంచరించగలగడం ఆత్మచైతన్యనిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి. సాధారణంగా సాంఘికనిర్బంధాల వల్ల ఇంటికే పరిమితం కావాల్సి వచ్చే ఆడపిల్లల విషయంలో ఈ అంశాలకు మరింత ప్రాధాన్యత ఉంది. ఈ సామాజిక సంప్రదాయాలే మగపిల్లల విషయంలో మరొకలా పనిచేసి వారిని బయటప్రపంచంలో ఉత్సాహంగా పాలుపంచుకునేలా, శారీరికవికాసాన్ని సాధించుకునేలా ప్రోత్సహిస్తాయి. ఈ వ్యత్యాసాలు తొలియవ్వనం పరిణతమయ్యే సమయంలో, శారీరికపరిణితి సమయంలో ఉచ్చదశకు చేరుకుంటాయి. సాధారణంగా సమాజం ప్రపంచవ్యాప్తంగా నమ్ముతూ వచ్చే సూత్రాలూ, భావాలూ ప్రశ్నించబడే వేళ అది. అదే సమయంలో సహచరుల, ఇతరుల అభిప్రాయాలకు విలువ లభించే వేళ కూడా. ఆ దశలో పిల్లలకు సామాజికమైన, భావోద్వేగపరమైన మద్దతు అవసరమవుతుంది. తద్వారా వారు తమతో తాము ఆరోగ్యకరమైన సంబంధంలోకి ప్రవేశించగలుగుతారు. వారు ఇతరులతో, ముఖ్యంగా స్త్రీ పురుషులు ఒకరు మరొకరితో ప్రభావితమయ్యే వేళ అది. ఆ సమయంలోగనుక సామాజికమైన మద్దతు లేనట్టయితే తమలో, ఇతరుల్లో ఆ దశలో సంభవించే మార్పులు వారిని భయాందోళనలకు గురిచేసి, చివరకు వారిని ఆటపాటలనుండీ, బయటప్రపంచపు కార్యకలాపం నుండీ దూరం చేసే ప్రమాదం కూడా ఉంది.

పాఠశాల తన విద్యార్థులకు అందచేసే అనుభవాలనుండి ఏ ఒక్కరు కూడా లింగ, వర్ణ, వర్గ, మత, శారీరిక వైకల్యాల ప్రాతిపదికన వివక్షకు గురికాకూడదు. కాని దురదృష్టవశాత్తూ నేడు జరుగుతున్నదదే. వివిధ గతానుగతిక ఆచారాలకూ, నైతిక, ధార్మిక నియమాలకూ మధ్యనుండే సన్నని వ్యత్యాసాన్ని పిల్లలు క్రమేణా తెలుసుకోవలసిఉంటుంది. కాని అటువంటి హేతువివేచన దానికదే నైతిక ప్రవర్తనని నిర్మింపజాలదు. నైతికవివేచనలో మార్పు రావాలంటే నైతిక సమస్యలమీద చర్చించడానికీ, లోతుగా పరిశీలించడానికీ అవకాశాలు ఒనగూడవలసిఉంటుంది.దానితో పాటే సమాజం మొత్తంతోనూ, ఇతరులతోనూ వ్యవహరించే తీరులో మరింత విస్తృతమైన ఆత్మపరిశీలనకూడా అవసరమవుతుంది.

స్వీయ అస్తిత్వ ముద్ర, నీతినియమాలనేవి సమకాలీన సాంఘిక సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని వృద్ధిచెందవలసిన అంశాలు. అన్ని రకాల వైవిధ్య ముద్రల్నీ ఒకే గాటన కట్టడం సరిగాదు. వివిధ అస్తిత్వముద్రలు సమాంతరంగా వర్ధిల్లగల బహుళతా పూర్వకసమాజాల్ని పెంపొందించడం మన కర్తవ్యం. దానితోపాటు దీనికి భిన్నంగా ఎవరికివారికి విశ్వజనీన హేతుశీలసంస్కృతికి కట్టుబడ్డ తనదైన 'భారతీయ' అస్తిత్వం, పరస్పర గౌరవం, శాంతి కూడా సాధ్యం కావలసిఉంటుంది.

### 2.3.4 అభ్యసన నైపుణ్యాలు

సాధారణంగా అభ్యసన వైకల్యాలు అని మనం వాడే పదం శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం, హేతువివేచన, గణితం అనే సామర్థ్యాల్లో తగిన స్థాయికి చేరలేకపోయే వివిధ రకాల అసమర్థతలన్నిటినీ కలిపిసూచిస్తుంది. కేంద్రీయనాడీవ్యవస్థ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల సంభవించే పర్యవసనాలివి. కాని ఈ పదం శారీరిక వైకల్యాలుండే పిల్లలకు వర్తించదు. ఆ పిల్లల విషయంలో అభ్యసనం సాధారణంగానే ఉంటుందిగాని, కొంత తేడా ఉంటుంది. అక్కడ కొన్ని పార్శ్వాల్లో వారి నిర్దిష్టవైకల్యం వల్ల అభ్యసనం కుంటుపడ్డట్టు కనిపించినా మరికొన్ని పార్శ్వాల్లో చురుగ్గా ఉంటుంది.

సాధారణంగా అభ్యసనవైకల్యాలు ఇంద్రియవైకల్యాలవల్లా మానసిక మైన ఎదుగుదల నిల్చిపోవడం వల్లా, సామాజిక, భావోద్వేగపరమైన, వాతావరణ సమస్యలవల్లా సంభవించేమాట నిజమే అయినప్పటికీ వాటికి సరయిన, సక్రమమైన బోధన లేకపోవడం కూడా ఒక కారణమేనని చెప్పాలి. అయితే, ఇందుకు తగిన నిర్ధారణ సూత్రాలింకా వృద్ధిచెందలేదు. ఇందుకుగల కారణాల నిర్ధారణ, నివారణ అనే అంశాల్లో పరిశోధన చాలినంత జరగలేదు. సంభావ్యకారణాలు కూడా హేతుయుక్తంగా విశ్లేషించబడలేదు. పిల్లల పనితీరు తగినంతగా లేకపోవడానికి విద్యాబోధన ఎంతమేరకు కారణం కావచ్చుననే దాని మీద పెద్దవివాదమే చెలరేగుతూఉంది. అభ్యసన వైకల్యాలు లాంటి పదాలు పిల్లలు పాఠశాలలో ఎదుర్కొనే సమస్యలని చిన్నవిగా చూపిస్తాయి పిల్లలు వివిధ సాంఘిక-సాంస్కృతిక నేపథ్యాలనుంచివచ్చినందువల్లనో మొదటితరం అభ్యాసకులు కావడం వల్లనో వారు అభ్యసనంలో సమస్యలనెదుర్కొంటున్నట్టుగా, ఆ సమస్యలు వ్యక్తిగత గుణదోషాలన్నట్టుగా, వైఫల్యాలన్నట్టుగా భావించే అవకాశం ఉంది. అయినప్పటికీ అన్ని తరగతుల్లోనూ, అన్ని విషయాల్లోనూ 'అభ్యసన వైకల్యాల్ని' 'అభ్యసన సమస్యల్ని' పరిష్కరించవచ్చుననే భావనకు క్రమేణా సార్వజనీన ఆమోదం లభిస్తున్నది. చాలా రాష్ట్రాల్లో అటువంటి పరీక్షలు సాధారణతరహాలోనే నిర్వహిస్తున్నారు. అభ్యసన వైకల్యాలు, సమస్యలు ఉన్నాయనుకున్నప్పుడు వాటిని సులభంగా పరిష్కరించే ఉద్దేశ్యంతో ఉపాధ్యాయులు అలవాటుగా చేపట్టే వివిధ చర్యలు వికటిస్తున్నాయి. ఇందుకు మరింత లోతైన పరిశోధన, మరింత సునిశితమైన నిర్ధారణసామగ్రి, ఏ అభ్యాసికి ఆ అభ్యాసిని దృష్టిలో పెట్టుకుని రూపొందించే ప్రత్యేక బోధనకార్యక్రమాలు అవసరమవుతాయి. అటువంటి మౌలికసామగ్రిని రూపొందించుకోనంతవరకూ మనం 'మానసిక వైకల్యాలు'అని వాడే పదాలు పిల్లలకు 'పేర్లు' పెట్టడమే అవుతుంది.

## 2.4 కరికులంలో, ఆచరణలో ఇమిడివున్న అంశాలు

### 2.4.1 జ్ఞాన నిర్మాణం కోసం బోధన

పిల్లలు స్వయంగా పాల్గొంటూ జ్ఞానాన్ని నిర్మించుకొనే క్రమంలో టీచర్లుకూడా క్రియాశీల భాగస్వాములు కాగల్గితే వారి పాత్రకు ప్రాధాన్యత పెరుగుతుంది. నేర్చుకొనే క్రమంలో బిడ్డ తాను పాల్గొంటూ జ్ఞానాన్ని నిర్మించుకొంటుంది. పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకొన్నదాన్ని బయట అనుభవాలతో అన్వయించుకోవడం మౌనవ్రతధారణ చెయ్యకుండా వుండటం, ఒకేవిధమైన 'సరైన' జవాబులు చెప్పేందుకు బదులు పలురూపాల్లో స్పందించడం ఇవన్నీ మనకు చాలా చిన్న విషయాలుగా కన్పించవచ్చు. కానీ పిల్లల అవగాహన పెరగడంలో

మాత్రం ఇవన్నీ చాలా కీలకమైన మెట్లు. పిల్లలకు తరచుగా తమ అనుభవాల నుంచిగానీ, ప్రసార మాధ్యమాల నుంచిగానీ కొత్తకొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఉపాధ్యాయుడికి నచ్చేవిధంగా వాటిని చెప్పడం పిల్లలకు చేతగాకపోవచ్చు. పూర్తిగా తెలిసినదానికీ, దాదాపు తెలిసినదానికీ మధ్య ఒక 'జోన్' ఉంటుంది. అక్కడే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. ఈ జ్ఞానం నైపుణ్యాలుగా రూపాంతరం చెందుతుంది. స్కూలు బయటా, ఇంటిలో, సమాజం మధ్యా పనిచేసే క్రమంలో ఈ నైపుణ్యాలు పదునెక్కుతాయి. మనం ఈ నైపుణ్యాలన్నిటినీ గౌరవించాలి. ఈ కీలకం తెలిసిన ఉపాధ్యాయుడు పిల్లలు తమ శక్తిని తాము గుర్తించడానికి తగినవిధంగా పిల్లలకు లక్ష్యాలు ఇస్తాడు. ప్రశ్నల్ని అందిస్తాడు.

క్రియాశీలంగా పాల్గొనడంలో పరిశీలన, పరిశోధన, ప్రశ్నించడం, చర్చించడం ఉంటాయి. అన్వయించడంలో సిద్ధాంత ప్రతిపాదన, దృక్పథాలు, నూతనాలోచనల ఆవిష్కరణ ఉంటాయి. క్రియాశీలంగా పాల్గొనడానికీ వివిధ భావనలు, నైపుణ్యాలు, వైఖరులు క్రమపద్ధతిలో నేర్చుకోవడానికి 'సవాలు' చాలా కీలకమైంది. ఒక గ్రూపుకు సవాలుగా ఉండేది మరొక గ్రూపుకు చాలా సులభమైంది కావచ్చు. ఒకరికెంతో ఆసక్తిగా ఉండేది మరొకరికి ఏమాత్రం ఆసక్తికరం కాకపోవచ్చు. ఇదంతా స్థాయినిబట్టి ఉంటుంది.

సాధారణంగా టీచర్లు నిర్దిష్టత కోసం సృజనాత్మకతను, సరళత్వాన్ని దూరం చేస్తుంటారు. అది ప్రభుత్వ పాఠశాలల్లోగావచ్చు, ప్రైవేటు పాఠశాలల్లో గావచ్చు, టీచర్లు తరచుగా ఒక ప్రశ్నకు ఒకేరకమైన సమాధానాన్ని పిల్లలు చెప్పాలని పట్టుపడుతుంటారు. 'పాఠ్యపుస్తకాల్లో లేని, బయటవున్న ప్రతిఒక్కటీ సమాధానం ఎలా అవుతుంది' అని వాదనకు పూనుకొంటారు. 'మేమ స్టాఫ్‌రూంలో చర్చించాం. ఒక్క జవాబునే అంగీకరించాలని నిర్ణయించాం' అనికూడా చెపుతుంటారు. 'ఎన్నో జవాబులు వస్తుంటాయి. అన్నిటినీ ఒప్పుకొనగలమా' అని సవాళ్ళు విసురుతుంటారు. ఈవాదం అభ్యసనాన్ని ప్రహసనంగా మార్చుతుంది. పిల్లలకు, తల్లిదండ్రులకు పాఠశాలలంటే మార్చడానికి వీలులేని నిర్హేతుక పద్ధతులనే భావాన్ని కల్గిస్తాయి. మనం ఇచ్చిన ప్రశ్నలకు పిల్లలు జవాబులివ్వడమేనా ఎప్పుడూ జరగాల్సింది? టీచర్లు దీన్ని ఆలోచించాలి. ఏమి నేర్చుకొన్నారో పరీక్షించేందుకు కొన్ని జవాబులిచ్చి, వాటిని ప్రశ్నలుగా ఎందుకు అడగకూడదు.

### ప్రశ్నలు రూపొందించడం

జవాబు **5** అయితే ప్రశ్నలు ఎలావుంటాయి? చూడండి:

నాలుగు ఒకటి కలిస్తే ఎంత?

ముప్ఫై మూడు నుంచి ఇరవైఏడు + ఒకటి తీసేస్తే ఎంత వస్తుంది?

నీకెన్ని చాక్లెట్లు కావాలి?

నేను మా అవ్వగారింటికి ఆదివారం వెళ్ళాను. గురువారం వచ్చేశాను. మరి నేను మా అవ్వగారింట్లో ఎన్నిరోజులున్నాను?

A, B, C లు వచ్చారు. తర్వాత వారికి E, F, G, H కలిసారు. వారినుంచి A, G వెళ్ళిపోయారు. మళ్ళీ G తిరిగివచ్చాడు. B వెళ్ళిపోయాడు. ఇప్పుడెంతమంది మిగిలారు?

ఎరుపు అనేది జవాబు అయితే ప్రశ్నలెలావుంటాయి?

ఈ పూవు రంగు ఏమిటి?

నీవు ఉత్తరాన్ని ఆ పెట్టెలోనే ఎందుకు వేశావు?

ట్రాఫిక్ లైటు దగ్గర ఆమె ఎందుకు ఉన్నట్టుండి ఆగిపోయింది?

### 2.4.2 ప్రతిచర్యల విలువ

చుట్టూవున్న పరిసరాలతో, ప్రకృతితో, వస్తువులతో, ప్రజలతో భాషద్వారా, కార్యక్రమాలద్వారా జరిపే ప్రతిచర్య ద్వారా అభ్యసనం సాగుతుంది. గతిశీలమైన భౌతికచర్యలు; వస్తువుల్ని స్వంతంగా, సహచరులతో కలిసిచెయ్యడం, సాధించడం; అభివ్యక్తీకరణ, ప్రశ్నలు, వినడం, చర్చించడంలాంటి భాషా వినియోగం – ఇవన్నీ జ్ఞాన నిర్మాణంలో చాలా కీలకమైనవి. ఏ సందర్భంలో అభ్యసనం జరుగుతున్నదనేదాన్నిబట్టి జ్ఞాన ప్రాధాన్యత ఉంటుంది.

మన పాఠశాల అభ్యసనం ఎక్కువగా వ్యక్తిప్రధానంగా వుంటుంది. ఉపాధ్యాయుడు జ్ఞానప్రసారకర్త. బోధనను పిల్లలు సమాచార ప్రసారంగా భావిస్తారు. ఇది పిల్లల అభ్యసనం కోసం ఉపాధ్యాయుడు అనుభవాల్ని క్రోడీకరించడంగా ఉంటుంది. కానీ పిల్లలు ఉపాధ్యాయులతో, తోటి వయస్కులతో, తమకంటే పెద్దలతో, పిన్నలతో, ప్రతిచర్య జరపడం ద్వారా ఎక్కువ అభ్యసనావకాశాల్ని పొందగల్గుతారు. ఇతరులతోకలిసిమెలిసి చర్చించుకొనే క్రమంలోనే నేర్చుకొనాల్సిన లక్ష్యం చేతికందుతుంది. ఇలాంటి అభ్యసనం ఫలవంతంగా జరగాలంటే మన స్కూళ్ళలో వివిధ నేపథ్యాల పిల్లలుండటం అవసరం.

పూర్వ ప్రాథమిక దశలో ఇలాంటి సమిష్టి కృత్యాలు మనమెక్కువగా చేపడుతుంటాం. మాధ్యమిక ఉన్నత తరగతుల్లో కూడా ప్రాజెక్టుల్ని, ఇతర కార్యక్రమాల్ని ఇవ్వడం ద్వారా గ్రూపు కృత్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి కృత్యాల్ని అంచనావేసి మూల్యాంకనం చెయ్యడానికి కొన్ని పద్ధతులున్నాయి. స్కూళ్ళు మిశ్రమ వయస్సుల పిల్లలకు కొన్ని ప్రాజెక్టులివ్వాలి. ఇలాంటి గ్రూపుల్లోని పిల్లలు టీములుగా పనిచెయ్యడం ద్వారా సమిష్టి పనివిధానాన్ని, సామాజిక విలువల్ని నేర్చుకోగల్గుతారు. ఇతరులతో చేరడంద్వారా తమ స్వంత శక్తికి మించిన లక్ష్యాన్ని సాధించడానికి వ్యక్తికి వీలవుతుంది. తనకు పూర్తిగా తెలియనిదానిలోనికి కూడా ప్రవేశించే అవకాశం చిక్కుతుంది. బాధ్యతల్ని తీసుకొని, లక్ష్యాల్ని ఎంచుకొని చేపట్టే ఈ కృత్యాలద్వారా జ్ఞానసముపార్జనేగాదు చేతివృత్తుల్ని, కళల్ని నేర్చుకోవడం కూడా సులభతరమవుతుంది. బహుళస్థాయి విద్యార్థులుండే మన తరగతుల్లో వయస్సుతో, స్థాయితో నిమిత్తంలేకుండా ఇచ్చే ఇలాంటి కృత్యాలు బోధనలో సౌలభ్యాన్ని పెంచుతాయి. మంచి పాఠ్యప్రణాళికా పద్ధతిగా ఇది రాణిస్తుంది.

### 2.4.3 అభ్యసనానుభవాల్ని రూపొందించడం

మనం రూపొందించుకొనే అభ్యసన లక్ష్యాల ప్రభావం అభ్యసనంమీదా, దాని విలువమీదా ఎంతో ఉంటుంది. మన అభ్యసన లక్ష్యాలు చాలా సులభమైనవిగా లేదా చాలా కష్టమైనవిగా, యాంత్రికమైనవిగా, మళ్ళీమళ్ళీ వచ్చేవిగా, పుస్తకాల్ని వెతుక్కోవల్సినవిగా, విద్యార్థి ప్రశ్నించడానికి స్వీయాభివ్యక్తీకి ఏమాత్రం అవకాశం లేనివిగా, టీచరుమీద ఆధారపడాల్సినవిగా ఉంటే పిల్లలు నిరాసక్తంగా, విధేయంగా ఉండిపోతారు.

తమ స్వంత అభ్యసనం, ఆలోచన, స్వీయతర్కం విలువలేనివనే నిర్ధారణకు వస్తారు. జ్ఞానం ఇతరులచే నిర్మింపబడిందనీ, తాము కేవలం దాన్ని స్వీకరించేవారమనే అభిప్రాయానికి వచ్చేస్తారు. అప్పుడు పిల్లల్ని ఉత్సాహపరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయుడిమీద పడుతుంది. పిల్లలు తమకుతాము సహజంగా ప్రేరణ పొందుతారనే సంగతి ఉపాధ్యాయుడు మరిచిపోతాడు. పిల్లలు కూడా నియంత్రణను అంగీకరించి, నియంత్రణను కోరుకునే దుస్థితికి చేరుకుంటారు. ఈ ధోరణి జ్ఞానాభివృదద్ధికి విఘాతంగా పరిణమిస్తుంది. అభ్యసనానికి అత్యవసరమైన సరళత్వం దెబ్బతింటుంది. మార్చడానికి వీలుకాని పద్ధతులు ముందుకొస్తాయి. ఏడవ తరగతికి వచ్చేటప్పటికి ఇటువంటి అభ్యసన వాతావరణంలో పెరిగిన పిల్లలు తమ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. స్వయం వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పోగొట్టుకుంటారు. వాళ్ళ స్వీయ అనుభవాలకు పాఠశాలలో ఇక స్థానం ఉండదు. పరీక్షల్లో ఉత్తీర్ణతకోసం యాంత్రికంగా కంఠస్తం చేయడానికి పూనుకుంటారు.

### అనుభవాల నిర్వహణ

పరిశీలన   సహజమైన పద్ధతుల్లో మొక్క మొలకెత్తడాన్ని, పాలు సేకరించే వివిధ దశల్ని, ప్యాకింగు చేయడాన్ని, వివిధ పాల ఉత్పత్తుల్ని పరిశీలించడం.

భాగస్వామ్యం   ఒక అంశంచుట్టూ రోల్‌ప్లే నిర్వహించి, ప్రదర్శించడంద్వారా శరీరానికి, మెదడుకు పనికల్పించే వ్యాయామం చేయడం.

మాట్లాడడం   విద్యార్థి తన అనుభవాలన్ని స్మరించుకుని మాట్లాడ్డం (ఉదాహరణకు కుటుంబంలో లేదా సమాజంలో స్త్రీ, పురుష విచక్షణతో చేసే పనులపై ఒక సంభాషణ లేదా సంఖ్యలకు సంబంధించిన ఒక క్రీడలో పాల్గొనడం).

చేయడం   గేర్లు గల చక్రాలని ప్రయోగపూర్వకంగా తయారుచేయడం, పుల్లీల సాయంతో బరువును పైకెత్తడం. ఇలాంటివి చేసిన తర్వాత వీటిపై ఉపాధ్యాయురాలు చర్చలు, వ్యాసరచన, చిత్రలేఖనం, ప్రదర్శనలాంటివి చేపట్టవచ్చు. పిల్లలనుంచి ప్రశ్నలు వేయించి జవాబులు రాబట్టవచ్చు. ఉపాధ్యాయురాలు పాఠ్యపుస్తక జ్ఞానంతో దీనిని అనుసంధానింపజేసి పై అనుభవాల్ని మరింత లోతుకు తీసుకెళ్ళవచ్చు. ఇలాంటి అనుభవాలు, అనుభవాల తర్వాత చేసే కృత్యాలు ఏదశలోనైనా పిల్లలకు ఎంతో ఉపయోగపడుతాయి. పిల్లలు పెరిగేకొద్దీ వీటి స్వభావం, రూపం, సంక్లిష్టత మాత్రమే మారతాయి. అనుభవాల్ని వ్యక్తీకరించడానికి అవసరం కాబట్టి అనుభవానికీ, భాషకీ మధ్య ఒక సమానత్వం ఉండాలి.

దీనికిబదులు సవాళ్ళతోకూడిన లక్ష్యాలను పెట్టి స్వతంత్రంగా ఆలోచించడానికి అవకాశమిస్తే, సమస్యను పలురూపాల్లో సాధన చేయడానికి ప్రోత్సహిస్తే, అది స్వతంత్రతను ప్రోత్సహిస్తుంది. అప్పుడు సృజనాత్మకత, స్వీయ క్రమశిక్షణ పిల్లల్లో పెంపొందుతాయి. క్విజ్ సంస్కృతికి, వెనువెంటనే సమాధానాలిచ్చే పద్ధతికి, ఎప్పుడు సరైన సమాధానమే తెలిసి ఉండాలనే ధోరణికి భిన్నంగా మనం పిల్లలకు ఎక్కువ సమయాన్నిచ్చి, లోతైన, అర్థవంతమైన అభ్యసనాన్ని పొందే అవకాశం ఇవ్వాలి.

పాఠ్యపుస్తకాలో లేని జ్ఞానాన్ని వెలికితీసే విధంగా అభ్యసన లక్ష్యాల్ని రూపొందిస్తే పిల్లలు తమ స్వంత అనుభవాలనుంచి, ఇంటిలోని, సమాజంలోని ప్రజల అనుభవాలనుంచి, గ్రంథాలయాలనుంచి, ఇతర బహిః ప్రదేశాలనుంచి జ్ఞానాన్ని పొందే అవకాశం కలుగుతుంది. అప్పుడు జ్ఞానమూ, అభ్యసనమూ తమకుతాము నిర్మించుకునేవని పిల్లలు గుర్తిస్తారు. పాఠ్యపుస్తకాలకుగానీ, ఉపాధ్యాయుడికిగానీ సర్వాధిపత్యం ఉండదని పిల్లలు తెలుసుకుంటారు.

ఒక్క చరిత్ర ఉపాధ్యాయుడేకాదు, ఉపాధ్యాయులందరూ తమ దగ్గర ఉన్న పిల్లలకు పురాతత్వ ప్రాధాన్యతగల నిర్మాణాల్ని గౌరవించడం, వాటి ప్రాధాన్యతని అన్వేషించడం, అర్థం చేసుకోవడం నేర్పాలి. ఇటీవలి కాలంలో ఒకటి, రెండు తరగతుల తరగతిగది వాతావరణాన్ని పిల్లలకనుకూలంగా మార్చేందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి.

వీటిని సమీక్షించి మరింత బలోపేతం చేయాలి. పెద్దపిల్లలకు తమ అభ్యసన అనుభవాలకు తగిన ప్రశ్నలివ్వాలి. వీటిద్వారా వాళ్ళు భావనలను అర్థం చేసుకోగలుగుతారు. జ్ఞానాన్ని నిర్మించుకుని సొంతం చేసుకోగలుగుతారు. ఇప్పుడిప్పుడే మన దృష్టిని 'వాస్తవజ్ఞానం' నుంచి కొద్దికొద్దిగా మరల్చుతున్నాం. ఇది చాలదు. ఉపాధ్యాయుడి సంసిద్ధతతోపాటు, తరగతిగది పద్ధతుల్ని మార్చుకోవడం, పాఠ్యపుస్తకాల్లో మార్పులు, మూల్యాంకనంలో మార్పులు జరిగినప్పుడే పాతపద్ధతుల్ని మనం స్పష్టంగా మార్చుకోగలం. ఏ అంశానికి ఆ అంశం ముక్కలుముక్కలుగా ఉండే పద్ధతినుంచి బయటపడడం ఒక లక్ష్యంగా NPE-86 పేర్కొనింది. ఈ లక్ష్యానికి అనుగుణంగా మనం ముందుకుపోవాలంటే మన ప్రణాళిక సరళతరం కావాలి. మన పాఠ్యపుస్తకాల్లో మార్పురావాలి. వాటిలోని విషయాలు మారాలి. ఇందుకోసం మన ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని, సామర్థ్యాలను పెంచాలి. పిల్లల అభ్యసనానికి తగినట్లుగా ఉపాధ్యాయులు తమ స్వంత ప్రణాళికను రూపొందించుకోవాలి. బోధనా సంస్కరణలకు సంబంధించిన ప్రయత్నాలు ఇంకా కేంద్రీకృతంగానే ఉన్నాయి. క్లస్టరు, బ్లాకు రిసోర్సు సెంటర్లను మరింత భాగస్వాముల్ని చేయడంద్వారా సమర్థవంతమైన వికేంద్రీకరణ సాధ్యమవుతుంది. అప్పుడు స్థానికంగా రిసోర్సుపర్సన్సుతోపాటు వనరులు, సామగ్రి ఉపాధ్యాయులకు అందుబాటులోకి వస్తాయి.

### 2.4.4 ప్రణాళికపట్ల వైఖరి

ఇప్పటికీ మన విద్య 'కొలవదగిన ప్రవర్తనలు' సాధించడాన్ని దృష్టిలో పెట్టుకున్న పరిమిత పాఠ్యప్రణాళికలమీదనే ఆధారపడి ఉంది. ఈ దృష్టితో చూచినపుడు విద్యార్థిని శిక్షణ పొందే ప్రాణిగా మాత్రమే మనం చూస్తాం, లేదా మనం రూపొందించిన ప్రోగ్రాముల్ని చొప్పించిన కంప్యూటర్‌గానైనా చూస్తాం. అందువల్ల మన విద్యలో 'ఫలితం'పై మనం ఎక్కువ దృష్టిని పెడతాం. అలాగే జ్ఞానాన్ని ముక్కలుముక్కలుగా విడకొట్టి సమాచారంగా మార్చి పాఠ్యపుస్తకాల నుంచి నేరుగా కంఠస్తం చేయడాన్ని ప్రోత్సహిస్తాం. చివరగా పిల్లలు ఎంత గుర్తుపెట్టుకున్నారో పరీక్షలు పెడతాం. దీనికిభిన్నంగా మనం విద్యార్థిని నిరంతరం జ్ఞాన నిర్మాణం చేసుకునేవాడిగా చూడాలి. గణితం, సైన్సు, భాష, సామాజిక శాస్త్రాలు లాంటి జ్ఞానసంబంధమైన సబ్జక్టులకేకాదు ఈ సూత్రం విలువలకు, నైపుణ్యాలకు, దృక్పథాలకు కూడా వర్తిస్తుంది. ఈ దృక్పథం అభ్యాసకులకు ఎంతో ఉపయుక్తమైనదిగా స్పష్టమైంది. కానీ ఉపాధ్యాయులకు పరీక్షా నిర్వాహకులకు, పాఠ్యగ్రంథ రచయితలకు మాత్రం ఇది వాస్తవరూపం ధరించేలా చేయడానికి కావల్సిన నిబద్ధత కరువైంది.

✦ 'కృత్యం' అనే పదం మన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల రిజిష్టర్లలో ఇటీవల ఎక్కడ చూసినా కనబడుతుంటుంది. కానీ ఎక్కువ సందర్భాల్లో ఇది మన 'పాఠాల ప్రణాళిక'కు అంటగట్టబడి ఉంటుంది. పాఠం చివర సాధించాల్సిన ఫలితంకోసమే తప్ప దీనికంతకంటే అర్థం ఉండదు. ఈరోజుల్లో సామర్థ్యాలను గురించి పెద్ద చర్చ జరుగుతోంది. కానీ వీటినికూడా పాఠాల్లో బిగించి ఫలితాలుగానే మనం పరిగణిస్తున్నాం. దీనికిబదులు ఉపాధ్యాయులు ప్రతి శీర్షికను నాలుగైదు భాగాలను యూనిట్లుగా మార్చుకోవడం మంచిది. పలు సందర్భాల్లో సామర్థ్యాలను మాటిమాటికీ వాడుకునే అవకాశాలు కల్పించటం ద్వారా మాత్రమే అవగాహనా అభివృద్ధి, సామర్థ్యాల సాధన సాధ్యమవుతుంది. జ్ఞానాన్ని, అవగాహనను, నైపుణ్యాలను పాఠం చివర అంచనా వెయ్యవచ్చు. కానీ సామర్థ్యాలను మాత్రం చాలా కాలం తరువాత మాత్రమే అంచనా వెయ్యగలం.

✦ పిల్లలపట్ల ఉపాధ్యాయయులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టేందుకు కృత్యాలు ఉపయోగపడతాయి. ఇవి పిల్లల అవసరాల్లో, అభిరుచుల్లో ఉండే తేడాలనుబట్టి లక్ష్యాల్ని మార్చుకోవడానికి కూడా ఉపయోగపడతాయి. నిజానికి ఉపాధ్యాయులు తమ తరగతి పనుల్ని ప్లాన్ చేసుకునేటప్పుడు పిల్లల్ని, పాత అభ్యాసకుల్ని కూడా భాగస్వాముల్ని చేయవచ్చు. ఇది తరగతి గదిలో జరిగే చర్యలను అద్భుతంగా సుసంపన్నం చేస్తుంది. ఇది ప్రత్యేక అవసరాలుండి, మరింత శ్రద్ధ పెట్టాల్సిన పిల్లలకు తగినట్లుగా ఉపాధ్యాయులు స్పందించడానికి కూడా ఉపయోగపడుతుంది. వ్యక్తిగతంగా ప్రతిబిడ్డ అభ్యసనంతో సంబంధం పెట్టుకునేందుకు ఉపాధ్యాయులకు ఇంకా వీలుకావడంలేదు. పిల్లలందర్నీ ఒక మొత్తంగానే చూడడం జరుగుతోంది. కాకుంటే 'స్టార్స్'గా గుర్తింపబడిన వారిపైన 'సమస్యాత్మకమైనవారిగా' గుర్తించినవారిపైన మాత్రమే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. పూర్వం చెప్పుకున్న పద్ధతిలో అయితే ప్రతిబిడ్డమీద శ్రద్ధపెట్టే అవకాశం ఉంటుంది.

✦ ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, అభ్యసనంలో కష్టపడే పిల్లలు ఉండే క్లాస్‌రూంలో ఉపాధ్యాయుడు అలాంటి పిల్లలకోసం తమ దైనందిన కార్యకలాపాల్ని ఎలా మార్పుచేస్తాడో పాఠాల ప్రణాళికలో యూనిట్ ప్రణాళికలో సూచించాలి. అభ్యసనంలో వెనకబడితే యాంత్రికంగా పునఃశ్చరణ చేయించి సరిపెట్టుకుంటున్నాం. సాధారణంగా ఇది చెప్పిన పాఠాల్ని మళ్ళీ చెప్పడం తప్ప మరేమీకాదు. ఇలాంటి పిల్లలకు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చాలామంది టీచర్లు కొన్ని 'చికిత్స'లకోసం వెతుకుతుంటారు. ఈ పిల్లలు ఎవరో, ఏం చేయగలరో దానికి తగినట్లుగా అభ్యసనాన్ని మార్చడం మాత్రం టీచర్లకింకా చేతకావడంలేదు. పిల్లలు వాళ్లకు చెప్పినదాన్ని తిరిగి వల్లించడం కాకుండా సొంతంగా ఆలోచించడం ఒక సవాలుగా ఉపాధ్యాయులు గుర్తించి, దానికితగిన బోధనాప్రణాళికను రూపొందించుకోవాలి. ఇటీవలికాలంలో 'కృత్యాలు', 'క్రీడాపద్ధతి' పేరుతో పిల్లల సామర్థ్యాలకు ఏమాత్రం సరిపోని తక్కువస్థాయి కార్యక్రమాల్ని పిల్లలకిచ్చి వారి అభ్యసనాన్ని పలచబారిపోయేటట్టు చేయడం జరుగుతోంది. మరో సమస్య ఏమంటే ఈ కృత్యాలు చేయదానికి చాలా ఎక్కువ సమయం పడుతోంది. టీచర్లు ఇందుకోసం ఎక్కువ సమయాన్ని వెచ్చించాల్సివస్తోంది. కృత్యాలను చేయదానికి కావల్సిన సమయాన్ని దృష్టిలో పెట్టుకుని మనం ప్రణాళికను రూపొందించుకోవాలి. మొదట టీచర్లు తమ తరగతిగదిలో కృత్యాలకనుగుణమైన సంస్కృతిని ఏర్పాటుచేసుకోవాలి. వీటిని చేసేటప్పుడు పాటించవలసిన నిబంధనల్ని, సామగ్రిని ఉపయోగించేందుకు పద్ధతుల్ని రూపొందించుకోవాలి.

✦ ఉపాధ్యాయుడు తరగతిగదిలో పాటించే పద్ధతులు, ఉపయోగించే సామగ్రి, మూల్యాంకనా పద్ధతులు ఒకదానికొకటి సుదృఢమైన అంతర్గత సంబంధం కలిగివుండాలి.

### 2.4.5 విమర్శనాత్మక బోధనావ్యూహం

పిల్లలు, ఉపాధ్యాయులు కలిసిపనిచేయడం తరగతిగదిలో చాలా కీలకమైనది. ఎవరి జ్ఞానం ఆధారంగా పాఠశాల జ్ఞానం రూపుదిద్దుకొనాలో, ఎవరి మాటకు పాఠశాల జ్ఞానంలో ప్రాధాన్యత ఉండాలో దీనిద్వారానే నిర్ధారణ అవుతుంది. పిల్లలు చిన్నవాళ్ళనీ, వాళ్ళకోసం మనం పెద్దలంగా సమస్యా పరిష్కారాలు ఆలోచించి పెట్టాలనీ అనుకోవడం సరైనది కాదు. తమ పరిస్థితుల్ని పిల్లలు ఎంతో విమర్శనాత్మకంగా పరిశీలిస్తుంటారు. వాళ్ళ విద్యకు సంబంధించి, భవిష్యత్ అవసరాలకు సంబంధించి పరిష్కారాలను వెతికేటపుడు, చర్చించేటపుడు పిల్లల్ని తప్పనిసరిగా భాగస్వాముల్ని చేయాలి. తమ అనుభవాలు, ఆలోచనలు ఎంతో ముఖ్యమైనవని, వాటిని అభివృద్ధి చేసుకోవడం

అవసరమని పిల్లలు గుర్తించాలి. అప్పుడే వాళ్ళు స్వతంత్రంగా ఆలోచించగలుగుతారు. కారణాలు వెతుక్కోగలుగుతారు. తమకిష్టంలేనివి కాదనడానికి ధైర్యాన్ని సంతరించుకోగలుగుతారు. వారి అధ్యయన క్రమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి బడి బయట నేర్చుకుని బడిలోకి వాళ్ళు తీసుకొనివచ్చే సామర్థ్యాలు, అభ్యసన శక్తులు, జ్ఞానపునాది ఎంతో ముఖ్యమైనవి. అట్టడుగువర్గాలవారి విషయంలో ప్రత్యేకించి బాలికల విషయంలో ఇవి మరీ ముఖ్యమైనవి, ఎందుకంటే వీరి నిత్యజీవితానుభవాలు పాఠశాల జ్ఞానంలో ఏమాత్రం కనిపించేవికావు.

బోధనావ్యూహంలో విమర్శనాత్మక పద్ధతి మనముందున్న అంశాలను రాజకీయ, సామాజిక, ఆర్థిక, నైతిక దృష్టినుంచి విమర్శనాత్మకంగా చూచే అవకాశం కల్పిస్తుంది. సామాజిక అంశాల్ని భిన్న దృక్పథాలనుంచి చూడడానికి, అవి జీవితంతో ఎలా ముడిపడి ఉన్నాయో తెలుసుకోవడానికి ఈ బోధనాపద్ధతి ఉపయోగపడుతుంది. ఉదాహరణకి పిల్లలు తాము ఇతరులపట్ల వ్యవహరించే తీరు ఆధారంగా ప్రజాస్వామ్యాన్ని ఒక జీవన విధానమని గుర్తిస్తారు (స్నేహితులు, పొరుగువారు, పెద్దలు, స్త్రీలు, పురుషులు). అలాగే కృత్యాల్ని, ఆటల్ని, స్నేహితుల్ని, వృత్తిని ఎన్నుకోవడంలో కూడా ప్రజాస్వామిక పద్ధతి ఉంటుంది. మానవ హక్కులు, కులం, మతం, లైంగికం మొదలైనవాటిని పిల్లలు విమర్శనాత్మకంగా చర్చించి తమ నిత్య జీవితానుభవాలతో అవి ఎలా ముడిపడి ఉన్నాయో తెలుసుకోగలగాలి. పలురకాల అసమానతలు ఒకదానితో ఒకటి చేరి ఎలా నాటుకుపోతున్నాయో పిల్లలు తెలుసుకోవాలి. విమర్శనాత్మక బోధనావ్యూహం బహిరంగ చర్చలద్వారా, సమిష్టి నిర్ణయాలు చేయగల అవకాశాల్ని కల్పిస్తుంది. బహుళ దృక్పథాన్ని గుర్తించి ప్రోత్సహిస్తుంది.

భాగస్వామ్య అభ్యసనం, బోధన, భావావేశాలు, అనుభూతులు తరగతిగదిలో ఎంతో విలువైనవి. ఇలాంటి బోధనాభ్యసనాలు ఎంతో శక్తివంతమైనవి. కానీ సంభాషణలను, చర్చలను ఒక తంతుగా మారిస్తే, ఉపాధ్యాయులు పెట్టుకున్న లక్ష్యాలను సాధించడానికి ఒక సాధనంగా మారిస్తే దానికేమీ విలువ ఉండదు. నిజమైన భాగస్వామ్యం ఉపాధ్యాయుడి, విద్యార్థి ఇద్దరి అనుభవాల కలబోతగా ఉంటుంది.

పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి తమ వ్యక్తిగత అనుభవాల్ని, సమిష్టి అనుభవాలని ఎలాంటి సంకోచం లేకుండా పంచుకోగలిగితే అప్పుడు వారికి తమ సొంత సామాజిక వాస్తవికతతో సంబంధంలేని ఇతరుల గురించి కూడా ఎంతో తెలుస్తుంది. అప్పుడు వారితో తమకు గల తేడాలను పోల్చుకోగలుగుతారు. వారంటే భయపడరు. పిల్లల అనుభవాల్ని తరగతిగదిలోకి తీసుకొనిరావడమంటే కొన్ని వివాదాస్పద అంశాల్ని కూడా మన క్లాసురూంలోకి ఆహ్వానించడమే అవుతుంది. వాటిని గురించికూడా చర్చించాల్సి ఉంటుంది. ఘర్షణలు అనేవి పిల్లల జీవితంనుంచి విడదీయరాని అంశాలు. పిల్లలు తమ సొంతంగాను, కుటుంబం, సమాజపరంగాను ఎదుర్కొనే అనుభవాల్లో ఇలాంటి ఘర్షణాంశాలు ఎన్నో ఉంటాయి. ప్రపంచంలోని హింసాత్మక సంఘర్షణల్ని వారు తమ కళ్ళతో చూస్తూనే ఉంటారు. ఈ ఘర్షణల్ని కూడా మనం మన బోధనా వ్యూహంలోకి తెచ్చుకోవాలి. పిల్లలు వీటి స్వభావాల్ని అర్థం చేసుకుని తమ జీవితంలో ఇవి నిర్వహిస్తున్న పాత్రను కూడా దీనివల్ల అవగతం చేసుకోగలుగుతారు. పిల్లలు తాము సంగ్రహించిన జ్ఞానాన్ని విమర్శనాత్మకంగా ప్రశ్నించాలి. ఇది పక్షపాత ధోరణితో కూడిన మన పాఠ్యగ్రంథాల్లోని జ్ఞానం కావచ్చు. తమచుట్టూ ఉన్న సాహిత్యంలోని జ్ఞానం కావచ్చు. తమ స్వంత వాతావరణంలోని అంశాలతో పాఠ్యగ్రంథాల్లోని అంశాల్ని పోల్చి చర్చించడం ద్వారా పిల్లలకు ఈ విమర్శనాత్మక దృక్పథం అలవడుతుంది. కొందరు మహిళా బోధకులు, దళిత బోధకులు ఇలాంటి చర్చల్ని, వాఖ్యానాల్ని, విశ్లేషణల్ని చేయడానికి పాటలను శక్తివంతమైన మాధ్యమంగా వాడుకున్నారు. జ్ఞానం అనేక మాధ్యమాల్లో ఉంటుంది. టెలివిజన్, వ్యాపార ప్రకటనలు,

పాటలు, పెయింటింగ్స్ మొదలైనవాటిపై అభ్యాసకులు తమలోతాము ఎంతైనా చర్చించుకోవచ్చు. లైంగికంగా, కులపరంగా, వర్గపరంగా ఉన్న అసమానతలు, ప్రపంచవ్యాప్త అసమానతలు కేవలం వ్యక్తిగతమైనవో, కొన్ని బృందాలు సమిష్టిగా ఏర్పరుచుకున్నవో మాత్రమే కావు. వీటికీ, విస్తృత అధికార వ్యవస్థలకు మధ్య బలీయమైన సంబంధం ఉంటుంది. ఈ అంశాల్ని దృష్టిలో ఉంచుకొని బోధించేటప్పుడు మనం ఎవరి జ్ఞానాన్ని చాలా విలువైనదిగా లెక్కిస్తున్నాం? అసలు ఎవరికోసం ఎవరు మాట్లాడుతున్నారు? అనే ప్రశ్నల్ని వేసుకోవలసి ఉంటుంది. ఈ సందర్భంలో భిన్న అభ్యాసకులకు భిన్న వ్యూహాలను పాటించవలసి ఉంటుంది. ఉదాహరణకు కొందరు పిల్లలకు తరగతిగదిలో స్వేచ్ఛగా, ధైర్యంగా మాట్లాడ్డం అవసరం. ఓపిగ్గా ఇతరుల మాటల్ని వినటం కొందరు నేర్చుకోవాలి. వారిద్దరికీ అనుగుణమైన వ్యూహం అవసరం. పిల్లలు ధైర్యంగా తమనుతాము వ్యక్తీకరించుకొని అదే సందర్భంలో ప్రతిచర్య జరుపుకోగలిగిన అవకాశాన్ని ఉపాధ్యాయులు పిల్లలకు కల్పించాలి. ఉపాధ్యాయులు 'నైతిక అధికారాన్ని' చెలాయించేవాళ్ళుగా ఉండటానికి వీల్లేదు. ఓపిగ్గా, బాధ్యతగా పిల్లలు చెప్పేది వినాలి. ముందుగానే తీర్పునిచ్చెయ్యగూడదు. పిల్లలుకూడా ఇతరులు చెప్పేది తాముకూడా వినటం నేర్చుకోవాలి. పిల్లలు అవగాహనను ఒకవైపు స్వీకరిస్తూ, నిర్మాణాత్మకంగా మలుస్తూనే మరోవైపు పిల్లలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వాలి. పిల్లలు తమ అనుభవాల్ని ఎంచుకునేందుకు మన తరగతిగది ఒక భద్రమైన ప్రదేశమని గుర్తించి అలాంటి వాతావరణాన్ని పాఠశాలలో నెలకొల్పాలి. ఈ అనుభవాల్ని పంచుకునేటప్పుడు వివాదాస్పద అంశాల్ని, ఘర్షణల్ని గుర్తించాలి. వాటిని నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలి. ఎంత తాత్కాలికమైనవైనా కొన్ని పరిష్కారాల్ని పరస్పరం చర్చించుకుని వెతకాలి. ముఖ్యంగా అట్టడుగు వర్గాలనుంచి వచ్చిన పిల్లలు, బాలికలు, విధాన నిర్ణయాలు చేసే పద్ధతుల్ని గురించి మన పాఠశాలల్లో, తరగతి గదుల్లో చర్చించగలగాలి. ఏ ప్రతిపాదికన ఆ నిర్ణయాలు చేస్తారో వారికి తెలుసుకునే అవకాశం ఉండాలి.

### మన భావాల్లో మార్పురాదు ఎందుకని?

పాఠశాలల్లో చదువు ఎప్పుడూ అందుబాటులోలేని దళితుల, గిరిజనుల, వెనకబడిన వర్గాల పిల్లల్ని గురించి మనల్ని చిరకాలంగా పట్టి వేళ్ళాడుతున్న భావాలు కొన్ని ఉన్నాయి. ఇవి ఎంతకాలానికీ మారకపోవడం చాలా ఆందోళనకరమైన అంశం. చారిత్రకంగానే కొందరు పిల్లలు చదువుకోవడానికి పనికిరారని, కొద్దిగా మాత్రమే చదువుకోగలరని, నెమ్మదిగా మాత్రమే చదవగలరని, చదువంటే భయపడతారని మనం భావిస్తుంటాం. అలాగే వారిని చూస్తుంటాం. అలాగే ఆడపిల్లలకు సంబంధించికూడా. వాళ్ళకు ఆటలంటే ఇష్టముండదనీ, గణితం, సైన్స్ అంటే వాళ్ళకి ఆసక్తి ఉండదనీ ఒక అభిప్రాయాన్ని స్థిరంగా మనం ఏర్పరచుకుని ఉంటాం. అంగవైకల్యం గల పిల్లల్ని ఇతర పిల్లలతోబాటు కూర్చోబెట్టి చదువునేర్పటం సాధ్యంకాదని కూడా మన నమ్మకం. లైంగికంలోను, కులంలోను, భౌతికంగాను, మేధస్సులోను అసమానతలు, వెనుకబాటుతనాలు, అంతర్‌గర్భితంగానే దాగి ఉంటాయని, వాటిని మార్చలేమని మనం నమ్మినందువల్లే ఇలాంటి అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. కొంతమంది ఇలాంటి భావాలనుంచి బయటపడి ఉండవచ్చు. కానీ ఎక్కువమందిలో ఈ భావాలు గడ్డకట్టుకునిపోయి ఉన్నాయి. పిల్లలందర్నీ సమానంగా చూచేవిధంగా మనం ఉపాధ్యాయుల్ని సిద్ధపరచినపుడే మనం రాజ్యాంగంలో నిర్దేశించుకున్న సమానత్వం సాధ్యమవుతుంది. పిల్లలు తమతోపాటు మన పాఠశాలకు తీసుకొనివచ్చే సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక భిన్నత్వాలను అర్థం చేసుకొనే విధంగా మన టీచర్లకు శిక్షణ ఇవ్వాలి.

మన స్కూళ్ళలో ఎక్కువమంది మొదటితరం చదువుకునే పిల్లలు. దీనికనుగుణంగా మన బోధనావ్యూహాన్ని మార్చుకోవాలి. మన మొదటితరం అభ్యాసకులు పఠన, లేఖన నైపుణ్యాలు పొందడానికి, పఠనంపై ఆసక్తి పెంచుకోవడానికి పూర్తిగా పాఠశాలమీదనే ఆధారపడతారు. ఇంటిలో అలాంటి ప్రోత్సాహం లభించే వాతావరణం ఉండదు. అలాగే ఈ పిల్లలు పాఠశాల భాషకు, పాఠశాల సంస్కృతికి అలవాటుకావల్సి ఉంటుంది. ముఖ్యంగా వారి ఇంటిభాష, పాఠశాల భాష ఒకటిగా ఉండవు. హోంవర్కు విషయంలో ఇంటినుంచి వాళ్ళకెలాంటి సహకారం ఉండదు. ఒకవేళ ఉన్నా అది నామమాత్రమే. ఇలాంటి పిల్లలకు ఇంటిలోని పరిస్థితులు ఎంతో బాధాకరంగా ఉంటాయి. అందువల్ల వాళ్ళు రోజూ సకాలంలో బడికి రాలేకపోవచ్చు. తరగతిగదుల్లో వారు ఏకాగ్రతతో ఉండలేకపోవచ్చు. అవిధేయంగా ఉన్నట్టు కనిపించవచ్చు. పలువైపులనుంచి వీరికి మద్దతు అవసరం. ఇలాంటి అడ్డంకులనుంచి వీళ్ళని విముక్తి చేయడం అవసరం. వీటన్నిటినీ గుర్తించి దీనికనుగుణమైన పాఠ్యప్రణాళికను రూపొందించుకోవాల్సి ఉంది.

## 2.5 జ్ఞానము - అవగాహన

ప్రతి వ్యక్తికి ఎలాంటి సామర్థ్యాలు, విలువలు అవసరం అనే దార్శనికతను బట్టి, సమాజానికి ఎలాంటి సామాజిక, రాజకీయ సాంస్కృతిక స్వభావం అవసరం అనే దృక్పథాన్ని బట్టి విద్యాలక్ష్యాలు ఉంటాయి. ఎలాంటి విద్యాలక్ష్యాలు అవసరమనుకుంటున్నామో దాన్నిబట్టి పిల్లలకు ఏమిచెప్పాలి? అనే ప్రశ్నకు సమాధానం ఉంటుంది. ఇది ఒకే ఒక లక్ష్యం కాదు. అనేక లక్ష్యాల సముదాయం. మనం ఎన్నుకునే బోధనాంశం ఈ అన్ని లక్ష్యాలకు న్యాయం చేయాలి. ఇది సమగ్రంగా, సమతుల్యంగా ఉండాలి. మన పాఠ్యప్రణాళిక ఒక జ్ఞాన పునాదిని ఏర్పరచే అనుభవాలతో నిండి ఉండాలి. తార్కికంగా ఆలోచించగల సామర్థ్యం, ప్రపంచాన్ని వివిధ అంశాలద్వారా అర్థం చేసుకోగలగడం, సౌందర్యారాధన, ఇతరులపట్ల స్పందన, తార్కికాభివృద్ధికోసం ఇతరులతో కలిసి పనిచేయడంలాంటివి ఈ జ్ఞానపునాదివల్ల మానవుడిలో అభివృద్ధి చెందుతాయి. ఈ అధ్యాయం పాఠ్యప్రణాళిక రూపకల్పనలో, విషయ నిర్ధారణలో అవసరమైన జ్ఞానరూపాల గురించి, అవగాహన గురించి చర్చిస్తుంది. క్రమబద్ధమైన అనుభవమే జ్ఞానంగా మనం పరిగణిస్తున్నాం. ఇది భాషద్వారా భావనారూపాలుగా ఏర్పడి అర్థాన్ని సృష్టిస్తుంది. ఫలితంగా మనం జీవిస్తున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. జ్ఞానాన్ని మనం ఆచరణ పద్ధతులుగా లేదా ఆలోచనలతోకూడిన శారీరక నైపుణ్యంగా కూడా భావించవచ్చు. ఇది వస్తూత్పత్తి ద్వారా సమాజ పురోగమనానికి దోహదం చేస్తుంది. చారిత్రక క్రమంలో మానవులు వివిధ ఆలోచనలు, భావాలు గల విజ్ఞానమూర్తులుగా, వస్తూత్పత్తి చేయగల సమర్థులుగా పరిణితిచెంది మరింత జ్ఞానాన్ని నిర్మించుకున్నారు. పిల్లలందరూ ఈ జ్ఞాన సంపదను తమకుతాము పునరుత్పత్తి చేసుకోవాలి. మరింత సమర్థవంతంగా ఈ ప్రపంచంలో వ్యవహరించేందుకు కావల్సిన మరిన్ని ఆలోచనలు దీనివల్ల వారికి లభిస్తాయి. పిల్లలు ఈ జ్ఞానోత్పత్తి క్రమంలో ఎలా భాగస్వాములు కావాలో నేర్చుకోవాలి. ఉత్పత్తి క్రమంలో కూడా వారు భాగస్వాములు కావాలి. ఈరూపంలో మనం జ్ఞానాన్ని అర్థం చేసుకుంటే అప్పుడు మనం జ్ఞానాన్ని కేవలం ఒక ఉత్పత్తిగా చూడం. ఇది ఎలా సృష్టింపబడుతుందో, ఎలా క్రమవికాసం

చెందుతుంతో, ఎవరికిది అందుబాటులో ఉందో, దేనికోసం దీన్ని ఉపయోగిస్తున్నారో ఇవన్నీ జ్ఞానానికి సంబంధించి అంతర్‌గర్భిత సూత్రాలని మనకప్పుడు అర్థమవుతుంది. ఈ అవగాహనతో మన పాఠ్యప్రణాళికను రూపొందిస్తే పిల్లల అభ్యసనా క్రమానికి ఇందులో ఎక్కువ పాత్ర ఉంటుంది. పిల్లలు తాము పాల్గొంటూ జ్ఞాన నిర్మాణం ఎలా చేసుకుంటారో, ఏమి నేర్చుకుంటారోకూడా మన పాఠ్యప్రణాళికలో ప్రతిబింబిస్తుంది.

అలాగాక జ్ఞానాన్ని మనం తయేరుచేసిన ఉత్పత్తిగా భావించినట్లయితే అది సమాచార రూపంలో మారి పిల్లల మెదళ్ళలోకి బదలాయించడమే జరుగుతుంది. అప్పుడు అభ్యాసకులు కేవలం సంగ్రహీతలుగా మారతారు. అభ్యసనంలో వారి ప్రమేయమేమీ ఉండదు. దీనికి భిన్నమైన దృక్పథం మనకుంటే పిల్లల్ని ప్రపంచాన్ని పరిశీలిస్తూ, ప్రపంచంపట్ల స్పందిస్తూ, ప్రపంచంలో పనిచేస్తూ, భాగస్వాములవుతూ నేర్చుకునేవాళ్ళుగా మనం చూడగలం. మనం ఎంచుకున్న విద్యాలక్ష్యాలను సాధించడానికి, కావల్సిన సామర్థ్యాలు చాలా విస్తృతమైనవి. కేవలం విద్యద్వారానే వీటన్నిటినీ అభివృద్ధి చేయలేం. మన లక్ష్యాలను సాధించడానికి అవసరమైన కొన్ని అంశాలకు మాత్రమే బోధనాజ్ఞానం పరిమితం కావల్సి ఉంటుంది.

### 2.5.1 ప్రాథమిక సామర్థ్యాలు

పిల్లలకు కొన్ని ప్రాథమిక సామర్థ్యాలుంటాయి. అవి వారి అవగాహనను, విలువలను, నైపుణ్యాలను పెంపొందించడానికి విస్తృత పునాదిని ఏర్పరుస్తాయి.

(ఎ) భాష : భాష, ఇతర రకాల వ్యక్తీకరణలు అర్థాలు రూపొందించడానికి, ఇతరులతో భాగస్వామ్యం నెరపడానికి పునాదిని ఏర్పాటుచేస్తాయి. కొన్ని సంకేతాలను, కోడ్‌లను రూపొందించుకుని గుర్తుచేసుకోవడం, నిక్షిప్తం చేసుకోవడం ద్వారా మానవులు అవగాహనను పెంచుకోవడానికి, జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి భాష ఉపకరిస్తుంది. భాష ఎంత అభివృద్ధి చెందితే పిల్లల అవగాహనాశక్తి, ఇతరులతో పోల్చుకోగల శక్తి, స్వంత గుర్తింపు అంత ఎక్కువగా అభివృద్ధి చెందినట్టు లెక్క. లిఖిత భాషలేకాదు, సంకేత భాషలు, బ్రెయిలీ లిపి వంటివి కూడా ఇదే పాత్రను పోషిస్తాయి.

(బి) సామాజిక ప్రాకృతిక ప్రపంచాలలో సంబంధాలను ఏర్పాటుచేసుకోవడం, నిలబెట్టుకోవడం, స్పందనలను, భావావేశాలను కలిగివుండటం : ఇది జీవితానికి ఒక అర్థాన్నిస్తుంది. నైతికతకు కూడా పునాది వేస్తుంది.

(సి) శరీరపు కదలికలకు, ఆలోచనలకు మధ్య అన్వయాన్ని కల్గించుకుని పనిచేసేందుకు కావల్సిన సామర్థ్యాన్ని కలిగివుండడం, నైపుణ్యాల్ని పెంచుకుని వస్తూత్పత్తి చేయగలగడం, పరికరాలను, సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోవడం కూడా ఇందులో దాగి ఉంటుంది.

**మౌఖిక, హస్తకళల సంప్రదాయాలు**

మన మహిళలు, అట్టడుగువర్గాలు, చిన్నచిన్న ప్రజాసమూహాలు, గిరిజనులు కాపాడుతున్న ఎన్నో విధాలైన అత్యద్భుతమైన మౌఖిక, హస్తకళల సంప్రదాయాలను అసమానమైన మేధోసంపదగా మనం గుర్తించాలి. వీటిని మన పాఠ్యప్రణాళికలో చేర్చడంద్వారా పిల్లలకు నూతన ఆలోచనలు, నైపుణ్యాలు, సామర్థ్యాలు, అన్వేషణాశక్తి లభిస్తాయి. ఇవి వారి జీవితాన్ని, సమాజాన్ని కూడా సుసంపన్నం చేస్తాయి. పాఠశాలలో ఈ మౌఖిక సాహిత్యాన్ని మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. అన్ని రూపాల్లోని ఈ సాహిత్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం.

వడ్రంగంలాంటి చేతివృత్తినే తీసుకుంటే అందులో ఎన్నో సామర్థ్యాలు మనకు కనిపిస్తాయి. చేయదల్చుకున్న వస్తువును ఊహించుకోవడం, డిజైన్ చేయటం, దాని విలువను అంచనా వెయ్యడం (సామాజిక, సాంస్కృతిక సౌందర్యాత్మక ఆర్థిక విలువలు) అందుబాటులోని సామగ్రిని గురించి తెలుసుకోవడం, నాణ్యతను నిర్ధారించుకోవడం, ధరను నిర్ణయించుకోవడం, తయారుచేసిన వస్తువును ప్రదర్శించుకోవడం, తన నైపుణ్యాన్ని ఇతరులతో పంచుకోవడం, పరికరాల్ని జాగ్రత్త చేసుకోవడం, తయారైన వస్తువుల, నాణ్యతను, సృజనాత్మకతను గుర్తించడం ఇలా ఎన్నో సామర్థ్యాలు ఇందులో ఉంటాయి.

### 2.5.2 అనుభవంలోని జ్ఞానం

మానవుని బహుముఖ కార్యక్రమాలు, ప్రావీణ్యాలు, ఆచరణా పద్ధతులు, సామాజిక జీవితాన్ని, సంస్కృతిని నిర్మించి నడిపిస్తున్నాయి. చేనేత, తివాచీల తయారీ, కుండల తయారీలాంటి చేతివృత్తులు, వ్యవసాయం, వ్యాపారంలాంటి వృత్తులు, వివిధ దృశ్యకళలు, క్రీడలు మొదలైనవన్నీ గొప్ప జ్ఞానరూపాలు. ఇవి కొన్ని అనుభవపూర్వకమైనవి. కొన్ని ఊహాత్మకమైనవి.

వీటిని మానవుడి సామర్థ్యాలు నడిపిస్తుంటాయి. ఉత్పత్తుల ఔపయోగిత్వాన్ని లేదా సౌందర్యాత్మకతను ఊహించటం, అర్థం చేసుకోవడం ఒక సామర్థ్యం. చేసిన వస్తువుల్ని ప్రదర్శించడం మరొక సామర్థ్యం. స్వీయ జ్ఞానం, సమిష్టిగా పనిచేయడం మరికొన్ని సామర్థ్యాలు.

వీటిలోని నైపుణ్యాన్ని మాత్రమే మనం చూస్తే సరిపోదు. వీటిని నిర్వహించడంలో ఒక్కోదానికి ఒక్కోరకమైన సామాజిక, ప్రాకృతిక ప్రపంచం గొప్ప భూమికను పోషించి ఉంటుంది. వీటిని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే వీటి అసలైన విలువను గుర్తించగలం. మన విద్యావిభాగాలలాగానే ఈ చేతివృత్తులకు, వాణిజ్యాలకు కూడా వాటి సొంత సంప్రదాయాలున్నాయి. గొప్ప నిపుణులున్నారు. చేతివృత్తులు, వృత్తులు, కళలకు సంబంధించిన ఈ జ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతూ, అనుభవంద్వారా ఒక తరం నుంచి మరొక తరానికి అందుతుంటుంది. కాబట్టి వీటిలోని ప్రతిఒక్కటీ ఒక ఆచరణాత్మక జ్ఞానంగా మనం గుర్తించాలి. ఇలాంటి జ్ఞానం భారతదేశంలో ఎంతో విస్తృతంగా, వైవిధ్యభరితంగా, సుసంపన్నంగా లభిస్తోంది. ఉత్పత్తి నైపుణ్యాలలాగానే మనకు ఆర్థికంగా ఇవి ఎంతోవిలువైనవి. వీటిని అధ్యయనం చేయడానికి, వీటిలోని జ్ఞాన నిర్మాణాల్ని గుర్తించడానికి మరింత పరిశోధన అవసరం. వీటిని ఎలా నిర్వహించేవారు? ఎలా నేర్చుకునేవారు? నేర్చుకున్నవాటిని ఎలా ఉపయోగించుకునేవారు? అనే ప్రశ్నలు సామాజికంగా ఎంతో ముఖ్యమైనవి. ఎందుకంటే ఈ వృత్తులు మన దేశంలో కులాలతో, లైంగిక అంశాలతో ముడిపడి ఉన్నాయి. వీటిని మన పాఠ్యప్రణాళికలో శ్రమరూపాలుగా గాక విజ్ఞానరూపాలుగా గుర్తించి ఇముడ్చుకోవలసి ఉంది. ఇవి ఇతర అంశాలు నేర్చుకోవడానికి ఒక మాధ్యమంగా కూడా ఉపయోగపడతాయి. ఎంతో విలువైన ఈ మానవ సమాజ జ్ఞానం మన పాఠ్యప్రణాళికలో ముఖ్యమైన భాగంగా మారాల్సి ఉంది.

### 2.5.3 అవగాహనా రూపాలు

ప్రత్యేకమైన భావాలనుబట్టి, అర్థాలనుబట్టి, నిరూపించుకునే పద్ధతులనుబట్టి జ్ఞానాన్ని వర్గీకరించడం జరుగుతుంది. వీటిలో ప్రతిఒక్కదానికి ఒక్కోరకమైన స్వంత సంక్లిష్ట ఆలోచన ఉంటుంది. స్వంతంగా సరిచూచుకునే పద్ధతి, సాధికారతను కల్పించుకునే పద్ధతి ఉంటాయి. స్వంత సృజనాత్మకత కూడా ఉంటుంది.

గణితానికి ప్రాథమిక సంఖ్యలు, వర్గం, భిన్నంలాంటివి ప్రత్యేకమైన భావనలు. దీనికి తన స్వంత నిరూపణా పద్ధతి ఉంది. నిర్ధారించదలుచుకున్న విషయాన్ని మెట్టుమెట్టుగా ప్రదర్శించే పద్ధతి గణితంలో ఉంటుంది. ప్రపంచాన్ని పరిశీలించడాన్నిబట్టి, ప్రయోగాల్నిబట్టి గణిత నిరూపణా పద్ధతులుండవు. ఇవి ఎప్పుడూ జ్ఞానాత్మకమైనవికావు. కొన్ని నిర్వచనాలద్వారా, సార్వజనీన సూత్రాలద్వారా, నిదర్శనలద్వారా గణితనిర్ధారణలు జరుగుతాయి.

గణితానికిలాగానే సైన్సుకుకూడా దాని సొంత భావనలు ఉంటాయి. అవి సిద్ధాంతాల ద్వారా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ప్రాకృతిక ప్రపంచాన్ని వివరించడానికి స్వంత పద్ధతులుంటాయి. అణువు, అయస్కాంత క్షేత్రం, కణం, నాడీకణంలాంటివి సైన్సులోని భావనలు. శాస్త్రీయ విచారణకు పరిశీలన అవసరం. సిద్ధాంతాలద్వారా చేసిన పూర్వ నిర్ధారణలను నిరూపించడానికి ప్రయోగాలు అవసరం. ఈ ప్రయోగాలకు అనేక నియంత్రణలు, పరికరాలు కావల్సివస్తుంది. సిద్ధాంత ప్రతిపాదనలకు ఒక్కోసారి పరికరాలు కావల్సివస్తుంది. ఒక్కోసారి గణితంకూడా అవసరమౌతుంది. కానీ ఈ నిజనిర్ధారణలో పరిశీలనల ప్రాధాన్యతే ఎక్కువ. ఇందులో గణితంలో ఉండే నిర్దుష్టత ఉండదు. వాస్తవానికి ఏదో ఒకరకంగా దగ్గరగా వుండే దానిగురించి వివరించే ప్రయత్నమే సైన్సు.

సామాజిక శాస్త్రాలకు సమాజం, ఆధునీకీకరణ, సంస్కృతి, గుర్తింపు, రాజకీయం వంటి సొంత భావనలుంటాయి. వర్ణన, వివరణ, సామాజిక ప్రపంచాన్ని గురించి కొన్ని పూర్వ నిర్ధారణలు సామాజిక శాస్త్రంలో ఉంటాయి. సామాజిక శాస్త్రంలోని ఊహలు సమిష్టిజీవితంలో మానవ ప్రవర్తనలకు సంబంధించినవి. సామాజిక పరిశీలనలమీద వీటి నిరూపణ ఆధారపడి ఉంటుంది.

జ్ఞాన నిర్మాణక్రమానికి సంబంధించినంతవరకు ప్రకృతి శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు రెండూ సమానంగానే ఉంటాయి. అయితే పాఠ్యప్రణాళికను రూపొందించడంలో మాత్రం వీటికి సంబంధించిన రెండు ముఖ్య విభేదాల్ని గుర్తుంచుకోవాలి. 'హేతువుల' మీద ఆధారపడ్డ మానవ ప్రవర్తనను సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేస్తాయి. కానీ ప్రకృతి మాత్రం 'కారణ-ఫలం' మీద ఆధారపడి ఉంటుంది. సామాజిక శాస్త్రాలు నైతికాంశాల్ని ప్రస్తావిస్తాయి. కానీ ప్రకృతికి సంబంధించినంతవరకు మానవుడి జోక్యం కారణంగా మాత్రమే నైతిక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

చరిత్ర సామాజిక శాస్త్రాల ఊకంటే, గణితంకంటే, సైన్సు కంటే భిన్నమైనది. కాలగర్భంలో లభించిన సాక్ష్యాల ఆధారంగా ప్రత్యేక మానవచర్యల్ని ఇది వివరిస్తుంది. చరిత్ర అంటే మానవ చర్యల వర్ణన. ఇందులో మానవులకు ప్రేరణనిచ్చిన అంశాలకు ప్రాధాన్యత ఎక్కువ. సైద్ధాంతిక అంశాలకు ప్రాధాన్యత తక్కువ. 'వాస్తవాల' నిరూపణకూడా చరిత్ర నిర్మాణంలోని ఒక క్రమం మాత్రమే.

కళలు, సౌందర్యాంశాలు అని బాగా ప్రచారంలో ఉన్న పదాల్ని మనం ఉపయోగిస్తుంటాము. లయ, సౌభ్రాతృత్వం, వ్యక్తీకరణ, సమతుల్యతలాంటివి వీటిలోకొన్ని అయితే వీటి భావాలు, అన్వయం వినూత్నంగా ఉండవచ్చు. కళలను వాస్తవికత, 'నిజం' ఆధారంగా తూచడం సాధ్యం కాదు. కళపై వస్తుగతమైన తీర్పునిచ్చే

అవకాశం ఉంది. అదే సందర్భంలో కళాత్మక ఊహలద్వారా ఏది మంచిదో, ఏది మంచిదికాదో విమర్శనాత్మకంగా చూచే అవకాశం ఉంటుంది. కళపై వస్తుగత తీర్పు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ సౌందర్యదృష్టితో ఏది మంచిదో, ఏది మంచిదికాదో చెప్పడానికి కూడా అవకాశాలున్నాయి.

నైతికత మానవ విలువలలకు సంబంధించినది. చట్టాలు, సూత్రాలు, ప్రమాణాలు, ఆదర్శాలు మొదలైనవాటి రూపంలో ఇది వ్యక్తమవుతూ ఉంటుంది. మానవ చర్యలకు, మానవుడు చేసే ఎంపికలకు సంబంధించినంతవరకు నైతికత చాలా ప్రముఖమైనది. నైతికతననుసరించిన అవగాహనవల్ల మనం చేసే నిర్ణయాల్లో హేతుబద్ధత ఉంటుంది. చేసినవారు ఎంత గొప్పవారైనప్పటికీ ఫలానిది తప్పు, ఫలానిది సరైంది అని వారి హోదాలతో నిమిత్తం లేకుండా నిర్ణయించేందుకు దీనివల్ల వీలవుతుంది. ఈ కారణాలు ఎవరికైనా వర్తించే కారణాలు. హేతువు, సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛలాంటివి ఒకదానితో ఒకటి అనుసంధానింపబడ్డ భావనలు.

తత్వశాస్త్రంలో ఒకవైపు విశ్లేషాత్మక వివరణ, పరీక్షించడం, జీవితానికి సంబంధించిన అవగాహనల మధ్య సమన్వయం ఉంటాయి. మరోవైపు జీవితానికి సంబంధించిన సర్వోత్కృష్ట పరిపూర్ణ పరమార్థం కూడా ఉంటుంది.

చారిత్రక క్రమంలో మానవుడి ప్రాథమిక సామర్థ్యాలు, జ్ఞానానుభవం, అవగాహనా రూపాలు. మానవ అనుభవాలకు పునాదిగా ఉపయోగపడ్డాయి. ఈ మానవాచరణ వివిధ వృత్తులకు, సాంకేతిక పరిజ్ఞానాలకు, పరిశ్రమలకు బాటలు వేసింది. ఇవే మానవ సంస్కృతికి కేంద్రబిందువులు. ఊహ, విమర్శనాత్మక ఆలోచన, అవగాహనకు, తార్కికతకు, ఆవేశాలకు కూడా ఇవే బాటలు వేశాయి.

### అవగాహనలోని దొంతరలు

ప్రత్యేకమైన భావాలనుబట్టి, అర్థాలనుబట్టి, నిరూపించుకునే పద్ధతులనుబట్టి జ్ఞానాన్ని వర్గీకరించడం జరుగుతుంది. వీటిలో ప్రతిఒక్కదానికి ఒక్కోరకమైన స్వంత సంక్లిష్ట ఆలోచన ఉంటుంది. స్వంతంగా సరిచూచుకునే పద్ధతి, సాధికారతను కల్పించుకునే పద్ధతి ఉంటాయి. స్వంత సృజనాత్మకత కూడా ఉంటుంది.

సమగ్రత : భాషను, అందులోని విషయాన్ని అవగాహన చేసుకోవడం.

పరిశీలన : పారిభాషిక పదజాలం, భావనలు దేన్నిగురించి చెబుతున్నాయో అర్థం చేసుకోవడం.

వ్యాఖ్యానం : ఏది సాక్ష్యంగా పనికొస్తుందో, ఏది ప్రకటనను వాస్తవం చేస్తుందో, వాస్తవాన్ని నిరూపించడానికి సాక్ష్యాన్ని సేకరించడం ఎలాగో అవగాహన చేసుకోవడం.

హేతుబద్ధత-ప్రాముఖ్యత : వివిధ వాస్తవాల, భావనల మధ్య అంతఃసంబంధాన్ని పెంపొందించుకుని జ్ఞానాంశాలుగా వాటిని రూపొందించడం. వివిధ అంశాలమధ్య సంబంధాన్ని అవగాహన చేసుకోవడం. మరొకదానితోటి సంబంధంలో ప్రతిఒక్కదానికీ గల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం.

పైన చెప్పుకొన్న ప్రతిజ్ఞానానికి ప్రత్యేక పదజాలం, భావనలు, సిద్ధాంతాలు, వర్ణనలు, పద్ధతులు ఉన్నాయి. వీటిలో ప్రతి ఒక్కటీ ప్రపంచాన్ని దర్శించేందుకు, అర్థం చేసుకునేందుకు, ఉపయోగించుకునేందుకు మనకు కొత్త దృష్టిని ప్రసాదిస్తాయి. గతకాలపు ప్రజల కృషి ఫలితంగా ఈ జ్ఞానరంగాలు అభివృద్ధి చెందాయి. ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్నాయి. వీటిరూపం మారుతోంది. ప్రాధాన్యత కూడా మారుతోంది.

సృజనాత్మకత, ప్రతిభ అనేవి ఈ జ్ఞానం నుంచి విడదీయరానివి.

ఈవిధంగా మానవ సంస్కృతి, జ్ఞానం పోగుపడడం, తెలుసుకునే మార్గాలు, అనేక పనులు చేయడం మానవ చరిత్రలో విలువైన విడదీయరాని భాగం. ఈ జ్ఞానాలద్వారా, సాధనాలద్వారా తమ లోకజ్ఞానాన్ని సుసంపన్నం చేసుకోగలగడం మన పిల్లలందరి హక్కు.

## 2.6 జ్ఞాన పునఃసృజన

కొన్ని సామర్థ్యాల్ని, ఆచరణల్ని, అవగాహనా నైపుణ్యాల్ని పాఠశాల పాఠ్య ప్రణాళిక ద్వారా మనం అభివృద్ధి చెయ్యాలనుకొంటున్నాం. గణితం, చరిత్ర, ప్రకృతి విజ్ఞానం, దృశ్య కళలులాంటివి సబ్జెక్టులుగా వీటిలో కొన్ని ఇప్పటికే రూపొందాయి. నైతికాంశాల్లాంటివి సబ్జెక్టులుగా, కృత్యాలుగా రెండు రూపాల్లో ఉంటాయి. భాషా సామర్థ్యాలుకూడా ఇలాంటివే. ఈ అన్ని రంగాల్లో ప్రాజెక్టులు అవసరం. క్షేత్ర సందర్శనాలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు అవసరం.

జ్ఞానాన్ని చూచే దృక్పథం వల్ల 'వాస్తవాలు' వాటంతట అవే లక్ష్యాలుగా మారే ప్రమాదం తప్పుతుంది. దీనికి భిన్నంగా వాటిని వాస్తవాలుగా గుర్తించే క్రమం ముందుకొస్తుంది.

భారతదేశంలో సబ్జెక్టుల ఆధారంగా పాఠ్య ప్రణాళికల్ని రూపొందించడం జరుగుతోంది. దీనివల్ల జ్ఞానాన్ని దేనికదిగా విడదీసి చూడ్డం జరుగుతోంది. దీనికితోడు పరీక్షల తతంగం, సామర్థ్యానికి గీటురాళ్ళుగా మార్కులు ఉండనేవున్నాయి. ఈ ధోరణి మన విద్యారంగంలో బోలెడు సమస్యల్ని తెచ్చిపెట్టింది. పాఠ్యగ్రంథాల్లోలేనివి, పరీక్షల్లో మార్కులురానివి పక్కకు నెట్టివేయబడ్డాయి. ఇవి పాఠ్యేతరాంశాలుగాను, అనుబంధ పాఠ్యాంశాలుగాను మారి పాఠ్యప్రణాళికలో అంతర్భాగాలు కాకుండాపోయాయి. వీటికి పాఠశాలలో ఏ ప్రాధాన్యతా ఉండదు. నైపుణ్యాల అభివృద్ధికి, సౌందర్యాస్వాదనకు, సృజనాత్మకతకు, సమిష్టికృషికి ఎంతో ఉపయోగపడే హస్తకళలు, క్రీడలు కూడా ప్రాధాన్యతను పోగొట్టుకున్నాయి. ఇక శ్రమ (పని), వ్యవహార జ్ఞానం అనేవాటికి పాఠ్యప్రణాళికలో స్థానమే లేదు. ఇప్పటికీ ఈ రంగాల్ని దృష్టిలో ఉంచుకొన్న సరైన పాఠ్యప్రణాళికా దృక్పథం మనకులేదు.

రెండోది మన సబ్జెక్టులన్నీ దేనికవిగా ఉంటాయి. ఫలితంగా మన జ్ఞానం పరస్పరాధారితంగా ఉండదు. ఉమ్మడిదిగా ఉండదు. ముక్కలు ముక్కలుగా ఉంటుంది. బిడ్డ ప్రపంచాన్ని దర్శించే పద్ధతికి ఈ సబ్జెక్టుల విభజన పూర్తి భిన్నంగా ఉంటుంది. పాఠశాల బయటి జ్ఞానానికి, లోపలి జ్ఞానానికీ పొంతనే ఉండదు. దేని సరిహద్దుల్లోఅది ఉండిపోతుంది.

మూడవది బిడ్డకు సహజంగా జ్ఞానాన్ని నిర్మించుకొనేందుకు, వినూత్న పద్ధతుల్ని జ్ఞానంకోసం వెతుక్కొనేందుకు అద్భుతమైన సామర్థ్యం ఉంటుందని మనం మరచిపోతున్నాం. జ్ఞానంగా నిర్ణయించేసినదాన్ని పిల్లలకందించేసి మనపని అయిపోయిందన్పించుకొంటున్నాం. ఫలితంగా జ్ఞానాన్ని తోసేసి సమాచారం ముందుకొచ్చి కూచుంటుంది. దీనివల్ల ఇంతేసిలావుండే పాఠ్యగ్రంథాలు, 'క్విజ్' పద్ధతులు, అవగాహనకు సమస్యాసాధనకు బదులు యాంత్రిక వల్లింపులు విద్యను నేడు శాసించే పరిస్థితి ఏర్పడింది.

నాల్గవది కొత్త సబ్జెక్టుల్ని ప్రవేశపెట్టడం. సమకాలీన సమాజానికవసరమైన సబ్జెక్కుల అవసరాన్ని ఎవ్వరూ కాదనలేరు. వేటి ప్రాధాన్యతను వాటికుంది. కానీ మన పాఠ్య ప్రణాళికలోకి కొత్త సబ్జెక్టుల్ని సృష్టించి దూర్చడం, దీనికిదతగ్గ పాఠ్యగ్రంథాలు, పరీక్షా పద్ధతులు రూపొందించడం మాత్రం పైప్రాధాన్యతను అపార్థం చేసుకోవడం తప్ప మరొక్కటిగాదు. వీటిని ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లో, ప్రస్తుత కృత్యాల్లోనే చేర్చవచ్చు. కొత్త సబ్జెక్టుల్ని ఇలా ఇబ్బడిముబ్బడిగా చేర్చడం మన పాఠ్యప్రణాళిక బరువు పెంచుతుంది. జ్ఞానాన్ని ముక్కలుముక్కలుగా చేస్తుంది.

### జ్ఞానం ఎంపిక

జ్ఞాన రంగాలు అనూహ్యంగా పెరిగిపోయాయి. అందువల్ల దేన్ని మన పాఠ్యప్రణాళికలో చేర్చుకోవాలో మనం జాగ్రత్తగా ఎంపికచేసుకోవాలి.

సంగతత్వం (Relevance) : భవిష్యత్తులో పెద్దయ్యాక ఉపయోగపడుతుందనే తప్పుడు భావనతో వ్యావహారికాంశాల్ని మనం ఎన్నుకొనే ప్రమాదం ఉంది. ప్రస్తుతం విద్యార్థి జ్ఞాన నిర్మాణానికి ఇలాంటిది ఎందుకూ పనికిరాదు. ఫలితంగా పెద్దయ్యాక కూడా ఎలాగూ పనికిరాదు.

అభిరుచి : ఇది చాలా ఉపయోగకరం. అట్లని దీన్ని మరీ సరళంచేసి పిల్లలు ఆనందించే కార్టూన్ల, ఆటల స్థాయికి దిగజార్చకూడదు. దీనికి భిన్నంగా పిల్లలు తమ లక్ష్యాన్ని సాధించడానికి కావల్సిన ఆసక్తిని స్వయం ప్రోత్సాహాన్ని అందించేదిగా ఇది ఉండాలి.

అర్థవంతం : అత్యంత ముఖ్యమైంది. బిడ్డ ఒక కృత్యాన్నిగానీ, జ్ఞానాన్నికానీ అర్థవంతమైంది అని భావిస్తే దాన్ని పాఠ్యప్రణాళికలో ఉంచాలి. ఇదే దీనికి ప్రామాణికత.

చివరగా మన పాఠ్యప్రణాళికలో ఏవేవి చేర్చాలో మనం జాగ్రత్తగా గుర్తించి ప్లాన్ చేసుకోవడంలేదు. అభివృద్ధికి సంబంధించి మన ఆలోచనలు అసమగ్రమైనవి. వివిధ గ్రేడ్లకు మధ్యగల అనుస్యూత సంబంధంపట్ల మనకు స్పష్టత లేదు. మనకిప్పటికే ఉన్న దృక్పథాల్ని మనం సుతరామూ మార్చుకోము. అలాగే సబ్జెక్టుల మధ్యగల సంబంధాన్ని (ఉదాహరణకు హైస్కూల్లో గణితం, ఫిజిక్సు ఒకదానికొకటి ముడిపడ్డవి) మనం అర్థం చేసుకోవడంలేదు.

## 2.7 పిల్లల జ్ఞానం, స్థానిక జ్ఞానం

పిల్లలు స్థానిక పరిసరాల నుంచి, స్థానిక సమాజం నుంచి అభ్యసనాన్ని ప్రారంభిస్తారు. జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. వాళ్ళు తమచుట్టూ ఉన్న వాతావరణంతో జరిపే ప్రతిచర్య వల్లనే వారి జ్ఞానం అర్థవంతమౌతుంది. అందువల్ల ఈ పరిసరాలకు స్థానిక సమాజానికీ ఎంతో ప్రాధాన్యత ఉంది. అయినప్పటికీ పాఠ్యప్రణాళికల్ని రూపొందించేటప్పుడుగానీ, బోధనలోగానీ వీటిని మనం పట్టించుకోవడంలేదు. అందువల్ల ఈ డాక్యుమెంటు విద్య సందర్భవంతంగా ఉండాలని, అభ్యసనాన్ని బిడ్డ సందర్భం నుంచి చూడాలని నొక్కిచెబుతోంది. పాఠశాల వాతావరణానికి, సామాజిక వాతావరణానికి మధ్య అడ్డంకులు ఉండకూడదని కోరుకుంటోంది. స్థానిక వాతావరణం, పిల్లల స్వీయానుభవాలు స్కూల్లో మనమందించే జ్ఞానానికి ప్రవేశకాలుగా ఉపయోగపడతాయనే దృష్టిలోంచి దీన్ని మేము చెప్పడంలేదు. జ్ఞానాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానించుకోవలసి ఉంది. అందుకోసమే దీన్ని నొక్కిచెప్పవలసి వస్తోంది. ఇది ఒక లక్ష్యాన్ని సాధించడానికి సాధనం కాదు. ఇది సాధనమూ, లక్ష్యమూకూడా. అట్లాగే జ్ఞానాన్ని మన రోజువారీ కార్యక్రమాలకు పరిమితమైనదిగా భావించనక్కరలేదు. ప్రపంచంతో అనుసంధానింపజేసుకోవడంతోనే పాఠశాల జ్ఞానం పరిపక్వమౌతుంది.

పిల్లలు పాఠ్యగ్రంథాల్లో చెప్పే విషయాలను తమవైపు నుంచి దర్శించుకోలేకపోతే, తమ సామాజిక అనుభవాలతో పాఠ్యపుస్తకాల జ్ఞానాన్ని అన్వయించుకోలేకపోతే జ్ఞానం కేవలం సమాచారంగా మిగిలిపోతుంది. అభ్యసనం సామాజిక జీవితపు భవిష్యత్ దర్శనంతో ఎలా ముడిపడి ఉంటుందో తెలుసుకోవాలంటే అసలు

తెలుసుకోవడం అంటే ఏమిటి? తెలుసుకున్న దాన్ని ఉపయోగించుకోవడం ఎలా? అనేవి తెలిసివుండాలి. అభ్యాసకుడు తన స్వీయ అభ్యసనంలో క్రియాశీల భాగస్వామి అని మనం గుర్తించాలి. పిల్లలు తాము ఎక్కిన చెట్లను గురించి, తిన్న పండ్లను గురించి, ఇష్టపడే పక్షులను గురించి ఇలా బయటి ప్రపంచంలోని అనుభవాలను ప్రతిరోజూ బడిలోకి తెస్తుంటారు. పిల్లలందరికీ ప్రకృతిలో జరిగే నిరంతర మార్పులు - రాత్రింబవళ్ళు, వాతావరణం, పైర్లు, చెట్లు, జంతువులు మొదలైనవన్నీ ఎంతో బాగా తెలుసు. పాఠశాలలో చేరేటప్పటికే భాషపైన వారికి మంచి పట్టు ఉంటుంది. చిన్నచిన్న సంఖ్యలు, వాటిని ఉపయోగించుకోవడం కూడా తెలిసివుంటుంది. కానీ మనం బోధించేటప్పుడు పిల్లల్ని ఇలాంటి విషయాలు చెప్పమని ఎప్పుడూ అడగం. బయటి ప్రపంచాన్ని గురించి మనం ప్రస్తావించం. బయట ఉన్న అద్భుతమైన సహజ పరిసరాల్ని వదిలేసి అచ్చులో ఉన్న పదాలకు, బొమ్మలకు పరిమితమౌతాం. మరీ ఘోరమేమిటంటే ఇటీవల కంప్యూటర్ విద్య వచ్చి సజీవ ప్రపంచాన్ని యానిమేషన్ ముక్కలుగా మార్చివేసింది. పిల్లలు వీటిని చూచి ప్రపంచాన్ని చూస్తున్నట్టు భ్రమపడటం మొదలైంది. సజీవాలు, నిర్జీవాలు అనే పాఠం చెప్పేటప్పుడు ఉపాధ్యాయురాలు పిల్లల్ని బయటకు తీసుకువెళ్ళి కొంచెంసేపు తిప్పి తిరిగి వచ్చేటపుడు కొన్ని ప్రాణం ఉన్న వాటిని, కొన్ని ప్రాణం లేనివాటిని రాసుకుని రమ్మంటే ఫలితం ఎంత అద్భుతంగా ఉంటుంది! అప్పుడు తమిళనాడులోని మహాబలిపురం పిల్లలు సముద్రపు గవ్వలు, గులకరాళ్ళు, చేపలు రాసుకొస్తారు. దండకారణ్యానికి దగ్గరగా ఉన్న చత్తీస్‌గడ్ పిల్లలు పక్షులగూళ్ళు, తేనెపట్టులు, కాలి అందెలు రాసుకొస్తారు. దీనికిబదులు మనం పుస్తకాల్లోని పదాల్ని, బొమ్మల్ని చూపించి వాటిలో సజీవాల్ని, నిర్జీవాల్ని విభజించి జాబితాను తయారుచేయమని అడుగుతుంటాం. నీటి కాలుష్యాన్ని గురించి చెప్పేటప్పుడు రకరకాల కాలుష్యాలతో నిండిన స్థానిక నీటివనరుల్ని పిల్లలకు చూపించవచ్చు. దీనికి బదులు బొమ్మల్లో కలుషితనీరు చూపించి దాన్ని గురించి మాట్లాడమంటే పిల్లలు ఏం మాట్లాడగలరు? అలాగే చంద్రకళలను గురించి బోధించే టీచర్లు ఎంతమంది రాత్రులు చంద్రుడ్ని చూడవలసిందిగా పిల్లల్ని పురమాయించి ఆ తరువాత చంద్రకళల పాఠం చెబుతారు? స్థానిక పక్షులపేర్లు, చెట్లపేర్లు, పిల్లల్ని అడగడానికి బదులు మన పాఠ్యగ్రంథాలు 'సర్వవ్యాప్త' విషయాలను గురించి చెబుతుంటాయి. ఇవి ప్రతిచోటా ఉంటాయని వాటి రచయితలు అనుకోవచ్చుగానీ, నిజానికి ఇవి ఎక్కడా ఉండవు. ఎనిమిదవ తరగతి పిల్లలకు కిరణజన్య సంయోగక్రియను గురించి  మనం చెబుతాం. మరి పిల్లలు హరితవర్ణపు ఆకులు లేని క్రోటన్ మొక్కలు తమ ఆహారాన్ని ఎలా తయారుచేసుకుంటాయో అడగటానికి మనం అవకాశం ఇస్తామా? మన పాఠాల్లో సజీవ ప్రపంచం విమర్శనాత్మకంగా ప్రతిబింబించకపోతే అందులోని విషయాల్లో సజీవత్వమే ఉండదు. వాటితో పిల్లలకు సంబంధమే ఉండదు.

స్థానికాంశాలు గొప్ప అభ్యసన వనరులుగా మనం గుర్తించి, గౌరవించి వాటిలో వేటిని తరగతిగదిలో పేర్కొనాలో జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి. స్థానిక సందర్భం కొన్ని సమయాల్లో ఒక భావనకన్నా మరోభావన ముఖ్యమైనదని చెప్పవచ్చు. అంటే దీనర్థం క్లాస్‌రూంలో స్థానిక విషయాలనే చర్చిస్తే చాలునని కాదు. కేరళ విద్యార్థికి మనం రాజస్థాన్ ఎడారి నివాసుల గురించి చెబుతుంటే అది కేరళ పిల్లలు కూడా అక్కడి సహజ ప్రపంచాన్ని కళ్ళముందు ఆవిష్కరించుకునేలా ఉండాలి. రాజస్థాన్ ప్రత్యేకతల్ని, వైవిధ్యాల్ని, వాళ్ళు గుర్తించగలగాలి. కేవలం ఇసుకదిబ్బల్ని, ఒంటెల్ని చూపిస్తే సరిపోదు. 'అంతటి వేడి ప్రాంతాల్లో ప్రజలు తక్కువ గుడ్డలు ధరించకుండా అంత ఎక్కువ గుడ్డలు ఎందుకు ధరిస్తారో గదా!' అని పిల్లలు ఆశ్చర్యపోవాలి. తమచుట్టూ ఉన్న జీవితంతో ఆ జీవితాన్ని పోల్చుకోగలగాలి. తమతో సమానంగా ఉండే అంశాల్ని, వేరుగా ఉండే అంశాల్ని పిల్లలు ఇందులోంచి గమనించాలి.

స్థానిక వాతావరణం అంటే మనచుట్టూ ఉన్న భౌతిక ప్రపంచమేకాదు మన సామాజిక, సాంస్కృతిక ప్రపంచం కూడా ఇందులో భాగమే. పిల్లలందరూ తమ ఇళ్ళలో తమ అభిప్రాయాల్ని ఎంతో స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తారు. ఇదే అవకాశం మన తరగతిగదిలో కూడా ఉండాలి. స్థానికంగా ఎన్నో కథలు, పాటలు, పొడుపు కథలు, హాస్యోక్తులు ఉంటాయి. ఇదంతా గొప్ప భాషా సంపద. పాఠశాలలోని భాషను, జ్ఞానాన్ని ఇవి పరిపుష్టం చేస్తాయి. అలాగే ప్రతి ప్రాంతానికీ గొప్ప మౌఖిక చరిత్ర కూడా ఉంటుంది. ఇవన్నీ తరగతి గదిలో ఆవిష్కరింపబడాలి. తరగతిగదిలో పిల్లల్ని నిశ్శబ్దంగా ఉండమని మనం నియంత్రిస్తే ఇవన్నీ ఎలా బయటకువస్తాయి?

### జ్ఞానోత్పత్తి

పర్యావరణ విద్య సాపేక్షంగా చూస్తే ఇటీవల ప్రవేశపెట్టబడింది. పిల్లలు స్వంతంగా జ్ఞానాన్ని ఉత్పత్తి చేసుకోడానికి ఇది చాలా బాగా పనికొస్తుంది. ఇలాంటి జ్ఞానానికి నేడు జాతీయ స్థాయిలో కూడా ఎంతో విలువ ఉంది. నిజమైన శాస్త్రీయ జ్ఞానాన్ని అభివృద్ధి చెయ్యడానికిదెంతో ఉపయోగపడుతుంది. ఇందుకోసం స్థానికాంశాలను మనం ఎన్నింటినో పరిశీలించి డాక్యుమెంటు చెయ్యాలి. స్థానిక మొక్కల పేర్లు, భూగర్భ నీటి పరిమాణంలాంటివి ఈ అంశాలు. ఏళ్ళతరబడి పోగుబడ్డ ఈ జ్ఞానం ఇతర ప్రాంతాల జ్ఞానాన్ని కలుపుకొని ఎంతో సంపన్నమై ఉంటుంది. స్థానిక పర్యావరణ మార్పుల్ని అవగాహన చేసుకోవడానికి ఎంతో దోహదపడుతుంది.

కొన్ని ప్రాంతాల్లోని మొక్కల పేర్లు స్థానిక పర్యావరణ చరిత్రను మనకు తెలియజేస్తాయి. స్థానిక భూగోళాంశాల్ని మనకు అవగతం చేస్తాయి.

### స్థానిక జ్ఞాన సంప్రదాయాలు

మనదేశంలోని స్థానిక సమాజాలకు సాంప్రదాయ జ్ఞానం ఎంతో ఉంది. చెట్ల వర్గీకరణ, చెట్లకు పేర్లు పెట్టడం, పంటనూర్చే విధానాలు, నీటి నిల్వ పద్ధతులు, వ్యవసాయిక విధానాలు ఇలాంటివెన్నో దీనికుదాహరణగా చెప్పొచ్చు. కొన్ని సందర్భాల్లో ఇవి మనం స్కూల్లో చెప్పేవాటికన్నా భిన్నంగా ఉండొచ్చు. మరికొన్ని సందర్భాల్లో వీటికంత ప్రాధాన్యత లేదని మనకనిపించవచ్చు. టీచర్లు పిల్లలకు ఇలాంటి స్థానికాంశాల్ని పరిశీలించవల్సిందిగా ప్రాజెక్టులు ఇవ్వొచ్చు. మొక్కల వర్గీకరణలాంటివి స్థానికంగా ఒకరకంగా, మన పుస్తకాల్లో ఒకరకంగా వుండొచ్చు (ప్రాతిపదికనుబట్టి). వ్యాధుల నిర్ధారణల్ని స్థానిక సంప్రదాయిక విశ్వాసాలు అంగీకరించకపోవచ్చు. ఇవి మన పాఠ్యపుస్తకాల్లో చెప్పుకొనేవాటికంటే పర్యావరణపరంగా విలువైనవికూడా కావచ్చు.

## 2.8 పాఠశాల విద్య – సమాజం

సాంఘిక, సాంస్కృతిక ప్రపంచపు అనుభవాలు కూడా మన పాఠ్యప్రణాళికలో భాగం కావాలి. పాఠ్యపుస్తకాల్లో కన్పించే వివిధ జాతుల ప్రజలు జీవనవిధాలు పిల్లల్ని ఆకర్షించాలి. వాటిపట్ల పిల్లలకు ప్రేమ కలగాలి. ఏ జాతినీ మనం తక్కువచేసి చూపగూడదు. ఏవో లక్షణాలు దేనికీ అంటగట్టగూడదు. తమ సామాజిక శాస్త్రాల అధ్యయనంలో భాగంగా పిల్లలు స్థానిక సామాజిక తరగతుల ప్రజల్ని అధ్యయనం చెయ్యడం మంచిది. పంచాయతీ ప్రతినిధి వచ్చి వికేంద్రీకరణవల్ల స్థానిక సమస్యలు పరిష్కరించుకోవడానికి ఎలాంటి అవకాశాలు వచ్చాయో తరగతి గదిలో వివరిస్తే పిల్లలు ప్రత్యక్షంగా ఆమెతో చర్చించే వీలుగల్గుతుంది. ప్రాంతీయ, జాతీయ చరిత్రకు మౌఖికంగా ప్రచారంలో ఉన్న స్థానిక చరిత్రనుకూడా జోడించడం మంచిది. మన సమాజంలోని వాస్తవ పరిస్థితుల్ని మాత్రం మన పాఠ్యప్రణాళికా

రచయితలు, ఉపాధ్యాయులు ఈ సందర్భంలో మరిచిపోగూడదు. కులం, లింగం, మతం, ప్రాంతం ప్రాతిపదికన అణచివేత, అసమానత రాజ్యమేలుతున్న వాస్తవాన్ని మనం కాదనలేము. పాఠశాల జ్ఞానం పిల్లలకు ఈ సామాజిక కఠోర వాస్తవాల్ని అర్థం చేసుకొనే శక్తినివ్వాలి. ఈ విషయాన్ని పిల్లలు తమ ఇళ్ళలో మాట్లాడగల్గాలి. చర్చింపగల్గాలి.

పాఠ్యప్రణాళికలో ఫలానివి ఉండాలని, ఫలానివి ఉండకూడదనీ స్థానిక సమాజం అనుకోవచ్చు. పాఠశాలలు స్థానిక సమాజంతో ఈ విషయాల్ని ధైర్యంగా చర్చించాలి. వారిని ఒప్పించాలి. ఈ పాఠ్యప్రణాళికలో ఉన్న అంశాల విలువ ఏమిటో వారికి తెలియజెప్పాలి. పాఠ్యప్రణాళికలో ఎందుకు వీటిని చేర్చాలో, ఎందుకు వీటిని చేర్చలేదో మొదట ఉపాధ్యాయులు తెలుసుకొని ఉండాలి. అప్పుడే వారు సమాజానికి వివరించి చెప్పగలరు. మనం పాఠశాలల్లో ఇంటి భాషను వాడినపుడు, లైంగిక విషయాలు, పునరుత్పత్తి విషయాలు చెప్పినపుడు, ప్రాథమిక స్థాయిలో క్రీడాపద్ధతిని పాటించినపుడు, బాలురచేత పాడించి, నాట్యం చేయించినపుడు, తల్లిదండ్రులు వీటిని అర్థం చేసుకోవడం కష్టంగావచ్చు. టీచర్లు ఓపిగ్గా వారికి నచ్చజెప్పాలి. ఇవన్నీ రాష్ట్రస్థాయిలో నిర్ణయించారు అని చెబితే సరిపోదు. అన్ని తరగతుల విద్యార్థులకు సెక్యులర్ విద్యను మనం అందించాలనుకొన్నపుడు, ఈ విద్యవల్ల ఎవరు లబ్ధిపొందుతారో వాళ్ళందరికీ ప్రతిదీ తెలియజెప్పాల్సిన బాధ్యత మనపై ఉంటుంది.

## 2.9 అభివృద్ధికి సంబంధించిన కొన్ని అంశాలు

పాఠశాల పూర్వదశ నుంచి హైయ్యర్ సెకండరీ దశ దాకా జరిగే విద్యాభ్యాసం ద్వారా పిల్లల అభిరుచులు, శారీరక నైపుణ్యాలు, భాషా సామర్థ్యం, తీసివేత, సామాన్యీకరణలో సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి. పిల్లల అభివృద్ధి, ఎదుగుదల అత్యంత వేగంగా జరిగే కాలమిది. అలాగే పిల్లల అభిరుచుల్లో, సామర్థ్యాల్లో మౌలికమైన మార్పులు వచ్చే సమయమిది. కాబట్టి పాఠశాల ప్రణాళిక ఏ దృక్పథంతో రచింపబడాలి, ఇందుకోసం వేటిని ఎన్నుకోవాలి, ఎలా రూపొందించుకోవాలి అనేవి చాలా ముఖ్యమైన అంశాలు. జ్ఞాన సృష్టికిగానీ, పునఃసృష్టికిగానీ అనుభవాలు, భాషాసామర్థ్యాలు, తోటి మానవులతో, ప్రాకృతిక ప్రపంచంతో జరిపే ప్రతిచర్యలు అవసరం. పాఠశాలకు రాకపూర్వమే ప్రపంజ్ఞానాన్ని పిల్లలు నిర్మించుకుని ఉంటారు. ఈ జ్ఞానం అంతఃప్రేరణతో అత్యంత సహజంగా నిర్మింపబడేది. పాఠశాల ఈ జ్ఞానాన్ని ప్రయత్నపూర్వకంగా నేర్చుకునేందుకు అవకాశాలు కల్పిస్తుంది. ప్రాథమిక విద్యదాకా అన్నిరకాల కృత్యాలలోను భాషకు, గణితానికి ప్రాధాన్యతనివ్వాలి. ఈదశలో ఈ రెండింటినీ కూడా వేరువేరు సబ్జెక్టులుగా విభజించుకోవాల్సిన అవసరం లేదు. రెండింటినీ కలిపి సమిష్టిగా చెప్పవచ్చు. అయితే తమ పరిసరాల అనుభవాల రూపంలోనే వీటి అభ్యసనం సాగాలి. తమచుట్టూ ఉన్న ప్రాకృతిక, సామాజిక పరిసరాలతో పిల్లలు చేసే నిరంతర ప్రతిచర్యద్వారా, పనులద్వారా, తమ సమాజంతోటి అనుబంధంద్వారా, తమ సౌందర్యాస్వాదన సామర్థ్యాలు పెంచుకోవడంద్వారా పిల్లలు ఈదశలో అభ్యసనం కొనసాగిస్తారు. ఈ అనుభవాలే తరువాత మాధ్యమిక విద్యాదశలో సైన్సు, సామాజిక శాస్త్రాలుగా విడిపోతాయి. మాధ్యమిక విద్యాదశలో పైనచెప్పిన వివిధరూపాల జ్ఞానం దేనికదిగా నిర్వచించబడడం ప్రారంభమవుతుంది. ఈదశలో కూడా సబ్జెక్టులకు అతీతంగా పిల్లలు నేర్చుకునే అంశాలు ఎన్నో ఉంటాయి. గణాంకాల సేకరణ, రకరకాల అంశాల విభజన, వర్గీకరణ, ప్రాకృతిక, సాంఘిక, గణిత, భాషాంశాల విశ్లేషణ ద్వారా పిల్లలు నైతిక అంశాలను అవగాహన చేసుకోవడటం, విమర్శనాత్మకంగా ఆలోచించడం నేర్చుకుంటారు. సామాజిక అంశాలను తెలుసుకునే అవకాశం కల్పించడంద్వారా సబ్జెక్టుల పరిధులకు మించిన జ్ఞానాన్ని అందివ్వడంద్వారా పిల్లల్లో హేతుబద్ధ ఆలోచనను మనం ప్రోత్సహించవచ్చు.

సెకండరీ విద్యాదశకు వచ్చేటప్పటికి పిల్లలకు తగినంత జ్ఞానపునాది, అనుభవం, భాషాసామర్థ్యాలు, వివిధరకాల జ్ఞానాన్ని ఉపయోగించుకునే పరిణితి, భావనలు, శరీరవిజ్ఞానం, పరిశోధనా పద్ధతులు మొదలైనవన్నీ లభించి ఉంటాయి. అందువల్ల వివిధ సబ్జెక్టులను ప్రస్తుతం మనం హైయ్యర్ సెకండరీ దశలో గుర్తించినవిధంగా బోధించవచ్చు.

సబ్జెక్టులను మరింత స్పష్టంగా, వేరువేరుగా నిర్వచించుకునే దశ వచ్చినపుడు వాటి ప్రత్యేక లక్షణాలతోపాటు, వాటిమధ్యగల సామాన్యతలను, పరస్పర సంబంధాల్ని మనం మరింత స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది.

### పాఠశాల కార్యక్రమాల నిర్వహణ

ఎ) సాధారణ కార్యక్రమాలు

1. అసెంబ్లీ
2. వివిధ ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు
3. క్రీడలు
4. స్వేచ్ఛగా ఆడుకునే సమయం
5. సంభాషణలు, సంవాదాలు, చర్చలు
6. పరిపాలనా నిర్వహణా కార్యక్రమాల్లో భాగస్వామ్యం

బి) సబ్జెక్టులు : భాషలు; బోధనా మాధ్యమం, ఆంగ్లం, తృతీయ భాష

7. గణితం
8. సైన్సు
9. సామాజిక శాస్త్రాలు, చరిత్ర
10. కళలు
11. చేతివృత్తులు, పని

### జ్ఞానానికి సంబంధించిన మనం గమనంలో ఉంచుకోవల్సిన కొన్ని సూత్రాలు

✦ సబ్జెక్టుల విషయపరిజ్ఞానం ద్వారా పిల్లలు సామాజిక వాస్తవాలపట్ల, తమ చుట్టూ ఉన్న సహజ పరిసరాలపట్ల విమర్శనత్మక దృక్పథాన్ని పొందడం.

✦ జ్ఞానం అర్థవంతంగా, సంగతంగా (relevant) ఉండాలంటే దాన్ని స్థానిక అంశాలతో సందర్భాలతో అనుసంధానం చేయాలి. పాఠశాల బయట అనుభవాల్ని ధృవీకరించుకొనగలిగేలా ఉండాలి. స్వంత పరిశీలనుండి, ప్రతిచర్యనుండి, వర్గీకరణ, విభజన సామర్థ్యాల నుండి, ప్రశ్నల నుండి, వాదాలనుండి, జ్ఞానం ఉద్భవిస్తుంది.

✦ వివిధ సబ్జెక్టుల మధ్య సంబంధం, పరస్పరాశ్రితత్వం.

✦ పరిశోధనయొక్క ఫలితత్వాన్ని, బహిరంగ స్వభావాన్ని గుర్తించడం, వాస్తవాల స్వభావాన్ని అర్థం చేసుకోవడం.

✦ స్థానిక జ్ఞానాన్ని, అనుభవాలని పాఠశాల విద్యతో అనుసంధానింపచేసుకోవడం.

✦ ప్రశ్నలకు ప్రోత్సాహం, నూతన ప్రశ్నలకు మరింత అవకాశం

✦ తరగతి గదిలో సమానత్వాన్ని పాటించాలన్న స్పృహ, వివిధ తరగతుల పిల్లల భిన్న సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని వారిపట్ల విచక్షణ చూపకుండా జాగ్రత్తపడడం. మూసపోసిన పద్ధతుల్ని నిరాకరించడం.

✦ ఊహాశక్తిని అభివృద్ధి చేయడం, కాల్పనికతను సజీవంగా ఉంచడం.

అధ్యాయం - 3

# పాఠ్యాంశాలు, పాఠశాల దశలు, మూల్యాంకనం


3.1 భాష

3.2 గణితం

3.3 ప్రకృతి శాస్త్రాలు

3.4 సామాజిక శాస్త్రాలు

3.5 కళా విద్య

3.6 ఆరోగ్య విద్య, వ్యాయామ విద్య

3.7 శ్రమ విద్య

3.8 శాంతికోసం విద్య

3.9 అధ్యయన పథకాలు

3.10 మూల్యాంకనం


మన సామాజికావసరాలు, ఆకాంక్షలు పెరిగాయి. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అధ్యయనం కూడా బాగా పెరిగింది. కానీ దీనికనుగుణంగా పాఠ్యాంశాల్ని రూపొందించుకోవడం మాత్రం చాలాకాలం నుంచి ఏమీ మారలేదు. అందువల్ల ప్రతి పాఠ్యాంశాన్ని గురించి లోతుగా పునఃపరిశీలన చెయ్యాల్సిన అవసరం నేడు ఏర్పడింది. మన సామాజికావసరాలకు తగ్గట్టుగా మనం సంసిద్ధులమయ్యేందుకు కావలసిన నిర్దిష్టమైన విషయాల్ని దీనివల్ల మనం గుర్తించే అవకాశం కల్గుతుంది. మనమైతే ఓ శతాబ్దానికిముందే కథల్ని, వ్యాయామ విద్యను, అదనపు పాఠ్యాంశాల (Extra Curricular) జాబితాలోకి నెట్టేశాం. ఇప్పుడు మన విద్యలో వీటి పాత్రపట్ల, స్థితిపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సివుంది. సౌందర్యాస్వాదన, అనుభూతి బిడ్డ సృజనాత్మకతలో చాలా కీలకమైనవి. మన పాఠ్యాంశాల్లో వీటిని ధైర్యంగా చొప్పించి ఆయాదశల్లో వాటికివ్వాల్సిన గుర్తింపునివ్వాలి. అలాగే శ్రమ, శాంతి, ఆరోగ్యం కూడా. ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత అభివృద్ధిలో ఈ మూడింటికీ ఎంతో ప్రాధాన్యత ఉంది. పిల్లలకు స్వావలంబన, సద్యఃస్పందన, శాంతి, ఆరోగ్యంలాంటివి ఒక సంస్కృతిగా ఒంటబట్టించి సామాజీకరించేందుకు పాఠశాలలు పెద్ద పాత్రను పోషించాల్సివుంది.

## 3.1 భాష

భాష జ్ఞాపకాల, చిహ్నాల భాండాగారం. ఇవి కొన్ని మన సహచరులు మాట్లాడుతున్నప్పుడందుతాయి. కొన్నిటిని జీవితంలో మనమే సృష్టించుకొంటాం. మనం నిర్మించుకొనే జ్ఞానానికి ఎక్కువగా భాషే మాధ్యమంగా పనిచేస్తుంది. అందువల్ల వ్యక్తుల ఆలోచనలతో భాష ముడిపడి వుంటుంది. భాష వ్యక్తికొక గుర్తింపుకూడా. మాతృభాషని నిరాకరించడమంటే పిల్లల అనుభవజ్ఞానాన్ని నిరాకరించడమే అవుతుంది. భాషల్ని సమర్థవంతంగా అర్థం చేసుకోవడం, ఉపయోగించుకోవడం వల్ల పిల్లలు ఆలోచనలకూ, ప్రజలకూ ఇతర ప్రాపంచికాంశాలకు మధ్య ఒక అనుసంధానం ఏర్పరుచుకోగల్గుతారు.

పుట్టుకతోనే పిల్లలకు అంతర్గతంగా భాషా సామర్థ్యం ఉంటుంది. ఎంతో సంక్లిష్టమైన నియమాలుగల భాషలో పిల్లలు మన బడికి రాకముందే ప్రావీణ్యం కల్గివుండటం మనకందరికీ అనుభవమే. అందరు పిల్లలకూ భాషా సామర్థ్యాలు పుష్కలంగా ఉండడం కూడా మనకు తెలుసు. భాషనేర్పే ఉపాధ్యాయుడు పిల్లల్లోని ఈ సామర్థ్యాన్ని ఒక గొప్ప వనరుగా మొదట గుర్తించాలి. ప్రామాణిక వ్యావహారిక భాషను ఉచ్ఛరించడంలో వెనకబడ్డ పిల్లలుకూడా

తమ అనుభవాల్ని వ్యక్తీకరించడానికి, సమాచారాన్ని అందించడానికి కొన్ని గుర్తుల్ని, సంకేతాల్ని అభివృద్ధి చేసుకొంటారు. ఈ సామర్థ్యాలమీద ఆధారపడి భాషల్ని మనం నేర్పించాల్సి ఉంటుంది. లేఖన నైపుణ్యం (బ్రెయిలీ లిపితో సహా) అభివృద్ధి చెందితే వీరికి అకడమిక్ జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. భాషాపరమైన వైకల్యం గల పిల్లలకు సంకేత భాషను నేర్పితే అది వీరు చక్కగా అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

పిల్లల భాషా సామర్థ్యాన్ని గుర్తించడంవల్ల వాళ్ళకు తమపట్ల, తమ సంస్కృతిపట్ల ఒక నమ్మకం ఏర్పడుతుంది. భాషాబహుళత్వం భారతదేశపు ప్రత్యేక లక్షణం. మంచి భాషా ఉపాధ్యాయుడు దీన్నొక అవకాశంగా, వనరుగా మలచుకొంటాడు. బహుభాషత్వం కేవలం ఒక సామర్థ్యం మాత్రమే కాదు. ఆ పిల్లలకిదొక గుర్తింపూ, ఒక రక్షణా కూడా. భాషా నేపథ్యం వల్ల ఏ బిడ్డా నిరాదరణకు గురికాగూడదు.

### 3.1.1 భాషా విద్య

భారతదేశపు భాషా బహుళత్వం మనముందుకు కొన్ని సవాళ్ళు తెస్తున్న మాట వాస్తవం. కానీ ఇది కొన్ని అవకాశాల్ని అందించడం కూడా అంతే వాస్తవం. బహుళ భాషలుండడం మనకు ఒక గొప్ప సాంస్కృతిక వనరు. బహుభాషలుండడం మన విశిష్టత కాగా, ఆ భాషలు వివిధ భాషా కుటుంబాలకు చెందినవి గావడం మరింత విశిష్టత. ఇన్ని భాషా కుటుంబాలు గల దేశం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఇండోఆర్యన్, ద్రవిడ, ఆస్ట్రో ఏసియాటిక్, టిబెటో బర్మన్, అండమాన్ కుటుంబాల భాషలుగా భారతీయ భాషల్లో ఒక స్పష్టమైన విభజన కన్పిస్తుంది. అదే సందర్భంలో ఈ భాషల మధ్య పరస్పరాన ప్రదానాలు కన్పిస్తాయి. భాషలకూ భాషలకూ మధ్య, భాషలకూ సమాజాలకూ మధ్య ఇచ్చిపుచ్చుకోవడాల్ని పరిశీలిస్తే మనదేశంలో శతాబ్దాల తరబడి బహుభాషలు, బహు సంస్కృతులు కలసిమెలసి జీవించాయని అర్థమవుతుంది. ఈ క్రమంలో అవి పరస్పరం పరిపుష్టి చెందాయి కూడా. లాటిన్, అరబిక్, పర్షియన్, తమిళం, సంస్కృతం లాంటి ప్రాచీన భాషల వ్యాకరణం, లయాత్మకత, రసాత్మకత ఎంతో గొప్పవి. అవి మన జీవితాల్ని ఉద్దీప్తం చేయగల్గినట్టివి. వీటినుంచి ఎన్నో భాషలు ఇప్పటికీ పదజాలాన్ని స్వీకరిస్తూనేవున్నాయి.

రెండు భాషలు, లేదా బహుళ భాషలు జ్ఞానాభివృద్ధికి చాలా మంచి అవకాశాలని ఇప్పుడు మనకు స్పష్టంగా తెలుసు. రెండు భాషలు జన్మతః నేర్చుకొనే అవకాశం ఉన్న వాళ్ళ జ్ఞానం మరింత త్వరగా పెరుగుతుందని చాలా అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. వీరికి సామాజిక సహనశీలత ఉంటుందనీ, వీరి ఆలోచనలు వైవిధ్యంతో ఉంటాయనీ, జ్ఞాన పారీణత వీరికెక్కువనీ కూడా ఈ అధ్యయనాలు తెలుపుతున్నాయి. కాబట్టి బహుళ భాషలుకూడా ఇతర సహజ వనరులలాగానే మన దేశానికి గొప్ప జాతీయ సంపదగా మనం గుర్తించాలి. త్రిభాషా సూత్రం మనదేశపు బహుళభాషా సవాళ్ళను, అవకాశాలను గుర్తించి రూపొందించుకొన్న విధానం. భాషాభ్యసనంలో ఈ క్రింది సూత్రాల్ని సాధించడంద్వారా మన లక్ష్యాల్ని సాధించవచ్చు.

- ✦ మన పాఠశాలల్లో పిల్లల మాతృభాష(లు) బోధనా మాధ్యమంగా ఉండాలి.
- ✦ ప్రాంతీయ భాష, మాతృభాష ఒకటి కాకపోతే మొదటి రెండు సంవత్సరాలు మాతృభాషలోనే విద్య సాగాలి.
- ✦ ప్రాథమికస్థాయిలో ప్రాంతీయ భాష తప్పనిసరి సబ్జక్టుగా ఉండాలి.
- ✦ మాధ్యమిక స్థాయిల్లో ప్రాంతీయ భాష(ల)తోపాటు ఇంగ్లీషుకూడా ఒక సబ్జెక్టుగా ఉండాలి.

- ✦ హిందీయేతర రాష్ట్రాల్లో పిల్లలు హిందీ నేర్చుకోవాలి. హిందీ ప్రాంతాల పిల్లలు హిందీతోపాటే ఆ ప్రాంతంలో మాట్లాడని మరో భాష నేర్చుకోవాలి. వీటితోపాటు సంస్కృతాన్ని కూడా నేర్చుకోవచ్చు.
- ✦ ఉన్నత పాఠశాల స్థాయిలో ఒక ప్రాచీన భాషను, హైయ్యర్ సెకండరీ స్థాయిలో ఒక విదేశీ భాషను కూడా ప్రవేశపెట్టవచ్చు.
- ✦ పలు భాషల్ని నేర్పడం ద్వారానేగాదు తరగతి గదిలోగల బహు భాషావకాశాల్ని ఉపయోగించుకోవడం ద్వారా కూడా బోధనా వ్యూహాల్ని రూపొందించుకోవాలి.

### 3.1.2 ప్రథమ భాషా విద్య

కుటుంబంతో, చుట్టూవున్న వారితో ప్రతిచర్య జరపడం ద్వారా పిల్లలు భాషను లేదా భాషల్ని స్వంతం చేసుకుంటారనేది మనకు తెలుసు. ఇలా పిల్లలు కావల్సినంత సంభాషణా నైపుణ్యంతో మన బడిలోకి ప్రవేశిస్తారు. ఈ నైపణ్యాన్ని మనం సానబెట్టాలి. మరింత వేగంగా సంభాషించగల సామర్థ్యాన్ని, తద్వారా జ్ఞాన సామర్థ్యాల్ని మనం తరగతి గదిలో అభివృద్ధి చెయ్యాలి. ఇది ప్రథమ భాషా లక్ష్యం. సంభాషణా నైపుణ్యాల్ని మరింత అభివృద్ధి చెయ్యడంకోసం, విమర్శనాత్మకంగా ఆలోచించగల్గడం కోసం మనం మూడవ తరగతినుంచి మౌఖిక లేఖన సాధనాల్ని ప్రవేశపెట్టాలి. ప్రారంభ దశలో బిడ్డ స్వంత భాషను మనం తప్పనిసరిగా అంగీకరించాలి. దీన్ని సరిచెయ్యడానికి ఎలాంటి ప్రయత్నం చెయ్యగూడదు. నాల్గవ తరగతి నుంచి ప్రామాణిక భాషను, సక్రమ ఉచ్ఛారణను పిల్లలకు నేర్పించాలి. అదే సందర్భంలో పిల్లల ఇంటి భాష(ల)ను మనం గౌరవించితీరాలి. తప్పులనేవి నేర్చుకోవడంలో తప్పనిసరైనవి. వాటిని నేర్చుకోగల దశ వచ్చినప్పుడు పిల్లలు తమకుతామేవాటిని సరిదిద్దుకొంటారు. పిల్లల తప్పులపై కేంద్రీకరించేబదులు పిల్లలకు సమగ్రమైన, ఆసక్తికరమైన, సవాళ్ళతోకూడిన అంశాల్ని అందించడం మంచిది.

భాషావిద్య, భాషా తరగతి గదికి మాత్రమే పరిమితమైంది కాదు. నిజానికి సైన్సు, సామాజిక శాస్త్రాలు, గణితం బోధించే క్లాసులు కూడా భాషా క్లాసులే. ఒక సబ్జెక్టును నేర్చుకోవడం అంటే ఏమిటి? ఆ విషయంలోని పారిభాషిక పదాల్ని నేర్చుకోవడం. ఆ విషయాన్ని చర్చించడం. దాన్ని విమర్శనాత్మకంగా రాయడం. ఇవన్నీ భాషా విద్యలోనివే గదా! కొన్ని విషయాలకోసం పిల్లల్ని పుస్తకాలు చదవాల్సిందిగా ప్రోత్సహించవచ్చు. పలు భాషల ప్రజలతో సంప్రదించమని చెప్పవచ్చు. ఇంటర్నెట్ నుంచి ఇంగ్లీషులో కావల్సిన సమాచారాన్ని సేకరించమని చెప్పవచ్చు. ఇలాంటి భాషావిధానం నిజమైన బహుళభాషా సంపదను మన పాఠశాలల్లో ఆవిష్కరిస్తుంది. భాషా తరగతిలో కథలు, కవిత్వం, పాటలు, నాటకాలు పిల్లల్ని, వారి సాంస్కృతిక వారసత్వ వైభవంతో అనుసంధానంపచేస్తాయి. వీటిలో పిల్లలు తమ అనుభవాల్ని దర్శించుకొంటారు. ఇతరులపట్ల స్పందించడాన్ని అలవాటు చేసుకొంటారు.

పిల్లల స్వీయ సృజనాత్మకతను సాహిత్యం ప్రోత్సహిస్తుంది. కథ, కవిత్వం, పాట లాంటివి వినిపించాక పిల్లల్ని స్వంతంగా ఏదైనా రాయమని చెప్పాలి. పలురూపాల్లో సృజనాత్మకంగా వ్యక్తీకరించే విధంగా మనం పిల్లల్ని ప్రోత్సహించాలి.

భాషాభ్యసన సామర్థ్యం తక్కువగా ఉండే పిల్లలు కూడా చాలామంది సాధారణ సామాజిక ప్రతిచర్యల ద్వారానే భాషా నైపుణ్యాల్ని పొందుతారు. కానీ వీరి ఎదుగుదలకోసం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూపొందించిన సామగ్రి అవసరం. ఇలాంటి సందర్భంలో సంకేత భాష, బ్రెయిలీ లిపిలాంటివి ఎంతైనా ఉపకరిస్తాయి.

### 3.1.3 అన్ని సబ్జెక్టులలోనూ భాష

భాషా నైపుణ్యాలు ఆలోచనలకు మూలం. గుర్తింపుకు ఆధారం. అందువల్ల ఇది సబ్జెక్టుల పరిధికి మించినది. భాషణం–శ్రవణం, పఠనం–లేఖనం అనేవి అన్నిటికీ వర్తించే నైపుణ్యాలు. పాఠశాలలో రాణించడానికి అత్యవసరమైన కారణాలివే. ఎక్కువ సందర్భాల్లో ఈ నైపుణ్యాలన్నిటినీ సమిష్టిగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అందువల్ల భాషా విద్యపై బడిలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ పెట్టడం అవసరం. ఇది ఒక్క భాషా ఉపాధ్యాయుడి బాధ్యత కాదు. అలాగే ప్రాథమిక తరగతులతోనే భాషా నైపుణ్యాల పాత్ర ఆగిపోకూడదు. సబ్జెక్టుల పరిధి పెరిగేకొలదీ నూతనావసరాలు ఏర్పడతాయి. దీనికనుగుణంగా ఉన్నత పాఠశాల, హైయ్యర్ సెకండరీ పాఠశాలలకు కూడా ఇవి విస్తరించాలి.

సాంప్రదాయక శిక్షణ పొందిన భాషా ఉపాధ్యాయులకు ఏ తప్పులూలేని భాషోచ్చారణ మాత్రమే పరమార్థం. భాషకు వ్యక్తీకరణ ధర్మం కూడా ముఖ్యమని వారు గుర్తించరు. తరగతిలో మాట్లాడ్డానికి ప్రతికూల విలువ మాత్రమే ఉండే వ్యవస్థ మనది. పిల్లల్ని మౌనంగా కూచోబెట్టడానికే మన టీచర్ల శక్తి అంతా ఖర్చయిపోతుంది. ఉచ్చారణ రూపాల్ని సవరించడానికే పుణ్యకాలమంతా సరిపోతుంది. పిల్లలు మాట్లాడ్డాన్ని ఒక తలనొప్పిగా చూడకుండా వాళ్ళని అభివృద్ధి చెయ్యడానికి అదొక వనరుగా టీచరు చూడాలి. అప్పుడు నియంత్రణ ప్రతిఘటన అనే విషవలయం వ్యక్తీకరణ, స్పందన అనే ఒక మంచి వలయంగా మారుతుంది. భాషను గొప్ప బోధనావనరుగా ఎలా ఉపయోగించుకోవచ్చునో తెలియజేసే పరిజ్ఞానం ఇప్పుడు మనవద్ద కావల్సినంత ఉంది. సర్వీసుకు ముందు, సర్వీసు మధ్యలో ఇచ్చే శిక్షణలో దీన్ని ఉపాధ్యాయులకందించాలి. చిన్నచిన్న సమూహాల్లో పోల్చటం–భేదాల్ని చూడ్డం, ఆశ్చర్యపోవడం – జ్ఞప్తికి తెచ్చుకోవడం, ఊహించడం, సవాలు చెయ్యడం, నిర్ణయించడం–మూల్యాంకనం చెయ్యడం లాంటి చర్యలద్వారా పాఠ్యాంశాల్ని రాబట్టవచ్చు. ఈ మెళకువల్ని ఉపాధ్యాయులకు పాఠ్యగ్రంథాల రచయితలు, ఉపాధ్యాయ కరదీపికలు అందించాలి.

శ్రవణ నైపుణ్యానికి సంబంధించికూడా ఇలాంటి ప్రణాళికే మన పాఠ్య గ్రంథాల్లో, ఉపాధ్యాయుల కరదీపికల్లో ఉండాలి. ఫలితంగా ఎంతో విలువైన ఈ నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది. జాగ్రత్తగా వినటం అభ్యసిస్తే ఏకాగ్రత పెరుగుతుంది. ఇతరుల అభిప్రాయాల్లోని సామరస్యాన్ని అంగీకరిస్తారు. ఎదుటివారు చెపుతున్న దానిలోని అంతరార్థాన్ని ఊహించుకోగల్గుతారు.

ఇలా శ్రవణం కూడా భాషలాగే ఎన్నో నైపుణ్యాల, విలువల సంక్లిష్ట సమాహారమని మనం గుర్తించాలి. జానపద విజ్ఞానం–సంగీతం, కథలు చెప్పుకోవడం, సామూహిక గానాలు, నాటకాలులాంటివన్నీ స్థానికంగా లభించే అవకాశాలు. కథలు చెప్పడం చిన్న తరగతుల్లోనేగాదు, పైస్థాయిలోకూడా విలువైందే. మౌఖికంగా కథ చెప్పడం కూడా ఒక రచనలాంటిదే. ఇదికూడా మన తార్కిక అవగాహనకు పునాది వేస్తుంది. ఊహాత్మకతను వికసింపచేస్తుంది. మన జీవితంలో ఎప్పుడూ తారసపడని సందర్భాల్లో కూడా సమర్థవంతంగా పాల్గొనగల సామర్థ్యాన్నిస్తుంది. కల్పనలు, అద్భుతాలు కూడా పిల్లల ఎదుగుదలలో కీలకమైనవి. భాష నేర్పడంలో భాగంగా మనం సంగీతాన్ని కూడా శ్రవణ సామర్థ్యం పెంచడానికి ఉపయోగించుకోవచ్చు. దీనికోసం ప్రాచీన, జానపద సంగీతాల్ని రెండింటినీ మనం స్వీకరించవచ్చు. జానపద గేయాల్ని, సంగీతాన్ని మన పాఠ్యపుస్తకాల్లో కూడా పరిచయం చెయ్యాలి. వాటి అభ్యాసాలు, కృత్యాలు ఎంతో ప్రత్యేకంగా రూపొందించుకోవచ్చు.

## పిల్లలు ఎందుకు చదవలేకపోతున్నారు?

- టీచర్లకు బోధనా వ్యూహ నైపుణ్యాలు (అభ్యాసకుడి స్థాయిని తెలుసుకోవడం, వివరించడం, సరైన ప్రశ్నల్ని అడగడం) తరగతి గది నిర్వహణా సామర్థ్యం లేవు. తప్పుల్ని సరిచెయ్యడమే తప్ప లయాత్మకతనీ, వ్యక్తీకరణ సామర్థ్యాల్ని వీళ్ళు పిల్లల్లో పెంచలేకపోతున్నారు.
- సర్వీసు ముందిచ్చే శిక్షణలో పఠనానికి సంబంధించిన బోధనా వ్యూహాల్ని గురించి టీచర్లకు ఏమీ నేర్పరు. సర్వీసు మధ్యలో ఇచ్చే శిక్షణకు అర్థమే ఉండదు.
- పాఠ్యపుస్తకాల్ని తాత్కాలిక ధోరణిలో రాయడమే తప్ప అవి పిల్లలు చదివేందుకు తగ్గట్లువుండవు. అలాంటి వ్యూహమే రచయితలకుండదు.
- మొదటితరం అభ్యాసకులైన వెనకబడ్డ వర్గాల పిల్లలకు ప్రతికూలాంశాలే తరగతిలో ఉంటాయి. వీళ్ళని ఉపాధ్యాయులు దగ్గరకు తియ్యరు. పాఠ్యపుస్తకాల ప్రపంచానికీ వీళ్ళ ప్రపంచానికీ పొంతన ఉండదు.

పఠన ప్రారంభదశలో చెయ్యదగినవి

- ధ్వనికీ, అక్షరానికీ గల సంబంధాన్ని శాస్త్రీయ పద్ధతిలో తెలియజెప్పడం.
- పిల్లలచేత తమ అనుభవాల్ని రాయించడం, వాటిని చదివించడం (సజీవ పఠనం).
- కథలు, కవిత్వం లాంటి ఇతర విషయాల్ని చదివించడం.

ఇక పఠనాన్ని మనం భాషా విద్యలో మొదటినుంచీ ముఖ్యమైందిగా అంగీకరిస్తున్నాం. అందువల్లనే కాబోలు మన సిలబసు బోలెడు సమాచారంతో పెద్ద మోతగా మారింది. జ్ఞాపకం పెట్టుకోవడం అసలు లక్ష్యమై కూచుంది. చదవడంలోని నిజమైన ఆనందం కాస్తా కనుమరుగైంది. పిల్లల్లో నిరంతరం చదివే సంస్కృతిని పెంచాలంటే మనం అన్ని స్థాయిల్లో వాళ్ళు స్వంతంగా చదివే అవకాశాల్ని కల్గించాలి. ఈ సంస్కృతి మొదట టీచర్లకుండాలి. ఇందుకోసం పాఠశాల గ్రంథాలయాలు, సామాజిక గ్రంథాలయాలు అవసరం. కథలు చదవడం దండగమారి పనిగా కొందరు భావిస్తారు. ఇది పఠనాన్ని తీవ్రంగా నిరుత్సాహపరుస్తుంది. మన పాఠశాలలకు అనుబంధ పఠన సామగ్రి అవసరం. అది అన్ని సబ్జెక్టులకు ఉండాలి. అన్ని స్థాయిల పిల్లలకూ సరిపోయేదిగా ఉండాలి. ఇప్పుడు మార్కెట్‌లో ఇలాంటి సామగ్రి దొరుకుతోంది. వాటి నాణ్యత సంగతి అలా ఉంచితే మన పాఠశాలల్లో వివిధ అంశాల్ని బోధించేందుకు ఈ సామగ్రిని మనం ఉపయోగించుకోవాలి. ఉపాధ్యాయుల శిక్షణలో ఈ సామగ్రిని పరిచయం చెయ్యాలి. ఎలాంటి సామగ్రిని ఎంచుకోవాలో, ఎలా దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలో తెలియజెయ్యాలి.

లేఖన ప్రాముఖ్యతను మనమందరం గుర్తిస్తున్నాం. కానీ ఇందులో నూతన పద్ధతుల్ని పట్టుకోవాలి. దీనికి తగ్గట్టు మన పాఠ్య ప్రణాళిక ఉండాలి. పిల్లలు తప్పుల్లేకుండా రాయాలని టీచర్లు పట్టుబడుతుంటారు. తమ అభిప్రాయాల్ని, ఆలోచనల్ని పిల్లలు రాతద్వారా వ్యక్తీకరించడం ముఖ్యమనే సంగతిని వారు మరిచిపోతుంటారు. ఉచ్చారణలో మనం ముందుగానే నిర్ణయించుకొన్న నియమాలతో కట్టడి చేయడం వల్ల ధారాళంగా మాట్లాడ్డం ఎలా కుంటుబడుతుందో, అలానే రాయడంలోనూ యాంత్రిక నియమాలకోసం పట్టుబట్టడంవల్ల పిల్లలు తమ ఆలోచనల్ని

వ్యక్తీకరించలేని దుస్థితి ఏర్పడుతుంది. రాయడాన్ని కూడా ఒక కళాత్మక వ్యక్తీకరణగా మొదట టీచర్లు చూడాలి. అలాంటి శిక్షణ టీచర్లకివ్వాలి. రాయడంలో అధికారిక నైపుణ్యాలకోసం వెతకకూడదు. అలాగే ప్రాథమిక స్థాయిలో లేఖనం పిల్లల శ్రవణ భాషలో పఠన నైపుణ్యాల జ్ఞానంతో అనుసంధానింపబడాలి. అలాంటి సమగ్రమైన పద్ధతిలోని మనం ప్రాథమిక స్థాయిలో లేఖనాన్ని పిల్లల శ్రవణ భాషణా పఠన నైపుణ్యాల జ్ఞానంతో అనుసంధానించాలి. అలాంటి సమగ్రమైన పద్ధతిని మనం ప్రాథమిక స్థాయిలో రూపొందించుకోవాలి. ఆపై స్థాయిలో ముఖ్యమైన అంశాల్ని నోట్ చేసుకొనే పద్ధతిలో లేఖన నైపుణ్యాన్ని పెంచాలి. ఇలా చెయ్యడం వల్ల బోర్డుపైన టీచరు రాసిందాన్ని నోట్‌పుస్తకాల్లో మక్కీకి మక్కీ కాపీ చేసే పద్ధతినుంచి పిల్లలు విముక్తులవుతారు. యాంత్రిక పద్ధతిలో ఉత్తరాలు, వ్యాసాలు రాయించడం నుంచి కూడా మనం బయటపడాలి. దీనికిబదులు పిల్లల ఊహలకు, స్వాభావికతకు మనం పట్టం కట్టించాలి.

పఠన బోధనా వ్యూహం

మూడేళ్ళు పూర్తయినా మన పిల్లలు సరిగా చదవలేరు, రాయలేరు. ఈ లోపం మనందరికీ ఆందోళన కల్గించే అంశం. పిల్లలు బడి మానెయ్యడానికి బడినుంచి ఎదురయ్యే కారణాల్లో ఇది ముఖ్యమైంది. ఏదిఏమైనా మన క్లాస్‌రూంలో మనం చేస్తున్నదీ చేయలేకపోతున్నదీకూడా ఈ వైఫల్యానికి కారణాలే. ప్రారంభ దశలో చదివించడం ఎలా అనేదానిపై మన దేశంలో పెద్ద పరిశోధన గానీ, చర్చగానీ, ప్రయోగంగానీ ఏవీ జరగలేదు. ఇంగ్లీషు కంటే భారతీయ భాషల లిపులు భిన్నమైనవి. వీటిలో ఒక ధ్వనికి ఒక అక్షరం ఉంటుంది. అందువల్ల ఇంగ్లీషు చదవడం కన్నా భారతీయ భాషలు చదవడం తేలిక. ఈ అంశాన్ని మనం సరిగా గుర్తించడంలేదు (కానీ భారతీయభాషల లిపుల్లోని అక్షరాల సంక్లిష్టత ఒక ప్రతికూలాంశం).

ఈ విషయంలో మన పాఠశాలల వైఫల్యాన్ని చూచి కొన్ని సంస్థలు కొన్ని పద్ధతుల్ని అనాలోచితంగా వెతుక్కొంటున్నాయి. సామూహిక పఠనాల్ని చేపడుతున్నాయి. ఇది సరైన పద్ధతి కాదు. ఒకే క్లాసులో కూడా ఒక పద్ధతి సరిపోదు. అందువల్ల నిర్ణీత పద్ధతి ఇందుకు సరిపోదు. పలు పద్ధతుల్ని మనం పాటించాల్సి ఉంటుంది.

### 3.1.4 ద్వితీయ భాషా బోధన

రెండవ భాషను ఎంత చెప్పాలి, ఎలా చెప్పాలి, ఏ లక్ష్యంతో చెప్పాలి అనేవి పిల్లలకు ఆ భాష ఎంత సన్నిహితమైంది అనేదాన్నిబట్టి, ఆ భాషను వారెందుకు నేర్చుకొంటున్నారు అనేదాన్నిబట్టి ఉంటాయి. ద్వితీయ భాషా వాచకాల్ని ఎంపిక చేసుకొనేప్పుడు అవి పిల్లల్ని ఆకర్షించేలా; ఆ భాష ప్రత్యేకతలని, గొప్పదనాన్ని ప్రతిబింబించేలా, సజీవ భాషలో ఉండేలా చూసుకోవాలి. ఏదో ఒక సంస్కృతిని, కొన్ని నీతుల్ని ప్రబోధిస్తే సరిపోదు.

### 3.1.5 ఇంగ్లీషు

మన భాషా పాఠ్య ప్రణాళికల్లో ఇంగ్లీషు బోధన ఇప్పుడొక పెద్ద ప్రశ్న. ఇది దేశంలోని అన్ని స్కూళ్ళకు వర్తించే సమస్య. ఒకవైపు 10వ తరగతిలో ఎక్కువమంది పిల్లలు ఇంగ్లీషువల్ల తప్పిపోతున్నారు. పిల్లలవైపు నుంచి చూస్తే ఇదొక అన్యాయమైన తీర్పు. ఇంకోవైపు మాధ్యమంగా గాక పోయినా కనీసం భాషగానైనా ఒకటవ తరగతినుంచే ఇంగ్లీషు నేర్పాలనే ఒత్తిడి పెరుగుతోంది. ఇలా చిన్నతనంలోనే మనం మాతృభాషల స్థానంలో ఇంగ్లీషును తెచ్చిపెడితే అప్పుడు ఇంగ్లీషు పదజాలంతో తమ పరిసరాల్ని అనుసంధానించుకోవడం పిల్లలకు అసాధ్యమవుతుంది. అదే సందర్భంలో ఇంగ్లీషు నేర్చుకోవడమూ అవసరమే. మన ఆకాంక్షలు, బ్రతుకుతెరువు, అవకాశాలు, జ్ఞానం అన్నీ ఇంగ్లీషుతో ముడిపడివున్న రోజులివి.

భారతీయభాషల సరసన ఇంగ్లీషుకూడా బోధింపబడినప్పుడే ఇంగ్లీషు విద్యకు అర్థం ఉంటుంది. పలు భాషల్లో ఉండే ప్రత్యామ్నాయ పాఠ్యగ్రంథాలు, ఉన్నత తరగతులకోసం ద్విభాషా నిఘంటువులు, మాట్లాడే పుస్తకాలు, 'బృహత్ గ్రంథాలు' (Big Books) అందుబాటులో ఉండడంవల్ల పాఠశాలలో ఒక వాతావరణం ఏర్పడుతుంది. సంకేతాలు, చార్టులు, నోటీసులు, లేబుళ్ళు, ఇతర చిహ్నాలు మరింత ఉపయుక్తమైన అభ్యసన వాతావరణాన్ని తరగతిగదిలో కల్గిస్తాయి. మన పాఠ్యగ్రంథాల్లో కథలుండాలి, పద్యాలుండాలి, ఇతర రచనలుండాలి. ఇవన్నీ పిల్లల సంస్కృతిని ప్రతిబింబించాలి. ఇప్పుడు ఇంగ్లీషులో చాలా మంచి రచనలు వస్తున్నాయి. వందేళ్ళ ముందటి పాత పుస్తకాలతో సరిపెట్టకుండా పాఠ్య గ్రంథ రచయితలు వీటిని ఉపయోగించుకోవాలి. తరగతి గదిలో బహుళ సంస్కృతుల వైవిధ్యాన్ని ఈ పుస్తకాలు ప్రతిబింబించాలి.

ఇంగ్లీషు : ఒక సబ్జెక్టా లేక మాధ్యమమా?

ఒకటవ తరగతినుంచే ఇంగ్లీషు నేర్పించాలని వస్తున్న డిమాండు కేవలం నూతన ఆకాంక్షలవల్లనో, మారిన రాజకీయ పరిస్థితులవల్లనో వచ్చింది గాదు. ఇప్పుడు మనం ఇంగ్లీషు నేర్పుతున్న విధానం, మనం వాడుతున్న పాఠ్య ప్రణాళికలు కూడా దీనికి కారణాలు. ఇంగ్లీషు బోధనకు సంబంధించి మన అధ్యయన సంస్థలు చేస్తున్న పరిశోధనల వైఫల్యం కూడా దీనికి కారణమే. నాల్గవ తరగతి నుంచి 10వ తరగతి దాకా మనం ఇంగ్లీషు నేర్పుతున్నాం. మనం పాటించే పద్ధతులవల్ల ఇంగ్లీషు ధారాళంగా వచ్చి ఉంటే పై డిమాండు వచ్చి వుండేదే కాదు. మన పరిశోధన అంతా ఇంగ్లీషు మాధ్యమంగా చదువుకొనే మధ్యతరగతి వర్గపు స్కూళ్ళ అవసరాలపైనే జరిగింది. ప్రాంతీయ భాషా మాధ్యమాల స్కూళ్ళలో రెండో భాషగా నేర్పే ఇంగ్లీషు మీద జరగలేదు. ఇంగ్లీషు కోసం వస్తున్న డిమాండు న్యాయమైందని మనం అంగీకరిస్తే మనం దీనికితగ్గ బోధనా వ్యూహాన్ని, పాఠ్య ప్రణాళికను వెంటనే రూపొందించుకోవాలి. ఇంగ్లీషు నేర్పడంలో రాబోయే అయిదారేళ్ళలో గనుక మనం చెప్పుకోదగ్గ విజయం సాధించకపోతే అన్ని స్కూళ్ళు ఇంగ్లీషు మీడియంలోనే ఉండాలనే రాజకీయ డిమాండు ముందుకొచ్చి తీరుతుంది. తమ పిల్లలకు ఇంగ్లీషులో నైపుణ్యం ఉండితీరాలనీ; తమ ఆకాంక్షలకు, ఆశలకు ఇంగ్లీషు ఒక అడ్డంకిగా మారకూడదనీ, తల్లిదండ్రులు డిమాండు చేస్తే ప్రభుత్వానికి కూడా గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడుతుంది.

## 3.2 గణితం

గణిత విద్య యొక్క ముఖ్య లక్ష్యం పిల్లలలో గణితాత్మక సామర్థ్యాలు పెంపొందించడం / పాఠశాల దశలో – ఔపయోగిక సామర్థ్యాలు అభివృద్ధి చేయడం అనే పరిమిత లక్ష్యానికి అనగా సంఖ్యలు–సంబంధాలు, చతుర్విధ ప్రక్రియలకు ప్రాధాన్యత వుంటుంది. (కొలతలు, దశాంశభిన్నాలు, శాతాలు మొ॥). గణితపరంగా ఆలోచించడం, కారణాలు వెతకడం వంటివి పిల్లలలో పెంపొందించడం ఉన్నత దశా లక్ష్యంగా ఉంటుంది. పరికల్పనలు చేయడం, తార్కికంగా ఆలోచించి నిర్ణయానికి రావడం, అమూర్త భావాలు అర్థం చేసుకోవడం వంటి అంశాలకు ఈదశలో స్థానం ఉంటుంది. దీనిలో సమస్యా పరిష్కార సాధనా పద్ధతులు, సామర్థ్యాలు, అభిరుచులు ఇమిడి ఉంటాయి.

గణిత పాఠ్యప్రణాళిక ఆసక్తికరంగా గణితేతర అంశాలతో ముడిపడిందిగా ఉండాలి. పరిమిత లక్ష్యాలకన్నా ఉన్నత లక్ష్యసాధనలో ఆసక్తిని కల్గించేదిగా వుండాలి. అంకగణితం, బీజగణితం, జామెంట్రీలాంటి అంశాల్లో అనుసరించాల్సిన వివిధ పద్ధతుల్ని, పొందాల్సిన నైపుణ్యాలను ఇది గుర్తుంచుకోవాలి. ఈ విధానం హైస్కూలు స్థాయిలో సామాజిక, విజ్ఞాన శాస్త్ర రంగాలతో కూడా సంబంధాలు పెంపొందించేందుకు తోడ్పడాలి. గణిత పాఠ్య ప్రణాళికకు రెండు సంవిధానాలున్నాయి. ఒకటి - గణిత విద్య ప్రతి పిల్లవాడి మనస్సులో ఏమి పనిపెడుతోంది అని తెలిపితే, రెండవది విద్యల వనరులను ఎలా బలపరచాలో తెలుపుతుంది.

సెకండరీ స్థాయిలో గణితం ఒక నిర్బంధ పాఠ్యాంశం. ఇది విద్యార్థికి గుణాత్మకమైన గణిత విద్యను పొందే హక్కును కలిగిస్తుంది. ఇది 8 సం॥లు పాఠశాల కాలంలో ఏవిధమైన గణిత పరిజ్ఞానం అందించబడుతోంది. సార్వత్రిక విద్య నేపథ్యంలో అడగదగిన ప్రధానమైన ప్రశ్న. ఇది విద్యార్థి నైపుణ్యాన్ని పెంచిందా లేక కేవలం హయ్యర్ సెకండరీ విద్యకు సిద్ధం చేసిందా? అనేది ముఖ్యం. ప్రాథమిక స్థాయిలో నేర్పే అధిక శాతం గణితాంశాలు ఉపయుక్తమైనవే కావచ్చు. కానీ గణిత విద్యా ప్రణాళిక పిల్లల్లో సమస్యా పరిష్కార సామర్థ్యం పెంపొందించుకునేందుకు, విశ్లేషణాత్మక నైపుణ్యాల నిర్మాణం ద్వారా నిజజీవిత సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉపయోగపడాలి. పాఠశాల సమయాన్ని దీనికనుగుణంగా సద్వినియోగపరచేదిగా ఉండాలి. విద్యా ప్రణాళికలోగల అంశాలు విస్తృతమైన పునాదికలిగి అన్నిస్థాయిల అభ్యాసకుల అవసరాల్ని తీర్చేవిగా కూడా ఉండాలి.

> **పాఠశాల స్థాయి గణితంలో కొన్ని సమస్యలు**
>
> 1. చాలామంది పిల్లలు గణితం అంటే భయపడుతుంటారు. ప్రస్తుత విద్యా ప్రణాళిక ఇలా ఎందుకు జరుగుతోందో ప్రస్తావించదు. దానితోబాటు గణితంపట్ల ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి ప్రదర్శించే పిల్లల గురించి కూడా ప్రస్తావించదు.
> 2. ప్రాథమికస్థాయి నుండి మాధ్యమిక స్థాయికి, దీనినుండి ఉన్నత స్థాయికి విషయాంశాలను ముందుకు తీసుకొనిపోవడంలో విద్యాప్రణాళికలో తార్కికత లోపించింది.
> 3. అభ్యాసాలు, సమస్యలు, మూల్యాంకన పద్ధతులన్నీ యాంత్రికంగా ఉంటూ, పునరావృతం అవుతూ కేవలం లెక్కించడానికి ప్రాధాన్యతనిచ్చేవిగా ఉంటున్నాయి. విస్తృతంగా ఆలోచించడానికి ప్రణాళికలో ఎక్కడా అవకాశం లేదు.
> 4. ఉపాధ్యాయులలో విశ్వాసం లోపించడం, బోధనాంశాలపట్ల ముందుగా సంసిద్ధత లేకపోవడం వివిధ స్థాయిల్లోని పిల్లలకు ఆసరా ఇవ్వలేకపోవడం మన సమస్యల్లో కొన్ని.

### 3.2.1 పాఠశాల గణితంలో మన దృష్టి

✦ గణితం అంటే పిల్లలు భయపడకుండా ఉల్లాసంగా నేర్చుకోగలగాలి.

✦ పిల్లలు గణితం నేర్చుకోవడం అంటే సూత్రాలు, పద్ధతులు నేర్చుకోవడం గాదు. దాని ప్రాధాన్యతను నేర్చుకోవాలి.

✦ గణితాన్ని ఇతరులతో చర్చించేదిగా, పరస్పరం అందించుకునేదిగా, వ్యక్తీకరించేదిగా, కలసి పనిచేసేదిగా పిల్లలు చూడగలగాలి.

- సమస్యల (అర్థవంతమైన)ను పరిష్కరించడంతోపాటు సమస్యలు సంధించగలగాలి.
- సంబంధాలను గుర్తించడంలో, నిర్మాణాల్ని అర్థం చేసుకోవడంలో, కారణాలు వెతకడంలో, తప్పు ఒప్పులను గురించి తర్కించడంలో పిల్లలకు గణితం ఉపయోగపడాలి.
- అంకగణితం, బీజగణితం, రేఖాగణితం, త్రికోణమితి మొదలైన అంశాలన్నింటిలోగల ప్రాథమిక భావనలను, విద్యార్థులు అర్థం చేసుకోవాలి. ఈ ప్రాథమిక గణిత భావనలు, గుణవిశేషత, నిర్మిత క్రమానుగత, సాధారణీకరణత బోధనా విధానాలలో ప్రతిఫలించాలి.
- తరగతిలో ప్రతి విద్యార్థీ గణితం నేర్చుకొనగలిగేలా ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థితోనూ గడపగలగాలి.




పాఠశాలలో వివిధ స్థాయిలలో సమస్యా పరిష్కారం కోసం చాలారకాల వ్యూహాలను, ఎత్తుగడలను బోధిస్తారు. పరిమాణీకరించడం, పోల్చడం, విశ్లేషించడం ఊహించి సవరించడం వంటి రకరకాల అంశాలను వివిధ సందర్భాలలో వినియోగిస్తారు. వీటితోపాటు పిల్లలు విభిన్నమైన విధానాలు కూడా నేర్చుకుంటారు. సామగ్రి పేటికలను ఉపయోగించడంలో ఏ విధానం సరైనదో గుర్తిస్తారు. గణితాన్ని ఖచ్చితమైన శాస్త్రం అని నమ్మడంతోబాటు అన్వేషణా పద్ధతులను అనుసరించి పిల్లలే కొత్తవి తెలుసుకోవడానికి అవకాశం కల్పించాలి. పరిమాణాలను అంచనా వేయడం, పరిష్కారాలు ఊహించడం కూడా ప్రాధాన్యతగల నైపుణ్యాలే. ఉదాహరణకి ఒక రైతు తన పొలంలో పంట ఎంత దిగుబడి ఇస్తుందో దరిదాపుగా ఊహించే పద్ధతి ఎలా అనుసరిస్తాడు? పాఠశాల కూడా ఆవిధమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి.

దృశ్యీకరించడం, వర్ణించడం వంటి నైపుణ్యాల అభివృద్ధిలో గణితం సహాయపడుతుంది. పరిమాణాలు, ఆకారాలు తెలుసుకోవడానికి నమూనాలు ఉపయోగించడం ద్వారా గణితాంశాలు అర్థవంతం అవుతాయి. వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు ఉద్దేశాలకోసం ఉపయోగించే గణిత భావనలు బహుళ విధాలుగా ప్రతిబింబిస్తాయి. ఇవన్నీ గణిత శక్తిని తెలియజేసేవే. ఉదాహరణకు ఒక కార్యాన్ని బీజగణిత రూపంలోనూ, రేఖాగణిత రూపంలోనూ వ్యక్తీకరించవచ్చు. p/q అనే అంశం మొత్తంలో ఒక అంశాన్ని సూచిస్తుంది. దీనితోబాటు p/q అనే రెండు సంఖ్యల శేషాన్ని గూడా తెలియచేస్తుంది. అంటే గణిత భావన వేర్వేరు సందర్భాలలో వేర్వేరు విధాలుగా వ్యవస్థీకృతమవుతుందన్నమాట.

గణితానికి ఇతర పాఠ్యాంశాలకు మధ్య సంబంధం గుర్తించడం అవసరం. పిల్లలు గ్రాఫులు గీయడం నేర్చుకొంటున్నప్పుడు సైన్స్‌తో గల సంబంధాలను (భౌగోళిక శాస్త్రంతోసహా) గురించి ఆలోచించడాన్ని ప్రోత్సహించాలి. అలాంటపుడే పిల్లలు సైన్స్‌లో గణితాన్ని ఒక ప్రభావవంతమైన పరికరంగా గుర్తించగలుగుతారు.

గణితంలో క్రమబద్ధమైన తార్కికతకు అధిక ప్రాధాన్యత అవసరం లేదు. ఈ తార్కికత గణితంలోని సొగసును, రసానుభూతిని కూడా గుర్తించే అంశాలతో ముడిపడి ఉండాలి. నిరూపణల ప్రాధాన్యత అవసరమే. దీనితోబాటు ఊహాజనిత నిరూపణలకూ చోటు ఉండాలి. నిరూపణలద్వారానే పిల్లలు నిర్మాణాల గురించి నేర్చుకోగలుగుతారు. నిరూపణా విధానం సందేహించదగిన ప్రతికూలతలను కూడా ఒప్పించగలిగేదిగా ఉండాలి. పాఠశాల స్థాయిలో గణితం క్రమబద్ధమైన వాదనా రూపంలో నిరూపణల్ని ప్రోత్సహించేదిగా ఉండాలి. కాబట్టి మన లక్ష్యాలు, వాదనల్ని అభివృద్ధి పరిచేవిగా; వాటిని సక్రమంగా మూల్యాంకనం చేసేందుకు సరిపోయేవిగా, ఉజ్జాయింపుగా అన్వేషించడానికి వీలైనవిగా ఉండాలి.

> **సమస్యల కల్పన**
>
> - **235 + 367 = 602** అయితే **234 + 369** ఎంత? ఎలా నీకీ జవాబు వచ్చింది?
> - **5384**లో ఏదో ఒక దశాంశాన్ని మార్చండి. అప్పుడు దీని విలువ తగ్గిందా? పెరిగిందా? ఎంత తగ్గింది? లేదా ఎంత పెరిగింది?

గణిత వ్యక్తీకరణ స్పష్టత, సంక్షిప్తత, సందిగ్ధం లేని భాష, ఖచ్చితమైన సూత్రీకరణ వంటి లక్ష్యాలు కలిగి ఉండాలి. పడికట్టు పదజాలం గణితంలో వాడేప్పుడు దానికో ఉద్దేశం, స్పష్టత, శైలి ఉండాలి.

వివిధరకాలైన నైపుణ్యాలు, క్రమానుగతాలను గురించి చర్చించేటప్పుడు బహువిధమైన విధానాలు, పద్ధతులు పరిశీలించాల్సివుంటుంది. ఇవన్నీ క్రూరమైన ప్రస్తుత బోధనా విధానాలనుండి పాఠశాల గణితాన్ని విముక్తిజేయడంలో ప్రధానపాత్ర వహిస్తాయి.

### 3.2.2 పాఠ్యప్రణాళిక

పూర్వ ప్రాథమిక స్థాయిలో అభ్యసనం బోధనారూపంలో ఉండకూడదు. ఆడుతూపాడుతూ నేర్పించేదిగా ఉండాలి. సంఖ్యల్ని వరుసగా బట్టీపట్టడం కాకుండా అర్థం చేసుకుంటూ అవసరంగా నేర్చుకోగలగాలి. ఈ సందర్భంలో పదానికి, లెక్కకు; గణనకూ, పరిమాణానికి సంబంధాన్ని బిడ్డ గుర్తించగలగాలి. చిన్నచిన్న పోలికల్ని గుర్తించాలి. వర్గీకరణ చేయగలగాలి. ఆకారాలు, సౌష్టవాలు గుర్తించగలిగే నైపుణ్యం రావాలి. మన సాంప్రదాయక పద్ధతులలో బోధించకుండా పిల్లలు తమ స్వంత భాషలో ఆలోచనలను, అనుభూతులను వ్యక్తీకరించడానికి ప్రోత్సాహం ఇవ్వాలి. ఆ తరువాత స్థాయిల్లోనూ ఇది అవసరమే.

గణితాన్ని ఇతర అంశాలతో అన్వయం చేసకోవడం ప్రాథమిక స్థాయినుండే అభివృద్ధి చెందాలి. తద్వారా పిల్లల జ్ఞానాత్మక నైపుణ్యాలు, భావనలు పొందగలుగుతారు. గణితక్రీడలు, పజిల్స్, కథలు ఈవిధమైన అనుకూల అభిరుచులు పెంపొందించుకోవడానికి తోడ్పడుతాయి. గణితం అంటే కేవలం లెక్కింపు (అంకగణితం) మాత్రమే కాదన్న సంగతి గుర్తుంచుకోవాలి. సంఖ్యలు, సంఖ్యా ప్రక్రియలతోబాటు వివిధ ఆకారాలు, శ్రేణులు, కొలతలు, సమాచార నిర్వహణ తదితరాలన్నీ ఉండాలి. గణితంలో గణిత ప్రణాళికలు, అంశాలు తెలిసిన దానినుండి తెలియనివి

నేర్చుకొనే క్రమంలో వుండాలి. గనుక గణన నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ గుర్తించడానికి, వ్యక్తీకరించడానికి, క్రమానుగతాలు వివరించడానికీ కూడా ప్రాధాన్యత ఉండాలి. సమస్య పరిష్కారాన్ని ఊహించడం, అంచనా వేయడంలాంటి వాటితోపాటు తార్కికమైన భాషా నైపుణ్యాలుకూడా అభివృద్ధి చెందాలి.

మాధ్యమిక స్థాయి పిల్లలు తాము గతంలో నేర్చుకొన్న అనుభవాలను, అమూర్త గణిత భావనలలో వినియోగించడంద్వారా మొదటిసారిగా గణితానందాన్ని పొందుతారు. అనగా ప్రాధమికస్థాయిలో నేర్చుకొన్న నైపుణ్యాలను నూతన సన్నివేశాలలో తిరిగి సందర్శిస్తారు. దీనినే మనం సార్వత్రిక గణితాక్షరాస్యతా సాధనగా భావిస్తాం. బీజగణిత ప్రక్రియలు ఉపయోగించడం ద్వారా బీజగణిత సమస్యల సాధనకు, సాధారణీకరించడానికి పిల్లల్ని సిద్ధం చెయ్యగలం. ఇది పిల్లలు 'జీవన నైపుణ్యాలు' సాధించడానికి తోడ్పడుతుంది.

సెకండరీ స్థాయిలో గణితం ఒక ప్రత్యేక కోర్సుగా చదవడం ప్రారంభమవుతుంది. గణిత సంబంధిత లక్షణాలను పూర్తిగా అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఈ దశలో పిల్లలు నిర్వచించబడిన పదాలకు, భావనలను సంకేతం ద్వారా వ్యక్తపరచగలుగుతారు. నిరూపణలను సరైన పరిమాణాలలో వ్యక్తపరచగలుగుతారు. బీజగణితం, రేఖాగణిత ఆధారాలద్వారా నిరూపణలు చేయగలుగుతారు. సమస్యా పరిష్కార సన్నివేశాలలో వివిధరకాల భావనలను, నైపుణ్యాలను ఏకీకృతం చేయగలుగుతారు. గణితనమూనాలు, సమాచార విశ్లేషణలు ఊహలు మొత్తం గణిత పరిజ్ఞానాన్ని పెంచుతాయి. వైయక్తిక, జట్టు ఆవిష్కరణను ప్రోత్సహించడానికి కంప్యూటర్లు, నమూనాలు ఇతర పరికరాలు ఈ దశలో ఉపయోగించడం అవసరం.

హయ్యర్ సెకండరీ స్థాయిలో గణితానికి గల బహుళ ప్రయోజనాల్ని విద్యార్థి అవగతం చేసుకోవడం గణిత పాఠ్యప్రణాళికా లక్ష్యంగా ఉండాలి. ఈ ప్రయోజనాల్ని సాధించడానికి అవసరమైన ప్రాధమిక సాధనాల్ని అతడు గుర్తించాలి. విస్తృతావగాహన అవసరమా, లోతైన అవగాహన అవసరమా అనే ప్రశ్నకీదశలో సమాధానం లభించాలి. ఒక విభాగంగా గణితం శరవేగంగా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా గణిత శీర్షికల్ని ప్రవేశపెట్టాలి. శీర్షికలు సహజమైనవిగా ఉండి, గణిత అంతర్దృష్టిని కలిగించి, పిల్లలు గణిత అధ్యయనంలో ఇష్టంగా పాల్గొనగలిగేలా ఉండాలి.

### 3.2.3 కంప్యూటర్ సైన్స్ – గణితం

విస్తృతంగా పెరిగిపోతున్న కంప్యూటర్ టెక్నాలజీ ఫలాలు పొందడానికి చదువుకొన్న సమాజం అవసరం. విద్యావంతులైన ప్రజలైతే మరింత సమర్థవంతంగా ఈ సాంకేతిక ఫలితాలను అందుకోగలుగుతారు. కాబట్టి మన పాఠ్యప్రణాళికలోకూడా ఆయా రంగాలకు సంబంధించిన పరిజ్ఞానం అందించడం అవసరం. సమాచార సాంకేతిక పరిజ్ఞానం (IT) కంప్యూటర్ శాస్త్రాలు (CS) పాఠశాల విద్యాప్రణాళికలో తప్పనిసరి కావాలి.

చాలాదేశాలు తమ పాఠశాలల్లో సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని (లేక) కంప్యూటర్ విజ్ఞానాన్ని (CS) ప్రవేశపెట్టాయి. భారతీయ పాఠశాలలో కూడా వీటిని ప్రవేశపెట్టడం ఒక సవాలు వంటిది. పిల్లలకు కంప్యూటర్ విజ్ఞానం లేకపోవడం మొదటి సమస్య. ఇదిలేకుండా బోధన చేయాలనుకోవడం (కనీసం కంప్యూటర్ల వినియోగం) హాస్యాస్పదం. అందరు పిల్లలకి కంప్యూటర్ వనరుల్ని అందించడం, నెట్‌వర్కుతో అనుసంధానించడం అటు సాంకేతికంగానూ, ఇటు ఆర్థికంగానూ మనకు పెద్ద సవాలు. నిజంగా దీన్ని అమలు చేయాలనుకుంటే మన గ్రామీణ, పట్టణ పాఠశాలలకు అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, కనెక్టివ్ టెక్నాలజీలలో మన స్వంత ప్రత్యామ్నాయాలను మనం రూపొందించుకోవాలి.

కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలకు సంబంధించి సమగ్రమైన విద్యాప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. దీని నిర్మాణంలో విద్యావేత్తలు, పరిపాలకులు, సాధారణ ప్రజలు పాల్గొనాలి. తద్వారా భారతీయ పాఠశాలలకు అత్యవసరమైన మౌలిక అంశాలను గుర్తించడానికి వీలవుతుంది. సమస్యా పరిష్కారాలలో కంప్యూటర్ వినియోగం, సాధ్యాసాధ్యాలు, సామాజిక స్థితిగతులు కూడా ఆధునిక ప్రపంచ నేపథ్యంలో గుర్తించడానికి వీలు కలుగుతుంది.

## 3.3 ప్రకృతి శాస్త్రాలు

ప్రకృతిలోని వింతలు, విజ్ఞానాల గురించి అన్వేషించాలని, ఊహించాలని మానవమెదడు నిరంతరం ప్రతిస్పందిస్తూనే ఉంటుంది. భౌతిక, జీవసంబంధ పర్యావరణాన్ని జాగ్రత్తగా పరిశీలించడం; అర్థవంతమైన సంవిధానాలను, సంబంధాలను దర్శించడం; ప్రకృతిలో ప్రతిచర్య జరిపేందుకు నూతన పరికరాల్ని వెతుక్కోవడం, తద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకొనేందుకు కావల్సిన దృక్పథాన్ని రూపొందించుకోవడంతో ఆధునికసైన్సు ఉద్భవించింది.

సైన్సు ఎంతో గతిశీలమైంది. నూతన అనుభవాలనతో నానాటికీ విస్తరిస్తున్న జ్ఞానరంగమిది. జీవితంలోని అనేక సంక్లిష్టాంశాలలాగానే సైన్సు పద్ధతిని ఆచరించడం కష్టం. పరిశీలన, సామాన్యాంశాల క్రోడీకరణ, ఊహించడం, నాణ్యమైన, తార్కికమైన నమూనాల్ని రూపొందించడం, పరిశోధనలద్వారా, పరిశీలనద్వారా సిద్ధాంతాల్ని సరిచూచుకోవడం అవి సరైనవో కావో తేల్చుకోవడం చివరకు ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న సూత్రాల్ని ఆవిష్కరించడం ఇదంతా సైన్సు పద్ధతి. ఇదంతా ఇదే వరుసలో జరగాలనేమీలేదు. ఒకప్పుడొక సిద్దాంతం ఒక కొత్త ప్రయోగాన్ని ముందుకు తేవచ్చు. అలానే ఓ కొత్త ప్రయోగం ఒక కొత్త సిద్ధాంత నమూనాకు దారితీయవచ్చు. సైన్సులో ఊహలక్కూడా అవకాశముంది. కానీ అవి ప్రయోగాలద్వారా / పరిశీలనలద్వారా రుజువు కావల్సివుంటుంది. సైన్సు సిద్ధాంతాల్ని శాశ్వత సత్యాలుగా ఎవ్వరూ భావించరు. ఇప్పటికే ఎంతో దృఢంగా ఖరారైన సిద్ధాంతాలు, విశ్వజనీన సైన్సు సూత్రాలు కూడా తాత్కాలికమైనవే అని సైన్సు భావిస్తుంది. కొత్త పరిశీలన, విశ్లేషణ, ప్రయోగాలు జరిగితే వీటినికూడా సవరించాల్సి వస్తుందని నమ్ముతుంది.

నిజమైన శాస్త్ర విద్య అంటే పిల్లవాడికి తన జీవితం గురించి, శాస్త్రీయంగా నిజానిజాలు చెప్పడమే. ఇదీ సైన్స్ పాఠ్యప్రణాళికలో ప్రధానమైన అంశం – కొన్ని పరిశీలనలు.

1. పిల్లల వయసుకు తగిన విషయం, పద్ధతి, భాష, బోధనా అనుభవాలతో కూడిన జ్ఞానాన్ని కలిగించేలా పాఠ్యప్రణాళిక కరికులం ఉండాలి. అపుడే అది పిల్లలకు అందుబాటులోకి వస్తుంది.

2. సైన్సులో చెప్పే అంశాలు శాస్త్రీయమైనవిగా ఉండాలి. పిల్లల స్థాయికితగ్గట్టు చెప్పడంకోసం మనం విషయాల్ని సరళీకరించడంవల్ల అర్థరాహిత్యానికి, అశాస్త్రీయతకు దారితీయగూడదు.

3. పిల్లలోగల సహజమైన కుతూహలం, సృజనాత్మకతలను మెరుగుపరచేలా నేర్చుకొనే పద్ధతులు, విధానాలు ఉండాలి. ఇది పిల్లలకు నేర్చుకోవడం ఎలాగో నేర్చుకునేందుకు పురికొల్పుతుంది.

4. శాస్త్రం దాని చారిత్రక ప్రగతి, కాలానుగుణంగా సైన్స్‌లో వస్తున్న మార్పులు తెలుసుకునేందుకు సైన్సు చరిత్రకు తగిన ప్రాధాన్యత ఉండాలి. దీనివల్ల పిల్లవాడు సామాజిక నేపధ్యంలో శాస్త్రాన్ని అర్థం చేసుకోగలుగుతాడు. సామాజిక కారకాలు శాస్త్ర ప్రగతిమీద ఎలా ప్రభావాన్ని కలిగిస్తాయో తెలుసుకొనే వీలు కలుగుతుంది.

5. స్థానిక పరిసరాలనుండి ప్రపంచం వరకు అర్థం చేసుకోవడానికి విద్యా ప్రణాళికలో పరిసరాలకు తగిన ప్రాధాన్యత ఉండాలి. పని ప్రపంచంలో అడుగుపెట్టాలంటే తన పరిసరాలలోని శాస్త్ర, సాంకేతిక, సామాజిక అంశాలను గురించిన జ్ఞానం కలిగించేలా ప్రణాళిక రూపొందించాలి.

6. నీతి, నిజాయితి, సహకారం, బాధల నుండి, భయాలనుండి స్వేచ్ఛ ప్రసాదించే నైతిక అంశాలు కూడా ప్రణాళికలో భాగం కావాలి. తనచుట్టూ ఉన్న పరిసరాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మానవుడు దానిని సంరక్షించుకొనేందుకు శ్రద్ధ పెట్టేలా సైన్సు బోధనాంశాలుండాలి.

### 3.3.1 వివిధ స్థాయిలలో విద్యా ప్రణాళిక

సైన్సు విద్యా ప్రణాళికకు సంబంధించి లక్ష్యాలు, విషయం, బోధనా విధానాలు, మూల్యాంకన పద్ధతి ప్రాధాన్యతలు వివిధ స్థాయిలలో క్రిందివిధంగా ఉంటాయి.

✦ ప్రాథమిక స్థాయిలో విద్యార్థి తనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆహ్లాదకరంగా తెలుసుకుంటూ దానితో సాన్నిహిత్యాన్ని పెంచుకోవడం అవసరం. అందువల్ల పిలల్లో ప్రపంచం గురించి తెలుసుకోవాలనుకునే కుతూహలాన్ని మరింతగా పెంచి పోషించడం ఈ దశలో మన లక్ష్యంగా ఉండాలి. పిల్లలు వివిధ కృత్యాలు చేస్తూ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో పరిశీలించడం, వర్గీకరించడం, ఒక నిర్ణయానికి రావడం మొదలైనవి ఉంటాయి. వాటిద్వారా జ్ఞానాత్మక, మానసిక, చలనాత్మక నైపుణ్యాలు పెంపొందుతాయి. ఈ దశలోని నమూనాలు, నిర్మాణాలు, అంచనాలు, కొలతలు మొదలైనవాటికి మనమిచ్చే ప్రాధాన్యత తరువాత దశలో అభివృద్ధి చెందబోయే సాంకేతిక, పరిమాణాత్మక నైపుణ్యాలకు పునాదిగా ఉంటుంది. భాషా నైపుణ్యాలు సైన్స్‌ను అర్థం చేసుకొనడానికేగాదు, సైన్స్ భాషాభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సైన్సును, సామాజిక శాస్త్రాల్ని కలిపి పర్యావరణ విద్యగా మనం బోధిస్తున్నాం. ఆరోగ్యానికి ఇందులో చాలా ప్రాధాన్యతనిస్తున్నాం. శాస్త్ర, సామాజిక అంశాలు రెండూ కలిపి పరిసరాల విజ్ఞానాలుగా పరిగణిస్తున్నాం. ప్రాథమికస్థాయిలో ఎక్కడా పీరియాడికల్ పరీక్షలు, మార్కులు, గ్రేడులు నిర్ణయించడాలు, అదే తరగతిలోనే మళ్ళీ చదివించడాలు వుండకూడదు.

✦ మాధ్యమిక స్థాయిలో పిల్లలు శాస్త్రీయ సూత్రాలను పరిచితమైన ప్రయోగాల ద్వారా, సరళమైన సాంకేతిక డిజైనులు, నమూనాల నిర్మాణం ద్వారా నేర్చుకోవాలి. వివిధ కృత్యాలు, సర్వేలలో పాల్గొనడం ద్వారా పరిసరాలగురించి, ఆరోగ్యం గురించి మరింతగా తెలుసుకోవాలి. శాస్త్రీయ భావనలు ప్రధానంగా కృత్యాలు, ప్రయోగాల ద్వారానే రావాలి. ఈ స్థాయిలోని మనం చెప్పే సైన్సు మనం సెకండరీ స్థాయిలో చెప్పబోయే సైన్సుకు పలచబార్చినరూపంగా చూడనక్కరలేదు. గ్రూపు కృత్యాలు చేయడం, తోటివారితో, టీచర్లతో చర్చలలో పాల్గొనడం, సర్వేలు చేయడం రాబట్టిన విషయ సమాచారాన్ని ఎగ్జిబిషన్ల ద్వారా ప్రదర్శించడం మొదలైనవి విద్యా విధానంలో ప్రధానమైనవిగా ఉండాలి. ఈ స్థాయిలో నిరంతర, నియమిత కాలవ్యవధి

మూల్యాంకనాలు (యూనిట్ పరీక్షలు, టెర్మినల్ పరీక్షలు) ఉండాలి. ప్రత్యక్ష పద్ధతి ద్వారానే గ్రేడింగ్ ఇవ్వాలి. ఇది నిరంతరం కొనసాగాలి. 8 సం॥ల విద్య పూర్తిచేసుకున్న ప్రతి పిల్లవాడికి 9వ తరగతిలో చేరే అవకాశం ఉండాలి. పరీక్షల్లో తప్పిపోవడం ఉండరాదు.

✦ సెకండరీ స్థాయి విద్యా ప్రణాళికలో విద్యార్థి వివిధ అంశాలతోకూడిన శిక్షణ ద్వారా సైన్స్‌ను నేర్చుకోవాలి. మాధ్యమిక స్థాయికన్నా మరింత మెరుగైన సాంకేతిక అంశాలను, పరికరాలను ఉపయోగించి చేస్తూ నేర్చుకోవాలి. చుట్టూ ఉన్న పరిసరాలు, ఆరోగ్యం వంటి అంశాలు కూడా కృత్యాలు, విశ్లేషణల ద్వారా నేర్పబడాలి. సిద్ధాంతపరంగా ఉన్న సూత్రాలను క్రమబద్ధమైన ప్రయోగాలు చేయడంద్వారా అర్థం చేసుకోవాలి. స్థానిక ప్రాధాన్యత గల ప్రాజెక్టులమీద పనిచేయడాన్ని శాస్త్ర సాంకేతిక అక్షరాస్యత (STL) గా గుర్తిస్తారు. దీనికి సెకండరీ స్థాయి ప్రణాళికలో అత్యంత ప్రాధాన్యత ఉండాలి.

✦ హయ్యర్ సెకండరీ స్థాయిలో సైన్స్ ఒక ప్రత్యేకమైన అంశంగా నేర్పబడాలి. దీనిలో ప్రయోగాలకు, సాంకేతిక అంశాలకు, సమస్యా పరిష్కారాలకు ప్రాధాన్యత ఉండాలి. 1986 జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రస్తుతం సైన్స్ విద్యాపరమైన, వృత్తిపరమైన విభాగాలుగా పరిగణింపబడుతోంది. దీనిని పునః పరిశీలించవలసిన అవసరం ఉంది. విద్యార్థికి తన అభిరుచికి అనువైన అంశాన్ని ఎన్నుకొని చదువుకొనే స్వేచ్ఛ ఉండాలి. అయితే ప్రతి పాఠశాలలోనూ అన్ని సబ్జెక్కులు ప్రవేశపెట్టడం సాధ్యంకాకపోవచ్చు. సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిల మధ్య మరింత వ్యత్యాసం రాకుండా విద్యాప్రణాళికాభారాన్ని రేషనలైజ్ చేయాలి. కానీ, ఇది అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లు ఉండేటట్లు జాగ్రత్తపడాలి.

### 3.3.2 ఒక పరిశీలన

భారతీయ శాస్త్ర విద్య యొక్క సంక్షిప్త నేపథ్యాన్ని చూసినట్లయితే మూడు ప్రధాన అంశాలు కనబడతాయి. ఒకటి – రాజ్యాంగపరంగా పవిత్రమైన సమానత్వాన్ని శాస్త్ర విద్య ద్వారా సాధిచడంలో మనం లక్ష్యానికి ఆమడదూరంలో ఉన్నాం. రెండవది – ఇది కేవలం సామర్థ్యాలు పెంచేదిగా ఉందే తప్ప ఆవిష్కరణలకు, సృజనాత్మకతలకు దారి తీయడం లేదు. మూడవది – మనం అతిగా ప్రాధాన్యతనిస్తున్న పరీక్షా విధానాలు. మొత్తం సమస్యలకు ఇదే కారణమని చెప్పలేంకానీ చాలా సమస్యలకు మాత్రం ఈ పరీక్షా విధానమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ప్రాంతీయ, కుల, మత, వర్గ, లింగ, ధనిక, పేద వివక్షతలను, అసమానతలను తొలగించే సామాజిక మార్పుకు దారి తీసేందుకు శాస్త్ర విద్యను ఒక పనిముట్టుగా ఉపయోగించాలి. సమానత్వాన్ని సాధించే దిశలో ప్రాథమిక పరికరంగా పాఠ్యపుస్తకాన్ని మనం ఉపయోగించాలి. మన లక్షలాది పిల్లలకు, టీచర్లకు పాఠ్యపుస్తకం కంటే పెద్ద వనరు ప్రస్తుతం ఏదీలేదు. జాతీయ విద్యా ప్రణాళిక చట్రానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పాఠ్య గ్రంథాలు రాసేందుకు దేశవ్యాప్తంగా కృషిచేయాలి. రచయితల్ని దీనికి ప్రోత్సహించాలి. ఈ పాఠ్యగ్రంథాలు కృత్యాలు, పరిశీలనలు, ప్రయోగాలతో నిండి ఉండాలి. కేవలం విషయాన్ని నేర్పేవిగా కాకుండా పిల్లలు తమచుట్టూ ఉన్న ప్రపంచంతో సంబంధాలు ఏర్పరచుకొని ప్రవర్తించేలాంటి శాస్త్రీయ విధానాల్ని వీటిలో ప్రవేశపెట్టాలి. దీనితోబాటు వర్కుబుక్‌లు, అదనపు సమాచార పుస్తకాలు, పిల్లల విజ్ఞాన సర్వస్వాల వంటివి అందుబాటులోకి రావాలి. అపుడు విషయాంశాలన్నీ పుస్తకంలో చొరబడి పాఠ్యపుస్తకం బరువు పెరగకుండా చేసేందుకు వీలవుతుంది. ప్రాజెక్టు పనులు చేయించడం ద్వారా నేర్చుకోవడాన్ని మరింతగా మెరుగుపరచవచ్చు. ప్రాంతీయ భాషలో ఇలాంటి పుస్తకాలు అతి తక్కువ కాబట్టి ఆ దిశలో కూడా కృషిచేయాలి.

సైన్స్ కార్నర్‌ల ఏర్పాటు, సైన్స్ కిట్‌లు, లేబరేటరీల ఏర్పాటుద్వారా గ్రామీణ ప్రాంతాలలోకూడా సైన్స్ నేర్చుకోవడానికి సమాన అవకాశాలు కల్పించాలి. సామాజిక అంతరాల్ని తగ్గించేందుకు సమాచార, ప్రసార సాంకేతిక పరిజ్ఞానం (ICT) ఉపయోగించుకోవాలి. మారుమూల ప్రాంతాలకు సైతం ICT విస్తరించడం వలన వెనకబడిన వర్గాలకు కూడా ఈ వనరులు అందుబాటులోకి వస్తాయి. అంతేకాకుండా ప్రయోగశాలలో (యూనివర్శిటీలలో) కృషి చేసే శాస్త్రవేత్తలతో టీచర్లు, విద్యార్థులు సంబంధాలు పెంచుకొనే అవకాశం కూడా కలుగుతుంది. దీనివల్ల శాస్త్రవేత్తలూ వాళ్ళ కృషి లోకాతీతమనే భావన పోతుంది.

భారతీయ శాస్త్ర విద్యలో గుణాత్మకమైన పెద్ద మార్పులు జరగాలి. బట్టీపట్టడాన్ని నిషేధించాలి. భాషను బలపరచడం ద్వారా పరిశీలనాత్మక నైపుణ్యాలు పెంపొందించాలి. పరిశీలనా దృక్పథం కలిగించేలా, సృజనాత్మక శక్తిని పెంపొందించేలా, పరిశోధనాభిలాషను కలిగించేలా పాఠశాలలు కృషిచేయాలి. అందుకుగాను పాఠ్యేతర, సహపాఠ్య అంశాలకు విద్యలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇవన్నీ పరీక్షలలో భాగంగా ఉండాలి. చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో చెప్పినట్లు ఈ ఉద్యమం మెల్లగా ఇండియా అంతా పాకుతూ వెళ్ళి ఆసియా ఖండాన్ని చుట్టుముట్టాలి. పిల్లల్లో, వారి టీచర్లలో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మక ఆలోచనా ధోరణిని కలిగించాలి. పిల్లలతోపాటు టీచర్లకుకూడా ఈ ధోరణి అలవడాలి.

## ప్రశ్నలు అడగడం

"గాలి అంతటా ఆక్రమించి ఉంది". ఈ విషయాన్ని ప్రతి పాఠశాలలోనూ పిల్లలు నేర్చుకునే ఉంటారు. మన పిల్లలందరికీ భూవాతావరణంలో అనేక వాయువులు ఉన్నాయనీ, చంద్రుడి మీద గాలి లేదని కూడా తెలుసు. వీళ్ళందరికీ కొంత సైన్స్ తెలిసినందుకు సంతోషిద్దాం. అయితే ఒక నాలుగవ తరగతి గదిలో జరిగిన సంభాషణను పరిశీలించండి.

టీచరు : ఈ గ్లాసులో గాలి ఉందా?

పిల్లలు : ఉంది (ముక్త కంఠంతో)

టీచరు మాత్రం ఈ సాధారణ నియమంతో సంతృప్తి చెందినట్లు లేదు. అందుచేత ఆమె మరొక చిన్న సన్నివేశంలో గాలి గురించి ఆలోచించమని పిల్లల్ని అడిగింది. అనుకోకుండా కొన్ని ప్రత్యామ్నాయ భావనలు వచ్చేశాయి. ఎలాగంటే

టీచరు : నేను ఇప్పుడు గ్లాసు తలక్రిందులు చేస్తున్నాను. ఇందులో ఇపుడు కూడా గాలి ఉందా?

(కొందరు అవునని, కొందరు కాదని, కొందరు నిర్ణయించుకోలేకున్నామని అన్నారు).

1వ పిల్లాడు: గాలి గ్లాసులోనుండి బయటికి వచ్చేసింది

2వ పిల్లాడు: గ్లాసులో అసలు గాలి లేదు.

ఎప్పుడో రెండేళ్ళనాడు రెండవ తరగతిలో 'వెలుగుతున్న కొవ్వొత్తి మీద గ్లాసు బోర్లించారు. అది ఆరిపోయింది'. గ్లాసులో గాలి ఉందో, లేదో తెలియని నిర్ధారణకు అప్పుడు పిల్లలు వచ్చారు. రెండేళ్ళ తర్వాతకూడా ఇది పిల్లల మనస్సులో స్పష్టంగానే ఉంది. అయినా కొందరు తప్పు సమాధానమే ఇప్పటికే చెప్పారు. టీచరు కొంత వివరించిన తర్వాత మళ్ళీ ఇలా అడిగారు. మూసి ఉన్న బీరువాలో గాలి ఉందా? నేలలో గాలి ఉందా? నీళ్ళలో ఉందా? నీ శరీరంలో ఉందా? నీ ఎముకల్లో ఉందా? ప్రతి ప్రశ్న కొత్త ఆలోచన రేకెత్తించింది.తమ అభిప్రాయాలు సరిచేసుకోవడానికి అవకాశం మొదలైంది. దీనిని బట్టి ఏమి తెలుస్తోంది – ప్రశ్నించండి, అన్నింటికి జవాబులు తెలుసుకోవచ్చు. మరింత నేర్చుకోవడానికి అవకాశం కలుగుతుంది.

## పిల్లలకు జీవశాస్త్రం ఎంత తెలుసు

"ఈ పిల్లలు సైన్స్ అర్థం చేసుకోలేరు వాళ్ళు కింది వర్గాల నుండి వచ్చే వాళ్ళు కదా వాళ్ళకేమి అర్థమవుతుంది". గ్రామీణ, వెనుకబడిన తరగతుల (యస్.టి.) పిల్లలపట్ల చాలామంది వ్యక్తపరిచే అభిప్రాయం ఇది. అయినప్పటికీ నిజజీవిత అనుభవాల నుంచి వాళ్ళూ చాలా నేర్చుకొనేవుంటారు.

జానీబాయి - సహ్యాద్రి కొండల్లో ఓ మారుమూల తాండాకు చెందిన బాలిక. వ్యవసాయం రోజుల్లో తల్లిదండ్రులకు పనుల్లో సాయపడుతుంటుంది. కొన్నిసార్లు తమ్ముడితోకలిసి మేకలు మేపడానికీ పోతుంటుంది. దానితోపాటు చిట్టిచెల్లి సంరక్షణ కూడా ఆమెదే. అయినప్పటికీ రోజూ 8 కిలోమీటర్లు నడిచి వెళ్ళి సెకండరీ స్కూల్లో చదువుతోంది. ఆమెకి తన పరిసరాలతో ఆత్మీయ సంబంధాలున్నాయి. ఆమె ఆహారం కోసం, మందులకోసం, వంట చెఱుకు కోసం, రంగుల కోసం, ఇళ్ళు కట్టడం కోసం రకరకాల చెట్లు సేకరిస్తుంటుంది. వివిధ మొక్కల భాగాలను తన ఇంటి అవసరాలకోసం పరిశీలిస్తూ ఉంటుంది. అది మతాచారాలకోసం కావచ్చు, పండగ సంబరాలకోసం కావచ్చు. ఆమె చెట్లల్లోని చిన్నచిన్న తేడాలు కూడా ఇట్టే గుర్తుపట్టేయగలదు. ఆకులు, ఆకారాలు, పూలు, వాసనలు, పరిమాణం, ఆకారం ఒకటేమిటి ఋతువునుబట్టి వాటిలో వచ్చే మార్పులు గుర్తుపట్టగలదు. తనచుట్టూ ఉన్న ప్రదేశంలో వందకుపైగా జాతుల చెట్లను గుర్తించగలదు. ఈ విషయంలో తన బయాలజీ టీచరుకన్నా జానీబాయికే ఎక్కువ తెలుసు. అయినా టీచరుమాత్రం జానీబాయిని వెనకబడిన విద్యార్థినిగానే గుర్తిస్తుంది.

జానీబాయికి తెలిసిన ఇంత పరిజ్ఞానాన్ని సాధారణ జీవశాస్త్ర భాషలోకి మార్చడానికి సహాయపడలేమా? జీవశాస్త్రమంటే అమూర్త ప్రపంచం గురించి అర్థంకాని భాషలో రాసివుంటుందని నమ్మించడమా? తాను పనిచేసేచోట జంతువుల సంరక్షణ గురించి, తాను నడిచే దారిలో మొక్కల్ని గురించి ఇలా రోజూ ఆమె ఎంతో నేర్చుకొంటోంది. ఇదే కదా నిజంగా శాస్త్రం నేర్చుకోవడం అంటే.

మంచి మానవ వనరుల్ని చక్కగా వాడుకొని, కావల్సినన్ని నిధులు సమకూర్చుకొని; ఉపాధ్యాయుల్ని, విద్యావేత్తల్ని, శాస్త్రవేత్తలను ఒకచోట చేర్చి పరీక్షా విధానంలో మనం తీవ్రమైన మార్పులు తేవాలి. దీనివల్ల పరీక్షలనగానే పిల్లలకై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. అవసరమైన అసంఖ్యాక ప్రవేశ పరీక్షల బెడద తప్పుతుంది. పాఠశాలలో నేర్చుకొన్నదే గాదు బయట పలువిధాల సంపాదించుకొన్న జ్ఞానాన్ని కూడా పరీక్షించే వీలు కలుగుతుంది.

ఇలాంటి పరీక్షా సంస్కరణలు తేవాలంటే టీచర్లలో కూడా మార్పు తేవాలి. వారి సామర్థ్యం పెరగాలి. మెజారిటీ టీచర్లలో ఈ మార్పు రాకుండా పరీక్షావిధానంలో మనం పెద్ద మార్పు తీసుకురాలేము. ఉపాధ్యాయులు క్రియాశీల భాగస్వాములై పరీక్షా విధానంలో మార్పులు తీసుకునిరాగల్గితే మన పాఠశాలల్లో సైన్స్ బోధనా స్వరూపమే మారిపోతుంది.

## 3.4 సామాజిక శాస్త్రాలు

సామాజిక శాస్త్రం సమాజంలోని భిన్న కోణాలను ఆవిష్కరించే చరిత్ర, భూగోళం, అర్థ, రాజనీతి, సామాజిక శాస్త్రాల అంశాలతో నిండివుంటుంది. అందువల్ల పిల్లలు సమాజాన్ని అర్థం చేసుకొనేటట్లు పాఠ్యాంశాల్ని ఎన్నుకోవడం, వాటిని ఒక క్రమపద్ధతిలో అందించడం, అంత సులభమైన పనేమీకాదు. ఇదొక సవాలు. అయితే పిల్లల వైవిధ్యభరితమైన జీవితానుభవాలనుంచి మనం నూతన సామాజిక కోణాలని తెలుసుకోగలం.

సామాజిక శాస్త్రాల ప్రయోజనం సర్వీసు సెక్టారులో లభిస్తున్న విద్యావకాశాల్ని ఉపయోగించుకోవడానికే పరిమితం కాదు.

విశ్లేషణాత్మక, సృజనాత్మక ఆలోచనా దృక్పధాన్ని ఏర్పరచుకొనేందుకొక పునాదిగా కూడా ఈ శాస్త్రాల్ని చూడాలి. అలాగే సైన్సు, గణితంలాగా ఇదేమీ అంతప్రధానమైన సబ్జెకు కాదనే ధోరణికూడా ఏమాత్రం సరైంది కాదు.

స్వేచ్ఛ, న్యాయం, వైవిధ్యాలపట్ల గౌరవం లాంటి మానవ విలువల్ని పెంపొందించి సుస్థిరం చేసే బాధ్యత సామాజిక శాస్త్రాలపై ఉంది. పిల్లలు స్వతంత్రంగా ఆలోచించేందుకు, వివేచించుకొనేందుకు అవసరమైన మానసిక సామర్థ్యాలకోసం సామాజిక శాస్త్రాలు తగిన పునాదిని వెయ్యాలి. ఉన్నత విలువల్ని ధ్వంసంచేసే శక్తుల్ని ఎదుర్కొనే పౌరులుగా, వ్యక్తిత్వాన్ని కోల్పోని యువకులుగా పిల్లల్ని తీర్చిదిద్దాల్సింది సామాజిక శాస్త్రాలే. వ్యక్తి ప్రయోజనాలకు, సమిష్టి ప్రయోజనాలకు మధ్య అగాధం ఏర్పడకూడదు. అవి రెండూ కలిసే ఉండాలి. అలాగాక, ఈ సంబంధాలకు విఘాతం కల్గించే సామాజికాంశాలని సామాజిక శాస్త్ర విద్యార్థి విమర్శనాత్మకంగా అర్థం చేసుకోగల్గాలి, తగినట్టు ప్రతిస్పందించాలి.

ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇద్దరూ భాగస్వాములై రూపొందించిన సమగ్ర పాఠ్యప్రణాళిక

సామాజిక శాస్త్రాల్లో చరిత్ర, భూగోళం, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం మొదలైనవాటికి దేనికిదాని ఆదని స్వంత పరిధి ఉంటుంది. నిజమే! కానీ వీలున్నంతవరకు ఈ పరిధుల్ని చెరిపెయ్యాలి. ఒక అంశాన్ని చెప్పడానికి బహుళ పద్ధతుల్ని పాటించాలి. పలు అంశాలమధ్య ఇలాంటి అనుబంధం ఉండేలా చూడ్డం మంచి పాఠ్యప్రణాళిక లక్ష్యం.

### 3.4.1 కొన్ని తాత్వికాంశాలు

కొన్ని ప్రధానమైన జ్ఞానాంశాలు, తార్కికాంశాలు ఆధారంగా నూతన సిలబస్ రూపొందించాలి. అవి.

1. విద్యా ప్రణాళిక స్థానిక ప్రజలలో జాతీయత, జాతిసమైక్యత వంటి అంశాలను పెంపొందించేలా ఆయా అంశాలలో జ్ఞానాన్ని కలిగించేలా ఉండాలి. ప్రణాళికా రూపకల్పనలో స్థానికాంశాలే ప్రతిబింబించాలి.
2. పాఠ్యగ్రంథం కేవలం విషయజ్ఞానం కలిగించేదిగా కాకుండా సహాయకారిగా కూడా ఉండాలి. అంటే పాఠ్యగ్రంథం నుండి బయటికెళ్ళి కూడా నేర్చుకొనే వీలుండాలి. ఇతరత్రా అంశాలు చదవడం ద్వారా గ్రంథంలో ఇవ్వబడిన సామాజిక దృగ్విషయాలను అర్థంచేసుకొనే విధానం ఉండాలి.
3. మన సామాజిక శాస్త్రాల్లో ఔపయోగిక ప్రయోజనాలెక్కువ. అభివృద్ధిపై కేంద్రీకరణ ఎక్కువ. సమానత్వం, న్యాయం, సామాజిక గౌరవంలాంటి వాటికి అవకాశం తక్కువ. వ్యక్తి 'అభివృద్ధి' కోసం నిర్వహించగల పాత్రను నిర్దేశించడంతో సామాజిక శాస్త్రాలు సరిపెట్టుకోకూడదు. ఈ వ్యత్యాసాన్ని భర్తీచేయడానికి ఔపయోగికతనుంచి సమానత్వంవైపు ఈ శాస్త్రాలు మొగ్గాలి.
4. పౌరశాస్త్రం పేరును రాజనీతి శాస్త్రంగా మార్చాలి. 'రాజ్యం' పట్ల నానాటికీ 'అవిధేయత' పెరుగుతున్న వలసవాద యుగంలో మనదేశంలోని పాఠ్యప్రణాళికలోకి పౌరశాస్త్రం వచ్చి చేరింది. వినయం, విధేయత గల్గిన ప్రజల్ని, అప్పటికి నిర్దేశించుకొన్న విశ్వజనీన అభివృద్ధి సూత్రాలకనుగుణమైన సమాజాన్ని నిర్మించడం ఆ కాలపు పౌరశాస్త్ర లక్ష్యం. దీనికనుగుణంగానే ఇందులోని అంశాలుండేది. ఇప్పుడు మన సమాజం ప్రజాస్వామిక సమాజంగా పరిణితి చెందింది. మన రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్య ప్రజాస్వామ్యానికవసరమైన విలువను అధ్యయనం చేసేందుకు మనకిప్పుడు అవకాశం, అధికారం రెండూ

ఉన్నాయి. ప్రత్యేకించి సమానత్వం, న్యాయంలాంటి విలువల్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు పీడితుల, అట్టడుగు వర్గాలకు సంబంధించిన సమస్యలను చర్చించుకొనేలా పిల్లల్ని, ఉపాధ్యాయుల్ని మనం ప్రోత్సహించాలి. దీనికనుగుణంగా రాజనీతిశాస్త్రం ఉండాలి. రాజనీతిశాస్త్రం సమకాలీన సామాజికాంశాన్ని అధ్యయనం చేసే వీలుకల్పిస్తుంది. ఫలితంగా మరింత బాధ్యతాయుతమైన పౌరుల్ని రూపొందించుకోవచ్చు.

5. అది గతానికి సంబంధించిందిగావచ్చు, ప్రస్తుతానికి సంబంధించింది గావచ్చు, చారిత్రక ఘటనను చర్చించేటపుడైనా స్త్రీల విషయం మర్చిపోగూడదు. స్త్రీలు చరిత్రలో చేసిన, చేస్తున్న మహత్తర పోరాటాల్ని మనం ముందుకు తీసుకువచ్చి చర్చించాలి. పితృస్వామిక వ్యవస్థాచట్రాన్ని ఛేదించి వైపుకు మన పాఠ్యప్రణాళిక మొగ్గాలి.

మానవ హక్కుల భావన ఒక విశ్వవ్యాప్త భావన. పిల్లలు చిన్నవారుగా ఉన్నపుడే మానవ హక్కుల గురించిన విషయాలు వారికి తెలపాలి. పెరిగే వయసుతోపాటు వారు తమ హక్కుల గురించి కూడా అధ్యయనం చేసే అవకాశం ఉండాలి. మానవ హక్కుల గురించిన జ్ఞానం అటు సాంఘిక శాస్త్రాలు, ఇటు జీవశాస్త్రాలు రెండింటిద్వారా అందించాలి. తమకోసం వివిధ వనరులను సృష్టించేవారిపట్ల వారి పనులపట్ల పిల్లలకు గౌరవం కలిగించాలి. జాతీయ విద్యా ప్రణాళికా చట్రం మానవ హక్కుల భావనను వేరువేరు సబ్జెక్టులతో అనుసంధానం చేసింది. జాతీయ ప్రణాళికా చట్రం 1975, 1988 రెండూకూడా పాఠశాల విద్యాప్రణాళికలో మానవ హక్కులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి. 1986 జాతీయ విద్యావిధానంలో అన్నిస్థాయిల విద్యలోనూ మానవ హక్కులకు స్థానం కల్పించాలని నిర్ణయించారు. భారత రాజ్యాంగ ప్రవేశిక కూడా మానవ హక్కులను వక్కాణించింది. సామాజిక సమానత్వం, లౌకికవాదం, జాతీయసమైక్యత, సోషలిజం, ప్రాథమిక హక్కులు, విధులు, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన ఆదేశ సూత్రాలు, పరిసరాలు పాఠశాల సబ్జెక్టులలో స్థానం పొందాలి. ముఖ్యంగా సాంఘిక శాస్త్రాలు ఈ బాధ్యత తీసుకోవాలి. ఐక్యరాజ్యసమితి చార్టర్, మానవ హక్కుల డిక్లరేషన్ కూడా విద్యలో ఈ అంశాల్ని అమలుపరచాలని ప్రతిపాదించాయి.

### 3.4.2 విద్యా ప్రణాళిక – అమలు

ప్రాథమిక స్థాయిలో జీవ, సామాజిక పరిసరాలను భాష, గణితాలతో మిళితం చేసి బోధించడం జరుగుతుంది (స్త్రీ, పురుష స్పృహతో) జీవ, సాంఘిక పరిసరాలను అర్థం చేసుకోవడానికి పిల్లలకు అనేక కృత్యాల్ని యిందుకోసం కల్పించాలి. ఈ దశలో పరిశీలనద్వారా, దృశ్యీకరణ ద్వారా పిల్లలు విషయావగాహన చేసుకుంటారు. అమూర్తాంశాలకు ఇక్కడ తావులేదు. ఇవి జీవితపు భౌతిక, జీవ, సాంఘిక, సాంస్కృతిక అంశాలనుండి తీసుకొన్నవై ఉండాలి. పిల్లలో పరిశీలన, గుర్తింపు, వర్గీకరణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అవసరం.

3 నుంచి 5వ తరగతి వరకు జీవ, సాంఘిక పరిసరాల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి గుర్తించడానికి పరిసరాల విజ్ఞానంలో పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. వారు జీవ వైవిధ్యానికి; సాంఘిక, సాంస్కృతిక వైవిధ్యానికి గల ప్రాధాన్యతలను, సంబంధాలను గుర్తించగలగాలి. అనగా సాంఘిక శాస్త్రాల బోధన కూడా పరిశీలనలు, ప్రయోగాలమీద ఆధారపడి జ్ఞానాత్మక సామర్థ్యాలను పిల్లలలో పెంపొందించడానికి ఉపయోగపడాలి. పిల్లలు తమ కుటుంబం నుండి ప్రారంభించి సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఆసిక్తిని ప్రదర్శించేవిధంగా ఈస్థాయి ప్రణాళిక ఉండాలి.

మాధ్యమిక స్థాయిలో సాంఘిక శాస్త్రంలో చరిత్ర, భూగోళం, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం అంశాలను ప్రవేశపెట్టాలి. వాటితోపాటు సమాజంలోని సాంఘిక, ఆర్థిక సమస్యలను; అందుకు కారణాలను వివిధ కోణాల నుంచి గమనించడానికి అవకాశం ఉండాలి. పేదరికం, నిరక్షరాస్యత, బాలకార్మిక వ్యవస్థ, కుల-వర్ణ, వివక్ష, మానవహక్కులు మొదలైన అంశాలకు ప్రాధాన్యత ఉండాలి. పరిసరాల గురించి, వనరుల గురించి వివిధ స్థాయిలలో అర్థం చేసుకోవడానికి భూగోళం, అర్థశాస్త్రం అంశాలు కలిసి తోడ్పడాలి. స్థానిక, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో, ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటును గురించి, పనితీరుల్ని గురించి కూడా తెలియజేయాలి. ఒక పౌరుడుగా రూపొందడానికి అవసరమైన చారిత్రక నేపథ్యాలను చరిత్ర ద్వారా విద్యార్థులకు తెలియచేయాలి. మాధ్యమిక స్థాయిలోనే విద్యార్థి గడచిన చరిత్రలను, అందులోని ఆసక్తిదాయకమైన విశేషాలను తెలుసుకోగలగాలి. అందుకుగాను విద్యా ప్రణాళిక పాత పద్ధతులను విడనాడాలి. ఈ పద్ధతులు పిల్లల జ్ఞానాభివృద్ధిని, సామర్థ్యాన్ని ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా ఆ ప్రాంతాల రాజకీయ సరిహద్దుల్ని, చారిత్రక యుగాల్ని చరిత్రపేరుతో చెబుతుంటాయి. స్థానికంగా ఉండే చారిత్రక స్థలాలను, మ్యూజియంలను సందర్శించడంద్వారా మనం పిల్లలకు చారిత్రక సాక్ష్యాలను దృశ్యాత్మకంగా చూపొచ్చు. దీనివల్ల చరిత్ర బోధనలో తీవ్రమైన మార్పు వస్తుంది.

సెకండరీ స్థాయిలోకూడా చరిత్ర, భూగోళశాస్త్రం, రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రాలకు సంబంధించిన కీలకాంశాలకు ప్రాధాన్యతనివ్వాలి. వాటిమధ్య ఒక అంతస్సూత్రం ఉండాలి.విద్యా ప్రణాళికలో భారతదేశీయ అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. సామాజిక, ఆర్థిక రంగాలలో ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళను అర్థం చేసుకొనేందుకు విద్యార్థికి శిక్షణనివ్వాలి. దళితులు, ఆదివాసీలు మొదలగు ఇతర ప్రత్యేక తరగతుల జనాభా గురించిన విశేషాలను చర్చించాలి. పిల్లల దైనందిన జీవితాలకు సంబంధించిన అంశాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి.

భారతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని అందులో వివిధ ప్రాంతాల, తరగతుల ప్రజల భాగస్వామ్యాన్ని చెప్పాలి. మారుతున్న ఆధునిక ప్రపంచ నేపథ్యంలో భారత జాతీయోద్యమాన్ని గురించి, తరువాత భారతదేశంగా మనదేశం అవతరించడాన్ని గురించి తెలియజెప్పాలి.

పరిసరాల వినియోగాన్ని, పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని విద్యార్థికి భౌగోళికశాస్త్ర అంశాలను బోధించాలి. భారత రాజ్యాంగాల విలువ, తాత్విక పునాదుల ఆధారంగా రాజనీతి శాస్త్ర అంశాలను చర్చించాలి. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం, గౌరవం, శ్రమదోపిడి నుండి స్వేచ్ఛలాంటి అంశాలపై లోతుగా చర్చ జరగాలి. చర్చనీయాంశాల్ని సగటు ప్రజల మనోగతాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి. ఉదాహరణకు పేదరికం, నిరుద్యోగంలాంటి అంశాల్ని ఆర్థిక సంస్థల పనితీరు ఆధారంగా, అసమానతల్ని ఆర్థిక సంబంధాల ఆధారంగా పిల్లలు చర్చించవచ్చు.

హయ్యర్ సెకండరీ స్థాయిలోని అంశాలు విద్యార్థుల అవసరాలు, అభిరుచులు, అభిప్రాయాలకు అనుకూలంగా ఉండాలి. కొంతమంది పిల్లలు ఈ దశ విద్య తరువాత చదువు ముగించి పనులలో చేరిపోతారు. మిగిలినవారికి ఉన్నత విద్యకు ఇది పునాదిగా ఉంటుంది. ఇలాంటివారు ప్రత్యేకమైన అకడమిక్ కోర్సులను లేదా వృత్తిపరమైన కోర్సులను ఎన్నుకుంటారు. కాబట్టి వీరికి మనం కల్పించే ప్రాథమిక జ్ఞానం భవిష్యత్తు కోసం తాను ఎన్నుకున్న రంగంలో నైపుణ్యాన్ని, అభిరుచిని పెంచుకొనేందుకకు ఉపయోగపడాలి. సామాజిక శాస్త్రాల్లో, వాణిజ్య శాస్త్రాల్లో వీలునన్ని ఎక్కువ కోర్సులుండాలి. విద్యార్థులు వారికి నచ్చిన కోర్సులపట్ల ఆకర్షితులౌతారు. అలాంటివాటికి ప్రాధాన్యతనివ్వాలి. సబ్జెక్టులను, కోర్సులను వేరువేరుగా వర్గీకరించనవసరంలేదు. పిల్లలకు వారి అవసరాలకు,

అభిరుచులకు అనుగుణంగా ఏది కావలిస్తే ఆ గ్రూపును ఎన్నుకొనే అవకాశం ఇవ్వాలి. ఈ స్థాయిలో సాంఘిక శాస్త్రాల్లో రాజనీతిశాస్త్రం, భూగోళం, చరిత్ర, నిర్మాణశాస్త్రం, అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రంలాంటివి ప్రవేశపెట్టాలి. హైయ్యర్ సెకండరీ స్థాయిలో వీటిని చదవడంద్వారా న్యాయాన్యాయాలపై తీర్పునివ్వగల సామర్థ్యం, భిన్న వాదనల్ని విశ్లేషించగల సామర్థ్యం లభిస్తాయి. చర్చలలో పాల్గొనడం, వివిధ వనరులను ఉపయోగించుకొని వ్యక్తిగతంగా ప్రాజెక్టులు నిర్వహించడం వంటివికూడా పిల్లలు చేయగల్గుతారు.

### 3.4.3 విద్యాబోధనా పద్ధతులు, వనరులు

సాంఘిక శాస్త్రాల బోధన అభ్యాసకుడు ప్రతిచర్య జరుపుతూ జ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందడానికి సహాయపడేదిగా ఉండాలి. సాంఘిక శాస్త్రాల బోధన సృజనాత్మకతను పెంపొందించి, ప్రకృతిపట్ల ప్రేమను కల్గించి సంక్లిష్టాంశాల్ని విశ్లేషించుకొనడానికి ఉపయోగపడేలా కూడా ఉండాలి.

| నీరు, పరిసరాలు | సహజ వనరులు |
|---|---|
| 1. మనకు నీరు ఎక్కడ నుంచి లభిస్తుంది.<br>2. నదులు, సముద్రాలు, మహాసముద్రాలు ఎలా ఏర్పడుతాయి<br>3. మన స్థానిక జల వనరులు ఏవి?<br>4. బావులు ఎందుకు ఎండిపోతాయి? చేతి పంపులు ఎలా పనిచేస్తాయి?<br>5. చిన్న ఆనకట్టలకన్నా పెద్ద ఆనకట్టలు ఎక్కువ ఉపయోగపడతాయా?<br>6. ఎడారులలో ప్రజలు నీటిని ఎలా పొందుతారు?<br>7. కరువుకు కారణాలు ఏమిటి? | నదులు, సరస్సులు, సముద్రాలు భూగర్భజలాలు<br>నీటివనరుల మ్యాపింగు<br>స్థానిక / ప్రాంతీయ / జాతీయ వనరులు<br>మానవ నిర్మిత జలవనరులకు సహజ వనరులకు సంబంధం<br>నీటి మట్టాన్ని చేతిపంపుల్ని గురించిన జ్ఞానం, నీటిపారుదల వ్యవస్థలు, పెద్ద ప్రాజెక్టులు పర్యావరణంపై కల్గించే ప్రభావం గురించి అవగాహన.<br>వివిధ పర్యావరణ వ్యవస్థల్లో నీరు<br>ఎడారుల్లోని నీటివనరులు, కొండప్రాంతాల నీటివరదలు, కరువులు, వరదలు |
| నీరు – సామాజిక అంశాలు | |
| 1. గ్రామీణ స్థాయిలో ఎవరు నియంత్రిస్తారు?<br>2. నీటిని ఎవరు పొందుతున్నారు?<br>3. మనకు తగినంత నీరు ఉందా?<br>4. పరిశుభ్రమైన నీరు ఎందుకు అవసరం? | కులం, వర్గం<br>జలవనరుల స్వచ్ఛత, కాలుష్య నియంత్రణ<br>స్త్రీ, పురుషుల మధ్య శ్రమవిభజన – జల సంపద అందుబాటు<br>త్రాగునీటికోసం, సాగునీటికోసం స్థానిక, ప్రాంతీయ ఘర్షణలు, వ్యాపార వస్తువుగా నీరు.<br>ఆరోగ్యం<br>శరీరానికి నీటి అవసరం. త్రాగునీటి హక్కు, నీటిసంబంధ వ్యాధులు. |

పిల్లలు గతానికీ, వర్తమానానికీ మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడాలి. సమాజంలో కలిగే మార్పుల్ని అర్థం చేసుకొనేందుకు ఇందులో అవకాశం ఉండాలి. ఇందుకోసం సమస్యా పరిష్కారం, నాటకీకరణ, రోల్‌ప్లే వంటి బోధనా ప్రక్రియల్ని చేపట్టవచ్చు. దృశ్యశ్రవణ సామగ్రి, ఫోటోగ్రాఫ్‌లు, చార్టులు, మ్యాప్‌లు, పురాతత్వ సమాచారం, ఇతర సేకరణలు వంటి వనరుల్ని సామాజికశాస్త్రాల బోధనలో విరివిగా ఉపయోగించుకోవాలి. అభ్యసనంలో భాగస్వామ్యాన్ని కలిగించాలంటే కేవలం సమాచారాన్ని వినిపిస్తే సరిపోదు. పిల్లలు చర్చలో, వాదనలో పాల్గొనేలా చెయ్యాలి. ఈ పద్ధతి సామాజిక శాస్త్రాలకు అభ్యాసకుడ్ని, ఉపాధ్యాయుడ్ని సన్నిహితుడ్ని చేస్తుంది. వ్యక్తిగత, సామూహిక అనుభవాలు కల్పించడం కూడా బోధనలో మరో మంచి పద్ధతి. దీనివల్ల సాంఘిక, సాంస్కృతిక అంతరాల్ని, విభేదాల్ని విద్యార్థుల తరగతి గదిలో అధ్యయనం చేయడానికి వీలవుతుంది. ఉపాధ్యాయులు సమాజంలోని వాస్తవికతల కోణాలన్నిటిని తరగతిగదిలో పిల్లల ముందుంచాలి. అప్పుడే పిల్లలకూ, తమకూ కూడా స్వీయ చైతన్యం అభివృద్ధి చెందుతుంది.

## 3.5 కళావిద్య

ఎన్నో దశాబ్దాలుగా విద్యారంగంలో కళావిద్య ప్రాముఖ్యత గురించి ఎన్నెన్నో చర్చలు, వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఎన్నో సిఫార్సుల్ని ఎన్నో కమిటీలు చేశాయి. అయినా ఇందులో చెప్పుకోదగ్గ ప్రగతి లేదు. నియత పాఠశాల విద్యలో కళావిద్యను అంతర్భాగం చేయవలసిన అవసరం ఈరోజు ఎంతైనా ఉంది. మన సాంస్కృతిక సంపద, దానిలోని భిన్నత్వం, ఉన్నతత్వం విద్యార్థులకు తెలియజేయాల్సిన తరుణమిది. సృజనాత్మకతగల పిల్లలు ఎవరైనా కళా విద్యను నేర్చుకోవడానికి ఇష్టపడితే దాన్ని మనం నిరుత్సాహపరుస్తున్నాం. దీన్ని ఒక ఉపయోగపడని అలవాటుగానో లేక కాలక్షేపంగానో లెక్కిస్తున్నాం. పాఠశాలలో జరిగే స్వాతంత్ర్యదినం రోజునో, వ్యవస్థాపక దినంరోజునో, వార్షికోత్సవం రోజునో, తనిఖీల సందర్భంగానో అలంకరణకోసం తప్ప దీన్నొక విద్యగా పరిగణించడంలేదు. పాఠశాలలో మనం కళావిద్యను పక్కనబెట్టి మిగిలిన సబ్జెక్టుల వెంట పిల్లల్ని పరుగెత్తిస్తున్నాం. విద్యార్థులకేకాదు తల్లిదండ్రులకు, టీచర్లకు, విద్యావేత్తలకు చివరికి విధాన నిర్ణేతలకు సైతం దీనిపట్ల నిర్లక్ష్యభావం ఏర్పడిపోయింది.

పాఠశాల యాజమాన్యాలు ఏవోకొన్ని ప్రత్యేక సందర్భాలలో కళావిద్యను ప్రోత్సహిస్తాయి. కొన్ని ప్రదర్శనలు, పాటలు, అభినయాలు, నాటికలు వంటివి కాలక్షేపం కోసం ప్రోత్సహిస్తుంటాయి. ఈమాత్రమైనా కళలపట్ల ఆరాధ్యభావం ఉండటం ఫరవాలేదనిపిస్తుంది. అలాగని ఎంతోకాలం ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. మనకున్న అన్ని శక్తి సామర్థ్యాలను, వనరులను ఉపయోగించి పిల్లల్లో కళావిద్యపట్ల, మన సాంస్కృతిక సంపదపట్ల అభిరుచిని పెంపొందించడానికి కృషిచేయాలి. భారతీయ కళలు సాంస్కృతిక భిన్నత్వాన్ని, లౌకిక తత్వాన్ని కలిగిన గొప్ప సజీవ సంపద. జానపద

### విద్యా - థియేటర్

థియేటర్ చాలా శక్తివంతమైంది. ఇది వివిధ కళారూపాల సంగమం. తననితాను అర్థం చేసుకోవడంతోపాటు ఇతరులతో సంబంధాలను ఏర్పరచు కోవడానికికూడా ఇది ఉపయోగ పడుతుంది. మానవుల గురించేగాదు ప్రాకృతిక, భౌతిక, సాంఘిక ప్రపంచాల్ని గురించి తెలుసుకోడానికి కూడా ఇదొక మాధ్యమంగా నిలుస్తుంది. విషయాన్ని అభినయించడం థియేటర్ ఆర్ట్స్‌లో ఒక భాగం మాత్రమే. రోల్‌ప్లే, థియేటర్ అభ్యాసాలు, శరీర కదలికలు, ఆంగిక వాచకాలు, సద్యఃస్ఫోరక నటన మరింత ప్రాధాన్యత గల అంశాలు. ఇలాంటివి పిల్లలకు నేర్పాలంటే ఉపాధ్యాయులు ఆయా అంశాలలో వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలి.

శాస్త్రీయ, సంగీతాలు, నాట్యం, నాటకాలు, తోలుబొమ్మలు, మృణ్మయకళ, దృశ్యకళ, హస్తకళలు ఇలా లెక్కలేనన్ని కళలు భారతదేశంలోని ప్రతి పార్శ్వాన్ని మనముందు ఆవిష్కరిస్తాయి. ఈ కళాసంపదను అభ్యసించడంవల్ల మన పాఠశాల స్థాయి పెరగడమేకాదు జీవితాంతం మన జీవితాలను సుసంపన్నం చేసుకొనే వీలు కూడా కలుగుతుంది.

దృశ్య ప్రదర్శనా రూపాల కళలన్నీ మన విద్యాలయాలలో ప్రధానాంశాలుగా ఉండాలి. ఈ రంగంలో సాధించే నైపుణ్యాలు, సామర్థ్యాలు కాలక్షేపానికన్నట్లు ఉండరాదు. వీటిద్వారా సుసంపన్నమైన, బహువిధమైన భారతీయ సాంస్కృతిక సంపదను గురించి పిల్లలు తెలుసుకోగలగాలి. కళావిద్య ఒక సాధనంగానూ, ఒక సబ్జెక్టుగానూ ప్రతి పాఠశాలలో (10వ తరగతి వరకు) తప్పనిసరి విషయంగా అమలుచేయాలి. దీనిలో నాలుగు ప్రధానాంశాలైన సంగీతం, నాట్యం, చిత్రకళ, థియేటర్ ఆర్ట్స్ లాంటి అంశాలన్నీ మన పాఠశాలల్లో ఉండాలి. ఇందుకు సంబంధించి అవసరాన్ని గుర్తించేలా తల్లిదండ్రులకు, పాఠశాల నిర్వాహకులకు, పరిపాలకులకు శిక్షణనివ్వాలి. ఈ రంగంలో బోధించడంకన్నా, నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఉండాలి. పాల్గొనడం, చర్చించడం, ప్రయోగాత్మక పద్ధతులద్వారా పిల్లలు వీటిని నేర్చుకునేలా చేయాలి.

ఒక శీతాకాలపు ఉదయాన ఉపాధ్యాయుడు తన పిల్లలను సూర్యోదయం దృశ్యాన్ని చిత్రించమని అడిగాడు. ఒక పిల్లవాడు సూర్యుడి నేపథ్యాన్ని నల్లరంగుతో నింపాడు. దీనివల్ల అసలు సూర్యుడే కన్పించకుండాపోయాడు. "నేను సూర్యోదయాన్ని గీయమన్నాను. సూర్యుడు కాంతివంతంగా ఉండాలికదా" అని టీచరు ప్రశ్నించాడు. ఉపాధ్యాయుడు విద్యార్థి కళ్ళలోకి చూడలేదు. అతని భావాన్ని అర్థం చేసుకోలేదు. నిజానికి ఆరోజున అప్పటికింకా చీకటిగానే ఉంది. శీతాకాలపు మబ్బులవెనుక దాగిన సూర్యుడ్ని ఆ పిల్లవాడు కిటికీలోనుంచి చూస్తున్నాడు.

సంగీతం, నాట్యం, థియేటర్ ఆర్ట్స్ అన్నీకూడా అటు జ్ఞానపరంగానూ, ఇటు సామాజిక పరంగానూ మనల్ని అభివృద్ధి చేస్తాయి. పూర్వప్రాథమిక, ప్రాథమిక స్థాయిల్లో మాత్రం ఇంత లోతైన అంశాల జోలికి పోనక్కరలేదు.

కళావిద్య ద్వారా భాషను, ప్రకృతిని, తనను, ఇతరులను లోతుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. భిన్న సామర్థ్యాలు గల పిల్లల్ని కళలు ఒకరికొకర్ని దగ్గరగా చేరుస్తాయి. అంతరాల్ని అంతరింపజేస్తాయి.

పాఠశాలలు అన్నిస్థాల్లోనూ కళావిద్య తప్పనిసరి పాఠ్యాంశంగా మారాలి. అప్పుడు పిల్లలు ఆహ్లాదంగానూ, క్రమశిక్షణతోనూ, తమగురించీ, ప్రపంచాన్ని గురించీ తెలుసుకోగల్గుతారు. పలు రూపాల్లో అభివ్యక్తీకరించుకోగల్గుతారు.

లలిత కళల్ని, సాంస్కృతిక హస్తకళల్ని నేర్పడానికి ప్రతి పాఠశాలలో తగినన్ని వనరులుండాలి. కళాకృత్యాలకోసం విద్యా ప్రణాళికలో తగినంత సమయాన్ని కేటాయించాలి. గంట లేదా గంటన్నర సమయం గల పీరియడ్‌లు థియేటర్ ఆర్ట్స్‌కు, డ్యాన్స్‌లకు అవసరం. మృణ్మయకళ కూడా ఇంతే సమయం తీసుకుంటుంది. పెద్దల నైపుణ్యాన్ని పిల్లలు ప్రదర్శించాలని తాపత్రయపడకూడదు. పిల్లలు తమ స్వంత శైలిలో తమనుతాము అభివ్యక్తీకరించుకొనే అవకాశం ఇవ్వాలి. దీనికవసరమైన సామగ్రిని, సాంకేతిక సహకారాన్ని అందించాలి. అట్లని వారిపై ఒత్తిడి పెట్టకూడదు. కాలక్రమంలో పిల్లలే తమ స్వంత ప్రాజెక్టులు రూపొందించుకుంటారు. సుందర కళారూపాల్ని ఆవిష్కరించి తమ నైపుణ్యాల్ని ప్రదర్శించుకుంటారు.

## 3.6 ఆరోగ్యవిద్య – వ్యాయామ విద్య

ఆరోగ్యం ఒక బహుముఖమైన భావన. ఇది జీవ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కారణాలచే ప్రభావితమవుతుంది. సామాన్య అవసరాలైన ఆహారం, రక్షిత మంచినీటి సరఫరా, గృహవసతి, మరుగుదొడ్లు, మురికినీటి పథకాలు, ఆరోగ్య సేవలు అన్నీ ప్రజల ఆరోగ్యం మీద ప్రభావం చూపుతాయి. ఇవన్నీ జీవన ప్రమాణాల్లో, పౌష్టికాహారంలో ప్రతిబింబిస్తాయి. పిల్లవాడి సంపూర్ణాభివృద్ధిలో ఆరోగ్యానిదే ప్రధానపాత్ర. ఆరోగ్యవంతుడైన పిల్లవాడు పాఠశాలలో నమోదైన తర్వాత విద్య పూర్తయ్యేదాకా కొనసాగుతాడు. ఆరోగ్యం, వ్యాయామం మన విద్యా ప్రణాళికలో సమగ్రరూపంలో ఉండగల్గితే (holistic) పిల్లవాడి భౌతిక, సాంఘిక, మానసిక, ఉద్వేగ వికాసాలకు ఇదెంతో తోడ్పడుతుంది.

మనదేశంలో పౌష్టికాహారలోపం, అంటువ్యాధులు, పిల్లల ఆరోగ్యం మీద ప్రభావం కలిగిస్తున్నాయి. ఇది పూర్వ ప్రాథమిక విద్య దశనుండి ఉన్నత విద్య వరకు కనిపిస్తోన్న నిజం. కాబట్టి పాఠశాలలో అన్ని స్థాయిల్లోనూ బలహీనవర్గాల పిల్లల, ముఖ్యంగా బాలికల ఆరోగ్యంపట్ల మనం శ్రద్ధ వహించాలి. విద్యా ప్రణాళికలో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని, వైద్య పరీక్షల్ని అమలుపరచాలి. పిల్లలు పెరిగేకొద్దీ తీసుకోవలసిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు (ముఖ్యంగా ఎదిగే వయసున్న బాలికల విషయంలో) కరికులంలో చేర్చాలి. **1940**లలో ప్రవేశపెట్టిన పాఠశాల ఆరోగ్య కార్యక్రమం ఆరు ప్రధాన అంశాలను చర్చించింది. వీటిలో ముక్యమైనవి వైద్య సదుపాయం, పాఠశాలలో ఆరోగ్యకరమైన వాతావరణం, పాఠశాలలో అందించే భోజనం, ఆరోగ్యం, వ్యాయామ విద్య. ఈ అంశాలన్నీ పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తాయి. అందుచేతనే వీటిని విద్యాప్రణాళికలో చేర్చవలసిన అవసరం ఏర్పడింది. ఈమధ్యకాలంలో నూతనంగా విద్యా ప్రణాళికలో చేర్చవలసిన అంశంగా యోగా గుర్తింపబడింది. ఏదో కొద్దిమందికి పరిమితం కాకుండా పిల్లలందరికీ సమగ్రమైన ఆరోగ్యాన్ని, వ్యాయామ విద్యను మనం అందించాలి. విద్యాప్రణాళికలో ఆటలకు, యోగా సాధనకు కేటాయింపబడిన సమయాన్ని ఏ పరిస్థితుల్లోనూ తగ్గించకూడదు.

ఆరోగ్యవిద్య పరస్పర ఆధారిత స్వభావంగలది. ఇది వివిధరకాలుగా, వివిధ అంశాలతో అనుసంధానం చేయడానికి వీలుగా ఉంటుంది. N.S.S., స్కౌట్ అండ్ గైడ్స్, N.C.C. మొదలైనవి ఇందుకోసం చక్కగా ఉపయోగపడతాయి. సైన్సులో మనం శరీరశాస్త్రం, ఆరోగ్యం, వ్యాధులు, వివిధ జీవరాశులమధ్యగల పరస్పర సంబంధాలు, భౌతిక అలవాట్లు చెప్తుంటాం. ఇవన్నీ ఆలోగ్యానికి అన్వయించవచ్చు. సామాజిక శాస్త్రాలు కూడా సామాజిక, ఆరోగ్యంపట్ల మనసుపెట్టాలి. అంటువ్యాధుల వ్యాప్తి, నివారణ, చికిత్సల గురించి అర్థం చేసుకోవడానికి తోడ్పడాలి. సామాజికార్థిక ప్రపంచ దృక్కోణాలనుంచి ఆరోగ్యాన్ని పరిశీలించాలి. ఇలా ఆరోగ్య విద్యను వినూత్న పద్ధతిలో బోధించే అవకాశం ఉంది. మన కరికులం దీనికి అనుకూలంగా ఉండాలి.

సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే ఈ సబ్జెక్టుకు సంబంధించిమన పాలసీ నిర్ణేతలకు ఇతర టీచర్లందరికీ ఒక అవగాహన కల్పించాలి. వారు దీని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. తదనుగుణంగా పాలసీల్లో మార్పు రావాలి. అవసరమైన వస్తువులు, పరికరాలు (వ్యాయామ, యోగా) నిర్వాహకులకు అందించాలి. దీనితోబాటు డాక్టర్లు, వైద్యరంగంలోని వ్యక్తులు పాఠశాలలను తరచుగా సందర్శిస్తుండాలి. హయ్యర్ సెకండరీ స్థాయిలో దీన్ని ఒక ఐచ్ఛిక అంశంగా చదివే అవకాశం కల్పించాలి.

పిల్లల 'అవసరాల్ని దృష్టిలో ఉంచుకొన్న బోధనా విధానం', పాఠశాలలోని అన్నిస్థాయిల్లో, సాంఘిక, మానసికపరమైన అవసరాలను తీర్చేవిధంగా ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించిన మౌలిక భావనలపై మనకు స్పష్టత అవసరం. వ్యక్తిగత, సామాజిక ఆరోగ్య పద్ధతుల్ని పాటించడంలో, ఆటల్లో, వ్యాయామంలో పాల్గొనడం చాలా కీలకమైన అంశం. అలాగే వ్యక్తిగతంగా, సామాజికంగా బాధ్యత వహించడానికికూడా పిల్లల్ని సిద్ధపరచాలి. మాతాశిశుసంక్షేమం, HIV/AIDS, క్షయవ్యాధి, మానసిక ఆరోగ్యం మొదలైన జాతీయ ఆరోగ్య పథకాలు పిల్లలను దృష్టిలో ఉంచుకొని ఎంతో కృషిచేస్తున్నాయి. వ్యాధుల నిరావరణ కోసం పనిచేస్తున్నాయి. పిల్లల ఆరోగ్య అవసరాలని మన కరికులంలో అంతర్భాగం చేయాలి.

యోగా కార్యక్రమాన్ని ప్రాథమిక స్థాయిలోనే అనియతంగా ప్రవేశపెట్టాలి. అయితే ఆసనాలు, ధ్యానం 6వ తరగతినుండి నియతరూపంగా ఉండవచ్చు. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పిల్లల నిత్యజీవితంతో సమన్వయం చేయాలి. స్థానిక ఆటలు, క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతర ప్రాంతాల, దేశాల ఆటలుకూడా నేర్చుకోవడానికి అవకాశం కల్పించాలి.

బ్లాకు స్థాయిలోనైనా పిల్లలు పాఠశాల స్థలంలో ఆటలు, క్రీడలలో ప్రత్యేక శిక్షణ పొంది, నైపుణ్యాల్ని ప్రదర్శించడానికి అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉండాలి. బడి సమయానికి ముందు లేదా తర్వాత ఎలా వీలైతే అలా వినియోగించుకోవడానికి తగినట్టుగా ఇది ఉండాలి (సెలవులలోకూడా). బాస్కెట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, ఇతర స్థానిక ఆటల ద్వారా పిల్లలు తమకు దొరికే విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యం సాధించాలి.

## 3.7 పని – విద్య

స్థూలంగా శ్రమతోకూడిన కార్యాన్ని 'పని'గా మనం భావిస్తాం. ఇది సమాజానికి ఉపయోగపడేవాటిని తయారుచేస్తుంది. మరోరకంగా చెప్పాలంటే ఒక వ్యక్తి తన శ్రమద్వారా, సామర్థ్యంద్వారా ఇతరుల ప్రయోజనాలను తీర్చడానికి శ్రమిస్తాడు. దీనిద్వారా ఆర్థిక ఫలితాన్ని పొందుతాడు. ప్రజల భౌతిక, మానసిక అవసరాల్ని తీర్చే ఆహారోత్పత్తి, వస్తువుల తయారీలాంటివి కొన్ని ఈకోవలోకి వస్తాయి. ఇతర పనులు పరిపాలనకు, సామాజిక నిర్వహణకు సంబంధించినవి. ఏ సమాజంలోనైనా ఈరెండు రకాల పనులేగాక ప్రజల అవనసరాల్ని తీర్చడానికి ఇతర పనులుకూడా ఉంటాయి. అన్వేషణలు, కళలు, క్రీడలు ఈ కోవలోకి వస్తాయి.

శ్రమను సమాజంలోని యితరుల అవసరాల్ని తీర్చడంకోసం తమ శక్తిని, తమ సామర్థ్యాన్ని ఖర్చుచేయడంగా మనం అర్థం చేసుకోవాలి. రెండవది ఈ శ్రమ విలువను ఇతరులు నిర్ణయిస్తారు. ప్రజల అవసరాలకుపయోగపడే ప్రమాణాల్నిబట్టి ఈ విలువ ఉంటుంది. మూడవది శ్రమవల్లనే సామాజిక జీవితం నడుస్తోంది. చివరగా శ్రమ మానవజీవితాన్ని సుసంపన్నంచేసి మనిషికి ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తోంది.

పాఠశాలలో పనిలో పాల్గొనడం ద్వారా కలిగే అనుభవం సామాజిక జీవితంలోకూడా పని విలువను గుర్తించడానికి, గౌరవించాడానికి తోడ్పడుతుంది. పనిచేసే తత్త్వంవల్ల సమాజంలో ఇతరులతో చక్కటి సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయి. పరస్పర సహకారం పెంపొందించుకోగల్గుతాము. పనిద్వారానే వ్యక్తికి ఒక స్థానం, ఒక గుర్తింపు లభిస్తుంది. మనిషి అఖండ ప్రతిభను వెలికితీసే అద్భుత విద్యాకృత్యం పని. పనికి స్పష్టమైన లక్ష్యాలు కలిగివుంటాయి. పరస్పరాధారితత్వం ఉంటుంది. క్రమబద్ధంగా సామర్థ్యాలు వినియోగించడం పనిలో జరుగుతుంది. అందువల్ల స్వయం నియంత్రణా సామర్థ్యం కలుగుతుంది. మానసిక శక్తులను, ఉద్వేగాలను నియంత్రించుకొనే

వీలుంటుంది. నైపుణ్యవంతమైన పనులలో పాల్గొనడం వలన స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది. వ్యక్తి మరొక వ్యక్తితో పనిచేసేటప్పటికన్నా వస్తువుతో (బంకమట్టి లేదా చెక్క) పనిచేసేటపుడు ఏర్పడే క్రమశిక్షణలో గుణాత్మకత ఎక్కువగా ఉంటుంది. పనిలో పలురకాల వస్తువుల్ని వాడాల్సివుంటుంది. మనుషులతో సంబంధాల్ని పెట్టుకోవల్సి ఉంటుంది. వీటివల్ల ప్రాకృతిక జ్ఞానం లభిస్తుంది. మానవులతో సంబంధాలు ఏర్పడతాయి. వృత్తిపరమైన నైపుణ్యం సాధించడం, బ్రతుకుతెరువును సంపాదించుకోవడంతోపాటు అదనంగా లభించే లాభాలివి. దీన్నిబట్టి పనికి జ్ఞాన నిర్మాణంలోగల పాత్ర ఎంత గొప్పదో అర్థమౌతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యా ప్రణాళికలో పనికి మనం స్థానం కల్గించాల్సి ఉంటుంది.

మన పాఠ్యప్రణాళికలో పని అంతర్భాగమైనప్పుడే పైఫలితాలను మనం శ్రమద్వారా సాధించగలం. మనదేశంలో  పిల్లలు ఇతర పనుల్ని చేస్తూ, వృత్తిపనుల్లో తోడ్పడుతూ, కుటుంబానికి తోడ్పడుతుంటారు. ఇదొక జీవనవిధానం. క్రమంగా ఈవిధానం మారుతోంది. స్కూల్లో ఒత్తిడి పెరిగి పిల్లలకు ఈ పనులు చేసేందుకు సమయం ఉండడంలేదు. పాఠశాలల్లో పెరుగుతున్న పోటీ మన పిల్లలకు సమాచారాన్ని వల్లెవేసుకోడానికే సమయమంతా సరిపోయేలా చేస్తున్నది. మన ప్రాథమిక పాఠశాలల్లో జాగ్రత్తగా ప్లాన్ చేస్తే ఈ సమస్యను కొంతమేర అధిగమించవచ్చు. అట్లని బడిలోనే అన్ని పనులూ చేయించలేము. మన పాఠ్యప్రణాళికలో శ్రమను ఎలా అంతర్భాగం చేయవచ్చో, దీన్ని ఎలా మూల్యాంకనం చేయవచ్చో మనం జాగ్రత్తగా ఆలోచించాలి. ఇందుకోసం బోధనా వ్యూహంపై మనకు స్పష్టత ఉండాలి.

పని చేయడం బలవంతపు కార్యంగా మారకూడదని మనం గుర్తుంచుకోవాలి. ఒకేరకమైన పని, పని ఇష్టంలేని పిల్లలమీద బలవంతంగా రుద్దితే దాని ఉద్దేశ్యమే దెబ్బతింటుంది. ఉత్పత్తి కోసం ఒకేపనిని మాటిమాటికీ చేయించేబదులు, అనేక వృత్తుల పనుల్ని చేయించడంద్వారా పనులలో మార్పుచేయవచ్చు. పిల్లలతో పనిచేయించే సందర్భంలో ఉపాధ్యాయుడు కూడా పనిలో పాల్గొనాలి. అలా అయితేనే ప్రణాళికలో నిర్వచించిన విద్యాలక్ష్యం నెరవేరుతుంది. ఇది ఎప్పటికీ పిల్లల శ్రమను దోచుకొనేదిగా ఉండరాదు. దీన్ని మనం బాగా గుర్తుంచుకోవాలి.

పనికి అకడమిక్ స్వభావం తోడైతే అత్యద్భుతమైన సృజనాత్మకావిష్కరణలు జరుగుతాయి. పని స్వభావంలోనే పెద్ద మార్పు వస్తుంది. పని పలు అంశాలతో ముడిపడివుంటుంది. దీనికి భిన్నంగా మన పాఠశాల విద్య ఒకే అంశంచుట్టూ తిరుగుతూ ఉంటుంది. పనికి, అకడమిక్ కృషికి మధ్య ఒక సంబంధం నెలకొల్పగల్గితే, సమాంతరంగా అది కలిసి పయనించగలిగితే గొప్ప సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. చేతిపంపులు ఇలానే అభివృద్ధి చెందాయి. పూర్వకాలంలో – స్ట్రాటోస్పియర్‌లోకి ప్రవేశపెట్టబడిన ఎక్కువ ఎత్తు ఎగిరే పాలిథీన్ బెలూన్‌లు పగిలిపోవడం సాధారణంగా జరిగేది. శాస్త్రీయంగా ఆలోచించగలిగిన ఒక పనివాడు ఇచ్చిన సూచన చక్కని పరిష్కారం ఇచ్చింది. అదేమిటంటే – ఒక చిన్న కార్బన్ ముక్కను అందులో ఉంచినట్లయితే సూర్యునివేడి గ్రహించి బెలూన్ను వెచ్చగా ఉంచుతుంది. నిజానికి చాలామంది పరిశోధకులు పనివారే కావడం గమనార్హం.

ఎడిసన్, పోర్ట్, ఫారిడ్ ఇలాంటివారే. మొదట టెలిస్కోపును కనుగొన్నది. కళ్ళజోడు కనుగొన్నదికూడా ఇలాంటివారే. సంప్రదాయ అంశాలైన కుండలు చేయడం, నేత, వ్యవసాయం, వైద్యం కూడా ఇంతే. శారీరక శ్రమ, మేధోశ్రమ రెండూ మిళితమైనప్పుడే ఇలాంటి ఆవిష్కరణలు జరిగాయి. ఆవిధమైన జ్ఞానకాంక్ష, శ్రమచేసే సాంప్రదాయం విద్యద్వారా మన పిల్లలకు అందించవలసిన అవసరం ఉంది.

పాఠశాల కరికులంలో పొందుపరిచే పనికార్యక్రమాలు సృజనాత్మకంగా, విస్తృత ఆలోచనా పరిధితో వుండాలి. మూసపోసినట్లుండే ఉత్పాదక కృత్యాలనుంచి మనం బయటపడాలి. కొన్నివర్గాల పిల్లలలో గల పని నైపుణ్యం, విషయపరిజ్ఞానం వారికి ఎలా వచ్చిందో పరిశీలించడం అవసరం. తరువాత దీనిని పిల్లలు ఒకరినుండి ఒకరు నేర్చుకోవడానికి తగిన వనరుగా ఉపయోగించుకోవాలి. ఉన్నత, మధ్య తరగతుల మధ్యగల అంతరాలు తగ్గించడానికి పని అనుభవం తోడ్పడుతుంది. పిల్లల సాంస్కృతిక మూలాలు పనిలో ముఖ్యపాత్ర వహిస్తాయి. సమాజంలో విస్తృత ఉత్పాదక రంగ పరిజ్ఞానాన్ని విద్యారంగంలోకి బదిలీచేసుకోవాలి. ఉత్పాదక రంగంలో ఉన్న మహిళల దగ్గర, ఇతర వెనుకబడ్డ సమూహాలలో గల విలువైన అంశాల్ని పరిశీలించి ఉపయోగించుకోవాలి. పని అనుభవ కార్యక్రమం మన విద్యాప్రణాళికలో కేంద్రబిందువు కావాలి. కేవలం పుస్తక జ్ఞానమేకాకుండా పిల్లల జీవితావసరాలు తీర్చేందుకుకూడా అనువైన అంశాలుండాలి. పనితత్వాన్ని ఒక ముఖ్యమైన పరికరంగా అటు బాల్యదశలోనూ, ఇటు కౌమార దశలోనూ అన్ని స్థాయిలలో ప్రవేశపెట్టాలి. అలా జరిగినపుడే 'వృత్తి విద్య', 'పని కేంద్రీకృ,త విద్య'గా మారుతుంది.

పూర్వప్రాథమిక స్థాయినుండి సీనియర్ సెకండరీ స్థాయి వరకు పని కేంద్రీకృత విద్యగా విద్యాబోధనను పునర్నిర్మించాలి. దీనివల్ల జ్ఞానాన్ని పొందడానికి, విలువలు పెంపొందించుకోవడానికి, బహుళ నైపుణ్యాల సాధనకు వీలు కలుగుతుంది. పిల్లవాడు పెరిగేకొద్దీ పని కేంద్రీకృత విద్యాస్థాయి పెరగాలి. పనిలో సంక్లిష్టతలు పెరగాలి. కానీ అదే సందర్భంలో మార్చుకొనేదానికి అనుగుణంగా ఉండేలా సందర్భానుసారంగా పని ఉండాలి. దీనితో సునిశిత ఆలోచన, సృజనాత్మకత, పరస్పర సంబంధాలు, సంభాషణా నైపుణ్యాలు, సౌందర్య దృష్టి, పనిపట్ల ఉత్సాహం, పనిపట్ల గౌరవం, సమిష్టి పనివిధానం, సమాజంపట్ల జవాబుదారీతనం మొదలైన అంశాలు ముడిపడివుంటాయి. ఈరకమైన పాఠ్యప్రణాళికకు కావల్సిన మూల్యాంకనాంశాలను కూడా పునఃనిర్వచించుకోవాలి. పనితో ముడిపడ్డ, ‰Hë0 `Ç ¾Ø q^¥¼q^¥#0 …ã½0_¨ ª•~þãu H›q^ ¾ (UEE) ఎప్పటికీ సాధ్యం కాదు.

### 3.7.1 వృత్తి విద్యలు – శిక్షణ

మనం పనికేంద్రంగా గల **10** నుంచి **12** సంవత్సరాల వృత్తివిద్యను, శిక్షణను మన స్కూళ్ళలో ఒక క్రమపద్ధతిలో అమలుజరపాలని ఆలోచిస్తున్నాం. వ్యవస్థాగతంగా చూస్తే ఇది స్కూలుబయట ఉంటుంది. దీన్ని ఒక ఉద్యమరూపంలో పెద్దయెత్తున చేపట్టాల్సివుంది. దీనికోసం ప్రత్యేకంగా వృత్తివిద్యా శిక్షణాసంస్థలు స్థాపించడం అవసరం. ప్రస్తుతం అందుబాటులోవున్న ITI లు, పాలిటెక్నిక్ సంస్థలు, మెడికల్ కాలేజీలు, సహకార సంస్థలు మొదలగువాటితోగల సంబంధాలను విస్తృతం చేసుకోవడం అవసరం. వృత్తివిద్య ద్వారా జీవనోపాధి పొందాలనుకునేవారికి అదనపు నైపుణ్యాలు కలిగించడానికి వీలుగా వీటిని నిర్మించాలి. ఏదో గతిలేని మార్గంగాకాక గౌరవప్రదమైన మార్గంగా ఇది ఉండాలి. పాఠశాలల్లాగానే ఇవికూడా వెనకబడ్డ వర్గాలవారికి తగినట్టుగా ఉండాలి. సెంకడరీ మరియు హయ్యర్ సెకండరీ స్థాయిలో పిల్లలకు, వృత్తిపరమైన సైకాలజీ, కౌన్సిలింగ్ ఏర్పాట్లుకూడా అవసరం. దీనివల్ల పిల్లలు తమకుకావల్సిన వృత్తివిద్యల్ని ఎన్నుకుంటారు.

VET ల ద్వారా సర్టిఫికెట్, డిప్లమో కోర్సులు ప్రవేశపెటాలి. ఇవి స్వల్పకాల, దీర్ఘకాల కోర్సులుగా ఉండవచ్చు. ఈ కోర్సుల్ని ఉత్పత్తి పద్ధతులు, సేవలు, వనరుల అందుబాటు, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా చేసుకొని రూపొందించాలి. ఈ కోర్సులు విద్యాపరమైన, ఉద్యోగపరమైన ప్రోగ్రాములతో సంబంధం కలిగివుండాలి. కోర్సులో

చేరడానికి, వెళ్ళిపోవడానికి పలురకాల మార్గాలకు అనుమతి ఉండాలి. జిల్లా, బ్లాకు, ప్రధానమైన పట్టణాలలో VET కేంద్రాలు స్థాపించాలి.

విద్యా ప్రణాళికను ఎప్పటికప్పుడు సవరించుకొంటూండాలి. అలా లేకపోతే ఈ వృత్తులు అర్థరహితంగా, అసందర్భంగా మారే ప్రమాదముంది. ఒకవేళ ప్రణాళికలోని అంశాలు నేర్చుకోవడానికి సంక్లిష్టంగా ఉంటే వాటిని ప్రణాళికనుండి తొలగించే అవకాశం ఉండాలి. ఈ కేంద్రాలకు తగిన వనరులుండాలి, స్వేచ్ఛ ఉండాలి. ఈ పని స్థానాల ప్రక్కనే ఉన్న వ్యవసాయ క్షేత్రాల్ని, అడవుల్నివాడుకొనే వీలుండాలి. ఈ ఉత్పత్తి కేంద్రాలలో ప్రకృతి మానవ వనరులు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని పరిశ్రమల ముఖ్యంగా చిన్నపరిశ్రమల, తయారీదారుల సహాయం తీసుకోవాలి. వస్తువుల్ని మార్కెట్లో పెట్టడానికి తగ్గ నైపుణ్యాలు దీనివల్ల లభిస్తాయి.

సర్వశిక్షాఅభియాన్ క్రింద **2010** నాటికి సార్వత్రిక, ప్రాథమిక విద్యను సాధించేటప్పటికి అందరూ **5**వ తరగతి పూర్తి చేయడం అవసరం. తరువాత **8**వ తరగతి, అలాగే **10**వ తరగతి సర్టిఫికెట్‌లు కూడా పొందగలగాలి. **16** సం॥లు లోపల పిల్లలు ఎవరూ VET కార్యక్రమంలో చేరకుండా ఉండకూడదు. వారివారి వీలునుబట్టి ఆయా స్థాయిలలో పిల్లలు వృత్తివిద్యా కోర్సుల్లో నమోదు అయ్యేలా చూడాలి.

ప్రాథమిక స్థాయినుండే పిల్లల్లో చేతిపనులు నేర్చుకోవడం ఒక అలవాటుగా మారేటట్లు VET కేంద్రాలు పనిచేయాలి. పాఠశాల పని గంటల తర్వాత కూడా ఇవి వారికి అందుబాటులో ఉండాలి. చేతివృత్తులవారు, మెకానిక్‌లు, కమ్మరి, వెదురుపనివారు మొదలగు నిపుణులైన పనివారి సేవల్ని పాఠశాలలు వినియోగించుకోవాలి. నైపుణ్యం గలిగిన పనివాళ్ళను స్థానికంగా ఉపయోగించుకోవాలి. వారి అభివృద్ధికి కూడా తోడ్పడాలి.

## 3.8 శాంతికోసం విద్య

మనం ప్రస్తుతం హింసాపూరిత సమాజంలో నివసిస్తున్నాం. అసహనం, గొడవలు, గందరగోళాలు, మోసాలు, దౌర్జన్యాలు రాజ్యం చేస్తున్నాయి. నీతినియమాలు, శాంతి, సంక్షేమం కొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా ప్రణాళికలో శాంతి విద్యను చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుచేతనే ప్రస్తుత డాక్యుమెంటు (NEFI) ఈ అంశంపై దృష్టిసారించింది. స్థానికంగా మొదలుపెట్టి జాతీయస్థాయికి, ప్రపంచమంతటికీ హింస, దౌర్జన్యాలు ఇప్పుడు ఎగబ్రాకుతున్నాయి. శాంతి సహనాలు, న్యాయం, సంస్కృతుల మధ్య అవగాహన, వ్యక్తిగత బాధ్యతల్ని గుర్తించడం విద్యకు దీర్ఘకాలిక లక్ష్యంగా ఉండాలి. ప్రస్తుతం మన పాఠశాలల్లో ప్రత్యక్షంగానూ, సంకేతాల రూపంలోనూ హింసావాదం కనిపిస్తూనే ఉంది. కాబట్టి మన పాఠశాల ప్రణాళికలో విద్యను పునర్‌నిర్వచించుకోవలసిన అవసరం ఉంది. శాంతి తన అడ్డంకులన్నింటినీ అధిగమించి ముందుకు రావాలి. అప్పుడు మనం కోరుకున్న విలువలు సాక్షాత్కరిస్తాయి. కాబట్టి ప్రణాళికలో అన్ని స్థాయిలలో దీనిని ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను చైతన్యవంతం చేయాలి.

శాంతి విద్య విలువలతో కూడిన, యితరులతో తనకుతాను సౌభ్రాతృత్వంతో, సంతోషంతో మనగల్గిన దృక్పథాన్ని, నైపుణ్యాన్ని కల్గిస్తుంది. శాంతి విద్యలో బ్రతకడంలో ఆనందం, మానవహక్కుల పట్ల బాధ్యత, న్యాయం, సహకారం, సహనం, సాంస్కృతిక అంతరాల్ని గౌరవించడంలాంటి అంశాలుండాలి. వీటితోపాటుగా ప్రజాస్వామ్యంపట్ల అంకితభావాన్ని, అహింసపట్ల నమ్మకాన్ని ఇది కల్గించాలి. ప్రేమ, ధైర్యం, ఆశ లాంటి అంశాలు వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి. వీటిని విద్యలో భాగం చేయాలి. శాంతి విద్య పాఠశాల జీవనంతో

పెనవేసుకోవాలి. విద్యాప్రణాళికల్లో, పాఠ్యప్రణాళికల్లో, తరగతి వాతావరణంలో, పాఠశాల నిర్వహణలో, ఉపాధ్యాయుల్లో, పిల్లల మధ్య సంబంధాల్లో, బోధనాభ్యసన ప్రక్రియల్లో అన్ని అంశాలో శాంతి విద్య ప్రతిబింబించాలి. విద్యా ప్రణాళికలో, పరీక్షా విధానంలో ఈరకమైన విద్యను ఎలా అందించాలో విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని పరిశీలించాలి. పిల్లల్లో గల అభద్రతాభావం, అసహనం, విసుగు అసందర్భంగా ప్రవర్తించడం వంటి అంశాల ద్వారా శాంతి విద్యను పరీక్షించాలి. చుట్టూ ఉన్న ప్రపంచంలో జరుగుతున్న హింసాధోరణులు, ప్రసార మాధ్యమాలు మనమీద ప్రభావం చూపుతున్నాయి. ఈ పెడధోరణుల స్థానంలో వారి మనసుల్లో నీతినియమాలు, శాంతియుత జీవనశైలిని నిలపాలి. విద్య వ్యక్తులల్లోని విలువలకు మరింత ఊతమివ్వాలి. వారి మాటలు, చేతలు శాంతియుతమైనవిగా ఉండేట్లు చేయగలగాలి. హింస స్థానంలో శాంతిని ఎన్నుకొనేటట్లు చేయాలి. వారు శాంతి అనుభవిస్తే చాలదు, శాంతికాముకులుగా, శాంతి స్థాపకులుగా వ్యవహరించగలగాలి.

## శాంతి సందేశాన్ని అందించే కృత్యాలు

**5+ సం॥ల పిల్లలకోసం** (మెళకువగా చెప్పడం) – పిల్లల్ని వరుసగా నిలబెట్టాలి. ఒక టేకు లేదా అరటి ఆకును ఒకళ్ళనుండి ఒకరు అందించుకోమనాలి. చివరికి తిరిగి ఆకు మొదటికే వస్తుంది. అలాగే మరలా చేయాలి. చివరకి ఆకును పరిశీలించాలి. ఆకు దెబ్బతింటుంది. ఆకు ఎందుకు దెబ్బతిన్నదో పిల్లలతో చర్చించాలి. నిర్లక్ష్యంగా ఆకును పట్టుకోవడంవల్ల కావచ్చు. ఈ చర్య ఆకుల్ని గురించి చర్చకు, అవి చెట్లనుండి ఎలా పుడుతున్నాయనే విషయానికి దారితీయాలి. ఒక ఆకుకు హాని కలిగిస్తే ప్రకృతికి హాని కలిగించినట్లని పిల్లలు గుర్తించాలి. ఈ సృష్టికి మొత్తానికి ఆకును ప్రతిరూపంగా భావించాలి.

**7+ సం॥ల పిల్లలకోసం** (అనుభవాలు పంచుకోవడం) – పిల్లల్ని గుండ్రంగా కూర్చోబెట్టాలి. "నీ జీవితంలో సంతోషకరమైన రోజు ఏది? అది ఎందుకు అంత సంతోషం కలిగించింది చెప్పమనాలి. ప్రతి పిల్లవాడిని చెప్పమనాలి. కొందరిని తమ అనుభవం గురించి అభినయం చేసి చూపమనాలి. పిల్లలు తమ అనుభవాలను పంచుకుంటారు. తర్వాత కొంచెం క్లిష్టమైన ప్రశ్నలు అడగాలి. నిన్ను నిజంగా భయపెట్టిన సంగతి ఏమిటి? నువ్వు ఎందుకు అలా భయపడ్డావు? ఎవరైనా దెబ్బలాడుకుంటుంటే నీకేమనిపిస్తుంది? నువ్వు ఎందుకు అలా అనుకున్నావు? నిన్ను నిజంగా దుఃఖానికి గురిచేసే విషయం ఏమిటి? ఎందుకు? ఇలా పలురకాలైన ప్రశ్నలు వేయడంద్వారా పిల్లలతో భావాలు పంచుకొనే, స్పందించే వీలుకలుగుతుంది.

**10+ సం॥ల పిల్లలకోసం** (అన్యాయాన్ని న్యాయంతో జయించడం) – ప్రపంచంలో అన్యాయం జరగడానికి గల అనేక కారణాలను వివరించాలి. దీనినిబట్టి ప్రపంచంలో శాంతి నిలబడాలంటే న్యాయం జయించాలని తెలపాలి. అన్యాయపు సంఘటనలు రెండుమూడు ఉదహరించాలి. తర్వాత ప్రశ్నించాలి? "ఈ అన్యాయానికి కారణం ఏమిటి? ఆ సన్నివేశంలో నువ్వు ఉంటే ఎలా స్పందిస్తావు?" వీటి సమాధానాల్ని తరగతిగదిలోని ఇతర పిల్లలతో పంచుకోవాలి.

**12+ సం॥ల పిల్లలకోసం** (శాంతి ప్రవక్తగా ఉండడం) – దేశంలో శాంతిని స్థాపించాలంటే ఎలాంటి న్యాయ నియమాలుండాలో చెప్పాలి. పిల్లల్నికూడా చెప్పనివ్వాలి. శాంతిని స్థాపించడానికి 5 అతి ముఖ్యమైన న్యాయనియమాలు చెప్పమనాలి. ఇతరులు రూపొందించిన నియమాలు ఎలాంటివాటిని నీ పట్టికలో చేర్చుకుంటావు? ఎలాంటివాటిని అంగీకరించవు? ఎందుకు? ఇలాంటి చర్చలద్వారా శాంతి స్థాపనోద్దేశాలను తెలుసుకొనేలా చేయాలి.

### 3.8.1 వ్యూహాలు

నీతి నియమాలను పెంపొందించుకోవడమంటే ఏవి చేయాలో, ఏవి చేయకూడదో టీచర్లు రుద్దడం కాదు. ఏది సరైందో, ఏది కాదో, దేన్ని కరుణ అంటారో, విస్తృత ప్రయోజనాల్ని, సామాజిక విలువల్ని దృష్టిలో ఉంచుకుంటే ఏది అందరికీ మంచిదో పిల్లలు తమకుతామే తెలుసుకొనేలా మనం సహాయపడడం. దీనికనువైన సాధనాల్ని, మార్గాల్ని వెతకడం. ఇదీ అసలైన శాంతివిద్య. పిల్లలు తాము వినిన ఏ విషయాన్నైనా దాదాపు అర్థం చేసుకొంటారు. చెప్పినదానికీ, చేసినదానికీ మధ్యగల వైరుధ్యాన్ని మాత్రం గుర్తించలేరు. ఇంటిలో ఏదైనా విషయాలలో పిల్లలకు అంగీకారం కుదరనపుడు అది వారిమీద ఎక్కువగా ప్రభావం చూపుతుంది. పెద్దలమధ్య అభిప్రాయ భేదాలుండడం, తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేకపోవడం, పిల్లల్లో అంతులేని భయాన్ని, అభద్రతాభావాన్ని కలిగిస్తాయి. ఇది కొన్నాళ్ళయ్యాక యవ్వనదశలో ఇది తిరుగుబాటుగా పరిణమిస్తుంది. తల్లిదండ్రుల్ని, టీచర్లను ఒకదగ్గరికి చేర్చి ఇలాంటి విషయాలు చర్చించాలి. వ్యక్తిగత నీతినియమాలు అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అటు తల్లిదండ్రులదో, ఇటు పాఠశాలదో ఏ ఒక్కరిదీ కాదు. ఇద్దరిదీ!

నైతిక విషయాలు ఒక్కో వయసునుబట్టి ఒక్కోరకంగా ఉంటాయి. చిన్నవయస్సులో పిల్లలు తమకు దగ్గరగా ఉన్న పరిసరాల్ని పరిశీలిస్తారు. స్వంతంగా తమ స్పృహని తాము పెంపొందించుకుంటారు. దండనను తప్పించుకోవడం, ప్రశంసల్ని అందుకోవడం వాళ్ళ ప్రవర్తనలో ప్రముఖంగా కనిపిస్తుంది. వారికిష్టమైందాన్ని మంచిగా, ఇష్టంలేనిదాన్ని చెడుగా భావిస్తారు. ఈ దశలో పెద్దల్లో తామేది చూస్తారో దాన్నిబట్టి నైతిక ప్రవర్తనను అలవర్చుకుంటారు.

పిల్లలు ఎదిగేకొద్దీ వారిలో కారణాలు తెలుసుకొనే సామర్థ్యం పెరుగుతుంది. అయినప్పటికీ వారు నియమాలను ప్రశ్నించలేరు. ఇతరులను సంతోషపరచడంకోసం, తమనుతాము నిరూపించుకోవడంకోసం నియమాలను అతిక్రమించడానికికూడా వెనకాడరు. ఈ దశలో చర్చలద్వారా, సంభాషణ ద్వారా నీతులు, పద్ధతులు, నియంత్రణలు, స్నేహాలు, తప్పనిసరి అవసరాలులాంటివి పిల్లలకు తెలియజెప్పాలి. దీనిద్వారా ఉమ్మడిగా అందరికీ ఏది మంచిదో, తమనుతాము నియంత్రించుకోవడం ఎంత విలువైందో, ప్రేమ ఎలాంటిదో పిల్లలు తెలుసుకొనేలా చేయవచ్చు.

తరువాత అమూర్త ఆలోచనాశక్తి బాగా అభివృద్ధి చెందుతుంది. నీతి ప్రవర్తనలమీద న్యాయబద్ధమైన తీర్పులు చేయగల సామర్థ్యం ఏర్పడుతుంది. ఇది శాశ్వత నీతినియమాలను గుర్తించడానికి దారి తీస్తుంది. బాహ్య పర్యవేక్షణ లేనప్పటికీ, వ్యక్తిగతంగా నీతినియమాల్ని పాటించడం, వాటిని అర్థం చేసుకొని సరైనమార్గంలో పయనించడం, అలవాటవుతుంది. ఈ నియమాలు మొత్తం మీద అందరికీ ఎలా ప్రయోజనకరమైనవో, శాంతికి ఎలా దోహదపడేవో తెలుసుకొంటారు.

మన పూర్వకాలపు టీచర్లు మంచి కథల్ని, వ్యక్తి చరిత్రల్ని, పిల్లల్లో ఆత్మప్రబోధాన్ని, సామాజికానుబంధాన్ని కల్గించడానికి ఉపయోగించేవారు. పిల్లలు ఇంటిలో ఎంత నిరుత్సాహపూరిత వాతావరణంలో ఉన్నప్పటికీ, ఎంత మందంగా ఉన్నట్టు కన్పిస్తున్నప్పటికీ వారికికూడా అంతర్‌దృష్టివుంటుంది. వారు చెప్పాల్సిందికూడా ఉంటుంది. వారికి తరగతి గది చర్చలద్వారా స్ఫూర్తిని కలిగించాలి. ఉపాధ్యాయుడు తరగతిలో పిల్లలలో విశ్వాసాన్ని నెలకొల్పాలి. తిట్టడంద్వారా, ఇతర చేష్టలద్వారా భయపెట్టకూడదు.

మంచి విలువల్ని బోధించడం కోసం మనం చాలా ప్రయత్నాలు చేస్తుంటాం. 'ఆమోదయోగ్యంకాని', 'అవాంఛితమైన' కోరికల్ని, భావాల్ని అణచివేస్తుంటాం. ఇది పిల్లల నిజమైన భావాల్ని, కోరికల్ని, ఆలోచనల్ని, నమ్మకాల్ని అణిచివేస్తుంది. మనం చెప్పే నీతిబోధల్ని ఏదో మాటమాత్రంగా వారు స్వీకరిస్తారు. వాటిమీద వారికేమీ నమ్మకం, నిబద్ధత ఉండవు. పిల్లలకు ఏదో అలవోకగా కొన్ని మాటలు, కొన్ని అనుభవాలు చెబితే చాలదు. మన జీవితంలోని నీతినియమాల్లోని మంచిచెడ్డలు, వాటి సంక్లిష్టతలు పిల్లలు అర్థంచేసుకోగల్గాలి, పరిశీలించగల్గాలి.

**శాంతికోసం కృత్యాల నిర్వహణలో కొన్ని సలహాలు**

- ✦ పాఠశాలలో ప్రత్యేక క్లబ్బులు, రీడింగ్ రూములు ఏర్పరచాలి. వాటిలో శాంతి సంబంధించిన వార్తలు, సామాజిక న్యాయం, సమానత్వం ప్రత్యేకంగా ఉండే అంశాలపై చర్చ జరగాలి. అలాంటి సమాచారం ఇందులో ఉండాలి.
- ✦ శాంతి, న్యాయం ప్రభోదించే చిత్రాలు, డాక్యుమెంటరీలు, ఫీచర్‌ఫిల్మ్‌లు నిర్మించాలి. సమయాన్ని బట్టి పాఠశాలలో వీటిని ప్రదర్శించాలి.
- ✦ వివిధ మాధ్యమాలను శాంతి విద్యలో వినియోగించుకోవాలి. ప్రతిభావంతులైన జర్నలిస్టులను, ఎడిటర్లను పిలిపించి పిల్లలకు ఉపాన్యాసాలు ఇప్పించాలి. పిల్లల అభిప్రాయాలను నెలకు ఒకసారైనా పత్రికల్లో ప్రచురించేందుకు అవకాశాలు కోరాలి.
- ✦ మనదేశంలోని సాంస్కృతిక, మతపరమైన భిన్నత్వాన్ని ప్రేమించాలి. అలాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో ఉండాలి.
- ✦ స్త్రీలపట్ల గౌరవం, బాధ్యత కలిగించే కార్యక్రమాలను నిర్వహించాలి.

పాఠ్య విషయాల ద్వారా కూడా ఉపాధ్యాయులు ఎదుగుతున్న పిల్లలకు శాంతి ప్రాధాన్యతను వివరించిచెప్పాలి. పాఠ్యాంశాలలో అంతర్లీనంగా ఉన్న అంశాలను తగిన పద్ధతులలో బోధిస్తూ శాంతిపట్ల అనుకూలమైన వైఖరులు పెంపొందించాలి. శాంతి విలువలు పెంపొందించే అంశాలు కనుగొంటూ, అర్థం చేసుకొంటూ, బోధనాభ్యసన క్రియలు కొనసాగాలి. ప్రశ్నోత్తరాలు, కథలు, వ్యక్తి చరిత్రలు, క్రీడలు, ప్రాయోగిక చర్చలు, సంభాషణలు, వివరణాత్మక విలువలు, ఉదాహరణలు, పోలికలు, ఉపమానాలు, నాటకీకరణలు మొదలైన ప్రక్రియలన్నింటిని బోధనాభ్యసన కార్యక్రమంలో ఉపయోగించుకోవాలి. నీతిబోధన వ్యక్తి నుండి సమాజానికి కొనసాగాలి. పిల్లల్లో సామాజిక స్పృహ కలిగిన ఆలోచనలు, విశ్వజనీన భావనలు ఏర్పడాలి. ఉపాధ్యాయులు తన బోధనలో వీటిని ప్రతిబింబింపచేయాలి. ఉపాధ్యాయ విద్యలో కూడా శాంతి కాముకతను ఐచ్ఛిక అంశంగా చదివే అవకాశం కల్పించాలి.

అభ్యసన పథకాలు – అంచనాలు

దేశంలోని చాలా పాఠశాలలో 1 నుండి పది తరగతులు ఉంటాయి. కొన్ని రాష్ట్రాలలో 12వ తరగతి వరకు ఉంటుంది. 11, 12 తరగతులు ప్రీ యూనివర్శిటీ లేదా జూనియర్ కాలేజీలుగా కొన్ని రాష్ట్రాల్లో ఉన్నాయి. కొన్ని పాఠశాలలలో 2 లేదా 3 సం॥ల పూర్వ పాఠ్య ప్రాథమిక విద్య ఉంటుంది. విద్యను నాలుగు స్థాయిలుగా విభజించడం కేవలం మన నిర్వహణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేసినది. పాఠ్యప్రణాళిక తయారీ, ఉపాధ్యాయుల సంసిద్ధత వైపునుంచి చూస్తే ఈ విభజన న్యాయమే అనిపిస్తుంది. వయసునుబట్టి గ్రేడులను విభజించి తరగతివారీగా పాఠ్యాంశాల్ని, లక్ష్యాల్ని నిర్ణయించడంకంటే అభ్యసన స్థాయినిబట్టి గ్రేడులను నిర్ణయించడం మంచిది. ఒకే టీచరు లేదా ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్న స్కూళ్ళలో ఈ బహుళ (అభ్యసన) స్థాయి విభజన ప్రస్తుత బహుళ తరగతి

విధానంకంటే ఎంతో ఉపయుక్తమైనది. ఒక ఏడాదిలో బిడ్డ తరగతిలో ఏం నేర్చుకుంటాడనేది సంవత్సరం పొడుగునా అంచనా వేస్తూనే ఉండాలి. సంవత్సరం చివరన పరీక్షలు పెడితే చాలదు. పిల్లలు ఒక క్రమపద్ధతిలో నేర్చుకుంటారు. ఈ క్రమాన్ని మనం ఈ పద్ధతిద్వారా గౌరవించినట్లవుతుంది. ప్రస్తుత కనీస అభ్యసన స్థాయిల నిర్ణయం కేవలం పాఠాలకు మాత్రమే పరిమితమైన సంకుచితపద్ధతిలో ఉంది. సంవత్సరం చివర ఏం ఫలితం వచ్చింది అనేదాన్నిబట్టి మాత్రమే ఉంది. వివిధ స్థాయిల పాఠ్యప్రణాళిక, బోధన, మూల్యాంకనం ఎలా ఉండాలో, వాటి లక్షణాలేమిటో పరిశీలిస్తే పిల్లల క్రమవికాసానికి తగ్గట్లు టీచర్లు ప్రణాళికలు రూపొందించుకొనే వీలుంటుంది.

## 3.9 అభ్యసన పథకాలు

### 3.9.1 బాల్యారంభ విద్య (ECE)

6 లేదా 8 ఏళ్ళ వయస్సుకు ముందరి బాల్యారంభ దశ ఎంతో కీలకమైంది. జీవిత పర్యంతం జరగాల్సిన అభివృద్ధికి ఈదశలోనే పునాదులు ఏర్పడతాయి. తరువాత నేర్చుకోబోయే అభిరుచులు, విలువల మీద ఈ దశ ఎంతో ప్రభావం చూపుతుంది. బాల్యారంభ సంరక్షణా విద్యాతత్వం (ECE) లోని కీలకాంశం పిల్లలకు రక్షణ, అవకాశాలు, అనుభవాలు కల్పించడం. తద్వారా వారి భౌతిక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసానికి తోడ్పడటం. పాఠశాలకు సంసిద్ధం చేయడం. పిల్లల ఆరోగ్యాన్ని, పౌష్టికాహార అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని వారి మానసిక, విద్యాపరమైన అభివృద్ధికి దోహదపడే సమగ్ర దృక్పథం దీనికి అవసరం. ఏకీకృత విధానం దీనికి అవసరం. మన పాఠ్యప్రణాళిక, బోధన ఈ దృక్పథంతో ఉండాలి. పిల్లలకు సహజంగానే తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించి తెలుసుకోవాలనే కోరిక ఉంటుంది. ఈ దశలో బోధన అంతా పిల్లల కోరికలు, ప్రాధాన్యాలు, వారి అనుభవాల ఆధారంగానే ఉండాలి. నియంత్రించినట్లు ఉండకూడదు. పిల్లలలో చక్కని ప్రేరణలు, అనుభవాలు కలిగించే వాతావరణం ఉండాలి. పరిశీలించడానికి, ప్రయోగాలు చేయడానికి, స్వేచ్ఛగా భావాన్ని వ్యక్తం చేయడానికి, సామాజిక సంబంధాలు కలిగివుండడానికి అవకాశం ఉండాలి. వారికి అనువైన రక్షణనిచ్చి నమ్మకం కలిగించాలి. క్రీడలు, సంగీతం, అభినయ గీతాలు, కళలు మొదలైనవాటిని పలు కృత్యాల ద్వారా నిర్వహించాలి. వినడం, మాట్లాడడం, వ్యక్తీకరించడం వంటి అంశాల్ని నేర్పాలి. ఈ దశలో వినియోగించే బోధనా భాష పిల్లలకి బాగా పరిచయమైనదిగా ఉండాలి. వీరిలో శిశువుల నుండి పూర్వ ప్రాథమిక స్థాయి వరకు విభిన్న సమూహాల పిల్లలుంటారు. మనం కల్పించే కృత్యాలన్నీ ఈ అన్ని దశల పిల్లల అభివృద్ధికి దోహదపడేవిగా ఉండాలి. శిశువులు తమ చుట్టూ ఉన్న పరిసరాలకు ప్రతిస్పందిస్తారు. అందుచేత వీరికి పాటలు, అభినయగీతాలు, చేతులతోచేసే కృత్యాలు ఎక్కువగా ఉండాలి.

పసితనంలో పిల్లలో కలిగే వైకల్యాలను గుర్తించడానికి వీలుకలుగుతుంది. అందుచేత ఎక్కువకాలం గుర్తించలేకపోవడంవల్ల కలిగే నష్టాలను కొంతవరకు తగ్గించుకోవడానికి వీలుకలుగుతుంది. పిల్లలను రాయడానికి బలవంతం చేయకూడదు. ఇంగ్లీషును ద్వితీయ భాషగా నేర్పాలనుకొంటే చదవడానికి ముందుగా భాషను పరిచయం చెయ్యాలి. అంటే విన్పించాలి. మాట్లాడించాలి. అయితే పూర్వ ప్రాథమిక పాఠశాలను, ప్రాథమిక పాఠశాలలో చేరడానికి శిక్షణనిచ్చే వ్యవస్థగా మార్చకూడదు. ECCE 0–8 సం॥ల వరకు వయస్సుగల పిల్లలందరికీ అనుకూలంగా ఉండాలి. బోధనా విధానం ఏకీకృతంగా ఉండి, కృత్యాధార పద్ధతిని అనుసరించేదిగా ఉండాలి. రాతనేర్చుకోవడానికన్నా ముందు వినడం, మాట్లాడడం తర్వాత చదవడానికి ప్రాధాన్యతనివ్వాలి. ఇంటికి, బడికి మధ్య ఇది వారధిగా ఉండాలి. చాలా తేలికగా సహజంగా ప్రాథమిక విద్యలోకి ప్రవేశపెట్టేదిగా ఉండాలి.

ప్రస్తుతం ECCE కార్యక్రమాలు ప్రభుత్వ, ప్రైవేటు, స్థానిక సంస్థల రంగాల్లో నడుస్తున్నాయి. ఏదైనప్పటికీ వీటి నాణ్యత తక్కువ. వీటిలో గుణాత్మకత ఉండాల్సినంత లేదు. ఇవి చాలా తక్కువమంది పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పేద, బలహీన వర్గాలలో ఎక్కువమంది ప్రజలున్నారు. వీరి పిల్లలకు ఈ సేవలు అందుబాటులో లేవు. ఇవి నిరాశాజనకంగా, విసుగుపుట్టించే కార్యక్రమాలతో పిల్లలను ప్రాథమిక పాఠశాలలో ప్రవేశపెట్టడమే లక్ష్యమన్నట్టు నడుస్తున్నాయి. దీనికితోడు ఇంగ్లీషు నేర్పడం, పరీక్షలు పెట్టడం, ఇంటిపని ఇవ్వడం; పిల్లల సహజశీలతను, ఆడుకునే హక్కును హరించివేస్తున్నాయి. తల్లిదండ్రులను మభ్యపెట్టి అవాంఛనీయమైన ప్రలోభాలకు గురిచేస్తున్నాయి. ఇదొక వ్యాపార రంగంగా మారింది.

ECCE కార్యక్రమాలు పిల్లల సంపూర్ణ వికాసానికి దోహదపడాలి. పిల్లలందరికీ బాల్యారంభ విద్య అందుకునే హక్కు వుంది. దురదృష్టవశాత్తు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో 0-6 సం॥ల వయోసమూహాన్ని చదువుకునే హక్కునుండి మినహాయించారు. దీనితోపాటు వీటిలో చేరే పిల్లలకుకూడా అభ్యసన లక్ష్యాల్ని ముడిపెట్టడం జరుగుతోంది. పిల్లలందరికీ ECCE విద్య సమానంగా అందించాలంటే తగినంత వనరులు సమకూర్చాలి. దీనితోపాటు ఈ పాఠ్యప్రణాళికను సరళీకరించి, వీటిని వికేంద్రీకరించాలి. నిజమైన అభివృద్ధి పిల్లల్లో జరగాలంటే సరైన నియమాలను, మార్గదర్శకాలను బాల్యారంభ విద్య కోసం రూపొందించడం తక్షణ అవసరం. అన్ని స్థాయిలలోనూ సామర్థ్యాల అభివృద్ధి మరింత అవసరం.

### 3.9.2 ప్రాథమిక విద్య

1 నుండి 8వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల విద్యగా పరిగణిస్తున్నాం. ప్రస్తుతం రాజ్యాంగ సవరణ ద్వారా ఈ విద్య ప్రాథమిక హక్కుగా మారింది. ఈ దశ ప్రారంభం నుండి పిల్లవాడికి నియత బోధన ఇవ్వబడుతోంది. అనగా చదవడం, రాయడం, అంకెలు, లెక్కలు నేర్పుతున్నాం. చివరికివి విజ్ఞాన శాస్త్రం, సామాజిక శాస్త్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ 8 సం॥ల కాలం జ్ఞానాభివృద్ధిలో అద్భుతమైన కీలకమైనదశ. కారణాలు అన్వేషించడం, నైపుణ్యాలు అలవరచుకోవడం పని విద్యకు అవసరమైన అభిరుచులు, సామర్థ్యాలు పెంపొందించుకోవడం ఈదశలోనే జరుగుతుంది.

సార్వత్రిక విద్య కోసం మన ప్రయత్నాలు ముమ్మరం కావడంతో ప్రాథమికవిద్య మన విస్తృత సమాజంలోని అత్యధిక పిల్లలకు అందుబాటులోకి వచ్చింది. ఈదశలో బహుళత్వంతోకూడిన, ప్రమాణాలకోసం వెంపర్లాడాల్సిన అవసరంలేని విద్య అవసరం. ఈ పీరియడ్‌లో విద్య ఏకీకృత లక్షణాన్ని కలిగివుండాలి. ప్రధానంగా పిల్లలకు భాష నేర్చుకోవడంలో, దానిని వ్యక్తీకరించడంలో సామర్థ్యం కలిగించాలి. తద్వారా పిల్లలు అభ్యాసకులుగా అటు పాఠశాలలోనూ ఇటు బయటా ఆత్మవిశ్వాసం కలిగి ఎదుగుతారు.

పిల్లలలో భాషాసామర్థ్యం పెంపొందించడమే ప్రాథమిక పాఠశాల మొదటి లక్ష్యం. ధారాళంగా, అర్థవంతంగా మాట్లాడ్డం మొదట నేర్పాలి. దీనితోపాటు భాష పలురూపాల్లో వినియోగించుకోవడానికి, ఆలోచించడానికి, ఇతరులతో సంబంధాలు ఏర్పరచుకొని తన భావాలు వ్యక్తంచేయడానికి ఉపయోగపడాలి. తమ మాతృభాష నేర్చుకోగోరేవారికి ప్రత్యేకావకాశాల్ని కల్పించాలి. తక్కువ సంఖ్యలో పిల్లలున్నప్పటికీ షెడ్యూల్డు తెగల జాతుల పిల్లలకోసం ప్రత్యేక

భాషా ప్యాకేజీలు తయారుచేయాలి. ఇలాంటి అవకాశాల్ని కల్పించడంతోపాటు, భవిష్యత్ అవసరాల్ని కూడా దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. దీనిమీదనే గుణాత్మక విద్యనందించడానికి గల మన సామర్థ్యం ఎంతటిదో తెలుస్తుంది. దీన్ని సాధించాలంటే భారతదేశ ప్రజల బహుళ భాషా ప్రతిభను గుర్తించి దాన్ని నిలబెట్టాలి. ఈదశలో ఇంగ్లీషు కూడా నేర్పొచ్చు. కానీ ఇందుకోసం భారతీయ భాషల్ని మాత్రం బలిపెట్టకూడదు.

అంకెలతో ప్రారంభమై, అమూర్తభావాలవైపు ఆహ్లాదంగా సాగే గణిత ఆలోచనా పద్ధతి వికసించాలంటే నిర్దుష్టమైన అనుభవాల్ని గణితానికి జోడించాలి. 4వ తరగతి వరకు ఈ దశలో అభ్యసనంలోని ఇబ్బందుల్ని మనం గుర్తించి సరిచేయాలి. భాషలోనూ, గణితంలోనూ పునశ్చరణ చేసి దిశానిర్దేశం చేయాలి.

తమచుట్టూ ఉన్న పరిసరాల్ని అధ్యయనం చేయడానికి ఇలాంటి నిర్దుష్ట అనుభవాలు ఎంతైనా అవసరం. పిల్లలు పాఠశాలలో లోకజ్ఞానాన్ని దీనిద్వారా అనుసంధానించుకోగల్గుతారు. కాలం గడిచేకొద్దీ సబ్జెక్టుల పరంగా దేనికదిగా విభజించుకోవడం జరుగుతుంది. భావనలు అభివృద్ధి చెందుతాయి. ఆయా సబ్జెక్టుల పద్ధతులు, భాష అవగతమౌతాయి.

కళలు, చేతిపనులు నేర్చుకోవడం కేవలం సౌందర్యారాధనకోసం మాత్రమే కాదు. పరికరాలు ఉపయోగించడమెలాగో, నేర్చుకోవడం కోసం పనిపట్ల చక్కని అభిరుచులు, నైపుణ్యాలు పెంపొందించడానికి ఇది ఎంతో అవసరం. విద్యా ప్రణాళిక వివిధ పని అనుభవాల్ని పిల్లలకందించాలి. జీవితానికి అవసరమైన పని నైపుణ్యాల్ని వారికి చూపాలి. ఆటలద్వారా శారీరక అభివృద్ధిని సాధించడం తప్పనిసరి అంశంగా ఉండాలి. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం, కార్యక్రమాలు నిర్వహించడం, పాఠశాల బయటి ప్రదేశాలకు వెళ్ళడం వంటివి పాఠ్యప్రణాళికలో భాగం కావాలి. వీటిద్వారా విద్యార్థి సామాజికంగా, మానసికంగా ఎదుగుతాడు, సృజనశీలిగా మారుతాడు. ఇతరులతో సున్నితంగా ప్రవర్తించడం, బాధ్యతల్ని నిర్వహించడం వంటి లక్షణాలుకూడా దీనివల్ల అలవడుతాయి. ఈ విధానం మొత్తం ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చేదిగా ఉండాలితప్ప ఫలితాలకు ప్రాధాన్యత ఇచ్చేదిగా ఉండకూడదు. ఈ పద్ధతులు, సౌకర్యాలు పిల్లలందరికీ అందుబాటులో ఉండాలి. ఇతరులపట్ల సానుకూలంగా స్పందించడం, చొరవ చూపడం, బాధ్యతల్ని స్వీకరించడం దీనివల్ల సాధ్యమౌతుంది. కొన్నిటికి ప్రాధాన్యతనిచ్చి, వాటినే అవసరమైనవిగా ఎన్నుకొని మూసపోసిన పద్ధతిలో రూపొందించిన విద్యాప్రణాళికలవల్ల ఫలితమేమీ ఉండదు. పనిని పరిచయం చేయడం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని కల్పించడం క్రమంగా ఈదశలో మనం చేపట్టాలి.

### 3.9.3 సెకండరీ విద్య

సెకండరీ పాఠశాల కాలంలో పిల్లవానిలో అనేక శారీరక మార్పులువస్తాయి. వ్యక్తిగా గుర్తింపబడే కాలమిది. శక్తిసామర్థ్యాలు తొణికిసలాడే దశ యిది. ఈ దశలో పిల్లలు తార్కిక ఆలోచనలు కలిగివుంటారు. విషయాన్ని అర్థం చేసుకోవడం, జ్ఞానాన్ని రూపొందించుకోవడం ఈ దశలో చాలావేగంగా జరుగుతాయి. తనను గురించి తాను అర్థం చేసుకోవడంతోపాటు సమాజంతో సంబంధాలు పెంపొందించుకొనేందుకు ఉత్సాహపడే కాలంగా దీనిని పరిగణిస్తారు. ఈ స్థాయిలో ప్రవేశపెట్టబడే కోర్సులు వివిధ అంశాలతో కూడి విభిన్నంగా ఉండాలి. ఇష్టం వచ్చినవాటిని నేర్చుకునేందుకు పిల్లలు తమ సామర్థ్యాలను వినియోగించుకునే అవకాశం ఉండాలి. ఇందువల్ల వారు తమ అభిరుచులకు, కోరికలకు అనుగుణమైన కోర్సుల్ని ఎంచుకోగలుగుతారు. చాలామంది పిల్లలు ఈ దశలోనే పాఠశాల

మూసివేసి ఉత్పాదక రంగంలో చేరిపోతారు. దానిక్కావల్సిన నైపుణ్యాలు పెంపొందించుకుంటారు. ఎక్కువమంది పిల్లలు ఆర్థిక సామాజిక కారణాలవలననే బడి మానివేస్తారు. సెకండరీ విద్యను సార్వత్రికం చేయాలంటే పిల్లలకు అవసరమైన పని అనుభవాలు ప్రవేశపెట్టి అందులో తగిన శిక్షణ ఇవ్వాలి. గ్రంథాలయాలు అందుబాటులో ఉండడం, ప్రయోగశాలలద్వారా అనుభవం సాధించడం జరగాలి. పిల్లలందరికీ ఈవిధమైన అవకాశాలు కల్పించడానికి దృఢమైన కృషి జరగాలి.

ఈ రెండు సంవత్సరాల విద్యపై (9-10) 'బోర్డు పరీక్షల' నీలినీడ పడుతుంది. పరీక్షలలో వచ్చే మార్కులే భవిష్యత్తును నిర్ణయిస్తాయి. చాలా పాఠశాలలు మొదటి టర్మ్ పూర్తయ్యేసరికి 10వ తరగతి సిలబస్ పూర్తిచేసేస్తాయి! మిగిలిన సంవత్సర కాలమంతా ఆ పాఠాలు రివిజన్ చేస్తుంటారు. అందువల్ల పిల్లలు పరీక్షలకు 'చక్కగా' సంసిద్ధులౌతారు. 9-11 తరగతుల్లో పరీక్షలు లేవనే నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇలా పరీక్షలకోసం సాగే చదువుల తంతు అభ్యసనం మీద హానికరమైన ప్రభావం కలిగిస్తుంది. దీనిని పునఃపరిశీలించాలి. సవాలు చెయ్యాలి. ఎంతో ఫలవంతమైన బాల్యజీవితాన్ని పాఠశాల చదువు పేరుతో ఇలా ఉత్పాదరహిత కార్యక్రమంలో వెచ్చించడం నిష్ప్రయోజనం. సంవత్సరమంతా జరగాల్సిన దానిని సంక్షిప్తంచేసి  పక్కగా దారిమళ్ళించడం యోగ్యమైనదికాదు. ఇలా పరీక్షలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి దానికి పిల్లల్ని సంసిద్ధం చేయాల్సిన అవసరం ఎంతమేరకు ఉందో సరైందో టీచర్లు గుర్తించాలి. వివిధ ప్రణాళికా అంశాలు, ముఖ్యంగా ఆటలు, కళలు కూడా పరీక్షలలో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు జరగాలి. ఒక రాజీ దీనికోసం కుదరాలి. దీనితోబాటు పరీక్షా విధానంలో సవరణలల తేవాలి. పాఠ్య, సహపాఠ్య అంశాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చే విధానం రావాలి.

దేశంలో చాలా బోర్డులు సెకండరీ విద్యాస్థాయిలో పరిమితమైన కోర్సులను మాత్రమే ప్రవేశపెడుతున్నాయి. రెండు భాషలు (ఒకటి తప్పనిసరిగా ఇంగ్లీషు ఉంటుంది). గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రాలు మాత్రమే ప్రధానమైన సబ్జెక్టులుగా ఉంటున్నాయి. ఈ గ్రూపులలో ఇంగ్లీషు, గణితంలలో ఎక్కువమంది పిల్లలు ఉత్తీర్ణులు కాలేక, మళ్ళీ మళ్ళీ పరీక్షలు రాయడం లేదా గ్రూపు మార్చుకోవడం చేస్తుంటారు. పరీక్షలలో ఉత్తీర్ణత కావడం / కాకపోవడం అనే విధానాన్ని, 'పాస్ మార్కు' విధానాన్ని మనం పునఃసమీక్షించవలసిన అవసరం ఉంది (పరీక్షా విధానానికి సంబంధించిన సంస్కరణలు 6వ అధ్యాయంలో చర్చించబడ్డాయి).

కొన్ని బోర్డులు మాత్రం ఐచ్ఛికాంశాలను ఎన్నుకోవడంలో పరిధిని విస్తృతం చేశాయి. పిల్లల అభిరుచి మేరకు ఆర్థికశాస్త్రం, సంగీతం, మృణ్మయశాస్త్రంలాంటి అంశాలు కూడా ఎన్నుకొనే వీలు కల్పించాయి. ఈవిధమైన అవకాశాలను మరింత మెరుగుపరిచి, సంప్రదాయ వృత్తులను నేర్చుకొనే అవకాశం కల్పించాలి. మన వృత్తి కోర్సులు స్థానిక సమాజానికి సంబంధించి ఉత్పాదకతతో ముడిపడినవిగా ఉండాలి. ఉదాహరణకు గ్యారేజి నిర్వహణ, కుట్టుపని, పారామెడికల్ సేవలు మొదలైన అర్థవంతమైన వృత్తివిద్యా కోర్సులుండాలి. పాఠశాల బోర్డులు అధ్యయన కేంద్రాలను పాఠశాల వెలుపల కూడా ఎన్నుకొనేందుకు వీలుకల్పించాలి. మనదేశంలో చాలా వృత్తి విద్యాకోర్సులు గుణాత్మకతను కోల్పోయి పిల్లలకు అర్థవంతమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించలేకపోతున్నాయి. ఇవి చాలావరకు యోగ్యతా పత్రాలను ఇచ్చే కోర్సులుగా మారాయి. ఇవి ఉద్యోగం చేయడం నేర్చుకోవడానికి, ఉద్యోగం పొందడం నేర్చుకోవడానికి మధ్య వ్యత్యాసం లేకుండా చేశాయి.

### 3.9.4 హయ్యర్ సెకండరీ విద్య

హయ్యర్ సెకండరీ స్కూలు స్థాయిలో మనం బోధిస్తున్న విద్యాపరమైన వృత్తివిద్యాపరమైన అంశాలను పునఃపరీక్షించాల్సిన అవసరం ఉంది. బోర్డు పరీక్షలకు, ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేయడం, 'అకడమిక్ స్రవంతి' అనబడేదానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం, వృత్తివిద్యలు చతికిలబడడం ఈ దశలోని మన ప్రధాన వైఫల్యాలు. వీటని మొత్తం పునఃసమీక్షించాలి. ఈ రెండు సం॥లు దశలో విద్యార్థి అతని అభిరుచులను అభిప్రాయాలకు, భవిష్యత్తు అవసరాలకు తగిన కోర్సును ఎన్నుకొనే అవకాశం ఉండాలి.

ఐచ్ఛికాంశాలు ఎన్నుకోవడంలో పిల్లలకు వాటి అవసరం, వాటిలో తేడాలు ముందుగా తెలిసివుండాలి. వ్యక్తి అభిరుచులు, భవిష్యత్ జీవితం రెండూ ప్రధానంగా భావించాలి. వివిధ అంశాలను సంగ్రహించడం, వాటి అంతఃసంబంధాల్ని గుర్తించడం అవసరం. చదవడానికి ఎంపికచేసుకొన్న సబ్జెక్టుల్ని, ఆ సబ్జెక్టు అవతల అంశాల్ని అన్వేషించడం అవసరం.

చాలా బోర్డులు విభిన్నమైన అంశాలను అధ్యయనాంశాలుగా ప్రవేశపెడుతున్నాయి. వీటిలో తప్పనిసరిగా భాషలు ఉంటున్నాయి. పిల్లలు సబ్జెక్టులను ఎన్నుకోవడంలో నియత, అనియత నిర్బంధాలు పనిచేస్తున్నాయి. చాలా బోర్డులు అధ్యయనాంశాలపై సైన్స్ విభాగం, ఆర్ట్స్ విభాగం, కామర్స్ విభాగం అని నిర్బంధ విభజనలు విధించాయి. అయితే CBSE మాత్రం అధ్యయనాంశాల కాంబినేషన్లపై నిర్బంధం విధించదు. కానీ కొన్ని విభాగాలకు ఎక్కువ ప్రాచుర్యం లభించడం వల్ల వాటిని చదివేవారి సంఖ్య పెరిగింది. చాలా విభాగాలు పిల్లలు లేకపోవడం వలన మూసిపేయడం జరుగుతోంది. భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలుకూడా అంశాలలోనే కోర్సులు నిర్వహించే పరిస్థితి వస్తుంది. +2 స్థాయిలో ఎక్కువ ప్రాచుర్యం పొందిన కోర్సులకే విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా స్థానం ఉంటుందన్నమాట. దీనికి భిన్నంగా వివిధ కాంబినేషన్ల కోర్సులకు అవకాశం ఉండాలి. ఉదాహరణకు గణితం, భౌతికశాస్త్రం, తత్వశాస్త్రం లేదా సాహిత్యం, జీవశాస్త్రం, చరిత్రలాంటి కాంబినేషన్లు పిల్లలకు లభించాలి.

ఆధునిక కాలంలో పాఠశాలలు ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకే ప్రాధాన్యతను ఇస్తున్నాయి. వీటికిగల ప్రాచుర్యం వల్ల ఎక్కువమంది వీటినే ఎన్నుకుంటున్నారు. దేశంలో చాలాచోట్ల ఆర్ట్స్, ఇతర సాధారణ అంశాలు అధ్యయనాంశాలుగా ఎన్నుకొనే పిల్లలకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. పాఠశాలలు సంప్రదాయేతర నూతన అధ్యయనాంశాల్ని ఎన్నుకోవడాన్ని నిరుత్సాహపరుస్తున్నాయి. టైంటేబిల్ కుదరదని చెప్పి ఇలా చేస్తున్నాయి. ఇది సరికాదు. అన్ని అధ్యయనాంశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. ఒకవేళ ఒక అధ్యయనాంశంలో తక్కువమంది పిల్లలున్నట్లయితే ప్రక్క స్కూళ్ళతో సంబంధం ఏర్పరచుకొని, రిసోర్స్ టీచరును నియమించుకొని పిల్లలు వీటిని చదువుకొనే అవకాశం కల్పించవచ్చు. రిసోర్సు టీచరును బ్లాకు స్థాయిలో నియమించి అవసరమైన అన్నిచోట్లకు సేవలు అందించమని చెప్పొచ్చు. ఈ విషయంలో పాఠశాల బోర్డులు ముఖ్యపాత్ర వహిస్తాయి.

+2 స్థాయిలో ప్రవేశపెట్టే అధ్యయనాంశాలన్నీ అభివృద్ధిపరచాలి. నూతన జ్ఞానాన్ని వాటిలో పొందుపరచాలి. బహుళ అధ్యయనాంశ పద్ధతిని అభివృద్ధి చేసుకోవాలి. అధ్యయనాంశాలలో వేటికి ప్రాధాన్యత ఉంటే వాటిని పిల్లలు చదువుకొనేందుకు అవకాశం ఉండాలి. ఉదాహరణకు చరిత్ర అటు ఆర్కియాలజీ ఇటు ప్రపంచ చరిత్ర చదువుకొనేవారికి ఉపయోగపడుతుంది. అలాగే భౌతికశాస్త్రం ఖగోళశాస్త్రం చదువుకొనే వారికి ఉపకరిస్తుంది.

సిలబస్ పూర్తిచేయడమే ప్రధానంగా భావించడంవల్ల చాలా ప్రాధాన్యతగల అంశాలు అంటే, ప్రాక్టికల్స్, క్షేత్ర పర్యటనలు, పరిశీలనా గ్రంథాలు చదవడం, ప్రాజెక్టు వర్కు నిర్వహించడం, ప్రదర్శించడం మొదలయినవన్నీ పాక్షికాంశాలుగా మారుతున్నాయి. అన్ని వసతులు గల ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్లు నేడెంతో అవసరం. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఆవిధమైన వనరుల్ని ఏర్పరుచుకోవాలి.

అకడమిక్ విద్య ద్వారా వృత్తివిద్యలకు వెళ్ళేవారి కోసమో, అధ్యయనం, పరిశోధన చెయ్యాలనుకొన్న వారికోసమోగాదు మన వృత్తివిద్యలుండేది. చదువు మధ్యలో పని నేర్చుకోవాలనుకొనేవారికోసమే మన వృత్తివిద్యలు ఉద్దేశింపబడ్డాయి. కానీ మేము అకడమిక్ వృత్తివిద్యా కోర్సుల్ని రెండింటినీ మిళితం చేయమంటున్నాము. దీనికి మూడు కారణాలున్నాయి. మొదటిది వృత్తివిద్యల్లో కూడా చాలామార్పులవసరమవుతున్నాయి. వీటి పాఠ్యప్రణాళికలో అకడమిక్ పునాది, అకడమిక్ నైపుణ్యం గల అంశాలుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండోది అకడమిక్ స్రవంతిలో చదువుతున్న పిల్లలు వారు చదువుతున్న కోర్సులకనుగుణమైన వృత్తివిద్యా కోర్సుల్ని ఎన్నుకోవల్సిన అవసరం నేడెంతైనా ఉంది. చివరగా మన పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరాలన్నా, విస్తృతావకాశాల్ని పొందాలన్నా అకడమిక్, వృత్తి కోర్సుల్ని ఒకటిగా మార్చడం అవసరం. కాలక్రమంలో ఇలాంటి విద్య రావాలి.

ఈ దశలో మన పిల్లలకు మంచిశిక్షణ పొందిన వృత్తినిపుణుల మార్గదర్శకత్వం తప్పనిసరి. వృత్తికి సంబంధించిన అవగాహనను కల్గించేందుకు, వృత్తుల్ని అన్వేషించుకొనేందుకు ఇది ఉపయోగపడుతుంది. యూత్ క్లబ్బుల్లాంటివాటిద్వారా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవకాశాలు కల్పించాలి. ఈదశలో ఇది ఎంతో అవసరం. కనీసం ఈ సదుపాయాలు, వీటి సమాచారం బ్లాకు స్థాయిలోనైనా మన పిల్లలకు అందుబాటులో ఉండాలి.

### 3.9.5 ఓపెన్ స్కూళ్ళు, బ్రిడ్జి స్కూళ్ళు

నేషనల్ ఓపెన్ స్కూలుతో ప్రారంభించి ఇపుడు దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఓపెన్ స్కూళ్ళు నడుపుతున్నాయి. ఇవి పిల్లలకు తగిన వెసులుబాటు కల్పిస్తాయి. వీటిలో విస్తృత పరిధిలో అధ్యయనాంశాలు అందుబాటులో ఉంటాయి. పరీక్షల వ్యవస్థ కూడా సరళంగా ఉంటుంది. ఒక బోర్డు నుండి మరొక బోర్డుకు సులభంగా మారవచ్చు. ఇవి మానవీయకోణంలో బోధనను అందజేస్తున్నాయి. ఓపెన్ స్కూళ్ళ సమాచారం విస్తృతంగా వ్యాప్తి చెందాలి. బోర్డు పరీక్షల కంటే వీటి పరీక్షల స్థాయి తక్కువనే దురభిప్రాయాన్ని పోగొట్టాలి. ఇతర బోర్డు పరీక్షలలాగే ఓపన్ స్కూళ్ళ పరీక్షలు కూడా దగ్గర దగ్గరగా జరపడం ద్వారా విద్యా సంవత్సరాన్ని కోల్పోయే పరిస్థితిరాకుండా నివారించవచ్చు.

బడి బయట ఉండే పిల్లలు ఒక స్థాయికి చేరుకొని, తమ వయస్సుకు తగిన తరగతిలో మన పాఠశాలల్లో చేరడానికి బ్రిడ్జి స్కూళ్ళు మనదేశంలో చాలాచోట్ల నిర్వహిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్కూళ్ళకోసం జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయించిన పాఠ్యప్రణాళిక ఉండాలి. అప్పుడే వీటి లక్ష్యం నెరవేరుతుంది. లేకుంటే వాళ్ళ బాల్యపు హక్కులు భంగం కావడమే మిగులుతుంది. ఈ స్కూళ్ళకు కావల్సిన బోధనా సామగ్రి మీదా, బోధనా వ్యూహాలమీదా మంచి పరిశోధన జరగాలి. ఖచ్చితంగా ఇవి అమలు అయ్యేలా నియమనిబంధనలుండాలి. వీటిని పాటించే పద్ధతులుండాలి. ఈ స్కూళ్ళకు తగిన వసతులు, సదుపాయాలు ఉండాలి. చివరగా ముఖ్యంగా రెగ్యులర్ పాఠశాలల్లో చేర్చాక ఈ పిల్లలకు వీరికి విద్యాపరంగా, సామాజికంగా మద్దతు ఉండాలి.

## 3.10 మూల్యాంకనం

భారతీయ విద్యలో మూల్యాంకనం అంటే పరీక్షలనీ, పరీక్షలంటే ఒత్తిడీ ఆత్రుతా అనీ అర్థం! ఈ పరీక్షా విధానాన్ని గురించి పట్టించుకోకపోతే మనం చెప్పుకొన్న విద్యాప్రణాళికా లక్ష్యాలకు అర్థమే వుండదు. మన పిల్లల అభ్యసనం అర్థవంతంగా, ఆహ్లాదకరంగా ఉండకుండా అడ్డుకొంటున్న ఈ పరీక్షల్ని గురించి మేమెంతో ఆందోళన చెందుతున్నాం. మన బోర్డు పరీక్షలు పూర్వప్రాథమిక విద్యనుంచి అన్ని స్థాయిల్లోనూ మన బోధనా పద్ధతులమీద వ్యతిరేక ప్రభావాన్ని కల్గిస్తున్నాయి.

ఇదే సందర్భంలో మంచి మూల్యాంకనా పద్ధతుల్ని ఏర్పర్చుకోగల్గితే అవి మన పిల్లల అభ్యసన క్రమానికి ఎంతో ఉపకరిస్తాయి. ఈ అధ్యాయంలో మనం ముల్యాంకాన్ని గురించి చర్చించుకొందాం. ఎందుకంటే ఇది మన పాఠశాలల్లోని బోధనాభ్యసన ప్రక్రియలతో ఎంతో సన్నిహితంగా ముడిపడివున్న అంశం. పరీక్షలకు సంబంధించి, ప్రత్యేకంగా బోర్డు పరీక్షలకు సంబంధించి 5వ అధ్యాయంలో వివరంగా చర్చించాము.

### 3.10.1 మూల్యాంకనం లక్ష్యం

విద్య వ్యక్తికి అర్థవంతమైన జీవితాన్ని ఇచ్చే కార్యక్రమం. ఈ క్రమంలో ఈ విద్య ఎంతవరకు ఫలప్రదంగా ఉపయోగపడింది అనే విషయాన్ని విశ్వసనీయ పద్ధతిలో లెక్కించడమే మూల్యాంకనం. ప్రస్తుతం అమలులోఉన్న మూల్యాంకనా విధానాలతో తక్కువ పరిధిగల అంశాలను మాత్రమే అంచనా వేయగలం. ఈ పద్ధతి ఆచరణ యోగ్యత లేదు. ఇది వ్యక్తి పూర్తిస్థాయి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఉపయోగపడదు. నిర్ణయించిన విద్యాలక్ష్యాలు సాధించడానికి కూడా అంతగా ఉపయోగపడదు.

ఈ పరిమితమైన ప్రయోజనాన్ని సాధించాలన్నా, విద్యార్థిలోని అకడమిక్ అభివృద్ధిని మాత్రమే పరీక్షించాలన్నా ఉపాధ్యాయుడు తాను పాఠం బోధించడానికి ముందే దీనికితగ్గట్టు సంసిద్ధుడై ఉండాలి. మూల్యాంకనా పద్ధతులేగాదు ఏ ప్రమాణాల ప్రాతిపదికన మూల్యాంకనం చెయ్యాలో, ఏరకమైన సాధనాల్ని దీనికోసం ఉపయోగించాలో కూడా ఉపాధ్యాయుడు నిర్ణయించుకొనివుండాలి. విద్యార్థి సాధించాల్సిన ఫలితంపట్ల కూడా ఉపాధ్యాయుడికి స్పష్టత వుండాలి. మూల్యాంకనం ఉద్దేశ్యం బోధనాభ్యసన పద్ధతిని, పరికరాలను మెరుగుపరుచుకోవడం. పాఠశాలలోని వివిధ స్థాయిలలో నిర్ధారించుకున్న లక్ష్యాల్ని సమీక్షించి, పిల్లలు సామర్థ్యాల్ని సాధింపబడ్డాయో, ఎంతవరకు పెంపొందించగలిగామో అంచనా వెయ్యడంకూడా దీని లక్ష్యం. దీని అర్థం పరీక్షలు నిరంతరంగా నిర్వహించమనికాదు. రోజువారీ కృత్యాలు, అభ్యాసాలు ఫలవంతంగా నిర్వహించడంద్వారా దీన్ని సాధించవచ్చు.

చక్కగా రూపొందించిన అంచనా పద్ధతి, 'రిపోర్టు కార్డులు' విద్యార్థులకు ఇవ్వడంద్వారా వారి పిల్లల అభ్యాసాన్ని అంచనావేసి, సాధించాల్సిన ప్రమాణాల్ని నిర్దేశించవచ్చు. పిల్లల అభ్యసన స్థాయిని, అభివృద్ధి క్రమాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి. అయితే ఇది విద్యార్థుల మధ్య పోటీని పెంచడానికికాదు. పిల్లల్ని వేరుపరచి ర్యాంకులు ఇవ్వడానికి కాదు. పిల్లల్లో న్యూనతాభావాన్ని కల్గించడానికి కాదు.

చివరిగా నిర్వహించే మూల్యాంకనం విద్యార్థికి కోర్సును పూర్తిచేసినట్లుగా ఇచ్చే సర్టిఫికెట్. దీనిద్వారా ఇతర స్కూళ్ళు, విద్యా సంస్థలు సమాజం విద్యార్థి అభ్యసనంలోని నాణ్యతను గుర్తిస్తుంది.

మూల్యాంకన ఉద్దేశ్యం ఇది కాదు

- ✦ పిల్లలు భయంతో చదువుకునేలా ప్రేరేపించడంకోసం
- ✦ పిల్లల్ని 'నిదానంగా నేర్చుకునేవారు', 'తెలివిగలవారు', 'సమస్యాత్మక పిల్లలు' అని ముద్రవేయడంకోసం. పిల్లవాడి మీదనే బాధ్యంతనంతా పెట్టి బోధనా పద్ధతుల బాధ్యతను తప్పించడంకోసం.
- ✦ పునశ్చరణ అవసరమైన విద్యార్థుల్ని గుర్తించడం కోసం (ఇది బోర్డు పరీక్షల్లోగాదు, టీచరు పాఠం బోధిస్తున్న క్రమంలోనే ఇలాంటి వారిని అంచనా వేస్తాడు).
- ✦ నేర్చుకోవడంలోని కష్టాలు, సమస్యాత్మకాంశాలు గుర్తించడంకోసం.

మూల్యాంకనం పునశ్చరణావసరాల్ని గుర్తిస్తుందని, ఉపాధ్యాయుడు తదనుగుణంగా పునశ్చరణ ప్లాన్ చెయ్యడానికి ఉపకరిస్తుందని ఓ అభిప్రాయం ఉంది. ఇది మన పాఠ్యప్రణాళికా రచనలోకి బోలెడు సమస్యల్ని తెచ్చింది. పునశ్చరణ అనే పదాన్ని ప్రత్యేక సమస్యలున్న (చదవలేకపోవడం, సారాన్ని అర్థం చేసుకోలేకపోవడం, స్థాన విలువలు తెలుసుకోలేకపోవడం, గణితసంజ్ఞల్ని అర్థం చేసుకోకపోవడం) పిల్లలకు అన్వయించుకోడం మంచిది. ఉపాధ్యాయులు సమర్థవంతంగా రెమెడియల్ పద్ధతులు పాటించడానికి తగిన శిక్షణ పొందివుండాలి. దీంతోపాటు విద్యార్థిని ఒక్కొక్కర్ని వేర్వేరుగా పట్టించుకొనేందుకు తగ్గ సామగ్రి కూడా ఈ పునశ్చరణకు అవసరం. ఇదొక నిరంతర క్రమం. దీనికి జాగ్రత్తతోకూడిన పరిశీలన అవసరం. పునశ్చరణ అనేపదాన్ని విచక్షణారహితంగా వాడడంవల్ల తప్పంతా పిల్లవాడిమీదనే పడుతోంది. చదువులు వెనకపడడానికి అతడొక్కడే బాధ్యుడవుతున్నాడు.

### 3.10.2 అభ్యాసకుల్ని అంచనా వెయ్యడం

పిల్లల అభ్యసన నైపుణ్యంపై అంచనా వేయడంలో ఒక సమగ్రత అవసరం. సృజనాత్మకమైన, వినూత్నమైన, సమగ్రమైన పాఠ్యప్రణాళిక పాఠ్యపుస్తకాల్లోని అంశాలను కంఠస్తంచేసే చదువును మూసబోసిన పద్ధతుల్లో పరీక్షించడాన్ని త్రోసిపుచ్చుతుంది. ఏదో కొన్ని ప్రత్యేక సబ్జెక్టుల్లో పరీక్షించడానికి బదులు, అభ్యసనం పట్ల విద్యార్థి వైఖరి, అభిరుచి; స్వతంత్రంగా అభ్యసించే సామర్థ్యం తదితరాంశాల్ని పరీక్షిస్తుంది.

### 3.10.3 బోధనా సమయంలో అంచనా

రిపోర్టింగ్ కార్డులు ఉపాధ్యాయుడు తన విద్యార్థి గురించి వ్యక్తిగతంగా ఆలోచించడానికి అవకాశం ఇస్తాయి. వీటివల్ల ఆ టర్మ్‌లో విద్యార్థి ఏమి నేర్చుకున్నాడో ఉపాధ్యాయుడు తెలుసుకునే వీలు కలుగుతుంది. దీనినిబట్టి విద్యార్థికి తగిన పనిని అప్పగించడానికి, అభివృద్ధి పరచడానికి వీలుకలుగుతుంది. ఈవిధమైన కార్యాలు రూపొందించాలంటే రోజువారీ బోధనాభ్యసన ప్రక్రియలో విద్యార్థులను వ్యక్తిగతంగా పరిశీలించవలసివుంటుంది. టీచరు-పిల్లల మధ్య సంభాషణలు అవసరమవుతాయి. పిల్లల గుణాత్మకతను అంచనా వేయడానికి నిరంతర పరిశీలన అవసరం. వీటికోసం ప్రత్యేక పరీక్షలు అవసరంలేదు. రోజువారీ డైరీ నిర్వహించడంవల్ల నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయడానికి వీలుకలుగుతుంది. డైరీనుండి ఒక వారంలో సేకరించిన సమాచారం (ఉదా :- "కిరణ్ తన పనిలో ఉత్సాహంగా ఉన్నాడు. అతను పుస్తకాలంటే ఇష్టపడతాడు. సంక్షిప్తంగా, సరళంగా ఉండే స్పష్టమైన భాషను ఇష్టపడతతాడు. అలావుంటే సులభంగా అర్థం చేసుకోగలడట. జవాబులు క్లుప్తంగా

రాస్తాడు. ప్రయోగాలద్వారా నేర్చుకోవడం అంటే అతనికి చాలా ఇష్టం") ద్వారా, వివిధ స్థాయిల సమాచారంతో ఉపాధ్యాయుడు, పిల్లల అభ్యసన విధానాన్ని క్రమబద్ధంగా రికార్డు చేయడానికి వీలుకలుగుతుంది.

ఇలాంటి అంచనాలవల్ల అభ్యసనంలోని సమస్యల్ని అర్థంచేసుకొని సవరించుకొనే వీలుంటుందని మనకు నమ్మకం ఉంది. బోధనాపద్ధతుల్ని అర్థంచేసుకొన్న వారెవ్వరూ దీన్ని అంగీకరించరు. మానసికమైన సమస్యలు మనం పరీక్షలు పెట్టి కనుక్కోవల్సినవిగా ఉండవు. ఉపాధ్యాయుడు బోధిస్తున్న క్రమంలోనే వీటిని పసిగట్టగల్గుతాడు. వేసే ప్రశ్నలవల్ల, ఇచ్చే చిన్నచిన్న పనులవల్ల ఇది అర్థమైపోతుంది. పిల్లల అభ్యసనం పట్ల బాధ్యతతో, సరైన సరళమైన ప్రణాళికతో దీన్ని ఉపాధ్యాయుడు రోజువారీ బోధనాక్రమంలోనే సరిచేసే ప్రయత్నం చేస్తాడు.

### 3.10.4 మార్కులకోసం పరీక్షించకూడని విద్యా ప్రణాళికాంశాలు

విద్యాప్రణాళికలోని ప్రతి అంశాన్ని పరీక్షించవలసిన అవసరంలేదు. ఒకవేళ విషయం తప్పనిసరిగా నేర్చుకోవలసినయినదప్పటికీ పరీక్షించడమనే దృష్టితో చూడకూడదు. ఉదా :- పని అనుభవం, వ్యాయామ విద్య, సంగీతం, కళలు ఇవన్నీ విద్యాప్రణాళికాంశాలే. అలాగని పరీక్షలు వీటిలోకూడా నిర్వహించాలనుకోరాదు. పరీక్షలు లేనందువల్ల ఈ అంశాలకు విద్యాప్రణాళికలో తక్కువ ప్రాధాన్యత ఉన్నట్లు కాదు. ఈ రంగాలకు తగినంత సామగ్రి, అవసరమైన వనరులు లభించడంలేదు. అందువల్ల వీటినిగురించి పెద్దగా కృషిచేయనవసరం లేదనే భావన ఏర్పడింది. వీటికి కేటాయింపబడిన సమయం కూడా తగ్గించి ఇతర అంశాలకు వాడుకుంటున్నాం. మనం తీవ్రంగా చర్చించాల్సిన అంశమిది. మార్పులు ఇవ్వనప్పటికీ ఈ రంగాల్లో పిల్లల అభివృద్ధిని మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉంది. ఈ విషయాలల్లో పిల్లలు ఎలా పాల్గొంటున్నారు? వారి అభిరుచులు ఏమిటి? ఏస్థాయిలో స్పందిస్తున్నారు? వారి సామర్థ్యాలు, నైపుణ్యాలు ఎలా పెంపొందుతున్నాయి మొదలైన అంశాల్ని పరిశీలించాలి. వీటిద్వారా పిల్లలు ఈ రంగాలలో ఏమి నేర్చుకుంటున్నారు? ఎలా నేర్చుకుంటున్నారు అనే విషయం టీచరు అర్థం చేసుకోవడానికి వీలుకలుగుతుంది. పిల్లలచేత స్వీయ నివేదికలు (Self reports) తయారుచేయించడంవల్ల కూడా ఆయా రంగాలలో పిల్లలు ఏమి నేర్చుకున్నారు అనే విషయంపై టీచరుకు అవగాహన కలుగుతుంది. దీనిద్వారా విద్యాప్రణాళికను ఎలా మెరుగుపరుచుకోవాలో వాళ్ళకు అర్థమవుతుంది.

**సామర్థ్యాలు**

మన ఉపరితల పాఠ్య గ్రంథాలకూ, వాటికి సంబంధించిన మూల్యాంకనానికీ లొంగనివి సామర్థ్యాలు. కానీ కనిష్ఠ అభ్యసన ప్రమాణాల (MLL) దృష్టిలో మాత్రం సామర్థ్యాల్ని, ఉపసామర్థ్యాలు, ఉపనైపుణ్యాలు ఇలా ముక్కలుచేసి చూడ్డం జరుగుతోంది. ఈ ఉపనైపుణ్యాలనే నైపుణ్యాలుగా లెక్కించేస్తున్నారు. ఎంతసేపటికీ ప్రవర్తననీ, సాధించిన ఫలితాల్నీ మాత్రమే ప్రమాణాలుగా మనం తీసుకోవడంతో భావనలు అసలు లెక్కలోకి రాకుండాపోతున్నాయి. ఈవిధమైన యాంత్రిక విభజనవల్లా, వీటిని సాధించడానికి మనం ఉపయోగించే కఠినమైన టైంటేబిల్‌వల్లా బోధనపట్ల మన శ్రద్ధంతా మారిపోతోంది. ఈ ముక్కముక్కల నైపుణ్యాలకంటే సమగ్రమైన సామర్థ్యం ఒకటుందని మరిచిపోయే స్థితి ఏర్పడింది.

ఇలాంటి జ్ఞానశకలాన్ని బోధించడం, వాటిని, పరీక్షించడం అర్థరహితమైనది, ఆచరణకు అసాధ్యమైనది.

### 3.10.5 మూల్యాంకనా రూపకల్పన, నిర్వహణ

మూల్యాంకనాలు, పరీక్షలు విశ్వసనీయంగా నమ్మదగినవిగా ఉండాలి. ఇవి సరైన, న్యాయమైన పద్ధతుల్లో అభ్యసనాన్ని కొలవగలగాలి. చాలాకాలంగా మన పరీక్షలు "పాఠ్య పుస్తకాలలోని అంశాలను పిల్లలు ఎంతవరకు గుర్తు పెట్టుకోగలిగారు, ఎంతవరకు గుర్తుతెచ్చుకోగలిగారు" అనేదాన్ని మాత్రమే అంచనావేసేవిగా ఉన్నాయి. ఈ పరిస్థితి కొనసాగినంతవరకు మన విద్యాప్రణాళికకు, అభ్యసనానికి విఘాతం తప్ప మరేమీ జరగదు. మొదట జ్ఞానాధారిత అంశాల్ని పరీక్షించాలి. పిల్లలు ఏమి నేర్చుకున్నారో, నేర్చుకొన్న జ్ఞానాన్ని సమస్యా పరిష్కారానికి ఏమాత్రం వాడుకోగల్గుతున్నారో, వినియోగించుకోగల్గుతున్నారో తర్వాత పరీక్షించాలి. పిల్లల ఆలోచనాక్రమాన్ని, సమాచారాన్ని సేకరించగల సామర్థ్యాన్ని, దాన్ని ఉపయోగించుకోగల నేర్పును, దాన్ని విశ్లేషించి నిగ్గు తేల్చుకొనే నైపుణ్యాన్ని కూడా అంచనా వెయ్యాలి.

దిద్దిన సమాధాన పత్రాల్ని పిల్లలకివ్వాలి. వాటిని చూచి పిల్లలు మళ్ళీ సరైన సమాధానాలతో రాస్తారు. వాటిని టీచరు పరిశీలించి ఈ పద్ధతిద్వారా పిల్లలు ఎంత నేర్చుకోగలిగారో తెలుసుకుంటారు.

మూల్యాంకనం కోసం రూపొందించే ప్రశ్నలు పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకూడదు. తరచుగా టీచర్లు గైడ్‌లలో ఉండే సమాచారం తప్ప అదనంగా నేర్చుకొని రాయడానికి పిల్లలకు అనుమతి, అవకాశం ఇవ్వరు. ప్రశ్నలు ముగింపు లేనివిగా, సవాలు విసిరేవిగా ఉండాలి. చక్కని ప్రశ్నలను రూపొందించడం ఒక కళ. ఉపాధ్యాయుడు సమయాన్ని వెచ్చించి, ఆలోచించి అలాంటి మంచి ప్రశ్నలను తయారుచేసుకోవాలి. జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి ఈవిధమైన చక్కని ప్రశ్నలు రాబట్టవచ్చు. అన్ని ప్రశ్నాపత్రాల్ని కఠినత్వస్థాయినిబట్టి గ్రేడ్ చేయాలి. అందువల్ల పిల్లలందరూ తమ సామర్థ్యాన్ని ఒక స్థాయి వరకు ప్రదర్శించుకోగల్గుతారు. పిల్లలకు సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, విశ్వాసం దీనివల్ల ఏర్పడతాయి.

పుస్తకాలు చూసి రాసే పరీక్షా పద్ధతి పరీక్షా పద్ధతుల్లో ఒక సవాలు. దీన్ని మనం స్వీకరించి అన్ని దశల్లోనూ మన పాఠశాలల్లో అమలుపరచాలి. అభ్యసనాన్ని ఇతరత్రా అన్వయించడం, విషయాన్ని వ్యాఖ్యానించడంపై కేంద్రీకరించిన ప్రశ్నలు దీనికవసరం. దీన్ని ఉపాధ్యాయులకు, ప్రశ్నాపత్రాల రూపకర్తలు నేర్చుకోవాలి. ఇలాంటి పరీక్షల్ని పెద్దఎత్తున నిర్వహించి అందరికీ పరిచయం చెయ్యాలి. దీనివల్ల ఉపాధ్యాయులకు ఈ పరీక్షా ఫలితాలమీద విశ్వాసం కుదురుతుంది. అలాగే ప్రాజెక్టు పనుల్ని, ప్రయోగశాలలోని ప్రయోగాలను కూడా సమర్థవంతంగా విశ్వసనీయ పద్ధతుల్లో పరీక్షించాల్సివుంటుంది.

పోటీ ప్రేరణగల్గించవచ్చు. కానీ ఈ ప్రేరణ సహజమైందిగాదు. బయటనుంచి వచ్చింది. ఈ రకమైన ప్రేరణని కల్గించడం సులభం. అందువల్ల టీచర్లు పిల్లలు ప్రతిభను ప్రదర్శించాదనికి ఈ మార్గాన్ని ఎన్నుకొంటారు. పోటీతత్వం పెంచాలనే ఉద్దేశంతో పూర్వప్రాథమిక స్థాయినుంచే ఉపాధ్యాయులకు ర్యాంకులిస్తుంటారు. ఈ పోటీ ధోరణి పిల్లల అభ్యసనంమీద వ్యతిరేక ప్రభావం కల్గిస్తుంది. పైపైన చదివితేచాలు ఈ పరీక్షల్లో సులభంగా రాణించవచ్చు. అందువల్ల పిల్లలు స్వంత ప్రయత్నాల్ని మానుకొంటారు. స్వంత అభిరుచుల్ని వదులుకొంటారు. మార్కులతో సంబంధంలేని అంశాల్ని వదిలేస్తారు. ఇది పాఠశాల సంస్కృతిపైన చెడు ప్రభావం కల్గిస్తుంది. వ్యక్తిగత ధోరణిని పెంచుతుంది. సమిష్టి పని విధానానికి నష్టం చేస్తుంది. మరీ ఘోరమేమంటే త్రైమాసిక, అర్థసంవత్సర పరీక్షల్నికూడా కఠినంగా మార్చడం, పరిశీలకుల్ని పెట్టి, పరీక్షా పత్రాన్ని రహస్యంగా ఉంచి వీటికి అనవసరమైన ప్రాధాన్యతను

కల్గించడం. మాధ్యమిక పాఠశాల దశదాకా ఈ విధానం పిల్లలమీద ఎలాంటి చెడు ప్రభావాన్ని కల్గించిందో తెలియకపోవచ్చు. కానీ ఇవి పిల్లలమీద తీవ్ర ఒత్తిడిని పెడతాయి. పాఠశాలలు ఉపాధ్యాయులు తమను తాము ప్రశ్నించుకోవాల్సిన తరుణం వచ్చింది. ఈ విధానాల వల్ల ఏమైనా ఫలితం ఉందా? అభ్యసనానికి ఈ విధమైన మార్కులు, ర్యాంకులు నిజంగా అవసరమా?

### 3.10.6 స్వయం మూల్యాంకనం - పునఃశ్చరణ

మూల్యాంకనం యొక్క ప్రధాన ఉద్దేశ్యం "బోధనాభ్యసన ప్రక్రియలో ఉపాధ్యాయుడు, విద్యార్థి ఏమి సాధించారు అనే అంశాన్ని కొలవడం - ఫలితాల ఆధారంగా ఈ బోధనా ప్రక్రియను ఎలా మెరుగుపరచుకోవాలో నిర్ణయించుకోవడం" ఫీడ్‌బ్యాక్ చేయడంవల్ల విషయాన్ని పునశ్చరణ చేసుకోవడంతోబాటు అంచనా వేసుకొని మెరుగుపరుచుకోవచ్చు. ఈ పద్ధతి పరీక్షల భయం లేకుండా చేస్తుంది.

పిల్లల సమక్షంలోనే సరిచేయడం, గ్రేడింగ్ ఇవ్వడం వలన వారు తమ తప్పుఒప్పులను తెలుసుకొంటారు. తప్పులు ఎలా జరిగాయో గ్రహించగలుగుతారు. పిల్లల్ని ఎందుకు ఇలా రాశారో / చేశారో అడిగి తెలుసుకొని పిల్లల ఆలోచనలను అర్థం చేసుకొనే వీలు కలుగుతుంది. అందువల్ల పిల్లలకు పరీక్షలు - మార్కుల బెంగ ఉండదు. పిల్లలు తమ తప్పుల మీద దృష్టి ఉంచి వాటిని సరిదిద్దుకొని నేర్చుకునే అవకాశం కలుగుతుంది. కొందరు ప్రధానోపాధ్యాయులు, పిల్లల సమక్షంలో ప్రశ్నాపత్రాలు దిద్దడం వల్ల నిర్దుష్టత లోపిస్తుందని భావిస్తారు.

'నిర్దుష్టత' అనే పదాన్ని అపార్థం చేసుకోవడంతప్ప ఇది మరేమీకాదు. పిల్లల్ని పరీక్షించడానికి ఎన్నుకొన్న పోటీ పద్ధతుల్నించి నిర్దుష్టతకు ఇలాంటి దుస్థితి ఏర్పడింది. ఈ నిర్దుష్టత పేరుతో జరిగే మూల్యాంకనం మన విద్యా లక్ష్యాలకు వ్యతిరేకం, నష్టదాయకం.

అభ్యసన ఫలితాలనేగాదు అభ్యసన అనుభవాల్ని కూడా మూల్యాంకనం చెయ్యాలి. అభ్యాసకులు తమ అనుభవాల సారాంశాన్ని సంతోషంగా చెపుతారు. దీనిద్వారా వాళ్ళు తమ అభ్యసనం పట్ల తామే స్పందించడం, తామే తమ అభ్యసనాన్ని అంచనా వేసుకోవడం చెయ్యగలుగుతారు. 'నేర్చుకోవడం ఎలాగో నేర్చుకోడానికి' కావల్సిన స్వయం సామర్థ్యాన్ని కూడా వారు పొందగల్గుతారు. మొత్తం విద్యాబోధన పద్ధతిని సమీక్షించుకొని, అవసరమైతే సరిచేసుకోవడానికి కూడా ఈ పద్ధతి ఉపకరిస్తుంది.

**ప్రశ్నల్ని సంధించడం**

| | |
|---|---|
| ఒక ఇనుము కరిగించే ప్లాంటు ప్రారంభించేటపుడు గుర్తుంచుకోవాల్సిన నాలుగు అంశాల్ని చెప్పండి.<br><br>Vs.<br><br>ఒక పారిశ్రామికవేత్త ఇనుము కరిగించే ప్లాంటు స్థాపించాలి అనుకొంటే ఎలాంటి స్థలాన్ని ఎంపికచేసుకొంటుంది? ఎందువల్ల? | ప్రకృతికి అనుకూలంగా మారడానికి పక్షి ముక్కు స్వరూపం ఎలా ఉపయోగపడింది?<br><br>Vs.<br><br>నీచుట్టుప్రక్కల పరిసరాల్లో కనిపించే ఒక పక్షి ముక్కు బొమ్మను గీయండి. ఈ ముక్కునుబట్టి ఆ పక్షి ఎలాంటి ఆహారాన్ని సేకరించుకొంటుందో చెప్పండి? అలాంటి ఆహారం మీ పరిసరాల్లో ఎక్కడ లభిస్తుందో చెప్పండి. |

పిల్లలతో మనం చేసే ప్రతిచర్యద్వారా పిల్లల స్వంత పనుల్ని మనం మూల్యాంకనం చెయ్యవచ్చు. వాళ్ళతో మాట్లాడ్డం ద్వారా వీళ్ళను ఏమి పరీక్షించాలో మనకు తెలుస్తుంది. వాళ్ళకెలాంటి సామర్థ్యాలు అభివృద్ధి అయ్యాయో, ఏమి కాలేదో గూడా అవగతమవుతుంది. ఏ పసిబిడ్డనైనా చూడండి 'తాను చేసింది సరైందో, కాదో' తనకుతానే అంచనావేసి చెప్పేస్తుంది. తమ సామర్థ్యాన్ని వీలున్నంత ఎక్కువకే ఉపయోగించుకొని జ్ఞాన నైపుణ్యాలకవసరమైన అభ్యసనానుభవాల్ని అందుకునేలా చెయ్యడం కూడా బోధన బాధ్యత. శారీరకంగా ఆరోగ్యంగా ఉండటం, క్రీడా సామర్థ్యాలు, సౌందర్యదృష్టి ఇవికూడా మనం కోరుకొనే సామర్థ్యాలు.

మనం అందించే రిపోర్టుకార్డులు సమగ్రంగా మొత్తంమీద విద్యార్థి అభివృద్ధిని తెలియజెప్పేవిగా ఉండాలి. టీచర్లు ప్రతిబిడ్డను గురించి చెప్పగల్గాలి. అంటే ప్రతిబిడ్డ మీద వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలి. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరిగి తాము సాధించాల్సింది ఏమిటో నిర్ధారించుకొనే అవకాశం కల్గుతుంది. మార్కులు కావచ్చు, గ్రేడ్లు కావచ్చు మనం రిపోర్టు కార్డులో ఏమి నమోదుచేసినా వాటితోపాటు అలా అంచనా వెయ్యడానికి కారణాల్ని తెలుపుతూ వివరమైన రిపోర్టును జతపరచాలి. ఇలా వ్యక్తిగతానుబంధం ఉంటేనే ఉపాధ్యాయుడు విద్యార్థికి ప్రేరణఇవ్వగల్గుతాడు. అతని అభ్యసనాన్ని ప్రభావితం చెయ్యగల్గుతాడు. ఉపాధ్యాయుడితోపాటు పిల్లలు కూడా తమనుతాము అంచనా వేసుకోవాలి. దాన్నికూడా రిపోర్టు కార్డులో నమోదు చెయ్యాలి.

ప్రస్తుతం ఇస్తున్న రిపోర్టు కార్డుల్లో సబ్జెక్టు అంశాలు మాత్రమే ఉంటున్నాయి. ఆరోగ్యం, శారీరక సామర్థ్యం, ఆటల్లో ప్రతిభ, సామాజిక నైపుణ్యాలు, కళల్లో, చేతివృత్తుల్లో ప్రవేశం ఇలాంటివేవీ ఈ కార్డుల్లో ఉండవు. వీటికి సంబంధించిన విషయాలు కూడా ఉంటే అప్పుడది సమగ్రమైన రిపోర్టు అవుతుంది.

### 3.10.7 మనం పునరాలోచించాల్సిన అంశాలు

మనం పరీక్షించాల్సిన విద్యాంశాలు ఇంకా చాలావున్నాయి. కానీ వీటిని కొలవడానికి సరైన ప్రమాణాలు, పరికరాలు మనవద్ద లేవు. పిల్లలు గ్రూపుల్లో కలిసి చేసే కృత్యాలు, నాటకాల్లాంటివి వేసేపుడు చూపే నైపుణ్యాలు, దీర్ఘకాల కృషితో లభ్యమయ్యే పనులు, హస్తకళలు – ఇవన్నీకూడా మనం మూల్యాంకనం చెయ్యాలి.

నిరంతరం, సమగ్రమైన పద్ధతితో జాగ్రత్తగా ఆలోచించి చేసే మూల్యాంకనమే అర్థవంతమైన మూల్యాంకనం. దీన్ని ఎప్పుడు ఏ పద్ధతిలో చెయ్యాలో మనం ఆలోచించి నిర్ణయించుకోవాలి. ఇలాంటి మూల్యాంకనం చెయ్యాలంటే టీచర్లు ఎక్కువ సమయం వెచ్చించాల్సి ఉంటుంది. ఎక్కువ రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది. అప్పుడే ఈ మూల్యాంకనానికి అర్థం, విశ్వసనీయత వుంటుంది. ప్రతి అంశాన్ని మనం పరీక్షిస్తున్నామనే అభిప్రాయం కల్గి పిల్లలపై ఒత్తిడి పెరిగితే, ప్రతిచోటా ఉపాధ్యాయుడి 'అధికారం' కనిపిస్తూ ఉంటే అది మన విద్యాలక్ష్యాన్నే దెబ్బతీస్తుంది. పై అంశాల మూల్యాంకనానికి ఒక నిర్దుష్టమైన పద్ధతి ఏర్పడేదాకా ఆగాలి. అప్పటి వీలునన్ని ఎక్కువ అంశాల్ని మూల్యాంకనం చెయ్యడంకోసం ఎన్నుకోవడంద్వారా మూల్యాంకనాన్ని అర్థవంతం చెయ్యవచ్చు.

చివరగా చెప్పుకోవాల్సింది ఏమంటే మూల్యాంకన విధానానికి ఒక గౌరవం, విశ్వసనీయత వుండాలి. అప్పుడే మనక్కావల్సిన సమాచారం అందుతుంది. అర్థవంతంగా ఉంటుంది.

### 3.10.8 వివిధ స్థాయిల్లో మూల్యాంకనం

బాల్యారంభ విద్య, 1-2 తరగతులు : ఈ దశలో పిల్లలు వివిధ సందర్భాల్లో చేసిన కృత్యాల్ని, వారి ఆరోగ్యాన్ని, శారీరకాభివృద్ధిని మనం మూల్యాంకనం చెయ్యాల్సివుంటుంది. పిల్లలతో ప్రతిరోజూ చేసే ప్రతిచర్యపై ఇది ఆధారపడి ఉంటుంది. ఈ దశల్లో మౌఖికమైనదైనా, లిఖితపూర్వకమైనా ఇలాంటి పరీక్ష పెట్టగూడదు.

3-8 తరగతులు : పరిశీలనలు, మౌఖిక లిఖిత పరీక్షలులాంటి పలు పద్ధతుల్ని ఈదశలో ఉపయోగించవచ్చు. తమని పరీక్షిస్తున్నట్టు పిల్లలకు తెలియాలి. కానీ ఇది తమ రోజువారీ చదువులోభాగమని వారనుకోవాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ వీటిని చూచి భయపడకూడదు. గుణాత్మకమైన రిపోర్టులతోపాటు మార్కులు, గ్రేడులు కూడా ఈ దశలోని మూల్యాంకనంలో ఉంటాయి. 5వ తరగతి నుంచి పిల్లల స్వయం మూల్యాంకనాన్ని కూడా రిపోర్టుకార్డులో నమోదు చెయ్యాలి. సంవత్సర పరీక్షలకు, టెర్మినల్ పరీక్షలు, 8వ తరగతి నుండి ఉండాలి. అప్పటికి పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కావల్సిన శారీరక సామర్థ్యం పిల్లలకు ఉంటుంది. ఎక్కువకాలం జవాబులు రాస్తూ పరీక్షల్లో కూర్చుండగల్గిన శక్తికూడా అప్పటికి ఉంటుంది.

వీరికిచ్చే రిపోర్టు కార్డులో ఆరోగ్యం, శారీరకశక్తిలాంటి సాధారణ పరిశీలనలన్నీ కూడా చేర్చాలి. దీంతోపాటు విద్యార్థి మొత్తంమీద సాధించిన అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజెయ్యాలి.

9-12 తరగతులు : స్వీయ మూల్యాంకనంతోపాటు ఈ దశలో ఎక్కువగా పరీక్షల మీద ప్రాజెక్టుల మీద ఆధారపడి పాఠ్య జ్ఞానాన్ని మూల్యాంకనం చెయ్యాలి. మిగిలిన అంశాల్ని పరిశీనలద్వారా అంచనా వెయ్యొచ్చు.

ఈ దశలో మనం ఇచ్చే రిపోర్టు రికార్డుల్లో పిల్లల నైపుణ్యాలు, జ్ఞానానానికి సంబంధించిన విశ్లేషణ ఎక్కువగా ఉండాలి. దీనిద్వారా పిల్లలు తాము దృష్టిపెట్టాల్సిన బోధనాంశాల్ని గుర్తిస్తారు. తర్వాతి కాలంలో ఏమి చదవాలో ఎన్నుకొనేందుకు కూడా దీనివల్ల అవకాశం కల్గుతుంది.

❀ ❀ ❀

అధ్యాయం - 4

# పాఠశాల, తరగతి గది వాతావరణం

| | |
|---|---|
| 4.1 | భౌతిక వాతావరణం |
| 4.2 | సమర్థవంతమైన వాతావరణాన్ని పెంపొందించుకోవడం |
| 4.3 | పిల్లలందరి భాగస్వామ్యం |
| 4.4 | పాఠశాలల్లో క్రమశిక్షణ |
| 4.5 | తల్లిదండ్రులకూ సమాజానికీ స్థానం |
| 4.6 | పాఠ్యాంశ రంగాలు, అభ్యసన వనరులు |
| 4.7 | సమయం |
| 4.8 | ఉపాధ్యాయులకు స్వతంత్రప్రతిపత్తి - వృత్తి స్వేచ్ఛ |

పిల్లలకీ ఉపాధ్యాయులకు మధ్య జరిగే పరస్పర చర్య (అది వ్యావహారికంగాగావచ్చు మరో రూపంలోగావచ్చు) ఫలితంగా ఏర్పడే సంబంధాల నుంచి అభ్యసనం అనే ప్రక్రియ జరుగుతుంది. 'అభ్యాసక సమాజం' ఉండే సంస్థారూప క్షేత్రాలు పాఠశాలలు. ఈ సమాజంలో ఉపాధ్యాయులూ ఉంటారు, పిల్లలూ ఉంటారు. ఆటస్థలంలో తోటి మిత్రులతో ఆడుకోవడం, పోట్లాడుకోవడం, విరామ సమయాల్లో బెంచీల మీద కూచుని స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడ్డం, ఉదయం అసెంబ్లీలో చేరడం, పరీక్షకు ముందు ఆత్రుతగా పేజీలు తిరగెయ్యడం, పాఠశాలకు దూరంగా తోటిపిల్లలతో, టీచర్లతో కలిసి విహారయాత్రలు చెయ్యడంలాంటివన్నీ ఈ సమాజాన్ని కలసికట్టుగా ఉండేలా చేస్తాయి. వీటివల్లనే ఈ సమాజానికి 'అభ్యాసకుల సమాజ' లక్షణం వస్తుంది. అలాగే పాఠశాలకు పాఠశాల స్వభావం రావడానికి తెరవెనుక జరిగే కృషి ఎంతో ఉంటుంది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు దైనందిన కృత్యాల్ని రూపొందించడం-అమలు చెయ్యడం, పరీక్షల్ని నిర్వహించడం, పాఠశాల క్యాలండర్‌లోని ప్రత్యేక సందర్భాల్ని (ఉత్సవాలు వగైరా) రూపొందించడం ఇవన్నీ ఈ కృషి వెనుక ఉంటాయి. మరి పాఠశాలలో బోధన, అభ్యసనం రెండూ సజావుగా జరిగేందుకవసరమైన ఈ వాతావరణాన్ని సృష్టించడమెలా? పిల్లలకు భద్రత, సంతోషం; ఉపాధ్యాయులకు వృత్తిపరమైన తృప్తి ఉండేలా పాఠశాలను తీర్చిదిద్దడమెలా? భౌతిక వాతావరణం, మానసిక వాతావరణం రెండూ ముఖ్యమైనవే. నిజానికివి రెండూ పరస్పరాశ్రితాలు. ఈ అధ్యాయంలో పిల్లల అభ్యసనం మీద ఈ వాతావరణాలు ఎలాంటి గొప్ప ప్రభావం కల్గిస్తాయో చూద్దాం.

## 4.1 భౌతిక వాతావరణం

పిల్లలు నియమిత సమయంలో కానీ, ఇతరత్రా కానీ; తెలిసి కానీ, తెలియకుండానే గానీ పాఠశాల భౌతిక వాతావరణంతో ఒక పరస్పర చర్యను జరుపుతుంటారు. అయినప్పటికీ మనం దీన్ని గురించి పట్టించుకోము. సామాన్యంగా మన క్లాస్‌రూములు కిక్కిరిసివుంటాయి. ఆ క్లాస్ రూములు కూడా ఆకర్షణీయంగా ఉండవు. ఇలాంటి స్వరూపం గల అస్తవ్యస్త పాఠశాలలో ఉపాధ్యాయుడి బోధన తీవ్రంగా దెబ్బతింటుంది. క్లాస్‌రూం నిర్వహణ భారమవుతుంది. పేరుకిది బడి తప్ప అంతకంటే అందులో ఏముంది?

ఎలాంటి ప్రదేశాలంటే మీకిష్టమని పిల్లల్ని అడిగితే ఏంచెబుతారు? రంగులంటే వాళ్ళకిష్టం, స్నేహాస్పదంగా, శాంతియుతంగా, ఆడుకొనేందుకు వీలుగా ఉండే బహిరంగ ప్రదేశాలు వాళ్ళకిష్టం. చిన్న సందులు, మూలలు, జంతువులు, చెట్లు, పూలు, బొమ్మలుండే చోట్లంటే వాళ్ళకిష్టం. పిల్లల్ని ఆకర్షించాలంటే వాళ్ళని బడిలో కొనసాగించాలంటే మన స్కూల్లోనూ, స్కూలు బయటా ఇవన్నీ ఉండాలి.

మొదట మన తరగతి గదుల్లోకి వీలున్నంత వెలుతురు వచ్చేలా చూడాలి. తర్వాత పిల్లలు చేసిన వస్తువుల్ని, వేసిన బొమ్మల్ని గోడలమీద, ఇతరత్రా ప్రదర్శనకు పెట్టాలి. ఇలా కళాకృతుల్ని, చిత్రలేఖనాన్ని, హస్తకళల్ని గోడలపైనా, షెల్ఫుల్లో పెట్టడం పిల్లలకి, వాళ్ళ తల్లిదండ్రులకి గొప్ప సందేశాన్నిస్తుంది. తమ కృషి గుర్తింపుకొచ్చిందని వాళ్ళు ఆనందిస్తారు. ఇలాంటివి ప్రదదర్శనగా పెట్టేప్పుడు పిల్లలు చూడ్డానికి, తీసుకోడానికి అందుబాటులో ఉండేంత ఎత్తులో, ప్రదేశాల్లో మాత్రమే పెట్టాలి. సామాన్యంగా మన పాఠశాలలు శిథిలావస్థలో ఉంటాయి. మసకబారి దయనీయంగా ఉంటాయి. ఇలాంటి స్కూళ్ళ నుంచి ఏ ఉత్సాహం పిల్లలకి కల్గుతుంది?

భవనాలే మన స్కూళ్ళకున్న ఖరీదైన ఆస్తులు. వీటివల్ల విద్యావిలువ గరిష్టంగా పెరుగుతుంది. ఈ భవనాలకు మరమ్మత్తులు చేసి, మరికొంత పెంచి, కొత్త భవనాల్ని నిర్మిస్తే ఈ విలువ మరింత గరిష్టంగా పెరుగుతుంది. బడి అందంలో మాత్రమే దీనివల్ల మార్పు వస్తుందనుకొంటే పొరపాటు. భౌతిక వసతులకు బోధనతోనూ, పిల్లలతోనూ ఒక అంతస్సంబంధం ఉంటుంది. దీనివల్ల బోధనాభ్యసన ప్రక్రియ మెరుగుపడుతుంది. దేశంలోని చాలా స్కూళ్ళలో తరగతి గది గోడలకు పెద్దపెద్ద చిత్రాల పెయింటింగులు మనం చూస్తుంటాం. కొంత కాలం తర్వాత ఇవి మొహమ్మొత్తుతాయి. దీనికంటే జాగ్రత్తగా చేసుకొన్న చిన్నసైజు బొమ్మలవల్ల గోడలు ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటాయి. అలాగే పిల్లలు స్వయంగా తయారుచేసిన వస్తువుల్ని, ఉపాధ్యాయుడు చేసిన చార్టులు మొదలైనవాటిన ప్రదర్శించడం మంచిది. వీటిని నెలకొకసారి మారుస్తుండాలి.

### భౌతిక అవకాశాల ద్వారా బోధన

పిల్లలు ప్రపంచాన్ని పలు ఇంద్రియజ్ఞానాల ద్వారా తెలుసుకొంటారు. స్పర్శ, దృష్టిజ్ఞానాలు వీటిలో ముఖ్యమైనవి. త్రిమితి (Three dimension) వస్తువులు పిల్లల అభ్యసనంలో మరింత బాగా ఉపయోగపడతాయి. వీటివల్ల వివిధ ఇంద్రియ జ్ఞానాల అనుభవం పిల్లలకు ఒకేసారి లభిస్తుంది. అంతరిక్ష వస్తువుల రూపాలు, అల్లికలు, వివిధ ఆకారాలు, కోణాలు, సౌష్టవాలు పిల్లలకు భాష, సైన్సు, గణితం, పర్యావరణాలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్నవాటిని ఇలా మార్చవచ్చు లేదా కొత్తవాటిని రూపొందించుకోవచ్చు.

### అవకాశాలు

స్కూలు బయటి అవకాశాలు : జెండా కర్రను నీడ గడియారంలాగా వాడుకుని, దాని నీడ కదలికలను బట్టి కాలాన్ని పలు రూపాలలో కొలవడం తెలియజేయవచ్చు. శీతాకాలంలో ఆకుల్ని రాల్చే చెట్లను పెంచడం ద్వారా, వేసవికాలంలో పచ్చని చెట్లకింద మంచి బహిరంగ తరగతి గదిని ఏర్పాటుచేసుకోవచ్చు. ఉపయోగించి పారవేసిన టైర్లతో ఆటస్థలంలో సాహసాల్ని చేయించవచ్చు. ఒక పెట్టెద్వారా బస్సు, రైలు, పోస్టాఫీసు, దుకాణంలాంటివి చూపించవచ్చు. ఇసుక, మట్టి ద్వారా పిల్లలు పర్వతాలను, నదులను, లోయలను నిర్మించుకొనే ఏర్పాటు చేయవచ్చు. త్రిమితులను (Three dimensional) కూడా వీటిద్వారా పరిచయం చేయవచ్చు. బయటి స్థలంలోని మొక్కలు, చెట్లు గల సహజ పరిసరాల నుంచి పిల్లలు తమ సొంత అభ్యసన సామగ్రిని, రంగుల్ని తయారుచేసుకొనేలా ప్రోత్సహించవచ్చు. అంతేగాక ఔషధ వనాలు పెంచడం, వాన నీటిని నిలువచేసుకోవడం వంటివి నేర్పవచ్చు.

## తరగతి గది

కిటికీల కమ్ముల్ని పూర్వలేఖన నైపుణ్యాల్ని అభ్యసనం చేయడానికి, భిన్నాల్ని అర్థం చేసుకోవడానికి తగినట్టు రూపొందించుకోవచ్చు. తలుపుల కింద, నేలమీద వివిధ కోణాలను గీసి విద్యార్థులకు వీటిని గురించి వివరించవచ్చు. తరగతి గది అల్మారాలను గ్రంథాలయంగా మార్చుకోవచ్చు. ఫ్యానలకు రకరకాల రంగుల్ని పూసి మారుతున్న రంగుల రూపాల్ని పిల్లలకు చూపి ఆహ్లాదపరచవచ్చు.

ఇలాంటివి తయారుచేసేటప్పుడు, గోడలకు అమర్చేటప్పుడు పిల్లలను భాగస్వాముల్ని చేయడం అవసరం. చాలా విలువైన అభ్యసన కృత్యంగా ఇది ఉపకరిస్తుంది. చాలా స్కూళ్ళలో ఆటస్థలాలు కూడా ఉండవు. ఇలాంటిచోట్ల బహిరంగ ప్రదేశాలలో నేర్చుకోవడమనేది సాధ్యం కాదు. పిల్లలు పాఠ్యాంశాల్ని నేర్చుకోవడం ఈ దుస్థితి వల్ల కుంటుపడుతుంది.

ఉపాధ్యాయుడు బోధించేప్పుడు, తాను కోరుకున్న పద్ధతుల్ని పాటించడంలో తరగతి గది సైజు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పాఠశాల విద్యకు సంబంధించినంతవరకు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి **1 : 30** కి మించకూడదని జాతీయ, అంతర్జాతీయ అనుభవాలన్నీ తెలుపుతున్నాయి. కిక్కిరిసిన తరగతులలో సృజనాత్మక బోధన అనేది అసాధ్యమని, బోధనానాణ్యతను ఎక్కువ పిల్లలుండే తరగతి గదులు దెబ్బతీస్తాయని **1966**లోనే కొఠారి కమీషను నివేదిక హెచ్చరించింది **(1966 : 413-415).**

పాఠశాలకు కావలసిన మౌలిక వసతుల్ని, సామగ్రిని సమకూర్చటంలో, బోధనా ప్రణాళికా లక్ష్యాల్ని సాధించడానికి ఉపయోగపడే సరళమైన ప్రణాళికను రూపొందించడంలో బ్లాకు, క్లస్టర్ స్థాయి కార్యకర్తలు ఉపాధ్యాయులకు తోడ్పాటునివ్వాలి. పాఠశాల జీవితానికి సంబంధించిన అన్ని అంశాలకు ఇది వర్తిస్తుంది. తరగతి గది స్థలం పిల్లలకు అవసరమైనట్టు మార్చుకోవడానికి తగినట్టుగా ఉండాలి. ఇందువల్ల చిన్నచిన్న బృందాలుగా పిల్లలు కలిసి కూర్చోవచ్చు. కథలు చెప్పేటప్పుడు పెద్దపెద్ద వృత్తాకారంలో కూర్చోవచ్చు. ఎవరికివారు రాసుకోవడానికి, చదువుకోవడానికి తగినట్లుగా కూర్చునే వీలు; రేడియో, టి.వి. ప్రసారాలు వచ్చేట్పుడు ఒకే బృందంగా కూర్చోవడానికి అవకాశం దీనివల్ల ఏర్పడతాయి. ఇందుకోసం బల్లల్ని, కుర్చీలను, బెంచీలను, చాపలను ఇటుఅటు సర్దుకోవలసి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకును చాలా స్కూళ్ళు పిల్లలు కూర్చోవడానికి అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. ఈ సామగ్రి ఇటుఅటు సర్దుబాటు చేసుకోవడానికి సులభంగా ఉంటుంది. ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమే కూర్చునే బల్లలు, కుర్చీలు, చాపలు ఇందుకు బాగా సరిపోతాయి. వికలాంగులకు అనుగుణంగా కూడా వీటిని ఏర్పాటుచేసుకోవచ్చు. కానీ కొన్ని స్కూళ్ళు మాత్రం ఇంకా బరువైన ఇనప బెంచీలను, పొడవైన బల్లలను కొంటున్నాయి. వీటిని వరుసల్లో మాత్రమే వెయ్యడం సాధ్యమౌతుంది. ఉపాధ్యాయుడు, బ్లాక్‌బోర్డు కేంద్రంగా గల అభ్యసనానికి మాత్రమే ఇవి ఉపయోగపడతాయి. మరీ ఘోరం ఏమిటంటే, ఈ బల్లల్లో పిల్లలు తమ పుస్తకాలు, వస్తువులు పెట్టుకునే చోటుకూడా ఉండదు. ఇవి ఆనుకునేందుకు తగినట్లుగా కూడా ఉండవు. ఇలాంటివాటిని పాఠశాలల్లో వాడకుండా నిషేధించడం మంచిది.

తరగతి గదిలో అందుబాటులో గల అవకాశాల్ని, బోధనా వనరులుగా మనం గరిష్టస్థాయిలో వాడుకోవాలి. కొన్నిచోట్ల ప్రాథమిక పాఠశాలల్లో క్లాస్‌రూం గోడలకు నాలుగు అడుగుల ఎత్తువరకు నల్లరంగు వేస్తున్నారు. పిల్లలు దీన్ని స్వేచ్ఛగా పలకలాగా, డ్రాయింగు బోర్డులాగా వాడుకుంటున్నారు. మరికొన్ని పాఠశాలల్లో నేలమీద వివిధ రేఖాగణిత రూపాల్ని వేస్తున్నారు. ఇవి కూడా రకరకాల కృత్యాలకు ఉపయోగపడతాయి. గది మూలల్ని అభ్యసన సామగ్రిని, కథల పుస్తకాలను, రకరకాల కార్డులను పెట్టుకొనడానికి ఉపయోగించుకోవచ్చు. అప్పుడు ఇవి పిల్లలకు

అందుబాటులో ఉంటాయి. ఉపాధ్యాయుడు ఇచ్చిన పని తొందరగా పూర్తిచేసిన పిల్లలు స్వేచ్ఛగా వచ్చి వీటిని వాడుకోవచ్చు. తరగతి గదిని, పాఠశాలని చదువుకోవడానికి, పని చేయడానికి, ఆడుకోవడానికి తగినట్టుగా ఆకర్షణీయంగా మలచడంలో పిల్లల్ని కూడా భాగస్వాముల్ని చేయాలి. ఎక్కువ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలే తరగతి గదుల్ని శుభ్రం చేస్తారు. దీనివల్ల పాఠశాల దైనందిన పనిలో శ్రమ చేరుతుంది. అయితే బాధాకరమైన అంశమేమంటే కొన్ని స్కూళ్ళలో ఆడపిల్లలచేత, నిమ్న కులాల పిల్లలచేత మాత్రమే ఈ పనులు చేయిస్తారు. శ్రమ చేయడం వీళ్ళ బాధ్యతగా భావిస్తారన్నమాట. ఉన్నతవర్గాల పాఠశాలల్లోని పిల్లలకు ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం ఉండదు. శుభ్రం చేయడంలాంటి పనుల్ని తప్పుచేసినవారికి శిక్షలుగా మాత్రమే ఈ స్కూళ్ళలో చేయిస్తుంటారు. స్త్రీ, పురుష వివక్షణతో కూడిన శ్రమవిభజన సంస్కృతిని, నిమ్నకులాల వారసత్వంగా చేస్తున్న వృత్తి 'ధర్మాల్ని' ఇవి పాఠశాలల్లోకి ప్రవేశపెడతాయి. పాఠశాలలు ప్రజా సంస్థలు. వీటిలో అన్నిరకాల పనులపట్ల గౌరవం, సమానత్వం వంటి విలువలుండాలి. ఉపాధ్యాయులు ఇటువంటి సాంస్కృతిక ధోరణులమీద ఆధారపడి పిల్లలకు పనులు పెట్టకూడదు. ఇదే సందర్భంలో తరగతి గది శుభ్రంగా ఉండడం, వస్తువుల్ని సరిగా సర్దిపెట్టడం, బోధనాభ్యసన ప్రక్రియలో ముఖ్యమైనవి. ఇందుకోసం పిల్లలు వ్యక్తిగతంగా, సమిష్టిగా బాధ్యతలు తీసుకుని తరగతి గదులన్నీ వీలున్నంత ఆకర్షణీయంగా ఉంచుకోవాలి. పిల్లలు తరగతిగదిలో, పాఠశాలలో బృందాలుగా ఏర్పడి పరస్పర చర్య చేసుకునే సందర్భంలో పెద్ద సమూహంలో తాము భాగమనే అవగాహన ఏర్పడుతుంది. సమిష్టి కృషిలో భాగస్వాములయ్యే సామర్థ్యం కూడా వారికి లభిస్తుంది.

## 4.2 సమర్థవంతమైన వాతావరణాన్ని పెంపొందించుకోవడం

పాఠశాలలు ప్రజోపయోగకర ప్రదేశాలు. వీటిలో సమానత్వం, సామాజిక న్యాయం, వైవిధ్యం పట్ల గౌరవం, పిల్లల హక్కులు లాంటి విలువలు ఉండి తీరాలి. వీటిని ప్రయత్నపూర్వకంగా మన స్కూళ్ళలో అంతర్భాగం చేయాలి. పాఠశాలలోని మన ఆచరణకు ఈ విలువలు పునాదిగా ఉండాలి. సమర్థవంతమైన వాతావరణంలో పిల్లలకు శుభ్రత ఉంటుంది. భయం ఉండదు. సమానత్వం ప్రాతిపదికన, సమాన న్యాయం ప్రాతిపదికన నిర్మించబడ్డ సంబంధాలు మాత్రమే ఉంటాయి. ఇందుకోసం ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా చేయవలసింది ఏమీలేదు. పిల్లల మధ్య వివక్షణ చూపకుండా సమానంగా చూస్తే చాలు. పాఠం చెప్పేటప్పుడు పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నలు అడిగేందుకు, ఉపాధ్యాయుడితో, తోటి పిల్లలతో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలి. వాళ్ళ స్వంత అనుభూతుల్ని పంచుకోలేకపోతే వాళ్ళ సందేహాలకు, ప్రశ్నలకు సమాధానాలు దొరక్కపోతే ఇక నేర్చుకోవటమనేదేమీ ఉండదు. పిల్లల వ్యాఖ్యల్ని తృణీకరించకుండా ఉంటే, నిశ్శబ్దంగా ఉండాలన్న నియమాన్ని రుద్ది వాళ్ళ గొంతులు కట్టెయ్యకుండా ఉంటే, వాళ్ళు మాట్లాడే భాషను నియంత్రించకుండా ఉంటే, పిల్లలు మాట్లాడేందుకు వీలున్నంత ప్రోత్సహిస్తే అప్పుడు తరగతి గదులు సజీవంగా ఉంటాయి. అప్పుడు పిల్లలకు బోధన ఏమాత్రం విసుగు పుట్టించదు. పైగా అభిప్రాయాలను కలబోసుకునే ఒక సాహస చర్యలాగా బోధనాభ్యాస ప్రక్రియ మారుతుంది. ఇలాంటి వాతావరణం అన్ని వయస్సుల పిల్లల ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతుంది.

పిల్లలు, ఉపాధ్యాయులు సగటున రోజుకు ఆరు గంటలు, సంవత్సరానికి వెయ్యి గంటలు పాఠశాలలో ఉంటారు. పిల్లలకుగానీ, టీచర్లకుగానీ తమ లక్ష్యాలను సాధించుకునేందుకు పాఠశాల వాతావరణం అనుకూలంగా ఉండాలి. సౌకర్యంగా ఉండాలి. తమ పనులు తాము చేసుకోవడానికి తగ్గట్టుగా ఆహ్లాదకరంగా ఉండాలి. ఇందుకోసం పాఠశాలల్లో పిల్లలు కూర్చునేందుకు అనుకూలమైన సామగ్రి, కనీస వసతులు (మరుగుదొడ్లు, మంచినీళ్ళు

మొదలైనవి) ఉండితీరాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ వసతులు తప్పనిసరిగా ఉండవలసినప్పటికీ మన గ్రామీణ ప్రాంతాల్లో – ప్రత్యేకించి దళితులు, గిరిజనులు నివసించేచోట, పట్టణ పేదలు నివసించే కాలనీల్లో ఉండే స్కూళ్ళకు ఇలాంటి వసతులు దాదాపు ఉండవు. ప్రభుత్వం నిర్దేశించిన ఈ మౌళిక సదుపాయాల్ని గురించి, వసతులను గురించి టీచర్లకు, ప్రధానోపాధ్యాయుడికి, గ్రామ విద్యాకమిటీకి, పాఠశాల పర్యవేక్షణ అభివృద్ధి కమిటీలకు తెలిసి ఉండాలి. సరైన వసతులు లేనిచోట వెంటనే వాటిని కల్పించాలి. అప్పుడు మాత్రమే ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాలలో బోధన సాధ్యమౌతుంది. అధికారుల్లో స్పందన లేకపోతే సమాజం ఇందుకు ఒత్తిడి తేవాలి. ఇలాంటి వసతుల కల్పనలో సమాజం ముందుకు రావడం ద్వారా ఉపాధ్యాయుడు తన అకడమిక్ బాధ్యతలపై కేంద్రీకరించేందుకు సమాజం సహకరించాలి.

ఉపాధ్యాయులు, పిల్లలు ఒక విస్తృత సమాజంలో భాగం. కులం, లింగం, మతం, భాష, ఆర్థికస్థితిపై ఆధారపడి వీరి మధ్య సామాజిక ప్రతిచర్య జరుగుతుంటుంది. కాకుంటే ఇది భిన్న సామాజిక సాంస్కృతిక సందర్భాల్లో పలురూపాల్లో కనిపిస్తుంటుంది. దళితులకు, గిరిజనులకు, మైనార్టీలకు, మహిళలకు సామాన్యంగా ప్రతికూల పరిస్థితులే ఎదురౌతుంటాయి. వాళ్ళ ప్రత్యేకతల్ని ఎవరూ గుర్తించరు. సమాజంలోని విలువైన వనరులు వారికి అందుబాటులో ఉండవు. సామాజిక సంస్థలలో వాళ్ళ భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది. పిల్లల్ని ఇలా గుర్తించడం పాఠశాలల్లో వాళ్ళను చూచే తీరుమీద ఎంతో ప్రభావం కలిగిస్తుంది. ఫలితంగా అభ్యసనంలో వీళ్ళకి ఉపయోగకరమైన, సమానమైన అవకాశాలు లభించవు. దీన్ని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. పిల్లల మధ్య సంబంధాలు, ఉపాధ్యాయుడి ధోరణి, పాఠశాల సంస్కృతిలో భాగమైన నియమాలు, విలువలు పిల్లలకు ఒక అవ్యక్త సందేశాన్ని అందిస్తాయి. ఇది పాఠశాల విద్యార్థులకు నిత్యం అనుభవంలో ఉన్నదే. మన సామాజిక దొంతర్లలో నిత్యం కనిపించే పవిత్రతా, అపవిత్రతా భావనలు, పురుషత్వ స్త్రీత్వాలకు మనం నిర్దేశించుకున్న అర్హతలు, పట్టణ మధ్యతరగతి జీవనవిధానాన్ని ఆదర్శంగా తీసుకొనే ధోరణి, మనంతప్ప ప్రపంచంలో ఇతరులెవ్వరూ లేరనే భావన మన పిల్లల్లో స్థిరపడ్డానికి పాఠశాల సంస్కృతి కూడా సహకరించడం బాధాకరం. దళితులు మొదలైన నిమ్నవర్గాల పిల్లలను, సామాజిక వివక్షకు గురయ్యే సెక్స్ వర్కర్ల, హెచ్.ఐ.వి. రోగుల పిల్లల్ని ఉపాధ్యాయులేకాదు తోటి విద్యార్థులు కూడా పాఠశాలలో హీనంగా చూస్తారు. భవిష్యత్తులో భార్యలుగా, తల్లులుగా తప్ప తమ సామర్థ్యాల్ని, హక్కుల్ని అభివృద్ధి చేసుకునే విధంగా ఆడపిల్లల్ని చూడకపోవటం మరొక దుర్లక్షణం. ఇక వికలాంగులైన పిల్లల అవసరాల్ని గురించి ఎవరూ పట్టించుకోరు. పాఠశాల వాతావరణం వాళ్ళ సమస్యలపట్ల ఏమాత్రం స్పందించేదిగా ఉండదు. నిమ్న కులాలవారు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు తరగతిలో వివక్షకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత మనపై వుంది. ఎట్టి పరిస్థితుల్లోను వీరికి అవకాశాల్ని నిరాకరించకూడదు. అలాంటి వాతావరణాన్ని పాఠశాలలు ప్రయత్నపూర్వకంగా కల్పించాలి. విద్యార్థులందర్నీ అభ్యాసకులుగా మాత్రమే గుర్తించే సంస్కృతి మన స్కూళ్ళలో ఏర్పడాలి. ప్రతి బిడ్డ ఆసక్తి, సామర్థ్యం వికసించే విధంగా పాఠశాల వాతావరణాన్ని మనం సృష్టించుకోవాలి.

## 4.3 పిల్లలందరి భాగస్వామ్యం

తమ ప్రతిభను ప్రదర్శించుకొనే అవకాశం, తోటి పిల్లలతో పంచుకొనే అవకాశం కల్పిస్తే అది పిల్లలందర్నీ భాగస్వామ్యం చెయ్యడంలో, ప్రోత్సహించడంలో చాలా శక్తివంతంగా ఉపయోగపడుతుంది. అందువల్ల తామొక ప్రత్యేక సమాజమనీ అందులో తామే ముఖ్యమైనవారమనీ పిల్లలు భావిస్తారు. దీనికోసం మనం పిల్లలందరికి

ఇలాంటి అవకాశమివ్వాలి. కానీ మన స్కూళ్ళలో మనం కొందరు పిల్లలకే ఇలాంటి గుర్తింపు ఇస్తాం. మాటిమాటికీ వారినే పిలుస్తుంటాం. కొద్దిమంది దీనివల్ల లాభం పొందొచ్చు. వీళ్ళకు ఆత్మస్థైర్యం పెరగొచ్చు. కానీ ఇతర పిల్లలు నిరుత్సాహపడే ప్రమాదముంది. దీన్ని గుర్తించి ఇలాంటి పిల్లలకు కూడా ఒక గుర్తింపు స్కూల్లో, తోటి పిల్లల మధ్యా లభించేలా ఉపాధ్యాయుడు ప్రయత్నించాలి.

- పేదపిల్లల్ని బడిలో ఇముడ్చుకొనే విద్య ఒక కార్యక్రమం కాదు. ఒక లక్ష్యం.
- వైకల్యం ఓ సామాజిక బాధ్యత. దీన్ని అంగీకరించాలి.
- ఏ పిల్లలకీ ప్రవేశాన్ని నిరాకరించకూడదు.
- పాఠశాల ప్రవేశ నిబంధనల పేరుతో ఏ విద్యార్థి ప్రవేశాన్నీ నిరోధించే పద్ధతులు స్కూళలో పాటించకూడదు.
- పిల్లలు రాణించలేదంటే స్కూలు రాణించడంలేదని లెక్క.
- భిన్నత్వాన్ని అంగీకరించాలి. వైవిధ్యాన్ని స్వాగతించాలి.
- మానవ హక్కుల గురించి తెలుసుకోవాలి. తప్పిదాల్ని జయించాలి.
- శారీరక వైకల్యం ఓ సామాజిక సమస్య. దీన్ని పరిష్కరించాలి.
- అవకాశాల్ని కల్పించాలిగానీ, కత్తిరించగూడదు. పిల్లలకు తగ్గట్లు మనం సర్దుబాటుకావాలి.
- భౌతికంగా, సామాజికంగా, దృక్పథంపరంగా ఎదురయ్యే అడ్డంకుల్ని తొలగించుకోవాలి.
- పాఠశాల-సమాజం, పాఠశాల-టీచర్లు, టీచర్లు-టీచర్లు, పిల్లలు-పిల్లలు, పిల్లలు-టీచర్లు, టీచర్లు-టీచర్లు ఇలా అందరి మధ్య పరస్పరానుబంధం మన బలం. ఇవికొన్ని స్కూల్లో జరిగేవి, మరికొన్ని స్కూలు బయట జరిగేవి కావచ్చు.
- పేద పిల్లల్ని బడిలోకి ఇముడ్చుకొనే పద్ధతులన్నీ మంచి పద్ధతులే.
- కలిసి అభ్యసించడం ప్రతి విద్యార్థికీ మంచిది.
- అదనపు సర్వీసుల్ని అవసరమైన సర్వీసులుగా గుర్తించాలి.
- బాగా బోధించాలంటే ముందు పిల్లల్నించి నేర్చుకోవాలి. పిల్లల పరిమితుల్ని గాదు సామర్థ్యాల్ని గుర్తించాలి.
- పరస్పర గౌరవం, పరస్పరాశ్రితత్వం పిల్లల్లో పెంపొందించాలి.
- AAS, బ్రెయిల్లర్ లాంటి కమ్యూనికేషన్ పరికరాల్ని వాడుకోవాలి.

ప్రశంస ద్వారా పిల్లల సామర్థ్యాన్ని అసాధారణ ప్రతిభను వెలికి తియ్యాల్సిందే, గుర్తించాల్సిందే. అదే సందర్భంలో అందరు పిల్లలకూ సమానావకాశాలు కూడా అందించాలి. వ్యక్తిగత, ప్రత్యేక సామర్థ్యాల్ని కూడా గుర్తించాలి. టీచరిచ్చిన పనిచెయ్యడంలో వైకల్యం గల పిల్లలు వెనకబడిపోవచ్చు. వీరికి మరింత సహకారం అవసరం. దీనికితగ్గ కృత్యాల్ని రూపొందించుకొనేటపుడు పిల్లల్ని కూడా టీచరు భాగస్వాముల్ని చెయ్యడం మంచిది. ఇలా చెయ్యడం టీచరు సామర్థ్యానికి గీటురాయిగా ఉంటుంది.

### 4.3.1 పోటీ సామర్థ్యం

పోటీతత్వం మీద అతి శ్రద్ధ పెట్టడం, వ్యక్తిగత విషయాల్ని ఆకాశానికెత్తడం ఇటీవల బాగా పెరిగింది. పట్టణ మధ్యతరగతి వర్గాల పిల్లలుండే స్కూళ్ళలో ఇది మరీ పెరిగింది. పిల్లలు చేరీచేరకముందే వారిని సముదాయాలుగా విభజిస్తున్నారు. ఏడాది పొడుగునా చేసే ప్రతిదాన్నీ జమచేసి, సంవత్సరం చివర మొత్తం తూకంవేసి ఆ సముదాయానికి బహుమతులిస్తున్నారు. దీనివల్ల జరిగేదేమిటి? అందరు పిల్లలు వీటిలో భాగస్వాములు కాలేరు. విజయంకోసం తమ సముదాయానికి పాయింట్లు సంపాదించుకోవడమే పిల్లల లక్ష్యంగా మారుతుంది. ఇది విద్యా లక్ష్యాలకే విఘాతం కల్గించే అంశం. ఇలాంటి పోటీ ఎక్కడికి దారితీస్తుంది? పిల్లలు తమ తృప్తికోసమో, తమ ప్రతిభను పెంచుకోడమో పనిచెయ్యడం మానేసి ఇతరులకంటే మిన్నగా కనిపించడానికే పనిచేస్తారు. ఇదే వారి లక్ష్యంగా మారుతుంది. ఇది పిల్లల మధ్య ఉండాల్సిన సామాజిక సంబంధాల్ని కూడా దెబ్బతీస్తుంది. పరస్పర సహకార స్వభావాన్ని, ఇతరుల్ని అర్థం చేసుకొనే లక్షణాన్ని కూడా ఇది దూరం చేస్తుంది. పాఠశాల జీవితంలోని ప్రతి పాఠ్యాంశానికి ఈ పోటీతత్వ ధోరణి ఎలా విస్తరిస్తోందో, ఆసక్తిని అభ్యసన క్రమాన్ని వేగిరం చేసే బదులు నియంత్రణను, క్రమశిక్షణను ఎలా పెంచి పోషిస్తుందో ఉపాధ్యాయ వర్గం గుర్తించాల్సిన తరుణం ఆసన్నమైంది.

పిల్లల జ్ఞానాన్ని, తెలివితేటలను సంకుచితంగా అర్థం చేసుకొని, వాళ్ళ భిన్న సామర్థ్యాల్ని, ప్రతిభల్ని ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా ప్రారంభ దశలోనే వాళ్ళని విభజించడం గూడా సరైందిగాదు. ప్రతి బిడ్డ ఒక వ్యక్తి, వ్యక్తిగా ఆమెకొక ప్రత్యేక లక్షణం ఉంటుంది. దీన్ని గమనించకుండా తరగతిలో ఒక్కొక్కరికి ఒక్కొక్క స్థాయిని అంటగట్టెయ్యడం ఏం న్యాయం? అఖండ ప్రజ్ఞావంతులు, సగటు ప్రతిభావంతులు, సగటు కంటె తక్కువ తెలివిగలవారు, అని విడదీసి ముద్రలు వెయ్యడం ఎంత సమంజసం? క్లాసులో కూచోబెట్టడంలోకూడా ఈ విభజన ఉంటుంది. ఇది చాలక అందరికీ కనిపించేలా వీళ్ళ గ్రేడును సూచించే చిహ్నాల్ని (బ్యాడ్జీలు, పట్టాల్ని) తగిలిస్తారు. నా సమాధానం సరైంది కాదేమో అనే భయం పిల్లల్ని తరగతి గదిలో మాట్లాడకుండా చేస్తుంది. అందువల్ల నేర్చుకొనే ప్రక్రియకు క్రమంగా వాళ్ళు దూరమవుతారు. పైన చెప్పిన గుర్తింపును సాధించిన పిల్లలను కూడా ఎక్కడ వెనకబడిపోతామో, పరీక్షల్లో ఎక్కడ మార్కులు తగ్గిపోతామోననే భయం వెంటాడుతుంటుంది. వాళ్ళకై వాళ్ళే స్వంతంగా, కొత్తగా ఏమీ చెయ్యరు, ఏమీ ఆలోచించరు.పిల్లలు తప్పులు చేస్తూనే నేర్చుకొంటారు. నేర్చుకోవడంలో తప్పులొక విడదీయరాని భాగం. దీన్ని మనం గుర్తించాలి. ఇతరులు గుర్తించేలా చెయ్యాలి. మార్కులు సాధించడమే నేర్చుకోవడం కాదని తెలియజెప్పాలి. తమ పిల్లలు అతి చిన్న వయస్సునుంచే అన్నీ ఖచ్చితంగా చెయ్యాలని, అన్నింటా ముందుండాలని ఆశలు పెట్టుకొని, పిల్లలమీద ఒత్తిడి పెట్టే తల్లిదండ్రులకు మనం నచ్చచెప్పాలి. ట్యూషన్లలో, ఇళ్ళలో, బడిలో నేర్చుకొన్నదే మళ్ళీ మళ్ళీ వల్లించి జవాబుల్ని కంఠస్థం చేసేబదులు పిల్లలు కథల పుస్తకాలు చదువుకొనేందుకు,

ఆటలాడేందుకు, ఇంటిపనులు చేసేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఒత్తిడి తగ్గించుకొనేందకు చిట్కాలు నేర్పే క్లాసులకు పిల్లల్ని పంపేబదులు ఇలాంటివి చేస్తే ఎంతో మంచిది. స్కూల్లో టీచరు, స్కూలు బయట తల్లిదండ్రులు దీనికనుగుణంగా వ్యవహరించేలా మారాల్సివుంది.

అవి ప్రభుత్వ పాఠశాలలు కావచ్చు, ప్రైవేట్ పాఠశాలలు కావచ్చు. తీవ్రమైన పోటీని ప్రోత్సహించే స్కూళ్ళను ఆదర్శంగా మనం తీసుకోకూడదు. అందరికీ ఒకేరకమైన స్కూళ్ళు ఉండాలని కొఠారీ కమిషన్ పేర్కొనింది. ఇదిప్పుడు మరింత అవసరం. అప్పుడు మాత్రమే మనం రాజ్యాంగంలో నిర్దేశించుకొన్న విలువలు సాధ్యం. ప్రతి బిడ్డా ఆనందంగా, నిబ్బరంగా వుండగల్గినప్పుడే పాఠశాలల్లో రాజ్యాంగం చెప్పిన ఈ విలువల్ని సాధించగలం. గతంకంటే ఇప్పుడిది మరింత అవసరం. ఎందుకంటే సార్వత్రిక విద్య ప్రస్తుతం మన లక్ష్యం. లక్షలాదిమంది పిల్లలిప్పుడు మన స్కూళ్ళలో చేరుతున్నారు. వీళ్ళందర్నీ స్కూళ్ళలో కొనసాగించాలంటే పిల్లల బాల్యాలన్నీ ఒకేరకంగా ఉండవనీ; వాళ్ళ సామర్థ్యాలు, వ్యక్తిత్వాలు, ఆకాంక్షలు కూడా ఒకేరకంగా ఉండవనీ; ప్రైవేటు పాఠశాలలతోసహా అన్ని పాఠశాలలు గుర్తించాలి. వివిధ సామాజికార్థిక సాంస్కృతిక నేపధ్యాలున్న పిల్లలు, వివిధ స్థాయిల సామర్థ్యాలున్న పిల్లలు ఒకేచోట చదువుకొనేటప్పుడు తరగతి గది మరింత ఉత్తేజకరంగా, మరింత సుసంపన్నంగా ఉంటుంది. దీన్ని మన పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు గుర్తించాలి.

## 4.4 పాఠశాలల్లో క్రమశిక్షణ

మన స్కూళ్ళలో పిల్లలకు వ్యక్తిగతంగాగానీ, బృందాలుగాగానీ 'మంచి', 'సరైన' ప్రవర్తనను నిర్ణయించే కొన్ని సాంప్రదాయక నియమాలుంటాయి. ఉపాధ్యాయులకేగాదు (సామాన్యంగా ఇది వ్యాయామోపాధ్యాయుడు, నిర్వహణాధికారి పని) స్కూల్లోని పెద్దలందరికీ స్కూల్లో క్రమశిక్షణను అమలుచెయ్యడం ఒక తప్పనిసరి కర్తవ్యంగా ఉంటుంది. తరచుగా కొందరు పిల్లల్ని లీడర్లుగా పెట్టి, తమ అధికారాల్ని టీచర్లు వీళ్ళకి బదలాయిస్తుంటారు. శిక్షించడం, బహుమతులివ్వడం క్రమశిక్షణలో భాగం. సామాన్యంగా క్రమశిక్షణను అమలుచేసేవాళ్ళెవ్వరూ దీని మంచి చెడ్డల్ని ప్రశ్నించరు. పిల్లల అభివృద్ధిపై దీని ప్రభావాన్ని గురించి పట్టించుకోరు. పిల్లల ఆత్మగౌరవాన్ని అభ్యసనంలో వారి ఆసక్తిని అసలు పట్టించుకోరు. సాటి పిల్లల సమక్షంలో కించపరచడం, శారీరక దండన, తిట్టడం ఇవన్నీ చాలా స్కూళ్ళలో మామూలు విషయాలు. దీర్ఘకాలికంగా జరిగే అనర్థాల్ని ఏమాత్రం గుర్తించకుండా టీచర్లే గాదు తల్లిదండ్రులుసైతం ఈ శిక్షల్ని చాలా అవసరమైనవని ఆహ్వానించడం బాధాకరం.

మన పాఠశాలల నిర్వహణలో కన్పించే ఈ నియమ నిబంధనల్లోని సామంజస్యాన్ని మొదట టీచర్లు ప్రశ్నించాలి. మన విద్యా లక్ష్యాలకివి అవసరమా అని కూడా వీళ్ళు ప్రశ్నించుకోవాలి. మేజోళ్ళు పొడుగ్గా ఉండాలని, వ్యాయామ దుస్తులు తెల్లగా ఉండాలని మనం పెట్టే నిబంధనలకూ విద్యకూ ఏం సంబంధం? ఇవి ఉండడంవల్ల పిల్లలకు బాగా చదువొస్తుందా? క్లాసురూంలో నిశ్శబ్దంగా ఉండటం, టీచరు అడిగే ప్రశ్నకు ఒక్కరే జవాబు చెప్పడం, సరైన సమాధానం తెలిస్తేనే చెప్పడం లేకుంటే చెప్పకపోవడం ఇవన్నీ మన పిల్లలకు దక్కాల్సిన సమానావకాశాల్ని హరించే అంశాలు. సమానత్వ విలువలకివి విఘాతాలు. పిల్లల సహజ అభ్యసన క్రమాన్నివి కుంటుపరుస్తాయి. 'సిలబస్ పూర్తి చేసెయ్యడానికి', 'తరగతిని అదుపులోపెట్టకోడానికీ' ఈ పద్ధతులు పనికొస్తాయేమో గానీ పిల్లలమధ్య సౌహార్దం పెంచడానికి మాత్రం ఇవి ఏమాత్రం పనికిరావు.

పిల్లల క్రమబద్ధ అభ్యసనానికీ, ఆసక్తులకీ, సామర్థ్యాలకీ కావల్సింది స్వయంక్రమశిక్షణ. క్రమశిక్షణ వల్ల పిల్లల పనితనం పెరగాలి. ఉత్సాహంతో తమకిచ్చిన పనిని చేసేందుకది తోడ్పడాలి. పిల్లలకూ, టీచర్లకూ అది స్వేచ్ఛనివ్వాలి. స్వయం ప్రతిత్తినివ్వాలి. నిబంధనల్ని రూపొందించేప్పుడు పిల్లల్ని భాగస్వాముల్ని చెయ్యాలి. ఫలితంగా ఆ నిబంధనలెంత అవసరమో వాళ్ళు గుర్తిస్తారు. అప్పుడు వాళ్ళు వాటిని పాటిస్తారు.

ఈ క్రమంలో పిల్లలు నిర్ణయాల్ని చేసే విధానాన్ని, ప్రజాస్వామిక పని పద్ధతుల్ని అవగాహన చేసుకొంటారు. టీచర్లకూ, పిల్లలకూ మధ్య; పిల్లలకూ, పిల్లలకూ మధ్య సమస్యలు వచ్చినప్పుడు వీటిని పరిష్కరించుకొనే యంత్రాంగాన్ని కూడా పిల్లలే రూపొందించుకొనేలా చెయ్యొచ్చు. అలాగే వీలున్నన్ని తక్కువ నిబంధనలుండేలా మనం చూడాలి. అవి న్యాయమైనవిగా, పాటించేవిగా ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించాల్సి వచ్చిన కారణాల్ని చూడకుండా పిల్లల్ని శిక్షించడం మంచిదికాదు. ఉదాహరణకు టీచర్లకూ, ప్రధానోపాధ్యాయునికీ నిశ్శబ్దంగా ఉండని క్లాసులంటే కోపమెక్కువ. టీచర్లు క్లాసును అదుపులో పెట్టలేకపోయినందువల్ల ఈ క్లాసులలా ఉన్నాయని ఎందుకనుకోవాలి? పిల్లలందరూ తమలో తాము చర్చించుకొనే క్లాసులుగా వీటినెందుకు చూడగూడదు?

అలాగే పిల్లల సమయపాలనకు సంబంధించినాంశాలు కూడా. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు అకారణంగా కఠినంగా ఉండడం మనం చూస్తుంటాం. పాఠశాలకొచ్చేప్పుడు మధ్యలో ట్రాఫిక్ స్తంభించి పరీక్షకు ఆలస్యంగా ఒకమ్మాయి వచ్చిందనుకోండి, ఈమెను శిక్షిస్తే ఎలా? ఇలాంటి నిబంధనల్ని 'ఉన్నతవిలువలుగా' మనం కీర్తిస్తే ఎలా? నిబంధనల విషయంలో హేతుబద్ధత లేకుంటే పిల్లలూ, తల్లిదండ్రులేగాదు టీచర్లుకూడా నిరుత్సాహపడతారు. ముందు పిల్లల్ని అడగాలి. వాళ్ళు ఎందుకు నిబంధనను అతిక్రమిచారో వాళ్ళ వైపునుంచి వినాలి. ఆతర్వాత తదనుగుణంగా వ్యవహరించాలి. ప్రధానోపాధ్యాయులూ టీచర్లూ చేయాల్సింది బలప్రయోగం కాదు. సాధికారితను ఉపయోగించాలి. నిరంకుశత్వం, హేతురాహిత్యం అనేవి బలప్రయోగపు లక్షణాలు. వీటిని చూసి భయపడతారు తప్ప ఎవ్వరూ వీటిని గౌరవించరు.

## 4.5 తల్లిదండ్రులకూ, సమాజానికి స్థానం

బడిలో మనం పిల్లలకు సహకరిస్తూ విద్య నేర్పుతాం.ఇదొక నియత వ్యవస్థ. కానీ జ్ఞాన నిర్మాణం మాత్రం నిరంతరం సాగేది. ఇది బడి బయటకూడా సాగుతుంది. స్కూళ్ళలో నేర్పిన విషయాల్నే చేసుకొని రమ్మని టీచర్లు పిల్లలకు హోంవర్కు ఇస్తుంటారు. చిన్నపిల్లలకైతే తల్లిదండ్రులు సహకరించాల్సి వుంటుంది. పెద్ద పిల్లలు తమంత తాము చేసుకొంటారు. చాలా సందర్భాల్లో టీచర్లు స్కూల్లో నేర్చుకొన్న దాన్ని మళ్ళీ రాయమని, పాఠ్యపుస్తకాల ప్రశ్నలకు జవాబులు రాయమని చెబుతుంటారు. స్కూల్లో మిగిలిపోయిన పనినైనా ఇంట్లో పిల్లలు చేస్తుంటారు. చదువురాని తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకి హోంవర్క్ విషయంలో సహకరించలేరు. ట్యూషన్లు కూడా ఇందుకే అవసరమవుతాయి. హోంవర్క్ చెయ్యనందుకు పడే శిక్షల్ని తప్పించుకోవడానికి పిల్లలు ట్యూషన్లకెళుతుంటారు. మనం అభ్యసనం నిరంతరమనీ, బడిబయట కూడా పిల్లలు నేర్చుకొంటారనీ భావించినట్లయితే హోంవర్క్‌ను ఇంకోవిధంగా ఇవ్వాలి. స్కూల్లో చెప్పింది మళ్ళీ చెయ్యడం, దీనికి తల్లిదండ్రుల సహకారం తీసుకోవాల్సిరావడం హోంవర్క్‌గా ఉండకూడదు. స్వంతంగా చేసినా, తల్లిదండ్రుల సహకారంతో చేసినా ఇది ఇప్పటి హోంవర్క్ కంటే భిన్నంగా ఉండాలి. దీనివల్ల తమ పిల్లలు స్కూల్లో ఏమి నేర్చుకొంటున్నారో తల్లిదండ్రులు తెలుసుకొనే అవకాశం కూడా కల్గుతుంది.

మన స్కూళ్ళలోకి సమాజాన్ని కూడా ఆహ్వానించాలి. పాఠ్య ప్రణాళికను అమలుచెయ్యడంలో సమాజాన్ని కూడా భాగస్వామిని చెయ్యాలి. స్కూల్లో చెబుతున్న ఒక అంశాన్ని పిల్లల తల్లిదండ్రులు వచ్చి తమ అనుభవాలతో, అవగాహనతో వివరించవచ్చు. ఉదాహరణకు యంత్రాల పాఠాల్ని చెప్పేందుకు స్థానిక మెకానిక్కు బడికి రావచ్చు. తాను ఎలా యంత్రాల్ని రిపేరు చేస్తాడో, దాన్నెలా తాను నేర్చుకొన్నాడో తన అనుభవంతో అతడు వివరించవచ్చు. అలాగే పిల్లలకు ఇంటి భాషను గురించి, దాన్ని పాఠశాల భాషగా మార్చుకోవడాన్ని గురించి మనం చెప్పేటప్పుడు స్థానిక భాష బాగా మాట్లాడగలవారిని పిలిపించవచ్చు. మాతృభాషను బోధించడానికి, దానికవసరమైన సామగ్రిని తయారు చెయ్యడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. ఇదంతా నిర్దిష్ట పాఠ్యాంశాల్ని బట్టి, స్థానిక నైపుణ్యాల్నిబట్టి, వాటి అందుబాటునుబట్టి ఉంటుంది. ఇలా స్కూల్లో తల్లిదండ్రుల్ని, సమాజాన్ని అభ్యసన క్రమంలో భాగస్వాముల్ని చెయ్యాలి. సంస్థాగతంగా మనం చేసే బోధన, మనం చెప్పే సబ్జెక్టుల్లోని అంశాలు దీనివల్ల మరింత పరిపుష్టమవుతాయి.

### ఇలా హోంవర్క్ చేయిస్తే...

**5-7** క్లాసులు : మీ తల్లిదండ్రుల్ని అడిగి మీ తాత, ముత్తాత, ముత్తాత తల్లిదండ్రులు ఇలా మీ వంశవృక్షాన్ని రాసుకొని రండి. ఎంత దూరం ఇలా వెనక్కి వెళ్ళగలరో చూడండి. మీ ఇంటి దగ్గర దొరికే ఒక గడ్డిపోచ బొమ్మ వెయ్యండి. దాన్ని గురించి మూడు వాక్యాలు రాయండి.

**7-9** క్లాసులు : మీ ఇంట్లో మీ తల్లిదండ్రులు, నువ్వు, నీకంటే చిన్నవాళ్ళు రోజూ ఉదయం నుంచి సాయంత్రందాకా చేసే పనుల్ని గమనించండి. ఈ పనుల్ని డబ్బు చెల్లించేవి-చెల్లించనివి, విధ్యుక్తమైనవి - కానివి; స్త్రీ పురుషుల మధ్య విభజింపబడ్డవి - ఇలా విభజించండి.

పిల్లలకు స్కూలు వాతావరణాన్ని మరింత సన్నిహితం చేసేందుకు, పాఠశాలకూ, సమాజానికీ మధ్య సంబంధాన్ని సుదృఢం చేసేందుకు మనకు కొన్ని సంస్థాగత వ్యవస్థలున్నాయి. తల్లిదండ్రుల, అధ్యాపకుల సంఘాలు, పాఠశాలల అభివృద్ధి కమిటీలు, పూర్వ విద్యార్థుల సంఘాలు ఇందుకోసం ఏర్పడ్డవే. జాతీయ పండుగలకు, సాంస్కృతిక వ్యాయామ దినోత్సవాలకు సామాన్యంగా ఈ సంస్థల సభ్యుల్ని ఆహ్వానిస్తుంటాం. చాలా స్కూళ్ళు తల్లిదండ్రుల్ని కూడా ఆహ్వానిస్తుంటాయి. దీనివల్ల సమాజం స్కూలుకు సన్నిహితమవుతుంది. స్కూలు నిర్వహణలో, వసతుల కల్పనలో కూడా వీళ్ళ సహకారం తీసుకోవచ్చు. ప్రహరీ గోడలు కట్టడంలో గ్రామప్రజలు చేయూతనిచ్చిన సందర్భాలు మనకెన్నో తరచూ కన్పిస్తుంటాయి. అంటే దీనర్థం పేద తల్లిదండ్రులమీద ఆర్థికభారం పెట్టమని కాదు. సామాజిక అవసరాలకు కూడా పాఠశాల ఆవరణాన్ని వాడుకోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో సమిష్టి బాధ్యత అవసరమవుతుంది. కాబట్టి అన్ని స్కూళ్ళు, పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులు భాగస్వాములయ్యేలా చూడాలి. చాలా స్కూళ్ళు తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఒప్పుకోలేవు. మంచి విషయాల్లో వాళ్ళ ప్రశ్నలకి ఏమీ విలువలేనట్టు, అర్థం లేనట్టు భావిస్తాయి. ప్రైవేటు స్కూళ్ళయితే తల్లిదండ్రుల్ని కేవలం వినియోగదారులుగా చూస్తాయి. స్కూలు విషయాలు నచ్చకపోతే పిల్లల్ని మాన్పించి తీసుకెళ్ళమంటాయి. ప్రభుత్వ పాఠశాలలు పేద పిల్లల తల్లదండ్రులు తమ పిల్లల్ని గూర్చి, స్కూలు విషయాల్ని గురించి తెలుసుకొనే అర్హతే లేనట్టు భావిస్తాయి. మనం ఇంటికి పంపే రిపోర్టు కార్డుల్లో మార్కులు, ర్యాంకులు తప్ప ఏమీ ఉండవు. తమ పిల్లలు బడిలో ఎలా నేర్చుకుంటున్నారో, వాళ్ళకి తాము నిర్దిష్టంగా ఏమి చెయ్యాలో తెలియజేసేవిధంగా ఇవి రూపొందించాలి.

## 4.6 పాఠ్యాంశ రంగాలు, అభ్యసన వనరులు

### 4.6.1 పాఠ్యపుస్తకాలు, పుస్తకాలు

పాఠ్యప్రణాళికలు రూపొందించడంలో పాఠ్యపుస్తకాలు కీలకమైనవని సర్వత్రా ఒక అభిప్రాయం ఉంది. నిజానికి పాఠ్య ప్రణాళికను రూపొందించడాన్ని ఇంతకంటే విస్తృతార్థంలో మనం చూడాలి. కానీ పాఠ్యపుస్తకాలు మార్చడం తప్ప మరేమీ మనం పట్టించుకోము. పాఠ్యపుస్తకాల్ని మంచి భాషలో రాస్తే సరిపోదు. బాగా డిజైన్ చేస్తే సరిపోదు. నైపుణ్యంతో ఎడిట్ చేస్తేనూ సరిపోదు. అవి పరస్పర చర్యకు తగ్గట్టుగా ఉండాలి. అయితే వీటికితోడు ఇతర పలురకాలు అభ్యసన సామగ్రి కూడా ఉండడం మరీ అవసరం. ఉదాహరణకు సబ్జెక్టు నిఘంటువుల్నే తీసుకోండి.  మన పాఠ్యపుస్తకాలు నిర్వచనాలతో, పారిభాషికాలతో, విజ్ఞాన సర్వస్వాల్లా మారే ప్రమాదం వీటివల్ల తప్పుతుంది. ఉపాధ్యాయుడు పాఠ్యాంశభావనలు మాత్రం బోధిస్తే సరిపోతుంది. క్లాస్‌రూం బోధనలో వేగం, బోలెడు హోంవర్క్, ప్రైవేటు ట్యూషన్లు మన చదువుల్లో ఒక త్రికోణం. ఇదే తీవ్రమైన ఒత్తిడికి మూలం. పాఠ్యగ్రంథ రచయితలు భావనల వివరణకు, కృత్యాలకు, ఆలోచనల్ని రేకెత్తించే అభ్యాసాలకు, చిన్నచిన్న సమూహాలుగా పిల్లలు చెయ్యగల ప్రాజెక్టులకు పాఠ్యగ్రంథాల్లో ప్రాధాన్యతనిచ్చి, నిర్వచనాల్ని సబ్జెక్టు నిఘంటువులకు వదిలెయ్యడం మంచిది.

అనుబంధ పుస్తకాలు, వర్క్‌బుక్కులు, అదనపు పఠన సామగ్రి

పాఠ్యపుస్తకాల తర్వాత ముఖ్యమైనవివి. భాషల్లాంటి సబ్జెక్టుల్లో ఇలాంటి సామగ్రి అవసరమని మనం ఇప్పటికే గుర్తించాము. కానీ ఎలాంటి సామగ్రి అవసరమనే దానిపై మన దృక్పథంలో మాత్రం పునస్సమీక్ష అవసరం. ప్రస్తుతం లభిస్తున్న పుస్తకాలు ఆకర్షించేలా లేకపోవడం పెద్ద సమస్య. ఇక వర్క్‌బుక్కుల దగ్గరికొస్తే పాఠ్య గ్రంథాల్లోని పాఠాలకు, అభ్యాసాలకు మించి వీటిలో ఏమీవుండవు. గణితానికి, ప్రకృతి శాస్త్రాలకు ఇలాంటి వర్క్‌బుక్కులు, అనుబంధ సామగ్రి ఇప్పుడెంతైనా అవసరం. ఇలాంటివి అందుబాటులోకి వస్తే పిల్లలు పాఠ్యపుస్తకాల నుంచి బయటపడతారు. బయటి ప్రపంచం నుంచి నేర్చుకోవడం మొదలుపెడతారు. కళల విషయానికొస్తే ఇలాంటి వర్క్‌బుక్కులే మన బోధనాసామగ్రి. ఇందుకోసం చాలా మంచి పుస్తకాలిప్పుడు మార్కెట్లో లభిస్తున్నాయి. పిల్లలు చెట్లను, పక్షుల్ని, ప్రకృతి ప్రదేశాలను పరిశీలించడాన్ని నేర్చుకోడానికివి ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటివి పిల్లలకేకాదు, టీచర్లకుకూడా అందుబాటులో ఉండటం అవసరం.

అట్లాసులు

భూమిని మన నివాసంగానూ, ప్రకృతిగానూ పిల్లలు అర్థం చేసుకొనేందుకు అట్లాసులెంతో పనికొస్తాయి.

నక్షత్రాలు, ప్రకృతి వైవిధ్యం, ప్రజలు, వాళ్ళ జీవనవిధానాలు, చరిత్ర, సంస్కృతి మొదలైనవి తెలిపే అట్లాసులైతే అన్ని వయస్సుల పిల్లలకు చాలా ఉపయోగపడతాయి. ఇలాంటి అంశాలపై ఉండే పోస్టర్లు కూడా పిల్లల జ్ఞానపరిధిని పెంచుతాయి. వీటిని క్లస్టర్ గ్రంథాలయాలనుంచిగానీ, ఇతరత్రాగానీ సేకరించుకోవాలి. టీచర్లు కూడా వీటిని కొన్నింటిని తయారుచెయ్యవచ్చు. పాఠశాల గ్రంథాలయాల్లో ఉంచవచ్చు. వీటితోపాటు మనం శ్రద్ధ పెట్టాల్సిన ఇతర అంశాలు కూడా కొని ఉన్నాయి. స్త్రీలపట్ల విచక్షణ, ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన పిల్లల అవసరాలు, రాజ్యాంగ విలువలు ఈ కోవలోకి వస్తాయి.

కరదీపికలు

పాఠ్యపుస్తకాలెంత అవసరమో ఉపాధ్యాయ కరదీపికలు కూడా అంతే అవసరం. కొత్త పాఠ్యపుస్తకాల్ని రూపొందించి ప్రవేశపెట్టేటప్పుడు తప్పనిసరిగా వీటిని టీచర్లకందించాలి. ఇప్పటి పద్ధతికంటే భిన్నమైన పద్ధతుల్లో వీటిని తయారుచేయవచ్చు. వీటిని తయారుచేసేటప్పుడు పాఠ్యపుస్తకాల అంశాల్ని అధ్యాయాలవారీగా ఇస్తుంటాం. కానీ అలానేవుండాలని ఏమీలేదు. ఇప్పటికే స్థిరపడ్డ పద్ధతులకు భిన్నమైన పద్ధతుల్ని వీటిద్వారా ఉపాధ్యాయులకు పరిచయం చెయ్యవచ్చు. ప్రస్తుత పద్ధతుల్లోని లోపాల్ని చెప్పవచ్చు. ఆడియో, వీడియో, ఇంటర్నెట్‌ల ద్వారా విషయ సేకరణనుగురించి తెలపవచ్చు. అప్పుడివి వనరుల పుస్తకాలవుతాయి. టీచర్లు తమ క్లాస్‌రూంలో పాఠ్యప్రణాళికల్ని రూపొందించుకొనేపుడు ఎంతో ఉపయోగపడతాయి. వృత్యంతర శిక్షణలో భాగంగా ఈ రిసోర్సు పుస్తకాల్ని టీచర్లకు అందించాలి.

### గ్రంథాలయాలు

వారానికొకసారి ఒక పీరియడు గ్రంథాలయం కోసం కేటాయించాలి. ఈ సమయంలో పిల్లలందరూ కూచుని చదువుకొంటారు. తీసుకెళ్ళిన పుస్తకాలు తిరిగి ఇస్తారు. కొత్తవి తీసుకుంటారు.

ప్రత్యేకంగా గదిలేకపోతే టీచర్లు తరగతిలోకి పిల్లలకు సరిపోయే పుస్తకాల్ని తీసుకొని రావాలి. పిల్లలే తమకు కావల్సినవి ఎంచుకొనేలా చూడాలి. టీచరు ఇవ్వడం సరిగాదు.

భాషాబోధన జరిగే క్లాసులో పుస్తకాల్ని ఇవ్వాలి. ఇచ్చేప్పుడు దానికి కావల్సిన పుస్తకాల్ని వెతుక్కొమ్మని పిల్లల్ని పురమాయించాలి.

భాషాబోధన తరగతిలో గతవారం పిల్లలు చదివిన పుస్తకం గురించి రాయమనాలి.

పిల్లలు తాము చదివిన కథను ఇతర పిల్లలకు చెప్పి పంచుకొనే అవకాశం ఇవ్వాలి.

వేసవి సెలవుల్లోకూడా పాఠశాల గ్రంథాలయం తెరిచి ఉంచాలి.

### 4.6.2 గ్రంథాలయాలు

పాఠశాల గ్రంథాలయాల గురించి ఎంతోకాలంగా ఎన్నో సిఫార్సులున్నాయి. కానీ స్కూళ్ళలో వీటి స్థితి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. మన భవిష్యత్ ప్రణాళికల్లో అన్ని స్థాయిల్లోనూ గ్రంథాలయాలకు మనం పెద్దపీట వెయ్యాలి. ఇది చాలా అవసరం. గ్రంథాలయాల్ని అభ్యసనానికి, ఆహ్లాదానికి, ఏకాగ్రతకు ఎలా ఉపయోగించుకోవాలో పిల్లలకూ, టీచర్లకూ ఇద్దరికీ శిక్షణ అవసరం. పాఠశాల గ్రంథాలయాన్ని టీచర్లు, పిల్లలు తమకుతాము వాడుకొనేందుకు వీలుగా క్యాటలాగుల్ని పద్ధతిప్రకారం తయారుచెయ్యాలి. పుస్తకాలు పత్రికలతోపాటు, మరింత విస్తృత ప్రపంచంతో సంబంధంకోసం గ్రంథాలయాల్లో కంప్యూటర్లు కూడా ఉండాలి. టీచర్లకు, పిల్లలకు దీనిద్వారా నూతన సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. చాలా ప్రాంతాల్లో సమాజ గ్రంథాలయాలున్నాయి. జిల్లా కేంద్రాల్లో మంచి గ్రంథాలయాలున్నాయి. భవిష్యత్‌లో పాఠశాల గ్రంథాలయాల్ని వీటితో అనుసంధానింపచెయ్యాల్సి ఉంది. రాజారామ్ మోహన్‌రామ్ గ్రంథాలయ సంస్థకు ఇలా అనుసంధానించేందుకు, పర్యవేక్షించేందుకు ప్రభుత్వం వనరులు సమకూర్చాలి.

పాఠశాల దైనందిన కార్యక్రమాల్లో గ్రంథాలయం పలురూపాల్లో ఉపయోగపడుతుంది. వారానికొకరోజు గ్రంథాలయంకోసం కేటాయిస్తే సరిపోదు. పుస్తకాలు చదవడంలోని

రుచి ఇంతమాత్రాన ఒంటబట్టదు. బయటికి తీసుకెళ్ళేందుకు వీలుగా పిల్లలకు పుస్తకాలివ్వాలి. ఎలా ఇవ్వాలో, ఎలా తిరిగి తీసుకోవాలో, టీచర్లకు శిక్షణ ఇవ్వాలి. గ్రంథాలయానికి మంచి గది ఉంటే అందులో పిల్లలు కూచుని చదువుకొనేందుకు బల్లలు సమకూర్చాలి. తగిన వెలుతురు ఉండేలా చూడాలి. గ్రంథాలయంలోనే టీచరు క్లాసును నిర్వహించుకోవచ్చు. వసతినిబట్టి దీన్ని ఒక చర్చాస్థలంగా మార్చవచ్చు. ఒక వృత్తి నిపుణుడిచేత ఇందులో ప్రదర్శన ఇప్పించవచ్చు. కథలు చెప్పించవచ్చు. క్లస్టర్, బ్లాకు స్థాయి గ్రంథాలయాలు ఏర్పడితే ఇది టీచర్లకు తమ పాఠ్యప్రణాళికల్ని రూపొందించుకోవడంలో ఎంతో తోడుగా ఉంటాయి. ఒక్కో బ్లాకు గ్రంథాలయం ఒక్కో ప్రత్యేక విషయక గ్రంథాలతో, సమాచారంతో నిండివుంటే మొత్తం జిల్లా గ్రంథాలయానికి ఒక సంపూర్ణత, సమగ్రత వస్తుంది.

ప్రాథమిక పాఠశాలల్లో వీడియో ఫిల్ముల ప్రదర్శనలో పిల్లలు చేతితో చేసే పనులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయాలు కాజాలవు.

### 4.6.3 విద్యా సాంకేతిక పరిజ్ఞానం

పాఠ్యప్రణాళికా తయారీలో విద్యాసాంకేతిక జ్ఞానం ఎంత ముఖ్యమైందో ఇప్పుడు మనమందరం గుర్తిస్తున్నాం. కానీ దాన్ని వీలున్నంత ఎక్కువగా వాడుకొనేందుకవసరమైన వ్యూహాలు, ఏర్పాట్లు అందుబాటులోకి తెచ్చుకోలేకపోయాం. సామాన్యంగా మనం సాంకేతిక విజ్ఞానాన్ని విస్తరణ మాధ్యమంగా ఉపయోగిస్తాం. ఉపాధ్యాయుల నియామకాల్లో సరైన పద్ధతులులేని ప్రాంతాల్లో మంచి ఉపాధ్యాయులు లేని కొరతను దీంతో తీర్చుకొంటాం. నాణ్యమైన బోధన కోసమే విద్యాసాంకేతిక విజ్ఞానాన్ని వాడేటట్టయితే దీనివల్ల టీచర్లకు బోధనపట్ల విశ్వాసం సడలుతుంది. పాఠ్యప్రణాళిక సంస్కరణకు ఈ సాంకేతిక విజ్ఞానాన్ని సాధనంగా మనం వాడుకోవాలంటే మెజారిటీ టీచర్లను, పిల్లలను మనం కేవలం వినియోగదారులుగా చూడగూడదు. ఉత్పత్తిదారులుగా చూడాలి. ఈ సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసి అమలుచేసే సందర్భంలో విస్తృత చర్చ జరగాలి. క్లస్టరు, బ్లాకు, జిల్లా, రాష్ట్రస్థాయిలన్నిటిలో ఈ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకొనే ఏర్పాట్లు ఉండాలి. ఊరిపెద్దతో ఇంటర్వ్యూను రికార్డు చేయడానికి ఉపయోగపడే సాధారణ ఆడియో రికార్డింగు నుంచి, వీడియో ఫిల్మ్‌లను, గేమ్స్‌ను తయారుచేసేదాకా ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలి. బహుళ మీడియా వ్యవస్థను, సమాచార ప్రసార సాంకేతిక విజ్ఞానాన్ని పెద్దఎత్తున అందుబాటులోకి తేవడం; ఉపాధ్యాయులు, పిల్లలు తమ స్వంత సామగ్రిని దీంతో తయారుచేసుకోవడం, తమ అనుభవాల్ని వీటిసాయంతో వ్యక్తీకరించడం జరిగితే వారి సృజనాత్మకతను వెలికితీయడానికి ఎంతో అవకాశం లభిస్తుంది.

కేవలం వినడానికీ, చూడ్డానికీ పరిమితం కాకుండా విద్యాసాంకేతిక విజ్ఞానం ఇలాంటి సామగ్రి తయారీకి కూడా దారితీస్తే మన దేశంలోని విస్తారమైన విద్యాసామాజిక పరిజ్ఞానాన్ని ఎంతో సమర్థవంతంగా ఉపయోగించుకొనే వీలుకల్గుతుంది. కేవలం సి.డి.లను వాడుకోడానికి పరిమితంగాకుండా అనుసంధాన వ్యవస్థగల పరస్పర చర్యకు ఉపయోగపడే కంప్యూటర్లయితే మరింత పనికొస్తాయి. వీటివల్ల మారుమూల గ్రామాల ప్రాంతాలకు సమాచారాన్ని, ఆలోచనల్ని అందించవచ్చు. విద్యాసాంకేతిక విజ్ఞానం రెండు వైపులనుంచి జరిగే పరస్పర చర్యకోసంకానీ, ఏకపక్షంగా జరిగే 'స్వీకరణ' కోసం కారాదు.

తరగతి గదిలోని సందర్భాల్ని పునరుత్పత్తి చెయ్యడం, పాఠ్యపుస్తకాల్లో ఉన్నదాన్నే బోధించడం, ప్రయోగశాలల్లో చేసే ప్రయోగాల్ని ఆనిమేషన్‌లో చూడడంకాదు విద్యాసాంకేతిక విజ్ఞానం నుంచి మనం కోరుకునేది. సాంప్రదాయక పద్ధతికి భిన్నమైన సృజన్మాతకతను మన బోధనాంశాలకు జోడించాలి. విస్తృత విజ్ఞాన ప్రపంచంలో పిల్లలు స్వేచ్ఛగా

సంచరించాలి. అభిరుచులకు తగ్గట్టు నేర్చుకోవాలి. ఇలాంటి అవకాశం గ్రామీణ పిల్లలకు ఇంకా అందుబాటులోలేదు. పట్టణ గ్రామీణ స్కూళ్ళ పిల్లల మధ్య, ప్రాంతీయ భాషా ఇంగ్లీషు భాషా మాధ్యమాల పిల్లల మధ్య అంతరం పెరిగిపోవడానికిదే కారణం. ఈ విజ్ఞాన సర్వస్వాలు, డాక్యుమెంటరీలు ఇప్పటికీ సరైన ప్రమాణాలతో లేవు. ఇప్పటికే లభిస్తున్న నాణ్యమైన ఆడియో వీడియో సామగ్రిని, ఇంటర్నెట్ నుంచి లభించే సమాచారాన్ని ఉపయోగించుకొని మన పాఠ్యగ్రంథాల్లో, ఉపాధ్యాయ కరదీపికల్లో మార్పులు తేవాలి. పాత, గొప్ప సినిమాల్ని కూడా ఇందుకోసం వాడుకోవచ్చు. ఉదాహరణానికి గ్రామీణ జీవితాన్ని గురించి పిల్లలు చదువుతున్నప్పుడు సత్యజిత్‌రే గారి 'పథేర్ పాంచాలి'ని చూపొచ్చు. ఇందుకోసం క్లస్టర్ రిసోర్సు సెంటర్సును, వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు. మన భవిష్యత్ పాఠ్యపుస్తకాల్లో వివిధ సబ్జెక్టుల జ్ఞానం సమ్మిళితంగా లభించాలి. ఉదాహరణకు రాజస్థాన్ చరిత్రని పిల్లలు చదువుతుంటే మీరాబాయి భజనగీతం పిల్లలకందుబాటులో ఉండాలి. అది ప్రాచీన భాండాగారం నుంచి సంపాదించారో పిల్లలకు చెప్పాలి. యం.యస్. సుబ్బులక్ష్మి పాడిన ఆ గీతాన్ని విన్పించాలి. ఇన్ని అనుభవాలు ఒకేసారి లభించినపుడు పిల్లలు జ్ఞానాన్ని ఎంతో అద్భుతంగా స్వంతం చేసుకోగల్గుతారు.

ఇలా అనుభవం, జ్ఞానం దగ్గరైనపుడు ఇప్పటిలా చదువు భారమనిపించదు, విసుగనిపించదు. గణితం, సైన్సు బోధించేటపుడు, వైకల్యం గల పిల్లలకు నేర్పించేటపుపు విద్యా సాంకేతిక విజ్ఞానం, సమాచార విజ్ఞానం విలువ చాలా ఎక్కువ. వయస్సుకు తగ్గట్టుగా నిర్దిష్టంగా విద్యా సాంకేతిక విజ్ఞానాన్ని వాడుకోగల్గితే పాఠ్య ప్రణాళికా లక్ష్యాన్ని మనం సాధించడం సులభమవుతుంది. ఇలాంటి సాంకేతిక విజ్ఞానం పూర్తిగా అందుబాటులోకి రావడంకోసం ప్రభుత్వాలు, ఆర్థిక ప్రణాళికా సంస్థలు పూనుకోవాలి.

### 4.6.4 పరికరాలు, ప్రయోగశాలలు

ఆర్టు క్రాఫ్టు పనులకు అవసరమైన పరికరాలు స్కూల్లో ఉండటం తప్పనిసరి. వీటివల్ల పాఠశాలకు సృజనాత్మకతా స్వభావం వస్తుంది. అయితే దీనికోసం కొందరైనా జాగ్రత్తగా ప్లాన్ చెయ్యాలి. హస్తకళలకైతే వారానికో, పక్షానికో ఒకసారి మగ్గాలు, తరిమె పట్టే సాధనాలు, కత్తెరలు, ఎంబ్రాయిడరీ చట్రాలు లాంటివి ఆయా హస్తకళలనిబట్టి అవసరమౌతాయి. అయితే ఇలాంటివి నేర్పే సందర్భంలో ఆడ మగ విచక్షణ చూపడం మాత్రం సరైందికాదు. ఇదే జరిగితే మన లక్ష్యమే దెబ్బతింటుంది. కల్పనాశక్తి, పరస్పర సహకారం ఉండే ఒక మానవీయ వాతావరణంలో పిల్లలు మమేకమై తమ స్వంత సామగ్రితో పనిచేసే ఒక సంస్కృతిని మనం పాఠశాలల్లో కోరుకుంటున్నాం. దీనికీ విచక్షణ విఘాతం కల్గిస్తుంది. కళలు నేర్చుకొనేపుడు కూడా కొన్ని పరికరాలు అవసరమౌతాయి. ఇవి అందుబాటులో ఉండటం, వీటిని వాడడంలో నైపుణ్యం, వీటిని జాగ్రత్తపరచడం ఇవన్నీ పిల్లలందరికీ చాలా విలువైన అనుభవాలు. సాధారణ విద్యతోపాటు మంచి సంస్కృతిని, శాంతిని పెంపొందించడానికికూడా ఈ కళలెంతో ఉపయోగపడతాయి. చాలా స్కూళ్ళలో సైన్సు బోధనకు ప్రయోగశాలలు, గణిత బోధనకు తగిన సామగ్రి ఉండవు. గ్రామీణ స్కూళ్ళలో ఈ లోపం మరీ ఎక్కువ. దీనివల్ల తమకిష్టమైన సబ్జెక్టుల ఎంపికలో అందరికీ సమానావకాశాలు లేకుండా పోతాయి. అందువల్ల వాళ్ళకి జీవితంలో అవకాశాలు కూడా తగ్గిపోతాయి. అన్ని స్కూళ్ళలోనూ మంచి ప్రయోగశాలలుండాలి. ప్రాథమిక పాఠశాలల్లో సైన్సు, గణితం కార్నర్ ఉంటే ఉన్నత, హైయ్యర్ సెకండరీ స్కూళ్ళలో ప్రయోగశాలలు తప్పనిసరి.

### 4.6.5 ఇతర రంగాలు, అవకాశాలు

పాఠశాల బయట ఉండే ప్రదేశాలు కూడా చాలా ముఖ్యమైనవని ముందే చెప్పుకొన్నాం. స్థానిక స్మారక భవనాలు, వస్తు ప్రదర్శన శాలలు, ప్రకృతి సహజమైన నదులు, కొండలు, రోజూ మనం వెళ్ళే మార్కెట్, పోస్టాఫీస్‌లాంటివి ఉపాధ్యాయుడెంత సమర్థవంతంగా వాడుకోగల్గితే పిల్లలు పాఠశాలలో నేర్చుకొనేందుకది అంత ప్రత్యక్షంగా, ఎక్కువగా ఉపయోగపడుతుంది. క్లాస్‌రూం కృత్యాల్ని, పాఠ్యపుస్తకాల అంశాలకు కుదిస్తే పిల్లల ఆసక్తికీ, సామర్థ్యాలకుకూడా అది గొడ్డలిపెట్టవుతుంది. మన పాఠశాల దైనందిన కృత్యాలు, సాంవత్సరిక కార్యక్రమాలు చాలా కఠినంగా మార్పుకు ఏమాత్రం అవకాశం లేకుండా ఉంటాయి. ఉదాహరణకు రాత్రులు మన స్కూళ్ళ గేట్లు మూసేసివుంటాయి. స్కూలుపైకి వెళ్ళే వీలుండదు. అందువల్ల నక్షత్రాల్ని పరిశీలించే అవకాశం స్కూల్లో ఉండదు. సూర్యాస్తమయాన్ని, ఋతుపవనాల రాకను పరిశీలించడంలాంటివి మన టైంటేబుళ్ళలో ఉండవు. దేశంలోని ఇతర ప్రాంతాల్ని, మనకు దగ్గరగా వున్న దక్షిణాసియా (SAARC) దేశాల్ని సందర్శించడంలాంటివి పరస్పరావగాహనకు ఎంతైనా ఉపయోగపడతాయి.

టీచర్లు, పాఠశాల నిర్వాహకులు కలిసి మన స్కూళ్ళ నియమాల్ని సరళతరం చెయ్యాలి. దీంతోపాటు సిలబసు రూపకర్తలు, పాఠ్యగ్రంథాల ఉపాధ్యాయ కరదీపికల రచయితలు కూడా దీన్ని గుర్తించి మన పాఠ్యప్రణాళిక పరిధిని పెంచాలి. దీనివల్ల విజ్ఞాన యాత్రల్ని, కళల్ని, చేతివృత్తుల్ని పాఠ్యేతర అంశాలుగా పరిగణించే మన దృక్పథం మారుతుంది.

### 4.6.6 బహుళ పాఠ్యగ్రంథాలు, ప్రత్యామ్నాయ సామగ్రి

భారతీయ సమాజం బహుళత్వంతో, వైవిధ్యంతో కూడింది. ఎంతో వైవిధ్యం గల పాఠ్యగ్రంథాలు, సామగ్రి రూపొందించుకునేందుకు మనకు అవకాశాలు ఎక్కువ. ఇలాంటి సామగ్రి మన పిల్లల సృజనశీలతను, భాగస్వామ్యాన్ని, ఆసక్తిని పెంచి అభ్యసనానికి దోహదపడుతుంది. వివిధ సమూహాల పిల్లల వివిధ అవసరాలకు సరిపోయే ఒకే పాఠ్య పుస్తకం ప్రపంచంలో ఎక్కడా ఉండదు. అంతేగాక ఒకే విషయాన్ని, భావనను పలు పద్ధతుల్లో బోధించవచ్చు. ప్రభుత్వ స్కూళ్ళు గాని, ప్రైవేటు స్కూళ్ళు గాని తమకు నచ్చిన పాఠ్యపుస్తకాల్ని ఎంపికచేసుకొనే అవకాశం ఉండాలి. అలాగే పుస్తకాలను రూపొందించే సంస్థలు, బోర్డులు కూడా రకరకాల పుస్తకాలను తయారుచేయాలి. ఇతర ప్రచురణ సంస్థలకు కూడా ఇలాంటి అవకాశం ఇవ్వాలి. పాఠ్య పుస్తకాల్లోని లోపాలను తొలగించేందుకు సెకండరీ విద్యాకమీషన్ **1953**కు ముందే "ఏ సబ్జెక్టుకు కూడా ఒకే పాఠ్య పుస్తకాన్ని నిర్దేశించకూడదు. నిర్దిష్ట ప్రయోగాలకు లోబడి వీలున్నన్ని పుస్తకాలుండాలి. వీటిలో నచ్చినవాటిని ఎంపికచేసుకునే అవకాశం ఆయా పాఠశాలలకుండాలి" అని సిఫార్సు చేసింది. అలాగే కొఠారీ కమీషన్ నివేదికలోని "పాఠ్యప్రణాళికాభివృద్ధిలో తప్పనిసరి అంశాలు" అనే భాగంలో కూడా మన పాఠ్య పుస్తకాల ప్రస్తావన ఉంది. మనం తాత్కాలిక పద్ధతిలో పాఠ్యప్రణాళికను రూపొందిస్తామని, రాష్ట్ర కేంద్రంలో తయారుచేసి అన్ని స్కూళ్ళు వీటిని ఒకేవిధంగా ఉపయోగించాలని ఆదేశిస్తామని ఈ నివేదిక పేర్కొంది. దీనివల్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు నూతన ఆవిష్కరణలు చేసే అవకాశం ఉండదు. మన పాఠ్యప్రణాళిక సంస్కరణకోసం చేసే ఏ ప్రయత్నమైనా విజయవంతం కావడం పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయ కరదీపికలు, ఇతర బోధనాసామగ్రి తయారుచేయడంలో పాటించే మెళకువల మీద ఆధారపడివుందని కూడా కొఠారీ కమీషన్ పేర్కొంది.

ఉపాధ్యాయుడు పిల్లల జ్ఞానాభివృద్ధికోసం చేసే ఎలాంటి ప్రయత్నమైనా అది పాఠ్యప్రణాళికలో భాగమౌతుంది. అది ఎక్కడ చేయబడింది, ఎలా చేయబడింది అనే దానితో సంబంధంలేదు. మన పాఠ్యప్రణాళికను గురించిన ఈ శాస్త్రీయమైన అవగాహనను గురించి మన అధికారులకు కూడా ఒక అవగాహన ఉండాలి. వారి మద్దతు, ఆమోదం లేకుంటే ఇలాంటి ప్రయత్నాలు ముందుకుపోలేవు.

**4.6.7** వనరుల సమీకరణ, నిర్వహణ

బోధనోపకరణాలు, ఇతర సామగ్రి, పుస్తకాలు, ఆటవస్తువులు బడిని పిల్లలకు ఆహ్లాదకరంగా మారుస్తాయి. కొన్ని రాష్ట్రాల్లో డి.పి.ఇ.పి. నిధుల్ని ఉపయోగించుకొని మంచి బోధనాభ్యసన సామగ్రిని సమకూర్చుకోవడం జరిగింది. ఇప్పుడు మార్కెట్లో చాలా సామగ్రి లభిస్తోందికూడా. టీచర్లకు, క్లస్టర్, బ్లాకుస్థాయి రిసోర్స్‌పర్సన్స్‌కు వీటి వివరాలు, వాడే విధం తెలిసివుండాలి. కొన్ని చిన్న సంస్థలు, స్వచ్ఛంద సంస్థలుకూడా ఇలాంటివి తయారుచేస్తున్నాయి. ఇవిగాక స్థానికంగా ఏమీ ఖర్చులేకుండా లభించే వస్తువులుకూడా ఉంటాయి. ఇవికూడా మన స్కూళ్ళకు ప్రత్యేకించి ప్రాథమిక స్కూలు పిల్లలకు ఎంతో ఉపయోగపడతాయి. టీచర్లు రకరకాల సామగ్రిని సేకరించుకోవాలి. తమకు కావల్సిన ఉపకరణాల్ని వీటితో చేసుకోవాలి. ఇవి ఏళ్ళతరపడి ఉంటాయి. స్టీరియోఫోం వస్తువులు, కార్డుబోర్డులో చేసిన సామగ్రి చాలా కాలం ఉండవు. దీనికంటే రెక్సిన్, రబ్బరు, గుడ్డలతో చేసినవి చాలాకాలం ఉంటాయి. ఆకర్షణీయంగా కూడా ఉంటాయి.

మ్యాపులు, బొమ్మల ఫోల్డర్లు లాంటివి క్లస్టర్ రిసోర్సు సెంటర్లలో ఉండాలి. అక్కడనుంచి స్కూళ్ళు తెచ్చుకొని ఉపయోగించుకొని తిరిగివ్వాలి. తర్వాత మరో స్కూలు తీసుకొంటుంది. ఇలా పంచుకోవాలి. ఇలా జరిగినప్పుడే మన క్లస్టర్ రిసోర్సు కేంద్రాలకు సార్థకత ఉంటుంది. ఒక టీచరు చేసిన సామగ్రి మరో టీచరు కూడా వాడుకోవచ్చు. బహుళ సామగ్రిని రూపొందిస్తే క్లాస్‌రూము మొత్తానికి ఉపయోగపడుతుంది.

అయితే ఇదంతా జరగాలంటే నిధులుండాలి. దురదృష్టవశాత్తు చాలినంత నిధులు లభించడంలేదు. మరిదెలా సాధ్యం? ఆపరేషన్ బ్లాకు బోర్డులాంటి ప్రభుత్వ స్కీములు ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్ళలో వుండాల్సిన కనీస పరికరాల్ని నిర్దేశించాయి. ఇవిగాక క్లస్టర్‌స్థాయిలో సామగ్రి సమకూర్చుకొనేందుకు మరికొన్ని పథకాలుకూడా ఉన్నాయి. తమ పాఠశాలల్లో బోధనోపకరణాల్ని సమకూర్చుకొనేందుకు టీచర్లు ఈ అవకాశాలన్నిటినీ ఉపయోగించుకోవాలి. వీటితోపాటు స్థానిక వనరుల్ని కూడా సమీకరించుకోవాలి. ఇప్పుడు మరింత సమర్థవంతంగా బోధించేందుకు విద్యాసాంకేతిక విజ్ఞానం, కంప్యూటర్లు అవసరమనే డిమాండు వస్తోంది. కొన్నిచోట్ల రేడియోలు, టీవీలు కూడా బోధనకోసం ఉపయోగిస్తున్నారు.

పిల్లల్ని భాగస్వాముల్ని చేసి, వారి అవగాహనను పెంచాలంటే ఇలాంటి సామగ్రిని ఉపయోగించుకోవడానికి సరైన ప్రణాళిక ఉండాలి. క్లాసులో వాటిని ప్రదర్శించడానికి ఉపాధ్యాయులు ముందుగా సిద్ధం కావాలి. దీనికో ప్రణాళికంటూ ఉంటే పిల్లలకు గ్రూపులుగాగానీ, వ్యక్తిగతంగాగానీ అందరికీ ఈ సామగ్రి అందించడానికి వీలవుతుంది. అలాగాక ఒక విద్యార్థికి దీన్ని ఇచ్చి మిగిలిన వాళ్ళంతా ప్రేక్షకుల్లా కూచోబెడితే ఏ ఫలితమూ ఉండదు.

ప్రయోగశాలలు

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సైన్సు బోధనకోసం ప్రయోగశాలలు చాలా అవసరమని మనకు తెలుసు. పిల్లలందరూ స్వయంగా పరికరాలు ఉపయోగించి ప్రయోగాలు చెయ్యాలంటే కనీసం క్లస్టర్ స్థాయిలో మంచి ప్రయోగశాల ఉండాలి. వారానికోపూట పిల్లలు క్లస్టర్ ప్రయోగశాలకెళ్ళి ప్రయోగాలు చేసుకొనేలా పాఠశాలలు ప్లాన్ చేసుకోవాలి. బ్లాకు క్లస్టర్‌స్థాయిలో క్రాఫ్టు ప్రయోగశాలలుకూడా అవసరం.

మనం అభ్యసనాన్ని ఒక సంస్కృతిగా అభివృద్ధి చెయ్యాలనుకొంటే ఒక్క తరగతిగదినేగాదు, మొత్తం స్కూలును, స్కూలు బయటి ప్రదేశాల్ని కూడా ఉపయోగించుకోవాలి. తద్వారా అనేక కార్యక్రమాల్ని ప్లాన్ చేసుకొనే వీలుంటుంది. పిల్లలు నూతనావకాశాల్ని ఉపయోగించుకొని, అన్వేషించి సమర్థవంతమైన జ్ఞాన నిర్మాణం చేసుకొనేందుకు టీచర్లు పాఠ్యపుస్తకాల అంశాల్నే గాదు, ఇతర అంశాల్ని కూడా తీసుకొని రకరకాల కృత్యాల్ని, ప్రాజెక్టుల్ని, అధ్యయనాల్ని రూపొందించుకోవాల్సి ఉంటుంది.




*Source : National Curriculum for Elementary and Secondary Education 1988*

## 4.7 సమయం

పాఠశాల బోధనా సమయాన్ని గురించి గత డాక్యుమెంట్లన్నీ ప్రస్తావించాయి వీటినుంచి మనం గుర్తించాల్సిందేమంటే మనం ఎట్టి పరిస్థితుల్లో సంస్థ పనిదినాల విషయాల్లో రాజీపడడానికి వీల్లేదు. సంవత్సరానికి **200** పనిదినాలుండాలని NCF **(1988)** పేర్కొనింది. NCF వివిధ సబ్జెక్టులకోసం నిర్దేశించిన సమయాన్ని ఒక మార్గదర్శకంగా మనం భావించవచ్చు. ఈ సిఫార్సులకులోబడి మనం సమయపాలనకు సంబంధించి ఏమి ప్లాన్ చేసుకోవచ్చో, ప్రతి బిడ్డ బడిలో ఎంత సమయాన్ని వెచ్చిస్తుందో దాంతో ఆమె అభ్యసనాన్ని ఎలా సుసంపన్నం చెయ్యవచ్చో చూద్దాం.

ఇప్పుడు పాఠశాల సాంవత్సరిక ప్రణాళికను రాష్ట్ర కేంద్రంలోనే రూపొందిస్తున్నాం. దీన్ని వికేంద్రీకరించాలని, స్థానిక పనులకు, వాతావరణానికి తగ్గట్టుగా ఇది ఉండాలని చాలా సూచనలొచ్చాయి. జిల్లా పరిషత్‌లతో సంప్రదించి వార్షిక ప్రణాళికను రూపొందించుకోవడం మంచిది.

స్థానిక వాతావరణాన్నిబట్టి మన వార్షిక ప్రణాళికలో చాలా మార్పులు అవసరం కావచ్చు. ఉదాహరణకు రుతుపవనాల్ని, వరదల్ని దృష్టిలో ఉంచుకొని ఆరోజుల్లో స్కూళ్ళకు సెలవులివ్వొచ్చు. వేసవికాలం పిల్లలు బయట ఆడుకోవడం కూడా కష్టంగాబట్టి స్కూళ్ళు పెడితే మంచిదని కొన్ని ప్రాంతాల్లో తల్లిదండ్రులు అడుగుతుంటారు. పంట కోతకొచ్చిన సమయంలో సెలవులిస్తే పనుల్లో పిల్లలు పాల్గొనే అవకాశం ఉంటుందనే డిమాండు కూడా ఉంది. దీనివల్ల పిల్లలు తాము జీవిస్తున్న ప్రపంచం నుంచి కూడా ఎంతో నేర్చుకోవడానికి వీలుంటుంది. చదువుపేర స్కూలు కోసం స్థానిక, స్వంత సమాజం నుండి వేరుపడకుండా ఉండగల్గుతారు. బతకడానికి అవసరమైన నైపుణ్యాలు కూడా సంపాదించుకొంటారు.

స్థానిక సెలవుల్ని బ్లాకు స్థాయిలో నిర్ణయించాలి. అలాగే స్కూల్లోని వారందరూ కలసి పాఠశాల ఉత్సవాల్లాంటివి ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం స్థానిక / విద్యా కమిటీ సహకారం కూడా తీసుకోవచ్చు. విహారయాత్రలు లాంటివి అన్ని తరగతుల పిల్లలకు ప్లాన్ చేసుకోవచ్చు.

### ఉదయం అసెంబ్లీ

పిల్లల్ని సిద్ధం చేస్తూ పాఠశాల దినం ప్రారంభమవుతుంది. ఈ ప్రారంభంలోనే పాఠశాలని, మరుగుదొడ్లను శుభ్రం చేసుకోవడం, ప్రదర్శనకు బోర్డులు తదితరాల్ని సిద్ధం చేసుకోవడం, క్లాస్‌రూం సామగ్రిని సర్దుకోవడం లాంటి పనులవల్ల స్కూలు తమది అని భావం అటు పిల్లలకూ, ఇటు టీచర్లకూ కూడా కల్గుతుంది. పాఠశాల సామగ్రిపట్ల బాధ్యత ఏర్పడుతుంది. ఈ సమయం పిల్లలూ, టీచర్లూ గతదినం కార్యకలాపాల్ని గురించి సమీక్షించుకోడానికి కూడా పనికొస్తుంది. ఫలితంగా క్లాస్‌రూంలో సమయం మిగులుతుంది.

అసెంబ్లీలో కూచున్నప్పుడు వరుసల్లోగాదు చిన్నపిల్లలు ముందు, పెద్దపిల్లలు వెనుక వుండేలా కూచుంటారు. ఒకరోజు ఒక ఉత్తేజకరమైన కథ వింటారు. మరురోజు సంగీతాన్నో, అతిథి ఉపన్యాసాన్నో వింటారు. దినపత్రికలోని వార్తను చదివి చర్చిస్తారు. తర్వాత అందరూ క్లాసుకు పోతారు.

అయితే ఇలా పని సమయాల్ని ఎక్కడి పరిస్థితులకనుగుణంగా అక్కడ సరళతరం చేసుకోవడంలో జాగ్రత్త పడాల్సిన అంశాలు కూడా ఉన్నాయి. స్థానిక సమాజం సాంప్రదాయిక సాంస్కృతికాచారాల్ని బడిలోకి చొప్పించే ప్రమాదం ఉంది. ఎక్కువగా ఇవి కులం, మతంపై ఆధారపడి స్త్రీలపట్ల వివక్షణ చూపేలా ఉండే ప్రమాదమూ లేకపోలేదు. బాలకార్మికుల్ని ప్రోత్సహించడంగా కూడా మన ప్లానింగు మారగూడదు. పిల్లలకు ఆడుకోవడానికి, విశ్రాంతిగా ఉండటానికి అవకాశం ఉండాలి. ఇది వారి హక్కు. కొన్ని స్థానిక సాంప్రదాయాలు దీన్ని అనుమతిస్తాయి. కొన్ని అనుమతించవు. సామాన్యంగా చిన్నతనం నుంచే ఆడపిల్లలకు ఇంటి పనిభారం నెత్తినపడుతుంది. తరచుగా మన పిల్లలు చదవడం పేరుతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ట్యూషన్లు, బడికి ముందూ బడి తర్వాత సరేసరి. ఆటలకిక వీరికి తీరికే ఉండదు. మన స్కూళ్ళు తల్లిదండ్రులతో సంప్రదించి పిల్లల హక్కుల్ని వివరించాలి. వాటి పరిరక్షణను గురించి చెప్పాలి.

గ్రామ పంచాయతీలతో సంప్రదించి పిల్లలు నడిచి బడికి రావడానికి పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల పనివేళల్ని పాఠశాల స్థాయిలో నిర్ణయించాలి. పనివేళల్ని సరళం చెయ్యడం పిల్లలందరూ బడికి సకాలంలో రావడానికి మాత్రమే ఉద్దేశించిందని మరిచిపోగూడదు. ఇలా చేసేపుడు పాఠశాలల్లో పిల్లలుండే కాలం, అభ్యసనం

సాగే కాలం ఏ పరిస్థితుల్లోనూ 6 గంటల కంటె తగ్గకుండా (బాల్యారంభ కేంద్రాలకు మూడు గంటలు) జాగ్రత్త పడాలి. పిల్లలు, టీచర్లు దూరంనుంచి బడికి రావల్సివచ్చే పరిస్థితి ఉంటే బస్సులు తదనుగుణంగా వచ్చేలా సమాజం చూడాలి. ఆలస్యంగా వచ్చి, ముందుగా వెళ్ళే పరిస్థితి మాత్రం ఉండకూడదు.

పిల్లల అభ్యసన అవసరాలు భిన్నంగా ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని రోజు, వారం, నెల, టర్మ్, సంవత్సరం ప్లానింగు ఉండాలి. ఇందులో కొత్తదనం, పాతపద్ధతి రెండూ మిశ్రమంగా ఉండాలి. రెండూ పిల్లలకవసరమవుతాయి. పిల్లలు పాఠశాలలో గడిపే సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకొనేందుకు తగినట్టుగా సంస్థాగతాంశాల్ని కొన్నిటినిక్కడ ప్రస్తావించుకుందాము. అలాగే సంస్థాగత ఏర్పాట్లనుకూడా చూద్దాము.

చాలా స్కూళ్ళు ఉదయం అసెంబ్లీతో ప్రారంభమవుతాయి. పాఠశాల మొత్తం ఒకచోట సమావేశమయ్యే సందర్భమిది. వార్తలు చదవడం, కొన్ని వ్యాయామాభ్యాసాలు చెయ్యడం, జాతీయగీతం పాడడం, అసెంబ్లీలో మామూలుగా జరుగుతుండేవే. వీటికి మరికొన్ని జతపరచవచ్చు. కలిసి పాడటం, కథ వినడం, స్థానిక సమాజం నుంచి లేదా బయటి నుంచి ఒక అతిథిని పిలిపించి మాట్లాడించడం, స్థానికంగా లేదా జాతీయంగా జరిగిన ముఖ్య ఘటనల్ని గుర్తుచేసుకుంటూ కొన్ని కార్యక్రమాల్ని రూపొందించుకోవడం వీటిలో కొన్ని. తమ తరగతి గదుల్లో చేసిన ఆసక్తికరమైన కృత్యాలేవైనా ఉంటే వాటిని అసెంబ్లీలో వివరించవచ్చు. ప్రతిరోజూకాకున్నా వారానికోసారో, రెండుసార్లో, ఇలాంటి దీర్ఘ అసెంబ్లీల్ని మనం ప్లాన్ చేసుకోవచ్చు. జూనియర్ అసెంబ్లీ, సీనియర్ అసెంబ్లీ అని విడదీసికూడా పాఠశాలల్లో అసెంబ్లీని నిర్వహించవచ్చు. ముజఫరాబాద్ బస్సు ప్రయాణం లాంటి ప్రత్యేక వార్తలు ప్రత్యేకాంశాలుగా ఒకరోజు అసెంబ్లీలో చర్చించవచ్చు.

'లక్ష్యానికి తగ్గ సమయం' అనే భావనని దృష్టిలో ఉంచుకొని వినడంకోసం, చదవడం కోసం, ఇతర కృత్యాలు చెయ్యడంకోసం, చర్చించడం కోసం పిల్లలకి కావల్సిన సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. ప్రత్యేకించి బహుళస్థాయి తరగతుల్లో పిల్లల కృత్యాలకు తగ్గట్టుగా ఎక్కువ సమయాన్నివ్వాలి. ఇలాంటి సందర్భంలో బ్లాకుబోర్డుపై రాసిందాన్ని కాపీచెయ్యడం లాంటివాటికోసం అవసరమయ్యే సమయాన్ని లెక్కించనక్కరలేదు.

టీచరు దగ్గర నేర్చుకొనేదానికి, స్వంతంగా చేసేదానికి, హోంవర్క్‌కు ఇలా మొత్తం అభ్యసనానికయ్యే సమయాన్ని పరిగణనలోనికి తీసుకొని మొత్తం అధ్యయన సమయాన్ని నిర్ణయించాలి.

హోంవర్క్‌కవసరమయ్యే మొత్తం సమయం

| | | |
|---|---|---|
| ప్రాథమిక | | వారానికి రెండు గంటలు |
| ప్రాథమికోన్నత | : | రోజుకొక గంట, వారానికి 6 గంటలు |
| ఉన్నత, హయ్యర్ సెకండరీ | : | వారానికి రెండు గంటలు, వారానికి 10–12 గంటలు |

టీచర్లందరూ కలసి మొత్తం హోంవర్క్ దీనికనుగుణంగా ఇలా హేతుబద్ధం చేయాలి.

చాలా డాక్యుమెంట్లు పీరియడ్ అంటే 45 నిమిషాలుగా ఉండాలని, అలా టైంటేబుల్‌లో కేటాయించుకోవాలని చెపుతున్నాయి. కానీ సామాన్యంగా ఇది 30-35 నిమిషాలుగా మాత్రమే ఉంటోంది. అభ్యాసానికిదే మాత్రం న్యాయమైందికాదు. మనం పీరియడ్‌ను ప్రాథమిక యూనిట్‌గా పరిగణిస్తున్నాం. పాఠ్యపుస్తకాల్లోని పాఠాల్ని కూడా పీరియడ్ యూనిట్‌గా పెట్టుకొని మనం బోధిస్తుంటాం.

ఈ ప్రాధాన్యతను మనం మనస్సులో ఉంచుకోవాలి. హస్తకళలు, ప్రాజెక్టులు, ప్రయోగాల్లాంటివాటికోసం పెద్ద పీరియడ్లు ఉండాలి. గంట, ఒకటిన్నరగంట (రెండు పీరియడ్లు) ఉండే పెద్ద పీరియడ్లు ఇలాంటి వాటికవసరం. ఇలాంటి పీరియడ్లు ఒక సబ్జెక్టుకు పరిమితంకాని అంశాల బోధనకు, గ్రూపు కృత్యాలకు కూడా కావల్సి వస్తాయి. బహుళస్థాయి తరగతుల్లో టీచరు చెప్పడానికి, పిల్లలు స్వయంగా చెయ్యడానికి, రెండుమూడు గ్రేడ్ల పిల్లలు కలిసి చెయ్యడానికి తగ్గట్టుగా పీరయడ్లు ఉండాలి. వారం టైంటేబుళ్ళలో భిన్నత్వం ఉండాలి. భాష, గణితం లాంటి సబ్జెక్టులకు ప్రతిరోజూ పీరియడ్ ఉండాలి. మిగిలినవాటికా అవసరం ఉండదు. వారం టైంటేబిళ్ళలో భిన్నత్వం కన్పించాలిగానీ అది సమతుల్యంగా ఉండేలా చూచుకోవాలి. మొత్తంమీద వివిధ సబ్జెక్టులు నేర్చుకోడానికి ఎంత సమయం అవసరం అనేది గమనించి, ప్లాన్ చేసుకోవాలి. ఉపాధ్యాయుడు పాఠం చెప్పేపుడు తక్కువ సమయమే సరిపోవచ్చు. ఎక్కువ సమయం పట్టొచ్చు. వాస్తవిక దృష్టితో వీటిని గుర్తించి వారం టైంటేబిల్ రూపొందించుకోవాలి.

## 4.8 ఉపాధ్యాయుడికి స్వతంత్ర ప్రతిపత్తి, వృత్తి స్వేచ్ఛ

పిల్లల రకరకాల అవసరాలకు తగిన అభ్యసన వాతావరణం ఉండాలంటే ఉపాధ్యాయుడికి స్వయంప్రతిపత్తి అవసరం. స్వేచ్ఛ, సరళత, గౌరవం విద్యార్థికెంత అవసరమో ఉపాధ్యాయుడికి అంతే అవసరం. ప్రస్తుత పాలనా వ్యవస్థలోని దొంతరలు, నియంత్రణ, పరీక్షలు, కేంద్రీకృత పాఠ్యప్రణాళికా రచన మొదలైనవన్నీ ఉపాధ్యాయుడి స్వేచ్ఛకు, ప్రధానోపాధ్యాయుడికి స్వతంత్రతకు అడ్డంగా ఉన్నాయి. ఒకవేళ పాఠ్యప్రణాళిక స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ తాము చేసేది సరిగాలేదని అధికారులు ఎక్కడ తప్పుపడతారోనని టీచర్లు భయపడుతుంటారు. అందువల్ల తరగతి గదిలో, పాఠశాలలో మనం ఎలాంటి ప్రజాస్వామిక సంస్కృతి ఉండాలని కోరుకుంటున్నామో పాలనా వ్యవస్థలోకూడా అదే ప్రజాస్వామిక సంస్కృతి అవసరం. ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వడమేగాదు వాళ్ళు చెప్పేదికూడా వినాలి. అధికారులు తీసుకునే నిర్ణయాలు నేరుగా క్లాస్‌రూం జీవితాన్ని, సంస్కృతిని ప్రభావితం చేస్తాయన్న సంగతి మరిచిపోకూడదు. అలాగే ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు మధ్య సమానత్వం, పరస్పర గౌరవం ఉండాలి. ఒకరితోఒకరు సంప్రదించుకుని, చర్చించుకుని మాత్రమే నిర్ణయాలు చేయాలి. మన సంవత్సర, మాస, వార క్యాలెండర్లలో ఇలాంటి చర్చల్నికూడా చేర్చాలి. ఉపాధ్యాయుల మధ్య కూడా సమిష్టి కృషికి అవసరమైన ఏర్పాటు ఉండాలి. ఘర్షణ ఏర్పడితే తొలగించుకునేందుకు తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటుచేసుకోవాలి.

సామాన్యంగా రేడియో, టీవి ప్రోగ్రాముల్ని ఉపాధ్యాయుడితో సంప్రదించకుండానే తరగతుల్లో ప్రవేశపెడుతుంటారు. టీచర్లు అందులోని కార్యక్రమాల్ని ఇష్టపడతారో లేదో చూడకుండా, వాళ్ళకెలాంటివి అవసరమో తెలుసుకోకుండా ఇలా చేయడం సరైనదికాదు. ఒకసారి క్లాసులో పెట్టాక వీటిని వాడుకోక తప్పదు. వీటిల్లో చెప్పేదానిపై ఉపాధ్యాయుడికి నియంత్రణ ఉండదు. మరి టీచరు వీటిని తన బోధనా ప్రణాళికతో ఎలా అనుసంధానింపచేసుకోగలడు?

### 4.8.1 పునశ్చరణకూ, ప్రణాళికకూ సమయం

ప్రతిరోజూ ఆనాటి కార్యకలాపాలను సమీక్షించుకొనేందుకు, పక్కరోజుకు నోట్సు తయారుచేసుకునేందుకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకునేందుకు కొంత సమయాన్ని (కనీసం 45 ని॥లు) కేటాయించుకోవాలి (ఇది హోంవర్కు సరిచేయడానికి పట్టే సమయానికి అదనం).

మొత్తం అభ్యసనాన్ని సమీక్షించడానికి; చెయ్యాలనుకున్న ప్రాజెక్టుల, కృత్యాల వివరాలు సిద్ధం చేసుకునేందుకు, రాబోయే వారంలో చెప్పాల్సిన పాఠాలు మననం చేసుకోవడానికి, వారానికి రెండుమూడు గంటలు అవసరం.

మొత్తం మాసం కార్యక్రమమం సమీక్షకు, పిల్లల అభ్యసనంలోని ఒడిదుడుకుల్ని గుర్తించడానికి నెలలో ఒకరోజును కేటాయించుకోవాలి.

**ఒక ప్రణాళిక**

అంశం : యంత్రాలు (ప్రాథమికోన్నత పాఠశాల)

ఒకటో తరగతి : ఆట – నేను ఒక పదం చెపుతాను. మీకు తెలిసిన పదాలు మీరు రాయాలి. రాసిన తరువాత వీటిని చర్చించండి. మీరు రాసిన యంత్రాల్లో ఉండే సమానతల్ని బట్టి వాటిని విభజించండి. ఇతర పద్ధతిలో కూడా విభజించే వీలుందేమో చూడండి. వివిధరకాల యంత్రాల చార్టుల్ని, బొమ్మల్ని సేకరించండి. వీటి బొమ్మలు గీయండి. కత్తిరించి కరిపించండి.

రెండో తరగతి : యంత్రాలను గురించి మీకు తోచిన, వీలున్నన్ని ప్రశ్నల్ని రాయండి. వీటిలో ఎన్నింటికి మీకు జవాబులు తెలుసో చూడండి. ఎన్నింటికి జవాబులు తెలియదో చూడండి. ఈ జవాబుల్ని పుస్తకాలను చూచి, ఇతరుల్ని అడిగి తెలుసుకోండి. దీన్ని టీచరు పర్యవేక్షిస్తాడు. 'మీకు తెలిసిన గొప్ప యంత్రం ఏది? ఇది అంత మంచిదనడానికి కారణాలు ఏమిటి? ఇలాంటి ప్రశ్నల్ని పిల్లలు హోంవర్కుగా ఉపయోగించుకుంటారు. తల్లిదండ్రులతో, స్నేహితులతో చర్చించి జవాబులు తెలుసుకుంటారు.

మూడవ తరగతి : రెండవ తరగతి పిల్లలు హోంవర్కు కోసం తీసుకెళ్ళిన ప్రశ్నలకు ఎలాంటి సమాధానాలు వచ్చాయో చెప్తారు. ఏదైనా ఒక యంత్రం మీద ఒక గేయాన్ని చెప్పమని టీచరు పిల్లల్ని అడుగుతుంది లేదా తానే ఒకటి వినిపిస్తుంది (దీనికి ముందుగా సిద్ధపడి రావాలి).

నాలుగవ తరగతి : యంత్రాలపై పాఠ్యపుస్తకాల్లో గల అధ్యాయాన్ని చదవండి. మనకు తెలియనివి అదనంగా ఏమున్నాయో చూడండి. పాఠం చివరి ప్రశ్నలకు జవాబులు రాయండి.

అయిదవ తరగతి : పుస్తకాన్ని చూచి ముందుగానే సేకరించుకున్న వస్తువుల సహాయంతో పిల్లలు 'ఒక టిప్పర్ ట్రక్కు' తయారుచేస్తారు. నాల్గవ తరగతి చివర ఉపాధ్యాయుడు కొన్ని ప్రశ్నలిచ్చి వీటికి జవాబులు తెలుసుకుని రావలసిందిగా కూడా పిల్లలకు చెప్పవచ్చు.

ఆరవ తరగతి : ఇప్పటికి యంత్రానికి సంబంధించిన పని పూర్తవుతుంది. మరింత సమాచారం తెలుసుకోవడం కోసం అదనంగా ప్రశ్నల్ని తయారుచేయవలసిందిగా ఉపాధ్యాయుడు పిల్లల్ని ప్రోత్సహిస్తాడు.

సంవత్సరం మొదట, చివర (2 లేదా 3 రోజులు) స్కూలుకు సాంవత్సరిక ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇందులో మొత్తం పాఠశాల కలిసి చేయాల్సిన పనులుంటాయి. స్థానిక సెలవుల్ని గుర్తించడం, రకరకాల ఉత్సవాల్ని నిర్వహించడం; తల్లిదండ్రుల, టీచర్ల సమావేశాలు ఏర్పాటుచేయడంవంటివి ఉంటాయి. విహారయాత్రలకు, క్షేత్రాల సందర్శనకు, రెండు మూడు తరగతులు కలిసి చేయాల్సిన ప్రాజెక్టులకు కూడా ఈ సందర్భంగా ప్లాన్ చేయాల్సి ఉంటుంది. స్కూలు, తరగతి వాతావరణంలో మార్పులు తేవడానికి కొత్త పోస్టర్లను పెట్టడం, ప్రదర్శనా వస్తువుల్ని మార్చడంలాంటివి చెయ్యాల్సి ఉంటుంది. అలాగే సమాజంతో సంప్రదించి పిల్లల్ని బడిలో చేర్చేలా వారు బడిలో కొనసాగేలా, సరిగా హాజరయ్యేలా, చక్కగా చదువుకొనేలా చూడాల్సి ఉంటుంది. వార్షిక ప్రణాళికలో వీటన్నింటినీ చేర్చాలి.

ప్రస్తుతం సంవత్సరానికి 20 రోజులు వ్యత్యంతర శిక్షణ కోసం కేటాయించబడి ఉన్నాయి. వీటిని పునశ్చరణకు, సమీక్షలకు, ప్లానింగుకు కూడా వినియోగించుకునే విధంగా మార్చుకోవాలి.

ప్రతినెలా క్లస్టర్ స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయుల సమావేశాలు వారు బోధించే సబ్జెక్టులనుబట్టి, క్లాసులనుబట్టి వేరువేరుగా ఉండాలి. దీనివల్ల ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకోవడమేగాకుండా రాబోయే నెలకు కావల్సిన ప్రణాళికను కూడా వారు రూపొందించుకుంటారు.

### యంత్రాలు శీర్షికను ఏడు, ఎనిమిది తరగతుల పిల్లలకు ఇలా విస్తరించవచ్చు

సైన్సు – యంత్రం అంటే ఏమిటో వివరించండి. ఉదాహరణలు ఇవ్వకూడదు. వివరణ మాత్రమే ఇవ్వాలి. ఇప్పుడు ఒక నిఘంటువును పరిశీలిద్దాం. అందులో ఏం చెప్పారో బోర్డుమీద రాద్దాం. తర్వాత సైన్సు పాఠ్యపుస్తకాన్ని, సైన్సు డిక్షనరీని పరిశీలిద్దాం. ఒకదానితో ఒకటి పోల్చుదాం. తేడా ఏముంది? యంత్రాన్ని గురించి అర్థం చేసుకోవడానికి ఏ నిర్వచనం సులభంగా ఉంది? ఏది సంక్షిప్తంగా, సమగ్రంగా ఉంది? పరికరం, సాధనం, యంత్రం మూడింటికి గల తేడా ఏమిటి?

సాంఘిక శాస్త్రం – అచ్చుయంత్రం, టెలిఫోను, బల్బు, వాహనం, రేడియో, టెలివిజన్, చక్రాల కుర్చీ, వినికిడిసాధనం, వంటగ్యాసు, స్టౌ, కుట్టుమిషను, రిఫ్రిజిరేటరు, కంప్యూటరు ఎప్పుడు తయారుచేశారు? ఏదేశంలో ఎవరు తయారుచేశారు?అవిలేక ముందు ప్రజలు ఎలా జీవించారో ఊహించండి. ఇవి లేకపోతే మన దైనందిన జీవితం ఎలా ఉండేది? వీటికి బదులు ఏమి ఉపయోగించేవాళ్ళం?

## చర్చనీయాంశం

**1.** సమాజంలోని ఉన్నతవర్గాలు, నిమ్నవర్గాలు, **2.** మహిళలు, **3.** పురుషులు ఎవరు ఎక్కువగా యంత్రాలను ఉపయోగిస్తారు? స్త్రీ పురుషుల్లో యంత్రాల్ని ఎక్కువగా వాడేది ఎవరు.

ఇంగ్లీషు వ్యాసం రాయడానికి అంశం – నా జీవితాన్ని మార్చిన యంత్రం (వినికిడి యంత్రం, చక్రాల కుర్చీ మరేదైనా) లేదా నేను కొనదల్చుకున్న యంత్రం, ఇందుకు కారణాలు.

ప్రాజెక్టులు – యంత్రాలు మన జీవితాల్ని మంచిగా, చెడుగా ఎలా మార్చాయి? యంత్రాలు ఉంటే / లేకుంటే మన జీవితాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది? (సమయం, సౌలభ్యం, ఖర్చు) ఒక యంత్రాన్ని (ఇష్టం వచ్చింది ఎన్నుకుని) ఎలా భవిష్యత్తులో అభివృద్ధి చేయవచ్చో ఊహించండి? ఒక భవిష్యత్ యంత్రాన్ని గురించి వ్రాయం. లేదా బొమ్మలు వెయ్యరు. ఒక కారు, మోటారు సైకిలు, ఎద్దులబండి, చక్రాలకుర్చీ రూపొందించేటప్పుడు ఎలాంటి విషయాల్ని మనసులో ఉంచుకోవాలి? యంత్రం సామర్థ్యంగానీ, అందంగానీ ఎలా పెరుగుతుంది?

❀ ❀ ❀

అధ్యాయం - 5

# సంస్థాగత సంస్కరణలు

5.1 నాణ్యతపట్ల శ్రద్ధ

5.2 పాఠ్యప్రణాళికారచన, ఉపాధ్యాయ విద్య

5.3 పరీక్షల సంస్కరణలు

5.4 వినూత్న ఆలోచనలు, ప్రయోగాలు

5.5 నూతన భాగస్వామ్యాలు

సామాజిక స్పృహతోకూడిన విద్యావిలువల ఆధారంగా రూపొందించిన జాతీయ పాఠ్యప్రణాళికాంశాల్ని గత అధ్యాయాల్లో చర్చించాము. పిల్లలు స్వయంగా, సమిష్టిగా తమకు తాము పాల్గొనడంద్వారా జ్ఞానాన్ని నిర్మయించుకొంటారని ఇందులో ప్రధానంగా ప్రతిపాదించాము. పిల్లల్ని కేవలం గ్రహీతలుగా చూడగూడదని చెప్పుకొన్నాము. ఇలాంటి దృక్పథానికి వ్యవస్థాగతమైన సపోర్టు అవసరం. పేదపిల్లల్ని దగ్గరకుతీసి, వారి అభ్యసన సామర్థ్యాన్ని వికసింపజేసే సంస్థలు మనకిప్పుడు కావాలి. దీనికి కావల్సిన వాటిలో మొదటిది పర్యవేక్షణ ద్వారా, అకడమిక్ నాయకత్వం ద్వారా ఉపాధ్యాయులకు అందాల్సిన సహకారం. రెండోది పాఠ్యపుస్తకాల్ని, పాఠ్యసామగ్రిని రూపొందించడం. మూడవది వికేంద్రీకరణ, పంచాయతీ సంస్థల భాగస్వామ్యం. నాల్గవది అతి ముఖ్యమైంది మన పరీక్షా విధానం.

ఉపాధ్యాయులు చేసే కృత్యాలవల్ల పిల్లలు పొందే అనుభవాలవల్ల మాత్రమే పాఠ్యప్రణాళిక అర్థమవుతుంది. వ్యవస్థాగతాంశాలమీద పాఠశాల పద్ధతులు, ఉపాధ్యాయుల ఆచరణ ఆధారపడివుంటాయి. ఇప్పుడు మనం ఏ కీలకాంశాల గురించి ఎక్కువ పట్టించుకోవాలో చర్చిద్దాం.

## 5.1 నాణ్యతపట్ల శ్రద్ధ

వివిధస్థాయిల్లో నాణ్యతగల విద్యనందించడం ఎలా అన్నదే పాఠ్యప్రణాళికా సంస్కరణల్లో కీలకమైంది. ప్రస్తుత వాస్తవ పరిస్థితిని ఏమిటి? దీన్నెలా మనం మార్చుకోవాలి? అనేవి మనముందున్న సమస్యలు.

- ✦ మొదట జ్ఞానాన్ని, సమాచారాన్ని కలగాపులగం చేసి గందరగోళపడకూడదు. ఈ ధోరణి పైనుంచి కిందికి రకరకాల సమాచారాల్ని బదలాయించడాన్ని మాత్రమే ప్రోత్సహిస్తుంది.
- ✦ పిల్లల జ్ఞానాభివృద్ధికి సంబంధించి కొన్ని సూత్రాలున్నాయి. అభ్యసనం అనేది ఒంటరిది కాదు, అదొక సమగ్రపద్ధతి.
- ✦ NPE, **1986,** POA, **1992** నొక్కి చెప్పిన విధంగా మన పాఠ్యప్రణాళిక పిల్లల వాస్తవ సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందాలి. అది సరళంగా ఉండాలి. వివిధ ఆలోచనలకనువుగా ఉండాలి.
- ✦ ఛటోపాధ్యాయ కమిషన్, **1984** ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యాల్ని గురించి అనేక సిఫార్సుల్ని చేసింది. ఉపాధ్యాయుల నియామకాలు, సర్వీసుకు ముందు, సర్వీసు మధ్యలో వారికిచ్చే శిక్షణలు, వారి పని నిబంధనలు ఈ సిఫార్సులకనుగుణంగా ఉండాలి.
- ✦ క్లాస్‌రూం బోధనలోనైనా, ఉపాధ్యాయ శిక్షణలోనైనా కృత్యాలమీద ఆధారపడ్డ అనుభవమే ప్రధానం. విద్యాసాంకేతిక విజ్ఞానం దీనికి సహాయకారిగా ఉండాలితప్ప ప్రత్యామ్నాయం కారాదు.

నాణ్యత అనేది బోధనకో, సాధనకో ఒక రూపమే కాదు. అది వ్యవస్థాగతంగా ఉండే అంశం. దీన్ని మనం మనసులో ఉంచుకోవాలి. తన బలహీనతల్ని తాను సరిచేసుకొని, నూతన సామర్థ్యాల్ని సంతరించుకోవడం, తననుతాను సంస్కరించుకోవడానికి సిద్ధపడడం వ్యవస్థలో రావల్సిన కీలకమైన మార్పులు.

POA, **1992** "మన విద్యా వ్యవస్థ మరింత సరళంగా ఉండేలా ఆధునీకరింపడాలి" అని చెప్పింది. ఇప్పుడు సరిగ్గా జరగాల్సింది ఇదే. వికేంద్రీకృత వ్యవస్థకు అనుగుణంగా మన పాఠ్యప్రణాళిక, శిక్షణా పద్ధతులు మారాలంటే స్పష్టమైన నిర్దిష్టమైన సంస్కరణలు అవసరం. ఇందుకోసం ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి.

- ✦ సామగ్రి కొనుగోలు, స్థానిక సంస్థలతో సమన్వయం, ప్రైవేట్ స్కూళ్ళతో భాగస్వామ్యం లాంటి విషయాల్లో పాఠశాలలకు స్వతంత్ర నిర్ణయాధికారం.
- ✦ సిలబస్ రూపకల్పనలో, పాఠ్య గ్రంథాల తయారీలో, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల మధ్య అనుసంధానం.
- ✦ సిలబసు, పాఠ్యపుస్తకాలు రూపొందించేందుకు ఉన్నత విద్యాసంస్థల నుంచి నిపుణుల్ని, ఉపాధ్యాయుల్ని, తీసుకొనేందుకు వ్యవస్థాగత ఏర్పాట్లు.
- ✦ స్థానిక సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలసి పనిచేసి పాఠశాల సామర్థ్యాన్ని పరిపుష్టం చేసేందుకు అవకాశాలు కల్పించడం.
- ✦ నిర్ణయాధికార సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు మధ్య సహకారం.
- ✦ విధాన నిర్ణయాలు చేసే పలు దొంతరల సంస్థల మధ్య మరింత సంబంధం, పారదర్శకత.

నాణ్యత అనేది సమర్థతకు కేవలం కొలమానం కాదు. దీనికొక విలువ ఉంది. సామాజిక న్యాయానికి తీసుకొనే చర్యలతో కలిసి ప్రయాణించినప్పుడే విద్యలో నాణ్యతకోసం మనం చేసే ప్రయత్నం సఫలమవుతుంది. ఇందులో ఒక ముఖ్యమైన అంశం ఏమంటే విద్య బడుగువర్గాల గుర్తింపును ప్రోత్సహించేదిగా ఉండాలి.రాజ్యాంగం చెప్పిన దానికనుగుణంగా మైనారిటీ భాషలవారికి, మైనారిటీ మతస్తులకు ప్రత్యేకావకాశాలు కల్పించాలి. ప్రాథమిక విద్య తొలి దశలో ఇంటి భాషలో విద్య నేర్పేందుకు కొన్ని రాష్ట్రాలు చాలా మంచి చర్యలు తీసుకొన్నాయి. గిరిజన భాషల విషయంలో ఇది చాలా మంచిచర్య. ఉపాధ్యాయులు బహుళ భాషల్ని మన పాఠశాలల్లో ప్రవేశపెట్టుకొనేందుకు మనం అవకాశం ఇవ్వాలి. అలాగే మదర్సాల్లోని పాఠ్యప్రణాళికను మరింత విస్తృతం చేయాలి, బలోపేతం చేయాలి.

సామాజికన్యాయానికనుగుణమైన పాఠ్యప్రణాళికను రూపొందించుకునే సందర్భంలో ఎదురయ్యే సవాళ్ళను కూడా మనం గమనంలో ఉంచుకోవాలి. దీనికి తగినట్టు ఉపాధ్యాయుడి చైతన్యాన్ని, సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. అలాగే టీచర్లు మారడానికి సిద్ధంగా ఉండాలి. సిలబసు రూపొందించే వారిమధ్య, పాఠ్యపుస్తక రచయితలమధ్య సృజనాత్మకమైన సహకారం కూడా ఉండాలి.

సామాజికార్థిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా అన్ని రకాల పిల్లల అనుభవాల్ని వికసింపచేసేదిగా విద్య ఉండాలి. దీనికోసం ఉపాధ్యాయుల శిక్షణలో కీలకమైన చర్యల్ని కొన్ని తీసుకోవాలి. అలాగే పాఠ్యప్రణాళిక, సిలబసు, పాఠ్యగ్రంథాల తయారీలోకూడా కొన్ని కీలకచర్యలు అవసరం.

ఉపాధ్యాయులు అట్టడుగు వర్గాల పిల్లలకు ముఖ్యంగా బాలికలకు అనుకూలమైన వాతావరణం ఉండేలా తరగతి గదుల్ని తీర్చిదిద్దాల్సి ఉంది. తదనుగుణమైన ఒక సంస్కృతిని నెలకొల్పాల్సి ఉంది. మన బి.ఇడి., యం.ఇడి., శిక్షణా కోర్సుల్లో దీనిపైన ఏమంత శ్రద్ధ పెట్టడంలేదు. స్త్రీపురుష విచక్షణను గురించి ఈ కోర్సులో ఏమీ ఉండదు. NCERT ఇటీవల దేశవ్యాప్తంగా జరిపిన చర్చల్లో దీనిపై అనేక సూచనలు వచ్చాయి. ఆడపిల్లల పట్ల తమ ప్రవర్తనకు సంబంధించి మగపిల్లల్లో చైతన్యం పెంపొందించేందుకు నిర్దిష్టమైన చర్యలు అవసరమని ఒక యువతి ఈ సందర్భంగా సూచించింది. మన పాఠశాల విధానాల్లో, సంస్కృతిలో ఈ దృక్పథం అవసరం.

### 5.1.1 నాణ్యతకోసం విద్యా ప్రణాళికా పర్యవేక్షణ

పాఠశాల విద్యకోసం ప్రస్తుతం రూపొందిస్తున్న ప్రణాళికలు ఎక్కువగా 'పైనుంచి కిందికి' దిగుమతి అయ్యేవిగా ఉన్నాయి. ఆయా సబ్జెక్టుల్లోని అంశాలు ఆ సంవత్సరంలో బోధించేందుకు ఎంత బోధనా సమయాన్ని కేటాయించుకోవాలి అనేదానిపైనే ఈ ప్రణాళికలు కేంద్రీకరిస్తున్నాయి. దీంతోపాటు పాఠశాలకు సంబంధించిన ఇతర కార్యక్రమాలకు కేటాయించుకోవలసిన సమయాన్ని గురించి కూడా ఈ ప్రణాళికలు మనసుపెడుతున్నాయి. ఎక్కువగా వీటిని SCERT, పాఠశాల విద్యా డైరెక్టరు కార్యాలయం రూపొందించి ఇవి రాష్ట్రంలోని అన్ని స్కూళ్ళలో ఒకేవిధంగా అమలుకావాలని నిర్దేశిస్తుంటాయి. కానీ కొఠారి కమీషన్ దీనికి భిన్నంగా పాఠశాల స్థాయి ప్రణాళిక అవసరమని నొక్కిచెప్పింది. ప్రతి పాఠశాలకు ఒక సంస్థాగత ప్రణాళిక, నిర్దిష్టకాలంలో చేయవలసిన ప్రోగ్రాం ఉండాలని సూచించింది. ఉపాధ్యాయుల మధ్య, ప్రధానోపాధ్యాయులమధ్య భాగస్వామ్య విధానం ఉంటేనే అర్థవంతమైన విద్యాప్రణాళిక రూపొందుతుంది. ఈ ప్రణాళికలో స్థానిక భౌతిక వనరుల్ని వాడుకోవడం, అభివృద్ధి చేసుకోవడం ఒక ముఖ్యాంశంగా ఉండాలి. రెండో అంశం పిల్లల వివిధ అవసరాల్ని ఈ ప్రణాళిక గమనంలో ఉంచుకోవాలి. దీనికనుగుణంగా ఆ పాఠశాలకి ఏరకమైన సహకారం అవసరమో ఇందులో ఉండాలి. పాఠశాల ప్రణాళికల్లో విస్తృత సమాజం నుంచి పిల్లల విద్యకోసం ఎలాంటి మద్దతును, సహకారాన్ని కూడగట్టాలో పేర్కొనడం చాలా అవసరం. పాఠశాల విద్యా కమిటీల్లాంటి రాజ్యాంగబద్ధ సంస్థల భాగస్వామ్యాన్ని గురించి కూడా ఈ ప్రణాళికల్లో పేర్కొనాలి. పాఠశాలకు సంబంధించిన అన్ని వివరాలతోకూడిన రిపోర్టులు (బడికిరాని పిల్లలు, హాజరు ధోరణి, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు మొదలగునవి) గ్రామస్థాయిలోనే తయారుకావాలి. ఇలాంటి రిపోర్టువల్ల వాస్తవిక దృక్పథంతో మన అవసరాల్ని తీర్చేందుకు కావల్సిన మానవవనరుల్ని గుర్తించే వీలుంటుంది. పాఠశాలలకు మరింత స్వాతంత్ర్యం లభించాలంటే, అవి తమ ప్రణాళికల్ని స్వేచ్ఛగా అమలుచేసుకునే అవకాశం ఉండాలంటే రకరకాల పథకాలకు సంబంధించిన కేటాయింపుల్లో సరళత ఉండాలి. పారదర్శకత, జవాబుదారీతనం కూడా నిధుల కేటాయింపులోను, ఖర్చు చేయడంలోను కనిపించాలి. రాష్ట్ర కేంద్రం నుంచి, జాతీయ కేంద్రం నుంచి రూపొందించిన కార్యక్రమాలకు యూనిట్ ఖర్చుల లెక్కల్ని తయారుచేసి కిందికి పంపే పద్ధతికి బదులు అట్టడుగు స్థాయినుంచి నాణ్యమైన ప్రణాళికల్ని రూపొందించుకునే విధానం అవసరం. అప్పుడే ఉపాధ్యాయులకు, పాఠశాలలకు 'స్వయం ప్రతిపత్తి', 'ఎంపిక చేసుకునే అవకాశం' ఉంటుంది. పిల్లల అవసరాలను తీర్చడంలో పాఠశాలకున్న బాధ్యతలు కూడా స్పష్టంగా ఉంటాయి. మొదట పాఠశాల స్థాయినుంచి ప్రారంభించి, క్లస్టరు స్థాయిలో, తర్వాత బ్లాకు స్థాయిలో తమ అవసరాలకు తగినట్టు ప్రణాళికలు రూపొందించుకోవాలి. అప్పుడు న్యాయమైన జిల్లా ప్రణాళిక రూపొందుతుంది. ఖచ్చితమైన లక్ష్యాల్ని నిర్దేశించటం, వాటిని అమలుచేసే బాధ్యతల్ని నిర్ణయించడం కూడా అన్ని స్థాయిల్లో అప్పుడే సాధ్యమవుతుంది.

### 5.1.2 పాఠశాలల్లో అకడమిక్ బాధ్యతలు, పాఠశాల పర్యవేక్షణ

తమ పాఠశాలలకు అకడమిక్ నాయకత్వం వహించడంలో హెడ్మాస్టర్లకున్న ప్రాముఖ్యాన్ని మనం ఇంకా గుర్తించలేదు. పాఠశాలపై నియంత్రణాధికారం గానీ, పాఠశాల క్రమబద్ధంగా నడిచేలా చూడగల శక్తిగానీ లేకపోయినప్పటికీ మన ప్రధానోపాధ్యయుల్ని మనం పరిపాలనాధికారులుగా మాత్రమే చూస్తున్నాం. పాఠశాల పాఠ్యప్రణాళికకు సంబంధించి ప్రధానోపాధ్యాయుడికి ఎలాంటి నిర్ణయాధికారం ఉండదు. ప్రధానోపాధ్యాయులకు (ఉపాధ్యాయులకు) తమ పాఠశాలకవసరమైన నిర్దిష్ట అవసరాల్ని గుర్తించి సమాజం నుంచి సహకారం పొందేందుకు తగిన అవకాశాలుండాలి. టీచర్లకిచ్చే శిక్షణకు సంబంధించిన అంశాలు ఎలావుండాలో చెప్పగల అవకాశం ఉండాలి. క్లస్టరు, బ్లాకు స్థాయి పర్యవేక్షకులు పాఠశాలల్ని సందర్శించి చూచే విషయాల్లో కూడా వీరికి ప్రమేయం ఉండాలి. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులను కూడా మనం అకడమిక్ విషయాలకు సంబంధించినంతవరకు ఉపాధ్యాయులుగానే చూస్తున్నాం తప్ప అంతకంటే ఎక్కువగా చూడటంలేదు. ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల బృందాలు క్లస్టరు స్థాయిలో నిర్వహించాలిస్న పాత్ర పెరగాలి. దీనికి తగిన సామర్థ్యాన్ని వారికి కలిగించాలి. ప్రస్తుతం పాఠశాల నాణ్యతను పెంచడం అనే పేరుతో రకరకాల కార్యక్రమాల్ని రుద్దుతున్నారు. ఆరోగ్యం, పర్యావరణం లాంటి సామాజిక విషయాలుకూడా పాఠశాల కార్యక్రమాలుగా మారుతున్నాయి. ఇవన్నీ ప్రధానోపాధ్యాయులపై పడుతున్నాయి. ఈ కార్యక్రమాల లక్ష్యాలపట్ల, నిర్వహణపట్ల స్పష్టత ఎవ్వరికీ ఉండదు. చాలా సందర్భాల్లో ఇవి కలగాపులగంగా ఉంటాయి. పాఠశాల ప్రణాళికలు రూపొందించేటప్పుడు ఇలాంటివి తమకెంత అవసరమో, వీటిని పాఠశాల కార్యక్రమాలలో అంతర్లీనం ఎలా చేయవచ్చో చర్చించాలి. వీటిని ఆ తరువాత క్లస్టరు, బ్లాకు స్థాయిల్లో సమన్వయం చేయాలి.

పాఠశాల పర్యవేక్షణను సాంప్రదాయికంగా ఇన్‌స్పెక్టర్లు చేస్తుంటారు. ఎక్కువగా అధికారం చెలాయించడం, నియంత్రించడం తప్ప ఈ వ్యవస్థ ఉపాధ్యాయులకి అకడమిక్ సహకారం అందించేదిగా ఉండడంలేదు. అప్పుడప్పుడు పాఠశాలల్ని సందర్శించే పనితోపాటు ఈ ఇన్‌స్పెక్టర్లకు బోలెడు ఇతర పనులు కూడా ఉంటాయి. వీళ్ళు సామాన్యంగా స్కూళ్ళను ఎప్పుడో సందర్శిస్తారు. ఆ సమయానికి వాస్తవ పరిస్థితులు కనిపించకుండా పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి బడిని బాగా తీర్చిదిద్దుతారు. దీంతో పర్యవేక్షణ సానుకూలంగా ముగుస్తుంది. పర్యవేక్షణ అంటే ఇదికాదు. తరగతిగదిలోని నిర్దిష్ట సందర్భంలోని బోధన, అభ్యసనం ఎలా ఉన్నాయో నిర్మాణాత్మకంగా చూడాలి. ఇదే నాణ్యమైన పర్యవేక్షణ. కాబట్టి మన పర్యవేక్షణా వ్యవస్థ లక్ష్యాలేమిటో కూడా జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. వీటిని సాధించడానికి ఎలాంటి పద్ధతులు, కార్యాచరణ అవసరమో, వీటిని సంస్థాగతం చేయడమెలాగో కూడా స్పష్టంగా చూచుకోవాలి.

### 5.1.3 పంచాయతీలు, విద్య

ప్రజలు తమ సమిష్టి అవసరాలను నిర్ణయించుకొని వాటిని తీర్చుకొనడానికి, అభివృద్ధి క్రమంలో ప్రజల భాగస్వామ్యం పెరగడానికి, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సమగ్రంగా రూపొందించుకుని అమలుచేసుకోవడానికి గ్రామ, తాలూకా, జిల్లా స్థాయిల మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ రాజ్యాంగంలోని 73వ అధికరణాన్ని సవరించడం ద్వారా ఏర్పడింది. పంచాయితీలకు కేటాయించవలసిన 29 అంశాలను ఈ రాజ్యాంగ సవరణ గుర్తించింది. ఇందులో ప్రాథమిక, సెకండరీ విద్యలు, వయోజన, అనియత విద్యలు, గ్రంథాలయాలు, సాంకేతిక శిక్షణ, వృత్తివిద్య మొదలైనవన్నీ ఉన్నాయి. వికేంద్రీకృత ప్రజాస్వామ్యం, అభివృద్ధి దీనివల్ల సాధ్యమౌతుందని గుర్తించి చాలా రాష్ట్రాలు పంచాయతీరాజ్ చట్టాలను తెచ్చాయి.

విధుల్లో గందరగోళం, కలగాపులగం

పంచాయితీరాజ్ విధులు వివిధస్థాయిల్లో అమలుచేయడానికి అవసరమైన కార్యాచరణల్ని, విధానాల్ని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి నిర్దేశించాయి. పంచాయతీరాజ్‌లోని ప్రతి స్థాయిలో చేయాల్సిన విధులు చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ, ఆచరణలో గ్రామ, తాలూకా స్థాయిలో చేసే పనులేమీ ఉండవు. కొన్ని రాష్ట్రాల్లో జీతాల బట్వాడాకు మించి వీటికి పనేమీ ఉండదు. విద్య, ఆరోగ్యం, మహిళా శిశుసంక్షేమం, సాంఘిక సంక్షేమంలాంటి రంగాల్లో తాలూకాలు, గ్రామ పంచాయితీలు చేసే ముఖ్యమైన విధులేమీ ఉండవు. ఫలితంగా ప్రణాళిక రూపొందించేదెవరు? నిర్ణయించేదెవరు? ఎంచుకునేదెవరు? అనుమతించేదెవరు? అమలుచేసేదెవరు? నిధులిచ్చేదెవరు? పర్యవేక్షించేదెవరు? అనే విషయాల్లో ఈ మూడు అంచెల సంస్థల మధ్య సంఘర్షణలు తలెత్తుతుంటాయి. నిర్దేశించిన విధులు, లక్ష్యాలు కలగాపులగంగా, గందరగోళంగా ఉండటమే దీనికి కారణం.

సహాయకతా సూత్రం

సహాయకతా సూత్రమే పంచాయితీరాజ్‌కు పునాది. నిర్దిష్టస్థాయిలో ఏమి చేయాలో ఆ స్థాయిలో మాత్రమే దాన్ని చేయడం, పై స్థాయిలో చేయకపోవడం, అట్టడుగు స్థాయిలో ఎంత గరిష్టంగా చేయడానికి వీలుంటుందో అంత చేయడం, సహాయకతా సూత్ర సారాంశం. పంచాయితీరాజ్ సంస్థల్లో వివిధ స్థాయిల్లో చేయాల్సిన పనుల్ని గురించి వాస్తవిక దృష్టితో మనం విశ్లేషించుకోవాల్సిన అవసరాన్ని ఈ సూత్రం గుర్తుచేస్తుంది. ఇలా విధుల్ని ఆయా స్థాయిలకు వికేంద్రీకరించడంలో నిధుల్ని ఆయా స్థాయిల పనులకు తగినట్టుగా కేటాయించడం కూడా ఇమిడివుంటుంది.

పంచాయితీరాజ్‌ను బలోపేతం చేయడం :– జిల్లా సాక్షరతా సమితి, డి.పి.ఇ.పి., సర్వశిక్షా అభియాన్‌లాంటి సమాంతర సంస్థలు రాష్ట్రస్థాయిలోనూ, ఇతర సంస్థలు తాలూకా, గ్రామ స్థాయిల్లోనూ ఏర్పరచడంవల్ల పంచాయితీరాజ్ సంస్థల అధికారాలకు విఘాతం కలుగుతోంది. ఇటీవల కాలంలో చాలా రంగాల్లో ఇలాంటి సంస్థలు అసంఖ్యాకంగా ఏర్పడుతున్నాయి. గ్రామ విద్యా కమిటీలు, వాటర్‌షెడ్ కమిటీలు, రైతుమిత్ర కమిటీలు, వనసంరక్షణ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాలు లాంటివి గ్రామగ్రామాన వెలుస్తున్నాయి. ఇవేవీ పంచాయితీలకు జవాబుదారీగా ఉండవు. బయటి సహాయక సంస్థల్నించి విపరీతంగా వీటికి నిధులు వస్తున్నాయి. గ్రామంలోని సంపన్నులు వీటిమీద అధికారం చెలాయిస్తున్నారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే పంచాయితీరాజ్ సంస్థల విధి నిర్వహణలో ఎదురౌతున్న సమస్యలివి : నిధుల కేటాయింపులోగానీ, వివిధ స్థాయిల సంస్థలకు అప్పగించబడిన కార్యక్రమాల్లోగానీ ఒకదానికొకటి సంబంధం వుండడంలేదు. గ్రామస్థాయిలో ఎన్నికైన సంస్థల్ని కాదని నెలకొల్పిన సమాంతర సంస్థలు స్థానిక ప్రణాళికల్లో ప్రజల భాగస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఈ మధ్యకాలంలో పాఠశాలలో చేరినవారు, బడి మానివేసినవారు, వారు సాధించిన లక్ష్యాలు ఇలా రకరకాల అంశాల్ని పొందిపరచిన గణాంక వివరాలు, తాలూకా, జిల్లా స్థాయిల్లో సేకరించడంమీద చాలా ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు. పాఠశాల నిర్వహణకు, పర్యవేక్షణకు కూడా ఇవే గీటురాళ్ళుగా చెలామణి అవుతున్నాయి. పాఠశాలల్లో వీటన్నిటికీ సంబంధించిన రికార్డుల్ని తయారుచేయడం పెద్ద భారంగా పరిణమించింది. అకడమిక్ ప్రణాళికలు, పాఠ్యప్రణాళికా బోధన తదితర అంశాల్ని పక్కనబెట్టి, ఈ లెక్కలతోనే పాఠశాల నాణ్యతను లెక్కకట్టడం ప్రారంభమైంది.

పాఠశాలల్ని పర్యవేక్షించడానికి ఇప్పుడు అన్ని జిల్లాల్లో బ్లాకు రిసోర్సు సెంటర్లు (B.R.C.); క్లస్టరు, రిసోర్సు సెంటర్లు (C.R.C.) ఏర్పడ్డాయి. శిక్షణలకోసం జిల్లాస్థాయిలో DIETs ఉన్నాయి. ఇలాంటి సంస్థల మధ్య కలగాపులగంగా బాధ్యతల్ని పంచడం జరుగుతోంది. ఈ రిసోర్సు సెంటర్లు కేవలం పాలనా కేంద్రాలుగా, గణాంక సేకరణా కేంద్రాలుగా మారుతున్నాయి. పాఠశాల స్థాయిలో అకడమిక్ ప్లానింగ్ జరగాలని, పాఠ్యప్రణాళికను ఉపాధ్యాయులు తమ క్రియాశీల సృజనాత్మక భాగస్వామ్యం ద్వారా వికసింపజేయాలని, ఇవి పిల్లల అవసరాలను తీర్చేవిధంగా ఉండాలని మనం కోరుకునేటట్లయితే ఈ BRC లను, CRC లను తదనుగుణంగా నడిపించాల్సి ఉంటుంది, పరిపుష్టం చేయాల్సి ఉంటుంది. ఇందులోని రిసోర్సుపర్సన్స్ విధుల్ని పునఃనిర్వచించాల్సి ఉంటుంది. వాళ్ళ విషయ పరిజ్ఞానాన్ని, శిక్షణా సామర్థ్యాన్ని పెంచి స్వతంత్రంగా పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి. పాఠశాల సందర్శనా పద్ధతుల్ని, సక్రమ పర్యవేక్షణా విధానాల్ని రూపొందించాలి. వీరు టీచర్లకు, స్కూళ్ళకు ఇవ్వాల్సిన సహకారాన్ని, చేయాల్సిన పునశ్చరణను కూడా నిర్దేశించాలి. అప్పుడు క్లస్టరు, బ్లాకు స్థాయిల్లో ఈ సహకారం సంస్థాగతంగా మారుతుంది. ఉపాధ్యాయులకు నిత్యం అందించే ఇతర సహాయసహకారాలలో ఒక భాగంగా దీన్ని మార్చవచ్చు. ఇలా చేసేటప్పుడు దీనికనుగుణంగా నిధుల కేటాయింపుకూడా ఉండాలి.

## 5.2 పాఠ్యప్రణాళికా రచన, ఉపాధ్యాయ విద్య

1960 నుంచే ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాన్ని పెంచాల్సిన అవసరం అన్నిటికంటే ముఖ్యమైనదని గుర్తించడం జరిగింది. కానీ కింది వాస్తవిక పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉంది. ఉపాధ్యాయ విద్యను మన విద్యాకోర్సుల ప్రధాన ప్రవంతిలోకి తీసుకుని రావాలని కొఠారీ కమీషను (1964-66) పేర్కొనింది. కానీ ఈనాటికీ ఉపాధ్యాయ విద్యా (శిక్షణ) సంస్థలు మాత్రం ఒంటరిగా, ఇతర విద్యా సంస్థలతో ఏమీ సంబంధం లేకుండా ఉండిపోయాయి. పన్నెండేళ్ళ విద్య తరువాత సెకండరీ టీచరుకు అయిదేళ్ళ శిక్షణ అవసరమని ఛటోపాధ్యాయ కమిటీ (1983-85) పేర్కొనింది. సైన్సు, ఆర్ట్స్ కళాశాలల్లో ఉపాధ్యాయ విద్య కూడా ఒక కోర్సుగా ఉండాలని ఈ కమిటీ సూచించింది. దీనివల్ల విద్యార్థులు ఉపాధ్యాయ విద్యా కోర్సుల్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని కూడా అది పేర్కొనింది. ఉపాధ్యాయ శిక్షణ పొందేవారు స్వయం అభ్యసన సామర్థ్యాన్ని పొందేటట్టు, స్వతంత్రంగా ఆలోచించేటట్టు ఉండాలని యశ్‌పాల్ కమిటీ రిపోర్టు (1993) (భారంలేని అభ్యసనం) చెబుతోంది.

ప్రస్తుత విద్యావ్యవస్థలో విద్య అంటే సమాచార ప్రసారమనే భావన పెరిగిపోతోంది. ఉపాధ్యాయుల్ని దీనికనుగుణంగా సర్దుబాటు అయ్యేటట్టు చెయ్యడంతప్ప మన ఉపాధ్యాయ శిక్షణ పైలక్ష్యాలకు అనుగుణంగా లేదు. పాఠ్యప్రణాళికా సంస్కరణలో ఉపాధ్యాయ విద్యకు సరైన స్థానం ఉండటం లేదు. పారా టీచర్లను విపరీతంగా నియమించడంవల్ల ఉపాధ్యాయుల వృత్తి నిపుణతకు గుర్తింపే లేకుండా పోయింది. 1990 తర్వాత ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణపై చాలా ప్రయత్నాలు జరిగాయి. సర్వీసుకు ముందు శిక్షణకు, సర్వీసు మధ్యలో శిక్షణకు మధ్య ఒక విభజన రేఖన ఇవి గీచాయి. అత్యున్నత అభ్యసన కేంద్రాలకు ఉపాధ్యాయులు దూరమయ్యారు. వాళ్ళ అవసరాలు అవసరాలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుత కార్యక్రమాలు కూడా పాఠ్యప్రణాళికా రూపకల్పనకు సంబంధించిగానీ, పాఠశాలకు, సమాజానికీ మధ్య సంబంధాలను గురించిగానీ ఏమీ పట్టించుకోవడంలేదు. ఇటీవల ఎంతో వినూత్నమైన ప్రయోగాలు విద్యారంగంలో జరుగుతున్నాయి. వీటిని గురించికూడా ఇవి పట్టించుకోవడంలేదు.

### 5.2.1 ఉపాధ్యాయుడి వృత్తి గౌరవాన్ని పెంచడం

విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడే కేంద్రం అని మనం విశ్వసించి, ఈ విశ్వాసాన్ని పునఃప్రతిష్ఠ చేయాలంటే సర్వీసుకు ముందు ఇచ్చే ఉపాధ్యాయ శిక్షణలో నాణ్యత పెరగాలి. ఇది మనం తీసుకోవలసిన మొట్టమొదటి చర్య. ఉపాధ్యాయుల వృత్తి శిక్షణను వివిధ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులతో అనుసంధానం చేయాలి. దీనివల్ల వివిధ సబ్జెక్టుల మధ్యగల అంతస్సంబంధం వీరికి అర్థమౌతుంది. ఇందుకోసం గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ స్థాయిల్లో ఉపాధ్యాయ విద్యా కోర్సు కూడా ఒక కోర్సుగా ఉండాలి గ్రాడ్యుయేషన్‌కు ముందుకూడా ఇదేవిధంగా ఇతర కోర్సుల్లో భాగంగా ఉపాధ్యాయ విద్య ఉండాలి. ప్రాథమికోపాధ్యాయులకిచ్చే BELEP కోర్సు దీనికి మంచి ఉదాహరణ. సాధారణ కళాశాలల్లోని కోర్సుల్లో ఒకటిగా ఉపాధ్యాయ విద్యను చేర్చడంవల్ల దీనికున్న ఒంటరితనం పోతుంది. అదేవిధంగా పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఉపాధ్యాయ విద్యను ఒక కోర్సుగా చేర్చడంవల్ల దీన్ని విద్యార్థులు ఎంచుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల పరిశోధన చేసుకోవడానికి, పునశ్చరణ చేసుకోవడానికీ కూడా విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

### 5.2.2 రూపకల్పనలో, ఆచరణలో కీలకాంశాలు

ఉపాధ్యాయుడి భాషాప్రావీణ్యం పెంచడం ప్రస్తుతం చాలా అవసరమని చాలా పరిశోధనలు చెప్తున్నాయి. ఉపాధ్యాయ శిక్షణలో భాషా ప్రావీణ్యం సాధించేందుకు తగిన కోర్సులు తప్పనిసరిగా ఉండాలి. పిల్లల అభివృద్ధికి సంబంధించి, బోధనా పద్ధతులకు సంబంధించి మనకున్న అభిప్రాయాలు చాలావరకు సరైనవి కావు. మనం బోధిస్తున్న పద్ధతుల్లో చాలా లోపం ఉంది. దీనికి సంబంధించి మనకిప్పటికే స్థిరపడి ఉన్న భావాలు కూడా సరైనవికావు. ఉపాధ్యాయ విద్య ఈ అంశాలను మరింత లోతుగా అవగాహన చేసుకునేవిధంగా ఉండాలి.

ప్రస్తుతం మన ఉపాధ్యాయ విద్య జ్ఞానాన్ని 'ఇచ్చే' వస్తువుగా భావిస్తోంది. శిక్షణ పొందేవారికి పాఠ్యప్రణాళికను, సిలబస్‌ను, పాఠ్యగ్రంథాలను విమర్శనాత్మకంగా పరిశీలించే అవకాశం ఉండటంలేదు. ఇప్పటికే స్థిరపడి ఉన్న వాస్తవ పరిస్థితులకు సర్దుకుపోవడాన్ని మాత్రమే ఇది నేర్పిస్తున్నది. పిల్లలకు సంబంధించి, జ్ఞానానికి, అభ్యసనానికి సంబంధించి, మనకున్న ప్రస్తుత దృక్పథాలు చాలా సులభంగా మారతాయని అనుకోవడం కూడా సరికాదు. మన ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలు శిక్షణ పొందేవారికి ఇప్పటికే ఉన్న భావాల్ని గురించికానీ, అనుభవాల గురించిగానీ పట్టించుకోవడంలేదు. వాటిని మార్చడానికి ప్రయత్నం చేయడంలేదు.

పిల్లల అవసరాలకు, వారి అభ్యసనానికి అనుగుణంగా స్పందించే ఉపాధ్యాయుల్ని తయారుచేయడం మన కర్తవ్యం. మన విద్య ఏ విస్తృత సందర్భంలో సాగుతోందో శిక్షణ పొందేవారు తెలుసుకునేలా శిక్షణాంశాలు ఉండాలి. వాస్తవ సందర్భాల్లో తెలివితో ఎలా వ్యవహరించాలో ఇది నేర్పాలి. జ్ఞానం, అభ్యసనాలకు సంబంధించి; కులం, లింగం, సమానత్వం, న్యాయం మొదలైన అంశాలకు సంబంధించి వారి విశ్వాసాలను వారే విమర్శనాత్మకంగా ప్రశ్నించుకునేలా ఉపాధ్యాయ శిక్షణ ఉండాలి. స్వతంత్రంగా ఆలోచించడానికి, స్వంతంగా నేర్చుకోవడానికి, పిల్లల అవసరాలకు తగినట్లుగా స్పందించడానికి తగినట్టు శిక్షణా కార్యక్రమాలుండాలి. తమ స్వంత అనుభవాల్ని, పిల్లల సామాజిక నేపథ్యాన్ని కలుపుకుని స్వంతంగా ఆలోచించే లక్షణం ఉపాధ్యాయుల్లో పెంపొందాలి. ఇందుకోసం ఈ క్రింది ప్రయత్నాలు చేయవచ్చు.

తనను, ఇతరుల్ని (స్వీయ విశ్వాసాల్ని, భావాల్ని, ఆవేశాన్ని) అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడం, స్వీయ విశ్లేషణ, స్వీయ మూల్యాంకనం, పరిస్థితులకనుగుణంగా మారడం, సరళంగా ఉండడం, సృజనాత్మకత, అన్వేషణ, స్వీయ అభ్యసనం, పునశ్చరణ, కొత్త ఆలోచనల్ని స్వీకరించడం, ఎంచుకోవడం ఉపాధ్యాయులకవసరం. దీనివల్ల ఉపాధ్యాయులు తాము నిర్దేశించుకున్న పద్ధతిలో నేర్చుకోవడానికి, విమర్శనాత్మకంగా వ్యవహరించడానికి, సమిష్టిగా పనిచేయడానికి వీలవుతుంది. పిల్లలతో అనుబంధాన్ని పెంచుకోవడం, వారితో మాట్లాడడం, వారిని పరిశీలించడం, అవగాహనను పెంచుకోవడం, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం, సామాజిక వాస్తవాల్ని అర్థం చేసుకోవడం, సామాజిక నేపథ్యాలతో సబ్జెక్టు అంశాల్ని అనుసంధానింపచేసుకోవడం, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అకడమిక్ జ్ఞానాన్ని శారీరక శ్రమతో సమన్వయం చేసుకోవడం టీచర్లు అలవరచుకోవాలి.

**టీచర్లు వీటికి సిద్ధపడాలి**

- పిల్లల పట్ల శ్రద్ధ పెంచుకోవడం, వారిని ప్రేమించటం.
- సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సందర్భాలను గమనంలో ఉంచుకుని పిల్లల్ని అర్థం చేసుకోవడం.
- స్వీకరించడానికి సిద్ధపడడం, నిరంతరం నేర్చుకోవడం.
- స్వీయ అనుభవాలనుంచి ఒక అర్థాన్ని వెతుక్కోవడమే అభ్యాసమని, జ్ఞానోత్పత్తి ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించడం.
- జ్ఞానం. మన అనుభవాలతో సంబంధంలేని పాఠ్యపుస్తకాలకు మాత్రం పరిమితమైన అంశం కాదని గుర్తించడం.
- స్వీయ అనుభవం నుంచి బోధనాభ్యసన ప్రక్రియలో జరిగే ఆదానప్రధానాలనుంచి జరుగుతోందని గుర్తించడం.
- మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నించడం, సమాజంపట్ల బాధ్యత వహించడం.

### 5.2.3 కొన్ని విస్మృతాంశాలు

అభ్యసించే విద్యార్థిని అర్థం చేసుకోవడం ఉపాధ్యాయ విద్యలో కీలకాంశం. భిన్న సామాజికార్థిక సాంస్కృతిక సందర్భాల్లో పిల్లల్ని అర్థం చేసుకోవడం, వారిని పరిశీలించడం, వారితో పరస్పర చర్య జరపడం చాలా ముఖ్యమైనవి. ఇందుకోసం మనం పిల్లలు ఆడుకునేటప్పుడు, పనిచేసేటప్పుడు వారిని జాగ్రత్తగా పరిశీలించాలి. పిల్లల ఆలోచనా పద్ధతుల్ని, అభ్యసన క్రమాల్ని లోతుగా పరిశీలించేవిధంగా; ప్రకృతిపట్ల, సమాజంపట్ల పిల్లల ప్రశ్నల్ని, పరిశీలనల్ని అర్థం చేసుకునేవిధంగా అసైన్‌మెంట్లు రూపొందించుకోవాలి. ఇవి పిల్లల్నుంచి ఉపాధ్యాయులు నేర్చుకోవడానికి, పిల్లలపట్ల ఏకాగ్రతను, సాన్నిహిత్యాన్ని, తాదాత్మ్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడాలి. సామాజిక దైనందిన సందర్భాల్లో పాల్గొనడం ద్వారా అభ్యసనం వికసిస్తుంది. సందర్భశుద్ధి లేకుండా గాంధీజీ, ఠాగూర్, అరవిందుడు, గిజాభాయి, జిడ్డు క్రిష్ణమూర్తి, దావే సిద్ధాంతాల్ని వల్లించడంవల్ల ప్రయోజనం లేదు. సాధారణంగా ఉపాధ్యాయ విద్యా శిక్షకులు ఈ సిద్ధాంతాల్ని ఎప్పుడూ ఆచరించరు. చదివి గుర్తుంచుకుంటేచాలని భావిస్తారు. సజీవమైన భావాలు ఏర్పడాలంటే భారతీయ సమాజానికవసరమైన అంశాల్ని, దీని బహుళత్వ స్వభావాన్ని, గుర్తింపు సమస్యను, స్త్రీపురుష సంబంధాల్ని, సమానత్వం–పేదరికం లాంటి అంశాల్ని తెలుసుకోవాలి. ఫలితంగా ఉపాధ్యాయులు అసలైన విద్యాలక్ష్యాన్ని, విద్యకు, సమాజానికి మధ్యగల సంబంధాన్ని అర్థం చేసుకోగలుగుతారు.

మన సాంప్రదాయిక ఉపాధ్యాయ విద్య పాఠశాల సబ్జెక్టులను వేరువేరుగా బోధించడానికి అవసరమైన పద్ధతులమీద మాత్రం శ్రద్ధ పెడుతుంది. సబ్జెక్టు జ్ఞానం శిక్షణ పొందేవారికి కావల్సినంత ఉంటుందని కూడా ఇది అభిప్రాయపడుతుంది. కానీ ఉపాధ్యాయులు సబ్జెక్టు విషయాన్ని సరైన పద్ధతుల్లో చెప్పాలంటే వారికి ఈ సబ్జెక్టులు లోతుగా తెలిసి ఉండటం అవసరం. జ్ఞాన పునర్నిర్మాణానికి పాఠశాలల్లో, కాలేజీల్లో నేర్చుకున్నవాటిని పరిశీలనద్వారా, ప్రయోగాలద్వారా సమీక్షించుకోవల్సిన అవసరం ఉంది. సైన్సు సబ్జెక్టులను చేపట్టేందుకు ప్రయోగశాలలను ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఆకాశం నీలంగా ఎందుకు ఉంది? మానవులకు రెండు చేతులు ఎందుకున్నాయి? లాంటి ప్రశ్నలు పిల్లలు వేస్తే సమాధానం వెతకడానికి గ్రంథాలయాలు, క్షేత్ర సర్వేలు, బృంద చర్చలు అవసరమౌతాయి. శారీరక శ్రమను ఈ కృత్యాల్లో జోడించడంవల్ల విషయ పరిజ్ఞానంతోపాటు శ్రమపట్ల గౌరవాన్ని, పరస్పర సహకారాన్ని, సౌహార్థాన్ని కూడా శిక్షణ పొందేవారు అలవర్చుకోగలుగుతారు. మన బోధనా వ్యూహంలో పెద్ద మార్పు రావాలి. ప్రస్తుతం మనం పరిశుద్ధ విషయ పరిజ్ఞానం మీదనే శ్రద్ధ పెడుతున్నాం. దీనికి భిన్నమైన పద్ధతి అవసరం. ఉదాహరణకు భాషను బోధిస్తుంటే వివిధ నేపథ్యాల పిల్లలు మాట్లాడే భాషా లక్షణాల్ని, భాషాభ్యసనంలోని సామాజిక సాంస్కృతిక అంశాల్ని, భాషాభ్యసన క్రమాన్ని మనం గుర్తుంచుకోవలసి ఉంటుంది. ప్రస్తుత సాంప్రదాయిక పద్ధతిలో భాషా వినియోగం కంటే భాషా నిర్మాణంపైనే మనం ఎక్కువగా శ్రద్ధ పెడుతున్నాం. దీనికి భిన్నమైన పద్ధతులు రావలసి ఉంది. ఇలాంటివి లోతుగా పరిశీలించాలంటే పిల్లలు ఎలా చదువుతారో మనం ఓపిగ్గా వినాలి. అందులో వారు ఎదుర్కొనే ఇబ్బందుల్ని పరిశీలించి విశ్లేషించాలి. పాఠశాల భాషకు, ఇంటి భాషకు మధ్య ఉన్న అగాధాన్ని గుర్తించాలి పాఠ్యపుస్తకాల్లో విషయాన్ని చెప్పే పద్ధతి, భాషాశైలి ఎలా ఉన్నాయో విమర్శనాత్మకంగా పరిశీలించాలి. గణిత సిద్ధాంతాలు, పరిశీలనలు విద్యార్థి ఆలోచనా క్రమాన్ని ఎలా నిర్దేశిస్తున్నాయో అర్థం చేసుకోవాలి. గణితభాషను పరిశీలించాలి. పిల్లల అభ్యసన పద్ధతులపై జరిగిన పరిశోధనల్ని చూడాలి. గణితంలో తప్పులు ఎందుకు దొర్లుతాయో, గణితం అంటే భయమెందుకోకూడా జాగ్రత్తగా పరిశీలించాలి. అలాగే పర్యావరణ విద్యలో చరిత్రను, భూగోళాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. స్థానికంగా ఉండే అంశాల్ని ఇందుకోసం వినియోగించుకోవలసి ఉంటుంది. విహార యాత్రలు చేయాలి. ఈ సందర్భంలో బండలను, ఆకులను, స్టాంపులను, జెండాలను, రిపోర్టులను, వార్తాపత్రికలను, డాక్యుమెంటులను స్థానిక మ్యాపులను, అట్లాసులను కూడా వినియోగించుకోవాలి.

పాఠశాలలో పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో తెలుసుకునే విధంగా, రెగ్యులర్ టీచర్లతోపాటు పిల్లలకు బోధించే అకవాశం ఉండేవిధంగా ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలుండాలి. దీనివల్ల పిల్లల అభ్యసనంలో వాస్తవిక లక్ష్యాలను నిర్ణయించుకోవడానికి, బోధనా వ్యూహాన్ని రూపొందించుకోవడానికి ఒక అవకాశం శిక్షణ పొందేవారికి లభిస్తుంది. అర్థవంతమైన తరగతి గది కృత్యాల్ని దీనివల్ల వీరు ఎన్నుకుని, రూపొందించుకుని అమలుచేసుకోగలుగుతారు. తమ సొంత ఆచరణను సమీక్షించుకోగలుగుతారు. పిల్లల మూల్యాంకనం కోసం స్వీయ వ్యూహాలను రూపొందించుకోగలుగుతారు.

### 5.2.4 వృత్త్యంతర విద్య ఉపాధ్యాయ శిక్షణ

ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాభివృద్ధితోపాటు పాఠశాలల్లోని ప్రస్తుత పరిస్థితుల్ని మార్చడంలో వృత్త్యంత విద్య చాలా గొప్ప పాత్రను పోషిస్తుంది. ఇది ఉపాధ్యాయులకు ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తుంది. టీచర్లు తమ క్లాసురూము ఆచరణల్ని సరిచూచుకోవడానికి, అనుభవాల్ని స్థిరపరచుకొనేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇతర ఉపాధ్యాయుల అనుభవాల్ని తెలుసుకొనేందుకు, తమ జ్ఞానాన్ని పెంచుకొనేందుకు కూడా ఇది ఉపయోగకరం.

విద్యా కమీషన్ (1964-65) విశ్వవిద్యాలయాలు ఉపాధ్యాయులకు వృత్త్యంత శిక్షణలు నిర్వహించాలని, కనీసం 5 ఏళ్ళకు 2-3 నెలల శిక్షణ అవసరమని పేర్కొంది. విద్యా పరిశోధనల ప్రాతిపదికన ఈ శిక్షణ ఉండాలి.శిక్షణా సంస్థలు 12 నెలలు పనిచేయాలి. పునశ్చరణ తరగతులు, సెమినార్లు, వర్క్‌షాపులు వేసవిలో నిర్వహించాలి. జాతీయ ఉపాధ్యాయ కమీషన్ (1983-85) ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని ఒకచోట కలబోసుకుని ఒకరి అనుభవాల్ని ఒకరు పంచుకొనేలా ఉపాధ్యాయ కేంద్రాలుండాలని చెప్పింది. అధ్యయనం కోసం టీచర్లకు సెలవు ఉండాలని వాటిని ఉపయోగించుకోవాలని కూడా తెలిపింది. జాతీయ విద్యావిధానం (1980) సర్వీసుకు ముందు, సర్వీసు మధ్యలో ఇచ్చే శిక్షణల మధ్య ఒక అనుబంధం ఉండాలని పేర్కొనింది. ప్రతి జిల్లలో DIET లు నెలకొల్పాలని, 250 విద్యా కళాశాలల్ని ఉపాధ్యాయ విద్యా కళాశాలలుగా అభివృద్ధి చెయ్యాలని, SCERT లను బలోపేతం చెయ్యాలని, 50 IASE లను (Institute of Advanced Studies in Education) స్థాపించాలని ప్రతిపాదించింది. ఉపాధ్యాయుల నిర్దిష్ట అవసరాల ప్రాతిపదికన వృత్త్యంతర శిక్షణా కోర్సుల్ని ప్లాన్ చెయ్యాలని, శిక్షణ తర్వాత మూల్యాంకనం కొనసాగింపు కూడా ఈ శిక్షణల్లో భాగం కావాలని సూచించింది.

### 5.2.5 వృత్త్యంతర విద్యా ప్రయత్నాలు, వ్యూహాలు

NPE (1980) సిఫార్సుల ప్రకారం DIET లు, IASE లు, CTE లు ఉపాధ్యాయుల వృత్త్యంతర విద్యకోసం ఏర్పడ్డాయి. 500 DIET లు, CTE లు, 38 IASE లు, 30 SCERT లు ఇలా వచ్చినవే. కానీ వాటిలో చాలాభాగం ఇంకా సమర్థవంతమైన వనరుల కేంద్రాలుగా రూపొందాల్సివుంది. DPEP క్లస్టర్ స్థాయి రిసోర్సు సెంటర్లను నెలకొల్పింది. వృత్త్యంతర విద్య, క్లస్టర్ స్థాయిలో పాఠశాల పర్యవేక్షణ వీటి లక్ష్యాలు. ఇంత విస్తృత ప్రయత్నాలు జరిగినప్పటికీ ఏదో కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో తప్ప, ఉపాధ్యాయులకిచ్చిన శిక్షణలు వారి బోధనా విధానాలపై కల్గించిన ప్రభావం నామమాత్రం.

ఉపాధ్యాయుల అవసరాల్ని గుర్తించడమే నాణ్యమైన శిక్షణకు గీటురాయి. కానీ ఎక్కువ శిక్షణల్లో ఇది కన్పించదు. ఈ శిక్షణలన్నీ ఉపన్యాస పద్ధతిలో ఉంటాయి. శిక్షణార్థుల భాగస్వామ్యం ఏమీ ఉండదు. కృత్యాధార బోధన, పెద్దపెద్ద తరగతి గదుల నిర్వహణ, ఉమ్మడి బోధన, ప్రత్యక్ష బహుళ తరగతుల బోధనలాంటివన్నీ ఉపన్యాస పద్ధతిలో తెలియజెప్పడం జరుగుతుంది. పాఠశాలల్లో దీని అమలును పరిశీలించడం అసలే కరువైంది. ఉపాధ్యాయులు సమిష్టిగా ప్లాన్ చేసుకొనేందుకు తగ్గట్లుగా, వారి వృత్తి నైపుణ్యాన్ని పెంచడానికి తగ్గట్టుగా క్లస్టర్ స్థాయి సమావేశాలు జరగడంలేదు.

ఏ పాఠ్యప్రణాళికా సంస్కరణ అయినా బాగా ఆలోచించి రూపొందించే వృత్త్యంతర శిక్షణమీద, ఉపాధ్యాయుడికి స్కూలు స్థాయిలో మనమిచ్చే సహకారం మీద ఆధారపడి విజయవంతమవుతుంది. వృత్త్యంతర శిక్షణ ఒక సంఘటనగా మారకూడదు. అదొక క్రమం. అందులో జ్ఞానం, అభివృద్ధి, దృక్పథాల్లో మార్పులు, నైపుణ్యాలు, ఇష్టాలు, పరస్పర చర్యలు మొదలైనవన్నీ ఉంటాయి. ఇది కేవలం నిపుణుల నుంచి జ్ఞాన సంగ్రహణ రూపంలో ఉండదు. అనుభవాలతో కూడిన అభ్యసనాన్ని, ఉపాధ్యాయులు క్రియాశీల అభ్యాసకులుగా వ్యవహరించడాన్ని, తోటి ఉపాధ్యాయులతో కలిసి తమనుతాము సమీక్షించుకోవడాన్ని ప్రోత్సహించే విధంగా వృత్త్యంతర శిక్షణ ఉండాలి. ఇది మూసపోసిన పద్ధతిలో ఉండకూడదు. వికేంద్రీకృత ప్రణాళిక ద్వారా స్పష్టమైన లక్ష్యాల్ని, పద్ధతుల్ని నిర్దేశించుకుని ఈ శిక్షణనివ్వాలి. కొన్ని

సందర్భాల్లో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎక్కువమందికి ఒకేసారి శిక్షణ ఇవ్వవచ్చు. కానీ సర్వీసులో ఉన్న టీచర్ల అవసరాల్ని తీర్చేవిధంగా నిజాయితీతో, ధైర్యంతో, సృజనాత్మకతతో శిక్షణలను రూపొందించుకోవడం అవసరం.

సాంకేతిక విజ్ఞానం పాఠ్యప్రణాళికా సంస్కరణలకు సరిగా ఉపయోగపడాలంటే ఉపాధాయులు, సమాజం కలిసి చర్చించుకొనే సంస్కృతి ఉండాలి. నూతన సాంకేతిక విజ్ఞానంలో ఆసక్తి పెరగాలంటే వాటి ప్రోగ్రాంలను స్వయంగా రూపొందించుకునే పరిజ్ఞానం అవసరం. సర్వీసుకు పూర్వం ఇచ్చే శిక్షణగానీ, వృత్త్యంతర శిక్షణగానీ పాఠ్యప్రణాళికను అర్థం చేసుకునే విధంగా, అందులోని సవాళ్ళను గుర్తించేవిధంగా ఉండాలి. ముఖ్యంగా వృత్త్యంతర శిక్షణను ఉపాధ్యాయుల, పాఠశాలల అనుభవాలను ప్రాతిపదికగా తీసుకుని రూపొందించాల్సి ఉంది. ఉపాధ్యాయులకు, వాళ్ళ స్కూళ్ళకు ఉపయోగపడేవిధంగా వృత్యంతర శిక్షణను రూపొందించాల్సిన బాధ్యత DIETs పై ఉంది. తాత్కాలిక పద్ధతిలో టీచర్లను వృత్యంతర శిక్షణకు పంపడం సరైంది కాదు. ప్రతి స్కూలు భాగస్వామ్యం ఉండేలా, ప్రతి క్లస్టరు నుండి నిర్దిష్ట సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనేలా ఈ శిక్షణలుండాలి. BRC లతో సమన్వయం చేసుకుని DIETs ఇలాంటి స్కూళ్ళను, టీచర్లను ఎంపికచేయాలి. శిక్షణల పేరిట పాఠశాల పనిదినాలు దెబ్బతినకుండా చూడాలి. శిక్షణ పొందే ఉపాధ్యాయులు ఆచరణకు, సిద్ధాంతానికి మధ్య సంబంధాన్ని గుర్తించేవిధంగా వృత్యంతర శిక్షణను ప్లాన్ చేయాల్సి ఉంటుంది. శిక్షణలో ఉపన్యాసాలతోపాటు పలు కృత్యాలు కూడా ఉండాలి. చర్చలకు ప్రాధాన్యతనివ్వాలి. వర్క్‌షాపులు, క్లాస్‌రూం అసైన్‌మెంట్లు కూడా ఇందులో భాగంగా ఉండాలి. వృత్యంతర శిక్షణ పొందే టీచర్లు క్లాస్‌రూంలో బోధించడాన్ని ఉపాధ్యాయ శిక్షణ పొందే విద్యార్థులు పరిశీలించాలి. దీనివల్ల శిక్షణనిచ్చేవాళ్ళు సమర్థవంతమైన శిక్షణా కార్యక్రమాల్ని రూపొందించుకోగల్గుతారు. ఈ క్రమాన్ని మరింత ముందుకు తీసుకుని పోయేందుకు ప్రధానోపాధ్యాయులతో ప్రతి చర్య జరిపేందుకు ఏర్పాటుకూడా ఉండాలి. పర్యవేక్షణా వ్యవస్థలో SCERT / DIETs / BRCs / CRCs లను కూడా చేర్చాలి. దీనివల్ల అకడమిక్ సపోర్టుతోపాటు డాక్యుమెంటు చేయడానికి, పరిశోధన చేయడానికి అవకాశం ఉంటుంది.

## 5.3 పరీక్షల సంస్కరణలు

10, 12 తరగతుల చివర మనం నిర్వహించే పరీక్షల్ని మార్పు చేయాలని 'భారంలేని అభ్యసనం' నివేదిక సూచించింది. ప్రస్తుత పరీక్షా విధానం క్విజ్ తరహా ప్రశ్నలతో కేవలం పాఠ్యపుస్తకాలపై ఆధారపడి ఉండడంవల్ల పిల్లల్లో విపరీతమైన ఒత్తిడిని పెంచుతోంది. నగర మధ్య తరగతి వర్గపు పిల్లలు ఈ పరీక్షల్లో అత్యధికంగా రాణించాలని తాపత్రయపడి ఒత్తిడికి గురైతే, గ్రామీణ పిల్లలు కనీసం ఉత్తీర్ణత సాధించడానికి శక్తిలేక బాధపడుతున్నారు. ప్రత్యేకించి గ్రామీణ పిల్లల్లో, ఆర్థికంగా, సామాజికంగా అణగారిన పిల్లల్లో ఉత్తీర్ణత బాగా తగ్గిపోతోంది. అందువల్ల మన మొత్తం పరీక్షా విధానాన్ని పునఃసమీక్ష చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

ఒత్తిడిని తగ్గించి 10, 12 తరగతుల పరీక్షల్లో ఉత్తీర్ణతను పెంచడం

- విషయాధారిత పరీక్షకు బదులు అవగాహన, సమస్యల సాధనపై ఆధారపడ్డ పరీక్షా విధానం కావాలి.
- విషయాధారిత పరీక్షా విధానం లోపభూయిష్టమైన బోధనా పద్ధతులకు, కంఠస్తం చేయడానికి దారితీస్తుంది. దీనివల్ల పరీక్షలంటే చాలు ఒత్తిడి పెరిగిపోతుంది. జ్ఞాపకం పెట్టుకునే అవసరం లేకుండా ఫార్ములాలు, ప్రాథమిక టేబుల్స్ పిల్లలకు పరీక్షల్లో అందించాలి. విశ్లేషతకు, అన్వయానికి ప్రాధాన్యత ఉండేవిధంగా ప్రశ్నలుండాలి. 25 నుంచి 40 శాతం లిఖిత సమాధానాలు, మిగిలినవి చాలా జాగ్రత్తగా రూపొందించిన బహుళ సమాధాన ప్రశ్నలు ఉండేవిధంగా చిన్నచిన్న పరీక్షలు నిర్వహించాలి. పరీక్షకు హాజరయ్యే 90 శాతం మంది విద్యార్థులు వీటిని పూర్తిచేయగల విధంగా ఉండాలి.
- పరీక్షల్ని పిల్లలు చదివే స్కూల్లోనే నిర్వహించాలి. తప్పుడు పద్ధతులను నిరోధించడానికి బయటి పాఠశాలల ఉపాధ్యాయులను పర్యవేక్షకులుగా నియమించాలి.
- పరీక్షల్ని ఏ పరిస్థితుల్లోను వాయిదా వేయకూడదు.
- పిల్లలు వీలున్నన్ని సబ్జెక్టుల్లో పరీక్షకు సిద్ధమయ్యేందుకు అంగీకరించాలి. మూడేళ్ళలో అన్ని సబ్జెక్టులు పూర్తిచేయాలి. దీనివల్ల పిల్లలు ఎప్పుడు పరీక్షకు సిద్ధమైతే అప్పుడు పరీక్షలు పెట్టవచ్చు. అప్పుడు పిల్లలే పరీక్ష పెట్టాల్సిందిగా డిమాండు చేస్తారు.
- పాస్, ఫెయిల్ అనే పదాల్ని తొలగించాలి. తగినంత ప్రావీణ్యం సంపాదించకలేకపోతే "మళ్ళీ పరీక్షకు సిఫార్సుచేయడమైనది" అనాలి.
- పరీక్షా ఫలితాలు రాగానే సప్లిమెంటరీ పరీక్షను నిర్వహించాలి. ఇందువల్ల పిల్లలు వీటికి హాజరై తప్పిపోయిన ఒకటి, రెండు పరీక్షలు రాస్తారు. ఒక సంవత్సరమంతా వృథా అయ్యే పరిస్థితి తప్పుతుంది. గణితం, ఇంగ్లీషులాంటి సబ్జెక్టులను సాధారణ స్థాయి, ఉన్నతస్థాయి అని రెండు దశలుగా పరీక్షించాలి.
- తరువాత్తర్వాత అన్ని సబ్జెక్టులకు ఇదే పద్ధతిని ప్రవేశపెట్టాలి. దీనివల్ల రెండు, మూడు పరీక్షల్ని ఒకదశలో; మూడు, నాలుగు పరీక్షల్ని మరొకదశలో ఎంచుకుంటారు.

### 5.3.1 ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షలు, నివేదికలు

ప్రస్తుత పరీక్షల నాణ్యత పెరగాలంటే ప్రశ్నాపత్రాల్ని రూపొందించే పద్ధతి మారాలి. ప్రశ్నాపత్రాన్ని రూపొందించడంమీద కంటే ప్రశ్నల్ని రూపొందించడం మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఇలాంటి ప్రశ్నల్ని నిపుణులు మాత్రమే తయారుచేయాల్సిన అవసరం లేదు. విస్తృత ప్రచారం ద్వారా సంవత్సరం పొడుగునా ఉపాధ్యాయుల నుండి, కళాశాల అధ్యాపకుల నుండి, ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయుల నుండి, చివరకు విద్యార్థులనుండి కూడా ప్రశ్నల్ని సమీకరించవచ్చు. ఆ తరువాత వీటిని క్లిష్టత, విషయం, భావన, తదితర అంశాల ప్రాతిపదికన నిపుణులు

విభజిస్తారు. వీటికి సమాధానాలు రాయడానికి ఎంత సమయం పడుతుందో నిర్ణయిస్తారు. ప్రశ్నాపత్రాల తయారీ సందర్భంగా వీటికొక రికార్డు కూడా తయారుచేస్తారు. సరైన పారితోషికం ఇవ్వకుండా ఉపాధ్యాయులచేత సమాధాన పత్రాలు దిద్దించడం సరైందికాదు. దీనివల్ల నాణ్యత, స్థిరమైన పద్ధతి లోపిస్తాయి. మన పరీక్షా నిర్వహణా సంస్థలు ఆర్థికంగా బాగా పరిపుష్టంగా ఉన్నాయి. అందువల్ల సమాధాన పత్రాలు దిద్దడంలో నాణ్యత తగ్గిపోవడానికి నిధులు కారణం కావల్సిన అవసరం లేదు. కంప్యూటర్లు వాడటం వల్ల పరీక్షలు రాసేవాళ్ళను, పేపర్లు దిద్దేవాళ్ళను గుర్తించడం తేలికౌతుంది. దీనివల్ల తప్పుడు పద్ధతుల్ని అరికట్టవచ్చు. పరీక్ష హాలు నుంచి మొదటి **90** నిముషాల్లో బయటికిపోయే అవకాశం లేకుండా చేస్తే, బయటికి పోయేటప్పుడు ప్రశ్నాపత్రాన్ని పరీక్షార్థులు ఎత్తుకుపోయే అవకాశం లేకుండా చేస్తే పరీక్షా సమయంలో తప్పుడు ధోరణులు బాగా తగ్గిపోతాయి. (పరీక్ష తరువాత ప్రశ్నాపత్రం ఇచ్చెయ్యవచ్చు). కంప్యూటర్ల వాడకం వల్ల అభ్యర్థులు సాధించిన స్థాయిని పలురూపాలుగా లెక్కించవచ్చు. మొత్తం మార్కులు / గ్రేడ్లు ఒక సబ్జెక్టులో మొత్తం పిల్లల ఉత్తీర్ణతాశాతం, వివిధ గ్రూపుల ఉత్తీర్ణతా శాతం సులభంగా తెలుసుకోవచ్చు. పరీక్షల నాణ్యతను విశ్లేషించవచ్చు. మనం పారదర్శకంగా ఉండాలి. ఫీజు చెల్లించి తమ సమాధాన పత్రాల కాపీలను తాము స్వయంగా పరిశీలించుకునేందుకు పిల్లలకు అవకాశం ఇవ్వాలి. ఇలా చేసినచోట తమ సమాధాన పత్రాలను మళ్ళీ పరిశీలించాలని కోరేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. మధ్యంతర పరీక్షల్లో పాఠశాల స్థాయి మూల్యాంకనానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి అంతర్గత మూల్యాంకనానికి గౌరవం, గుర్తింపు కలిగేలాగా మనం జాగ్రత్త పడాలి. తెలివైన టీచర్లు పిల్లల శక్తిని, అశక్తతను చాలా సులభంగా గుర్తిస్తారు. ఈ పద్ధతుల్ని కూడా ఉపయోగించుకోవాలి. అదే సందర్భంలో దుర్వినియోగం జరక్కుండా ఉండాలంటే పబ్లిక్ పరీక్షల మార్కులతో పోల్చి చూసి పిల్లలకు గ్రేడులివ్వాలి. దీనికితగ్గ పరిశోధన, ఉపాధ్యాయ విద్య, అవసరమైన సంస్థాగత ఏర్పాట్లు ఎంతో అవసరం.

### 5.3.2 ఇతర స్థాయిల్లోని ప్రవేశ పరీక్షలు, బోర్డు పరీక్షలు

ప్రవేశ పరీక్షలు, బోర్డు పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లోను **5, 8, 11** తరగతులకు పరీక్షలు జరపకూడదు. **11**వ తరగతిలో చేరాలనుకునేవారికి మాత్రమే పదవ తరగతిలో పబ్లిక్ పరీక్ష పెట్టాలి. మిగిలినవారికి పాఠశాల నుంచి సర్టిఫికేటు ఇవ్వాలి. పోటీపరీక్షల నుంచి, ప్రవేశ పరీక్షల నుంచి పాఠశాల విద్యానంతర పరీక్షల్ని వేరుచేయాలి. తక్కువమంది పిల్లలు హాజరైతే ఈ ప్రవేశ పరీక్షలు రాసేవారిలో ఒత్తిడి తగ్గుతుంది. పరీక్షలకు రూపకల్పన చేసి నిర్వహించడం కోసం ఒక మోడల్ సంస్థను గుర్తించాలి. ఇది సంవత్సరంలో మొత్తం దేశంలోని కొన్ని కేంద్రాల్లో పలుమార్లు పరీక్షలు నిర్వహిస్తుంది. సకాలంలో పరీక్షలు జరిగేలా, ఫలితాలు ప్రకటించబడేలా చూస్తుంది. ఈ పరీక్షలో సాధించిన మార్కుల్నిబట్టి విద్యా సంస్థలు పిల్లల్ని చేర్చుకోవాలి.

## 5.4 వినూత్నాలోచనలు, ప్రయోగాలు

### 5.4.1 బహుళ పాఠ్య గ్రంథాలు, నూతన ప్రయత్నాలకు ప్రోత్సాహం

పాఠ్యప్రణాళికల్లో పిల్లల అనుభవాల్ని అర్థవంతంగా ఇముడ్చుకోవాలంటే, పిల్లల సాంస్కృతిక సందర్భాలు, భాషలు వీటిలో ప్రతిబింబించాలంటే మొదట పాఠ్యగ్రంథ రచనను వికేంద్రీకరించాలి. అయితే ఈ సందర్భంలో ఇందుక్కావల్సిన సామర్థ్యాలను, వ్యవస్థను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. పాఠ్యగ్రంథ రచనకు పరిశోధన అవసరం.

అకడమిక్ నైపుణ్యం అవసరం. పిల్లల అభివృద్ధి దశల్ని అర్థం చేసుకోవడం కూడా అవసరం. పాఠ్యగ్రంథ రచయితలకు సంభాషణా నైపుణ్యం ఉండాలి. ప్రస్తుతం పాఠ్యగ్రంథ రచనా బాధ్యతలను SCERT చూస్తోంది. ఈ స్థితి కొనసాగాలి. అయితే ఈ పాఠ్య గ్రంథ రచన వ్యక్తిగత పద్ధతిలో కాకుండా సమిష్టి కృషిగా జరగాలి. ఇలాంటి సమిష్టితత్వం ఎందుకంటే పాఠ్యగ్రంథ రచనలో చాలా అంశాలు కీలకపాత్ర వహిస్తాయి. దార్శనికత, పిల్లలు ఎలా నేర్చుకుంటారు? అనే దానిపై స్పష్టత, సబ్జెక్టు జ్ఞానాన్ని పునఃపరిశీలించడం, పరిశోధనలాంటివి ఇందులో కొన్ని. దీంతోపాటు పిల్లలకు విషయాన్ని అందించే పద్ధతి కూడా తెలిసుండాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాల పరిశోధనల్ని, స్వచ్ఛంద సంస్థల అనుభవాల్ని కూడా ఉపయోగించుకోవాలి. ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు సమగ్రంగా ఉండటం లేదు. కొన్ని సందర్భాల్లో వాటిలోని అంశాలు చాలా ఎక్కువ. కొన్ని సందర్భాల్లో చాలా తక్కువ. విద్యా సంవత్సరంలో ఏ సబ్జెక్టు ఏ కాలంలో చెబితే న్యాయంగా ఉంటుందో ఈ పాఠాలు దృష్టిలో ఉంచుకోవు. కనీసం ప్రారంభ పాఠాల్ని ప్రయోగాత్మకంగా పిల్లలకు బోధించి, ఉపాధ్యాయులు, పిల్లలు వాటిని ఎలా స్వీకరిస్తున్నారో చూడ్డం అవసరం. పాఠ్యపుస్తకాల విషయంలో నూతన మార్పులు చేసేటప్పుడు తరగతి గదిలోని వాస్తవాల్ని, ఉపాధ్యాయుల, పిల్లల సంసిద్ధతని తప్పకుండా దృష్టిలో ఉంచుకోవాలి. ఉపాధ్యాయులు ఎంపికచేసుకోవడానికి అనువుగా, పిల్లల అవసరాల్ని, ఆసక్తుల్ని గమనంలో ఉంచుకుని బహుళ పాఠ్యగ్రంథాలు రూపొందాలి. వివిధ పుస్తకాలు, అనుబంధ సామగ్రి అందుబాటులో ఉంటే ఏవి తమ పిల్లలకు నిర్దిష్టంగా సరిపోతాయో వాటిని ఉపాధ్యాయులు ఎన్నుకునే అవకాశం ఉంటుంది. ఇది ఉపాధ్యాయుల స్వయం ప్రతిపత్తిని పెంచుతుంది. ఉపాధ్యాయులు కూడా ఒకే విషయాన్ని పలురూపాల్లో ఎలా పిల్లలకు తెలియజెప్పవచ్చో దీనివల్ల నేర్చుకుంటారు. ఇలాంటి టీచర్లు పిల్లల్నికూడా ఇలాగే ప్రోత్సహిస్తారు. ఈ పద్ధతి గ్రంథాలయాలను ఉపయోగించుకోవడాన్ని కూడా ప్రోత్సహిస్తుంది. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ, వర్క్‌షాపులు అవసరం. దీనివల్ల ఇలాంటి పాఠ్యగ్రంథాలను, అనుబంధ సామగ్రిని ఎలా ఉపయోగించుకోవచ్చో గ్రంథాలయ వసతుల్ని ఎలా పెంపొందించుకోవచ్చో తెలుస్తుంది. పాఠశాలల మధ్య ఒకరి గ్రంథాలయాన్ని మరొకరు ఉపయోగించుకునేలా అనుబంధం పెరుగుతుంది. ఇది ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలమధ్య కూడా భాగస్వామ్యాల్ని పెంచుతుంది. సామాజిక గ్రంథాలయాల్ని నెలకొల్పుకోవడం కూడా ఈ సందర్భంలో అవసరం. బహుళ వాచకాల ఉత్పత్తి, ప్రైవేటు రంగాన్ని ఆహ్వానిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సంస్థలు మరింత పరిశోధన చేసి ప్రైవేటు ప్రచురణకర్తలతో పోటీపడాల్సి ఉంటుంది. పూర్వం పేర్కొన్నట్లు SCERT లు ఉమ్మడి భాగస్వామ్య పద్ధతిలో పాఠ్యపుస్తకాల్ని రూపొందిస్తే పాఠ్యపుస్తకాల నాణ్యత మెరుగ్గా ఉంటుంది. దీనివల్లSCERT ల సామర్థ్యం పెరుగుతుంది. పాఠశాలల్లో ఉపయోగించుకోవడానికి అద్భుతమైన పుస్తకాల్ని, అనుబంధ సామగ్రిని అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రస్తుతం తయారుచేస్తున్నాయి. ఇదే సందర్భంలో ఈ వాచకాల్లో మన రాజ్యాంగంలో నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు, విలువలు, విద్యాలక్ష్యాలు తప్పనిసరిగా ఉండేలా ఒక నియంత్రణా చట్టం కూడా అవసరం. పాఠ్యగ్రంథాల ఉత్పత్తి, ప్రైవేటు సంస్థలకు లాభాలు ఆర్జించిపెట్టేదిగా మారకూడదు. అప్పుడు విద్య అందరికీ సులభంగా అందుబాటులో ఉండే అవకాశం సన్నగిల్లుతుంది. పాఠ్యపుస్తకాలను తల్లిదండ్రులు, టీచర్లు, పౌర సమూహాలు చర్చించాలి (ఇంటర్‌నెట్‌లో పాఠ్యపుస్తకాల్ని ఉంచడంద్వారా దీన్ని సాధించవచ్చు). విశ్వవిద్యాలయాలను పాఠ్యపుస్తకాలపై అధ్యయనం చేయాల్సిందిగా ప్రోత్సహించాలి. దీనివల్ల పాఠశాల జ్ఞానంపై పరిశోధనలు పెరుగుతాయి.

### 5.4.2 వినూత్న పద్ధతుల్ని ప్రోత్సహించడం

తమ నిర్దిష్ట క్లాస్‌రూం అవసరాలకనుగుణంగా సందర్భాన్నిబట్టి కొందరు ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళికా బోధనలో కొత్తపుంతల్ని తొక్కుతుంటారు (స్థలం, పిల్లల సంఖ్య, బోధనోపకరణాల లేమి, విద్యార్థుల్లో వైవిధ్యం, తప్పనిసరైన పరీక్షలు లాంటి సమస్యలున్నపటికి) ఇవి ఎంతో ఆచరణాత్మకంగానేగాదు సృజనాత్మకంగాకూడా ఉంటాయి. స్కూల్లోగానీ, ఉపాధ్యాయ సమాజంలోగానీ వీటినెవరూ పట్టించుకోరు. అసలా ఉపాధ్యాయులు వీటికింత విలువ ఉందా అని గమనించరు. ఈ టీచర్ల అనుభవాల్ని కూడా తరగతిలో ఆచరణల్ని ఒకరికొకరి పంచుకోవాలి. మంచి టీచరుతో చేసే ఇలాంటి ప్రతిచర్యవల్ల, ఒకరినుంచి ఒకరు ఇలా నేర్చుకోవడంవల్ల ఒక అకడమిక్ మథనం జరుగుతుంది. నూతనాలోచనలు పుడతాయి. నూతనావిష్కరణ, నూతన ప్రయోగాలు జరుగుతాయి. ఇలాంటి టీచర్ల సృజనాత్మక చర్యల్ని ప్రోత్సహించడమెలా? వీటికెలాంటి మద్దతు, సహకారం అందించాలి? ఇది వ్యవస్థలో భాగంగా మారేలా ఎలా ఉపయోగించుకోవాలి? ఇందుకోసం స్కూల్లోతగిన ఏర్పాటు ఉండాలి. క్లస్టర్, బ్లాకు స్థాయిల్లో టీచర్ల మధ్య ఇలాంటి అనుభవాల ఆదానప్రదానాలు జరగాలి. ఇవి చాలా ఉపయుక్తమైనవని తేలితే వీటిని కొనసాగించే ఏర్పాటుచేసుకోవాలి. పాఠశాల స్థాయిలో లేదా కొన్ని పాఠశాలల సముదాయాల స్థాయిలో టీచర్ల బృందాల్ని గుర్తించి వారికి కావల్సిన వనరుల్ని అందించాలి. వారలా బృందాలుగా పనిచేసే అవకాశం కల్పించాలి. ప్రస్తుతం ఇలాంటి ప్రయత్నాలకు DIET లలో నిధులున్నాయి (వినూత్న పద్ధతుల గుర్తింపు డాక్యుమెంటేషన్ కోసం) పాఠశాలని ఆధారంగా చేసుకొని చేసే పరిశోధనని ప్రోత్సహించేందుకు – SSA లో కూడా నిధులు ఉన్నాయి. ఇలాంటి వైవిధ్యభరితమైన ఉపాధ్యాయుల ప్రయత్నాల్ని ప్రోత్సహించేందుకు తగిన వాతావరణాన్ని కూడా మనం నెలకొల్పాలి. వీటని ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చే ప్రయత్నం జరగాలి.

మన పాఠశాలల ఒంటరితనం పోగొట్టి, ఉపాధ్యాయులు ఒకరి అనుభవాల్ని ఒకరికొకరు పంచుకొనేందుకే క్లస్టర్ రిసోర్సు సెంటర్లు ఏర్పడ్డాయి. టీచర్లు కూడా తమ స్వంత వృత్తి నైపుణ్యానికొక గుర్తింపు తెచ్చుకోవాలి. అదే సందర్భంలో విస్తృత ఉపాధ్యాయ సమాజంలో తామొక భాగమని గుర్తించాలి. స్వంతంగా కొన్ని వ్యవస్థల్ని తామే నిర్మించుకోవాలి. మరింత నిబద్ధతతో, మరింత ఎక్కువగా తాము చెయ్యాల్సిన కృషిలో భాగస్వాములు కావాలి.

### 5.4.3 సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం

విద్యా కార్యక్రమాలు మరింత విస్తరించి అందరికీ అందడానికి, వ్యవస్థాగత నిర్వహణల్ని మెరుగుపరిచేందుకు, నిర్దిష్ట అవసరాల్ని గుర్తించి తగిన సహకారం అందించేందుకు సాంకేతిక విజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకి ప్రజాప్రసార వ్యవస్థ ద్వారా ఉపాధ్యాయ శిక్షణకు సహకారం అందించవచ్చు. తరగతి బోధనను మెరుగుపరచవచ్చు. భిన్నదశల్లో బోధనాభ్యసనాలకోసం, స్వీయ అభ్యసనంకోసం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవచ్చు. విస్తృతంగా ఇంటర్నెట్‌ను వాడుకోవడంవల్ల సమాచారాన్ని పంచుకోవచ్చు. చర్చలు జరుపుకోవచ్చు. విస్తృతమైన అంశాలపై ఈ స్థాయిలో ఇలా చర్చించుకొనే అవకాశం గతంలో మనకెప్పుడూ లేదు.

ప్రత్యేక అవసరాలకుదగ్గ బోధనోపకరణాలకోసం, సామగ్రికోసం కూడా నూతన సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. అయితే ఇలాంటివి మన విద్యారంగ విస్తృతావసరాల్ని తీర్చే విస్తృత వ్యవస్థలో భాగంగా చూడాలి. ఇవి ఒంటరివి కాకూడదు. అదనంగా అతికించినవీ కాకూడదు. ఉపాధ్యాయుల్ని, పిల్లల్ని కేవలం

వినియోగదారులుగా చూసే సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రం నిరుత్సాహపరచాలి. పరస్పర చర్య, సన్నిహితత్వం అనేవి నాణ్యమైన విద్యకు చాలా కీలకమైనవి. పాఠ్యప్రణాళికలో జోక్యం పెట్టుకొనే ఏ అంశాలనైనా ఈ దృష్టితోనే చూడాలి. ఈ సందర్భంలో ఎలాంటి రాజీ ఉండకూడదు.

## 5.5 నూతన భాగస్వామ్యం

### 5.5.1 స్వచ్ఛంద సంస్థల, పౌర సమాజబృందాల, ఉపాధ్యాయ సంఘాల పాత్ర

విద్యారంగంలో స్వచ్ఛంద సంస్థలు పౌర సమాజబృందాలు క్రియాశీలంగా పాల్గొనడం ఇటీవల వచ్చిన పెద్ద పరిణామం. వినూత్న ఆవిష్కరణల్ని చెయ్యడంలో; ఉపాధ్యాయ శిక్షణల్లో; పాఠ్యగ్రంథాల్ని, ఇతర సామగ్రిని తయారుచెయ్యడంలో; ప్రజల్ని సమైక్యపరచడంలో, సహకారాన్ని అందించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర చాలా గొప్పది. రిసోర్సుసెంటర్లలో వాళ్ళ క్రియాశీల భాగస్వామ్యం పెరగడం చాలా అవసరం. ఇది పాఠ్యప్రణాళికాభివృద్ధికి అకడమిక్ సపోర్టుకు, పర్యవేక్షణకు, పరిశోధనకు ఎంతో దోహదపడుతుంది. స్వచ్ఛంద సంస్థలు విద్యకు ఒక గుర్తింపు తెచ్చి, అందరికీ పరిచయం చేసి సమాజపు అజెండాలో చేర్చాయి. పిల్లల హక్కులపై విస్తృత ప్రచారం చేసి దీన్ని చర్చనీయాంశంగా మార్చాయి. NCF దృక్పథాన్ని, ఆలోచనల్ని విస్తృతంగా ప్రజలదగ్గరికి తీసుకెళ్ళేందుకు; వీటిని స్కూల్లో, సమాజంలో కూడా ఆచరణలోకి తెచ్చేందుకు; పిల్లల విద్య ఒక హక్కుగా సమాజం గుర్తించే వాతావరణాన్ని నెలకొల్పేందుకు, పాఠ్యప్రణాళికలోని వివిధ అంశాలపై కిందిస్థాయి అనుభవాల్ని పరిశీలించేందుకు మనం స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచెయ్యాలి. భిన్న పౌర సమాజ బృందాల భాగస్వామ్యాన్ని పెంచాలి.

పాఠశాల విద్యను బలోపేతం చెయ్యడానికి ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఎంతో విలువైంది. గతంలో ఎప్పుడూలేని అవకాశమిది. జవాబుదారీతనపు సంస్కృతిని నెలకొల్పేందుకు, పాఠశాల పనితీరుకవసరమైన నిబంధనల్ని రూపొందించేందుకు, తదనుగుణంగా ఉపాధ్యాయుల్ని ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయసంఘాలు ఎంతో అవసరం. పాఠ్యప్రణాళికను సమర్థవంతంగా పిల్లలకందించేందుకు ప్రభుత్వం ఇస్తున్న మద్దతుపై, వనరులపైన కూడా ఉపాధ్యాయ సంఘాలు మనసుపెట్టాలి. పాఠశాల వనరులు, విద్యానాణ్యత, ఉపాధ్యాయ విద్య, వృత్తి నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకోసం ఉపాధ్యాయ సంఘాల నిర్మాణాత్మకమైన ఒత్తిడిని తెచ్చే సంస్థలుగా ఉండాలి. పాఠశాలలకు కావల్సిన అకడమిక్ సపోర్టు ఎలా ఉండాలో నిర్ణయించడానికి కిందినించి సమాచారాన్ని అందించడానికి ఉపాధ్యాయ సంఘాలు స్థానిక సంస్థలతో, BRC లతో, CRC

పాఠ్యప్రణాళికా లక్ష్యాలకనుగుణంగా విద్యారంగంలో బహుళత్వాన్ని ప్రోత్సహించడానికి, పిల్లల అవసరాల్ని గుర్తించడానికి, నూతన పాఠ్యప్రణాళికాంశాల్ని జోడించడానికి యూనివర్శిటీలు పూనుకోవాలి. పిల్లల భిన్న సామాజిక సాంస్కృతిక నేపథ్యాలను దృష్టిలో పెట్టుకుని, భారతదేశపు తరగతి గదుల్లోని సంక్లిష్టతల్ని గమనంలోకి తీసుకుని విద్యా జ్ఞానానికి సంబంధించిన పునాదిని విస్తృతం చేసుకోవడం ఇప్పుడు తక్షణావసరం. తమ పరిశోధనలో భాగంగా యూనివర్శిటీల్లోని విద్యావిభాగాలు, సామాజిక శాస్త్రాల, విజ్ఞాన శాస్త్రాల విభాగాలు విద్యను ఒక పరిశోధనాంశంగా తీసుకోవాలి. పాఠ్యప్రణాళికా చట్రంలోని లక్ష్యాల్ని, ఆలోచనల్ని, తరగతిగదిలో ఆచరణకు తెచ్చేందుకవసరమైన పరిశోధన జరగాలంటే వివిధ విభాగాలకు చెందిన నిపుణులు సమిష్టిగా కృషిచేయడం, పరిశోధించడం అవసరం. దీనితోపాటు పాఠశాలల్లో విద్య పూర్తిచేసిన విద్యార్థులు తమకిష్టమైన సరికొత్త సబ్జెక్టుల్ని

ఎంచుకునేందుకు అనుగుణంగా కూడా విశ్వవిద్యాలయాలుండాలి. విశ్వవిద్యాలయాల్లో పిల్లల్ని చేర్చుకునే విధానం వీలున్నంతమందిని వదిలించుకునే పద్ధతిలో ఉండకూడదు. భిన్న ఆసక్తులు, అవసరాలు ఉన్న పిల్లల్ని ప్రోత్సహించి, ఆహ్వానించేవిధంగా ప్రవేశపద్ధతులుండాలి. వృత్తివిద్యా కోర్సులను పిల్లలు ఎంపికచేసుకునే విషయంలోకూడా ఇలాంటి విధానాలే అవసరం. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకేగాక, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు కూడా వృత్తి నైపుణ్యాన్ని పెంచడానికి శిక్షణ ఇవ్వడానికి ఉన్నత విద్యాసంస్థలు పూనుకోవాలి. ఇప్పుడిది చాలా అవసరం. ఉపాధ్యాయుల వృత్తినైపుణ్యంకూడా పెరగాలి. అది లేకుండా పాఠ్యప్రణాళికా లక్ష్యాలు సాధించడం సాధ్యం కాదు. దీనికనుగుణమైన ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాల్ని రూపొందించాల్సివుంది. దీంతోపాటు మన పాఠ్యప్రణాళికను రూపొందించడంలో విద్వాంసుల నిత్య సహకారం కూడా అవసరం. వీలున్నంతమంది విద్యావేత్తల్ని ఒకచోటికి చేర్చి వారి భిన్న నైపుణ్యాలను ఉపయోగించుకోవాలి. విద్యారంగ ధోరణులపై, ఆచరణలపై పునశ్చరణకు, చర్చలకు ఉన్నతవిద్య పూనుకోవాలి. పాఠశాలలకు, విధాన నిర్ణేతలకు మధ్య పరస్పర సంబంధం కూడా ఇవి నెలకొల్పాలి. SCERT లకు, DIET లకు యూనివర్శిటీలతో వ్యవస్థాగత అనుబంధం అవసరం. దీనివల్ల ఉపాధ్యాయ విద్యకు, వృత్యంతర శిక్షణకు, పరిశోధనకు అవసరమైన సామర్థ్యం వీటికి పెరుగుతుంది. అకడమిక్ సపోర్టు అందించడానికి, పర్యవేక్షణల్లో, మూల్యాంకనంలో పాల్గొనడానికి నిర్దిష్ట ప్రాంతంలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, స్కూళ్ళు, SCERT / DIETs, స్వచ్ఛంద సంస్థలు ఒక సముదాయంగా ఏర్పడాలి. పాఠ్యప్రణాళికను, సిలబస్‌ను తయారుచేయడంలో, పాఠ్యగ్రంథాలతోసహా బోధనాభ్యసన వనరుల్ని సమీకరించుకోవడంలో వికేంద్రీకృత భాగస్వామ్య పద్ధతులవసరం. ఒక తరగతికి ఒక సబ్జెక్టులో వివిధ పాఠ్యపుస్తకాలను రూపొందించేటప్పుడు, బహుళ సామగ్రిని తయారుచేసేటప్పుడు ఇది అవసరమౌతుంది. ఇలాంటి బృందాలు స్థానికభాష, చిత్రాలు ఉపయోగించి చిన్న కథలు, కార్డులులాంటి అదనపు సామగ్రిని కూడా తయారుచేయాలి. ఇవి పిల్లలకెంతో ఆసక్తిగా ఉంటాయి. ప్రస్తుతం ధనికుల స్కూళ్ళలో మాత్రమే పలురకాల సామగ్రి అందుబాటులో ఉంది. ఇది జరిగితే అన్ని స్కూళ్ళకు ఇలాంటివి లభిస్తాయి. స్త్రీ, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ, క్రీడలు, వ్యాయామ విద్యాశాఖ, శాస్త్ర సాంకేతిక శాఖ, గిరిజన సాంఘిక సంక్షేమ శాఖ, సాంస్కృతిక పర్యటన, పురాతత్వ శాస్త్ర శాఖలు, పంచాయతీరాజ్ సంస్థలులాంటివెన్నో పిల్లలతో, విద్యా పాఠ్యప్రణాళికలతో సంబంధం కలిగివున్నాయి. విద్యారంగానికి సహకారం అందించగల ఎంతో సామర్థ్యం వీటికుంది. విద్యాశాఖతో సమన్వయం చేసుకుని పిల్లల విద్యకోసం తామెలా సహకరించవచ్చునో ఇవి ప్లాన్ చేసుకోవాలి. తమ కార్యక్రమాల్ని విద్యాశాఖ కృషికి జోడించాలి. పాఠశాలలకు అదనపు సౌకర్యాలు కలిగించడమేకాదు పాఠ్యప్రణాళికను పరిపుష్టం చేసే ప్రత్యేక కార్యక్రమాలకి కూడా ఇది నిధుల్ని సమకూర్చాలి. క్రీడల క్లబ్బులను ఏర్పరచడం; క్రీడా సామగ్రిని అందించడం; క్రీడలకోసం శిక్షకుల్ని ఏర్పాటుచేయడం; చారిత్రక పురాతత్వ ప్రదేశాలకు, ప్రకృతి దృశ్యాలకు విహార యాత్రలు ఏర్పాటుచేయడం; పరిశీలనా సామగ్రిని సమకూర్చడం; ఫోటోలు, చార్టులు, ఫిల్ములు అందించడం; క్రమబద్ధంగా ఆరోగ్యపరీక్షలు జరపడం; మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించడంలాంటి విషయాల్లో ఈ శాఖలు నేరుగా సహకరించవచ్చు. విద్యాశాఖతో సంప్రదించి అవసరమైన సహాయసహకారాల్ని ఇవి అందించాలి. అలాగాక ఇవి తమకుతాము స్వతంత్రంగా సహాయం చేస్తే పెద్దగా ఉపయోగం ఉండదు. ఇచ్చే సహాయం అవసరమైనదిగా ఉపయోగించుకునేదిగా ఉండాలి. ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యాశాఖ సహాయం కోరినపుడు ఈ శాఖలు అనుకూలంగా స్పందించాలి.

❀ ❀ ❀

## ముగింపు

మన పిల్లలకు ఏది కావాలో దానికి సంబంధించిన ఒక దార్శనికతను ఈ పాఠ్యప్రణాళికా చట్రం మీముందుంచుతోంది. పిల్లలతో, వారి విద్యతో సంబంధం ఉన్నవారందరూ ఈ పాఠ్యప్రణాళికను పరిపుష్టం చేయడంలో సహకరించాలి. ఇందుకు ఏమిచేయాలో తెలియజెప్పాలి. దీనివల్ల పిల్లల అభ్యసనాన్ని గురించి, జ్ఞాన స్వభావాన్ని గురించి, ఒక సంస్థగా పాఠశాలను గురించి అవగాహన చేసుకునే వీలు కలుగుతుంది. పాఠ్యప్రణాళికకు సంబంధించిన ఈ దృక్పథాన్ని గురించి చర్చించేటప్పుడు పాఠశాల పద్ధతులు, సంస్కృతి, టీచర్లు తరగతిగదిలో చేసే ఆచరణలు, స్కూలు బయట నేర్చుకునేందుకు గల అవకాశాలు, వివిధ అభ్యసన వనరులు, వ్యవస్థను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితంచేయగల అంశాలు మొదలైనవన్నీ గమనంలో ఉంచుకోవాలి పెద్దఎత్తున పాఠ్యప్రణాళికను రూపొందించడం, సిలబస్ పాఠ్యగ్రంథాలు తయారుచేయడానికి పరీక్షల సంస్కరణలకు ఒక అనుసంధానం ఉండాలి. అప్పుడే మన పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు, విద్యా లక్ష్యాలను సాధించేందుకు వీలవుతుంది. NCERT చేసిన ప్రకటనలకు సంబంధించి ఈ జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం కోసం తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి వందలాది సూచనలు వచ్చాయి. ముంబాయిలోని శ్రీమతి నీతా మెహతా తల్లిగా, టీచర్‌గా పంపిన సందేశం వీటిలో ఒకటి. ఆమె ఇలా వ్రాసింది “ఈరోజు మా పిల్లలు నేను ఏళ్ళకు ముందు ఎలా చదువుకున్నానో అదే పద్ధతిలో చదువుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యాబోధనలో, మూల్యాంకనంలో ఎన్నో నూతన పద్ధతులు వచ్చాయి. కానీ మా పిల్లలు మాత్రం బోర్డుమీద రాసిన అభ్యాసాల్ని కాపీ చేసుకోవడం, వాటిని కంఠస్తం చేయడం, పరీక్షల్లో వాటిని రాయడం మినహా మరేమీ చేయలేకపోతున్నారు. వచ్చిన మార్పులేమైనా ఉంటే వాటివల్ల మరింత నష్టం తప్ప మేలు జరగడంలేదు. ఒకవైపు ఇప్పటి పిల్లలకు ఎక్కువ సమాచారం అందించడానికి బోలెడు ఇతర మార్గాలున్నాయి, అవకాశాలున్నాయి. కానీ దీన్ని గుర్తించకుండా మన పాఠశాల సంచి మాత్రం బరువెక్కిపోతోంది. కొత్తగా కంప్యూటర్ కోర్సులు, నైతిక సైన్సు వచ్చాయి. జనరల్ నాలెడ్జిని కూడా ఒక కొత్త సబ్జెక్టుగా ప్రవేశపెట్టారు. ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ ప్రసారమయ్యాక క్విజ్ కోసం ఇది అవసరమైనట్టుంది”.

మన సిలబస్ విపరీతంగా పెరిగిపోయింది. ఇది ఉపాధ్యాయుల శక్తికి మించిపోయింది. అందువల్ల వాళ్ళు విసుగుపుట్టించే పద్ధతిలో మాత్రమే బోధించగలుగుతున్నారు. తరగతి గదుల్లో ఏకాగ్రతతో ఉండటానికి అవసరమైన వ్యవధి పిల్లలకు ఉండడంలేదు. సబ్జెక్టుపై సమగ్ర అవగాహన కలగడంలేదు. పాత అంశాలలోకి వెళ్ళీవెళ్ళకముందే సబ్జెక్టుల్లోకి కొత్తకొత్త అంశాలు వచ్చిచేరుతున్నాయి. ఫలితంగా ఈ భారం తల్లిదండ్రులమీద, ట్యూషన్ క్లాసులమీద పడుతోంది. ‘బాల్యాన్ని వదులుకుని

తమ భుజాలమీద చిన్నపిల్లలు విద్యాభారాన్ని మోస్తున్నారు'. అత్యున్నత స్థాయిని చేరుకోవడానికి కొందరు పిల్లలు శక్తికి మించి శ్రమిస్తున్నారు. ఎక్కువమంది పిల్లలపై తల్లిదండ్రుల, టీచర్లపై ఒత్తిడి పెరుగుతోంది. మరింత కష్టపడాలని పిల్లలను వీళ్ళు ఒత్తిడి చేస్తున్నారు. చివరకు కొంతమంది దీనివల్ల ఆసుపత్రుల్లో చేరాల్సివస్తోంది కూడా. ముఖ్యమైన సబ్జెక్టులలో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన పిల్లలే విజేతలుగా పరిగణింపబడుతున్నారు. క్రీడలు, కళలు లాంటి అంశాల్లో సామర్థ్యం ఉన్నవారిని ఎవరూ గుర్తించడంలేదు. మార్కులకు పనికిరావు గాబట్టి ఆటలు, అభిరుచులు అవసరంలేదనే రోజులొచ్చాయి. ఫలితంగా మన విద్యార్థులు వాస్తవిక ప్రపంచానికి దూరమౌతున్నారు. పుస్తకాల్లో ఇరుక్కునిపోతున్నారు. మార్కుల పరుగుపందెంలో నిలబడాలంటే ఆరోతరగతి విద్యార్థి కూడా స్కూలు బయట కనీసం 4 గంటలు చదవాల్సిన స్థితి ఏర్పడింది. ఎదగాల్సిన వయసులో బయటి ప్రపంచాన్ని వదిలేసి పుస్తకాల్లో ఎక్కువకాలం ఉండిపోతే పిల్లలు ముడుచుకునిపోతారు. విద్య ఒక ప్రతికూలాంశంగా మారుతుంది. ఇది విద్యార్థి మెదడును రెండుగా విడగొడుతుంది. ఇందులో ఒకటి సమగ్ర అవగాహన లేకుండా కంఠస్తం చేసే పుస్తకాలకు పరిమితమైన ప్రపంచం ఒకటైతే, రెండోది తనకు పట్టు ఏమీలేని వాస్తవిక ప్రపంచం. ఉదాహరణకు ఒక నాలుగవ తరగతి విద్యార్థిని తీసుకుందాం. ఆమెకు కొండల్లో మేకల్ని మేపడాన్ని నిరోధించడం ద్వారా నేలకోతను ఎలా నివారించవచ్చో తెలుసు. కానీ తన నోటు పుస్తకాలను, పెన్సిళ్ళను ఎలా జాగ్రత్త చేసుకోవాలో మాత్రం తెలియదు. చివరకు బోలెడంత జ్ఞానంతో ఈమె పెరిగి పెద్దదవుతుంది. ఇంగితజ్ఞానం మాత్రం ఉండదు. చదువుకున్న మూర్ఖురాలిగా మారుతుందన్నమాట. పిల్లల్ని జాగ్రత్తగా అభివృద్ధి చేస్తే మంచి వ్యక్తిత్వం, మంచి ప్రవర్తన ఏర్పడుతాయి. దీనికిబదులు తమచుట్టూ ఉన్న ప్రపంచానికి, అనుభవాలకు ఏమీ సంబంధంలేని బోలెడు విషయాల్ని పిల్లలకు బోధించడం జరుగుతోంది. ఇలాంటి పగటికలలకు పనికొచ్చే విద్యవల్ల ఫలితమేమీ ఉండదు. పైగా ప్రమాదకరమైన ప్రభావాలు పడే అవకాశం మాత్రం పెరుగుతుంది. ప్రస్తుతం పిల్లలకు కావల్సిన మద్దతు, సహకారం అందించే వ్యవస్థ కూడా ఏమీలేదు. తల్లిదండ్రులు కూడా పిల్లల్లాగే ఒత్తిడికి లోనవుతున్నారు. బోర్డులు నిర్వహించే పరీక్షలకు సిద్ధమయ్యే పిల్లల్లో 70 శాతం మంది ఒత్తిడికి సంబంధించిన సమస్యతో సతమతమవుతున్నారు.

ప్రస్తుతం మనం నీతామెహతా చేసిన కొన్ని నిర్దిష్ట సూచనలను పరిశీలిద్దాం.

✦ ఎంత నేర్చుకోగలమో అంత మాత్రమే బోధించేవిధంగా ఒక సమతుల్యత ఉండాలి. మన శారీరక వ్యవస్థలు అద్భుతమైన నిర్మాణం కలవి. ఇందులోని ప్రతిభాగం మొత్తం వ్యవస్థతో అనుసంధానం చేసుకుని పనిచేస్తుంది. విశాల విద్యా లక్ష్యాలకనుగుణమైన పాఠ్యప్రణాళికను రూపొందించుకోవడం, వాస్తవిక అవకాశాలను, అడ్డంకులను గుర్తించి దాన్ని అమలుచేయడం ప్రస్తుతం కీలకమైన విషయాలు. ఏదో కొద్దిమంది రాణించేవిధంగా కాకుండా ఎక్కువమంది అభ్యసన ప్రక్రియలో భాగస్వాములయ్యే విధంగా మన విద్యావ్యవస్థ ఉండాలి.

✦ విద్య సంపూర్ణ జీవితానికి అవసరమైన దృఢమైన పునాదిని వేయాలి. మనం నిర్మించే స్తంభాలుకూడా భిన్నంగా ఉండాలి. వ్యక్తిత్వం, సత్ప్రవర్తన, శారీరక దారుఢ్యం, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలు ఇవన్నీ పాత గణితం, సైన్సు, చరిత్రలతోపాటు నిర్మించాల్సిన నూతన స్తంభాలు.

✦ జీవితంలో, బ్రతుకుతెరువులో, వివిధదశల్లో ఎదురయ్యే సవాళ్ళతో మనం నేర్పే విషయాలకు సంబంధం ఉండాలి. వీటిపై దృష్టిపెట్టడానికి తగినంత సమయం ఉపాధ్యాయులకు, పిల్లలకు ఉండాలి. పిల్లల స్వీయ అభిరుచుల్ని, స్వీయ అన్వేషణల్ని వికసింపజేయడానికి ఉపయోగపడే జ్ఞానం అవసరం. దీన్ని సాధించాలంటే ప్రత్యామ్నాయ అభ్యసన పద్ధతులు కావాలి. ప్రాజెక్టులద్వారా, పుస్తకాల్ని చూచిరాసే పరీక్షలద్వారా ప్రత్యామ్నాయ మూల్యాంకనాలద్వారా ఇది సాధ్యమవుతుంది. మనం విత్తనాలు నాటాలే తప్ప మొత్తం చెట్లను పెంచాల్సిన పనిలేదు. జీవితంకోసం నిరంతరం నేర్చుకునేవాళ్ళనుగా విద్య పిల్లల్ని తీర్చిదిద్దాలి.

✦ మనం విద్యను మానవీకరించాలి. మానవుల విస్తృత బహుళ అర్హతలకు తగినట్టుగా మన విద్య ఉండాలి. మన పిల్లల్లో పలురకాల నైపుణ్యాలుంటాయి. వాటిని ప్రోత్సహించేవిధంగా ప్రస్తుతం నూతన మూల్యాంకనా విధానం అవసరం. విద్యా ప్రమాణాలను సాధించినట్టే క్రీడలు, కళలు, హస్తకళలు మొదలైన అంశాల్లో ప్రావీణ్యం సంపాదించినవారికి కూడా తగిన గుర్తింపు ఉండాలి. ఇలా చేస్తే తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకేరకమైన విద్యలోకి నెట్టకుండా పలురకాల విద్యల్లోకి పంపుతారు. ఫలితంగా ఒత్తిడి తగ్గుతుంది. ఇలాంటి గ్రేడింగ్‌వల్ల సమాజం దృష్టిలో కూడా మార్పు వస్తుంది.

దేశవ్యాప్తంగా ఉన్న పాఠ్యప్రణాళిక, సిలబస్, పాఠ్యగ్రంథాల రూపకల్పనాకర్తలు ఈ తల్లిమాటలపై వెంటనే తగినంత దృష్టిపెడతారని ఆశిద్దాం.

❀ ❀ ❀

# సారాంశం

## అనుబంధం - 1

**అధ్యాయం - 1**

- ✦ బహుళత్వంగల మన సమాజంలో ఒక జాతీయ విద్యావ్యవస్థను బలోపేతం చేయడం.
- ✦ 'భారంలేని విద్య'లోని అంశాల ఆధారంగా పాఠ్యప్రణాళికాభారాన్ని తగ్గించడం.
- ✦ పాఠ్యప్రణాళికా సంస్కరణలకనుకూలమైన వ్యవస్థాగత మార్పులు.
- ✦ మన రాజ్యాంగంలో చెప్పుకున్న సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికత్వం వంటి విలువల ఆధారంగా గల పాఠ్యప్రణాళిక.
- ✦ అందరికీ నాణ్యతతో కూడిన విద్యనందించే హామీ.
- ✦ ప్రజాస్వామిక పద్ధతులు, విలువలు, స్త్రీపురుష సమానత్వం, షెడ్యూలు కులాల, తెగల సమస్యలు, వికలాంగుల అవసరాలు, ఆర్థిక రాజకీయ ప్రక్రియలో వీరు పాల్గొనే సామర్థ్యాలు గుర్తించి వాటికి నిబద్ధంగా ఉండే పౌరుల్ని తయారుచేయడం.

**అధ్యాయం - 2**

- ✦ అభ్యాసకుల గురించి, అభ్యసనను గురించి మనకున్న భావాల్ని పునర్నిర్వచించుకోవడం.
- ✦ అభ్యాసకుల వికాసానికి, అభ్యాసానికి సంబంధించిన సమగ్ర దృక్పథం.
- ✦ అభ్యసనంలో వైఫల్యంగలవారికి అవసరమైన నిర్దిష్ట కార్యక్రమాల రూపకల్పన.
- ✦ జ్ఞాన నిర్మాణానికి, సృజనాత్మకతను వేగవంతం చేయడానికి అభ్యాసకుల భాగస్వామ్యం.
- ✦ ప్రయోగాత్మక పద్ధతులద్వారా క్రియాశీల అభ్యసనం.
- ✦ పిల్లల ఆలోచనకు, కుతూహలత్వానికీ, ప్రశ్నించడానికి తగిన అవకాశం కల్పించడం.
- ✦ అంతర్‌దృష్టిలో కూడిన జ్ఞాన నిర్మాణం కోసం వివిధ సబ్జెక్టుల మధ్యగల జ్ఞానాన్ని అనుసంధానం చేయడం.
- ✦ విషయజ్ఞానంతోపాటు పరిశీలన, భాగస్వామ్యం, అన్వేషణ, విశ్లేషణ, విమర్శనాత్మకతలపై దృష్టిసారించడం.
- ✦ పాఠ్యప్రణాళిక ఆచరణలో సామాజిక, సాంస్కృతిక వాస్తవాలకు స్థానం కల్పించడం.
- ✦ పాఠ్యగ్రంథాల్లో, బోధనావ్యూహాల్లో స్థానిక జ్ఞానాన్ని, పిల్లల అనుభవాల్ని అవసరమైన అంశాలుగా గుర్తించడం.
- ✦ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, విషయ పరిజ్ఞానం పెంచుకోవడానికి అవసరమైన మార్పులు, వికాసం, సామర్థ్యాలు, అభిరుచులు, పాఠశాలలో చదువుకునేటప్పుడే ఏర్పడతాయని గుర్తించడం.

అధ్యాయం - 3

భాష

- భాషా సామర్థ్యాలైన భాషణం, శ్రవణం, పఠనం, లేఖనం సబ్జెక్టులకు అతీతమైనవి. ప్రాథమిక తరగతుల నుంచి సీనియర్ సెకండరీ తరగతులదాకా జ్ఞాన నిర్మాణం చేసుకోవటంలో భాష పాత్రను గుర్తించాల్సిన అవసరం.
- మాతృభాషను విద్యాబోధనకు ఉత్తమ మాధ్యమంగా గుర్తిస్తూనే, ద్విభాషా సూత్రాన్ని అమలుచేయడానికి సరికొత్త ప్రయత్నం అవసరం. గిరిజన భాషలకు కూడా ఇది వర్తిస్తుంది.
- మాతృభాషలో బలమైన పునాది ఉంటేనే ఇంగ్లీషు బాగా వస్తుంది.
- పాఠశాల జీవితాన్ని పరిపుష్టం చేయడానికి భారతీయ సమాజపు బహుళభాషా స్వభావం గొప్ప వనరుగా ఉపయోగపడుతుంది.

గణితం

- గణితజ్ఞానం కంటే సూత్రాలు, యాంత్రిక పద్ధతులు, గణితీకరణ (తార్కికంగా ఆలోచింపగలగడం, అమూర్తాలను చేపట్టగలగడం, అర్థం చేసుకోగలగడం) గణితబోధనలో ముఖ్య లక్షణం.
- గణితబోధన తార్కికంగా ఆలోచించడానికి, అమూర్తాలను నిర్వహించుకోవడానికి, సమస్యల్ని సాధించుకోవడానికి తగినవిధంగా పిల్లల సామర్థ్యాల్ని పెంచాలి. నాణ్యమైన గణితవిద్య అందుబాటులో ఉండటం ప్రతిబిడ్డ హక్కు.

విజ్ఞానశాస్త్రం

- సైన్సుకు సంబంధించిన అంశాలు పిల్లల వయస్సుకు, జ్ఞాన సామర్థ్యానికి తగినట్టుండాలి.
- పిల్లల కుతూహలత్వాన్ని, సృజనాత్మకతను వికసింపజేసుకునే పద్ధతుల్ని, క్రమాల్ని అర్థం చేసుకొనేవిధంగా సైన్సు శిక్షణ ఉండాలి. పర్యావరణానికి సంబంధించి ఇది మరింత అవసరం.
- శ్రమ ప్రపంచంలోకి ప్రవేశించడానికి తగిన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందించేవిధంగా సైన్సు శిక్షణ ఉండాలి.
- పాఠశాల మొత్తం పాఠ్య ప్రణాళికలో పర్యావరణ చైతన్యం అంతర్భాగం కావాలి.

సామాజిక శాస్త్రాలు

- స్వతంత్రంగా ఆలోచించడానికి, సామాజిక అంశాల్లో విమర్శనాత్మకంగా ప్రతిస్పందించడానికి తగిన నైతిక మానసిక శక్తిని కలిగించేవిధంగా సామాజిక శాస్త్రాల బోధన ఉండాలి.
- స్త్రీ, పురుషన్యాయం, మానవహక్కులు, అట్టడుగువర్గాలపట్ల, మైనార్టీలపట్ల స్పృహ కలిగి ఉండటంలాంటి జాతీయ అంశాల్ని దృష్టిలో ఉంచుకోవాలి.
- పౌరశాస్త్రాన్ని రాజకీయ శాస్త్ర రూపంలో చూడాలి.
- గతంపట్ల పిల్లల దృక్పథాన్ని ప్రభావితం చేసేదిగా చరిత్ర ఉండాలి.
- పౌర గుర్తింపు కూడా ఒక కీలకాంశం.

పని

- ప్రాథమిక పాఠశాలల్నించి అన్ని సబ్జెక్టుల్లో పని ఉండాలి.
- పాఠశాల బయట పని అవకాశాలు కల్పించే ఏజెన్సీలను గుర్తించాలి.
- వృత్తివిద్యా శిక్షణ 10-12 సంవత్సరాల పని ఆధారిత విద్యను పునాదిగా చేసుకోవాలి. అందుకోసం ఇవి అవసరం.
- వివిధ వ్యవధుల్లో పూర్తయ్యే సరళమైన కోర్సులు
- గ్రామ క్లస్టరు స్థాయినుంచి జిల్లాస్థాయి దాకా అందుబాటు.
- పాఠశాల బయటవున్న ఏజెన్సీలకు వికేంద్రీకృత గుర్తింపు.

కళలు

- కళలను (జానపద - సాంప్రదాయిక సంగీతం, నృత్యం, చిత్రకళ, తోలుబొమ్మలు, మట్టిపని నాటకాలు మొదలైనవి) వారసత్వపు హస్తకళలను పాఠశాల పాఠ్యప్రణాళికలో భాగంగా గుర్తించాలి.
- కళలు పాఠశాల విద్యలో ప్రతిస్థాయిలో ఒక సబ్జెక్టుగా ఉండాలి.
- వ్యక్తికి, సమాజానికీ, ఆర్థికానికీ, సౌందర్య స్పృహకు కళలు ఎంత అవసరమో తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యాలకు, అధికారులకు తెలియజెప్పాలి.

శాంతి

- తగిన కృత్యాలద్వారా పాఠశాల విద్యసాగినంతకాలం అన్ని సబ్జెక్టులలో శాంతి విలువను పిల్లలకు తెలియజెప్పాలి.
- ఉపాధ్యాయ శిక్షణలో కూడా శాంతి విద్య ఒక భాగంగా ఉండాలి.

ఆరోగ్యం, వ్యాయామ విద్య

- పిల్లల సంపూర్ణ అభివృద్ధికి ఆరోగ్య విద్య, వ్యాయామ విద్య, అవసరం (యోగాతో సహా). వీటిద్వారా పర్యావరణం సమస్యల్ని పరిష్కరించవచ్చు. పిల్లలు బడిలో కొనసాగేలా చేయవచ్చు.

అధ్యాయం - 4

- కనీస భౌతిక వసతుల్ని కల్పించడం, సరళతరమైన దైనందిన కార్యక్రమాన్ని రూపొందించడంలో సహాయపడటం. ఉపాధ్యాయుడి పని పద్ధతుల్ని మెరుగుపరచడానికి ఇవి చాలా అవసరం.
- పిల్లల్ని అభ్యాసకుల సమాజంగా గుర్తించే సంస్కృతిగల పాఠశాలలు ప్రతిబిడ్డ అభిరుచుల్ని, సామర్థ్యాల్ని పెంచగలవు.
- పిల్లలందరూ సమర్థులైనా, వికలాంగులైనా నేర్చుకోవడానికి వారంతా భాగస్వాములయ్యే కృత్యాలు చాలా అవసరం.

✦ ప్రజాస్వామిక పద్ధతులద్వారా స్వీయక్రమశిక్షణను ఒక విలువగా పిల్లల్లో పెంపొందించవచ్చు.

✦ సమాజంకూడా తమ అనుభవాల్ని, జ్ఞానాన్ని పాఠశాలలో పంచుకోవడం ద్వారా స్కూలుకు, సమాజానికి మధ్య అనుబంధం ఏర్పడుతుంది.

అభ్యసన వనరులపై మన దృష్టిలో రావల్సిన మార్పులు

✦ పిల్లలు పునశ్చరణ చేసుకునేవిధంగా, బృందాలుగా పనిచేసేవిధంగా పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలుండాలి. పాఠ్యపుస్తకాల్లో, భావనలపై, కృత్యాలపై, సమస్యలపై దృష్టి ఉండాలి.

✦ కొత్త దృక్పథాలకు, ఆలోచనలకు తగినట్టుగా అదనపు పుస్తకాలు, వర్కు బుక్కులు, టీచర్లకు హ్యాండ్‌బుక్కులు అవసరం.

✦ ప్రసార సాధనాలు, ఐ.సి.టి. లాంటి వనరులు రెండువైపులా ప్రతిచర్య చేసుకునేందుకు అనువుగా ఉండాలి. కేవలం సంగ్రహణ కోసం ఉండకూడదు.

✦ జ్ఞానాన్ని పెంచుకుని బయటి ప్రపంచంతో మనం అనుసంధానింపబడేందుకు ఉపాధ్యాయులకు, పిల్లలకు, సమాజానికి పాఠశాల గ్రంథాలయం ఉపయోగపడాలి.

✦ అభ్యసన వాతావరణాన్ని నెలకొల్పాలంటే స్కూలు క్యాలెండర్ని, రోజువారీ కార్యక్రమాల్ని రూపొందించేటప్పుడు వికేంద్రీకృత ప్రణాళిక అవసరం. ఉపాధ్యాయులకు స్వతంత్రప్రతిపత్తి, వృత్తి నైపుణ్యం కూడా అవసరం.

అధ్యాయం – 5

✦ వ్యవస్థాగత సంస్కరణల సందర్భంలో నాణ్యతను మనసులో ఉంచుకోవాలి. వ్యవస్థ తన సామర్థ్యాన్ని పెంచుకొని తన బలహీనతల్ని తానే సరిజేసుకోగల్గాలి. తననుతాను సంస్కరించుకోగల్గాలి.

✦ పాఠశాల నుంచి ప్రారంభమై కిందినుంచి పైకి ఒక విస్తృత ప్రణాళిక రూపొందించుకోవాలి. దేనిమీద కేంద్రీకరించాలో ముందుగా గుర్తించాలి. క్లస్టరు స్థాయికి ఈ వికేంద్రీకృత ప్రణాళిక విస్తరించాలి. తర్వాత జిల్లా ప్రణాళిక రూపొందించాలి.

✦ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కలిసి భాగస్వామ్య పద్ధతిలో అర్థవంతమైన అకడమిక్ ప్రణాళికను రూపొందించుకోవాలి.

✦ ఏ పాఠశాలకాపాఠశాలలోని బోధనాభ్యసన తీరుతెన్నుల్ని నిరంతర ప్రతిచర్యా రూపంలో పర్యవేక్షించాలి.

✦ వృత్త్యంతర శిక్షణలో ఈ కింది అంశాల్ని గుర్తించాలి.

  – వివిధ సబ్జెక్టులలో పోస్టుగ్రాడ్యుయేషన్ అధ్యయనం.
  – ఉపాధ్యాయ విద్యలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు అవకాశం ఉండాలి.
  – భాషా ప్రావీణ్యం కోసం ఒక కోర్సు ఉపాధ్యాయ విద్యలో భాగం కావాలి.

- పిల్లలతో చర్చించే అవకాశం ఉండాలి. వారి జ్ఞానాన్ని, విశ్వాసాల్ని ప్రశ్నించాలి. లైంగిక, కుల, సమానత్వ, న్యాయాలను గురించి వాస్తవిక ప్రపంచ పరిస్థితిని గురించి శిక్షణార్థులు తెలుసుకోవాలి. అంటే విద్యను విస్తృతార్థంలో చూడాలి. అభ్యసనాన్ని పరిశుద్ధంగా ఒంటరిగా చూడగూడదు. పిల్లల ప్రత్యేక సందర్భాల్లోంచి చూడాలి.
- వృత్త్యంతర శిక్షణ పాఠశాల పనిపద్ధతుల్లో మార్పుకోసం ఒక ఉత్ప్రేరకంగా ఉపకరించాలి.
- ప్రజాస్వామిక భాగస్వామ్యంతో అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చెయ్యాలి. గ్రామస్థాయిలో పంచాయతీకి సమాంతరంగా ఉన్న ఇతర వ్యవస్థలను క్రమబద్ధీకరించాలి.

పరీక్షా సంస్కరణలు

- ✦ ఒత్తిడిని తగ్గించి ఉత్తీర్ణతను పెంచాలంటే మన పరీక్షా విధానాల్లో
  - విషయాధారితంగా గాక సమస్యా పరిష్కారాత్మకంగా, అవగాహనాధారంగా ప్రశ్నాపత్రాలుండాలి.
  - తక్కువ వ్యవధి పరీక్షలుండాలి.
  - ప్రవేశ పరీక్షా పద్ధతుల్ని రూపొందించి, నిర్వహించేందుకు ఒక నోడల్ వ్యవస్థను ఏర్పరచాలి.
- ✦ పిల్లల వైవిధ్యభరితమైన అభిరుచులకు, అవసరాలకు తగినట్టు బహుళ పాఠ్యగ్రంథాలు అందుబాటులో ఉండాలి.
- ✦ నూతన ఆలోచనలకోసం, వినూత్న అన్వేషణలకోసం, ప్రయోగాలకోసం తరగతిలోని ఉపాధ్యాయుల అనుభవాల్ని ఒకరికొకరు పంచుకొనే అవకాశం ఉండాలి.
- ✦ ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు కలిసి చర్చించుకొని, వికేంద్రీకృత పద్ధతిలో సిలబసును, పాఠ్యగ్రంథాలను, బోధనా అభ్యసన సామగ్రిని రూపొందించుకోవాలి.

❀ ❀ ❀